22 katha 1-203 page-1_Layout 1 9/25/2021 3:32 PM Page 1

# కథ 2020

## ముల్కనూరు ప్రజా గ్రంథాలయం,
## నమస్తే తెలంగాణ
## కథల పోటీలు

22 katha 1-203 page-1_Layout 1 9/25/2021 3:32 PM Page 2

# కథ 2020

**ముల్కనూరు ప్రజా గ్రంథాలయం, నమస్తే తెలంగాణ కథల పోటీలు**


ముద్రణ : 2021

కాపీలు : 1000

కవర్ పేజీ ఆర్ట్ : మల్లిభట్ వాసు

కవర్ పేజీ డిజైన్, లే అవుట్ : *Vinoo..*

ప్రింటింగ్ : హైదరాబాద్

**కాపీలకు..**

94416 70804– ప్రమోద్ రెడ్డి ,

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు

ధర :250/–

ముల్కనూరు ప్రజా గ్రంథాలయం

# సంకలన సంప్రదాయం



**తిగుళ్ళ కృష్ణమూర్తి, ఎడిటర్**
**నమస్తే తెలంగాణ**

తెలంగాణలో కథా సాహిత్యం గురించి ప్రత్యేకంగా పరిచయం చేయవలసిన అవసరం లేదు. ఉద్యమ కాలంలో పరిశోధనలు విరివిగా సాగడమే కాదు, అవన్నీ సాధారణ ప్రజలకు చేరాయి. తెలంగాణ కథా సాహిత్యానికి సుదీర్ఘ చరిత్ర ఉన్నది. 1898 – 1904 కాలంలో బండారు అచ్చమాంబ రాసిన కథలే తెలుగు సాహిత్యంలో తొలి కథలని పరిశోధకులు అంటున్నారు. చెరుకుపల్లి సోదరులు– చెరుకుపల్లి హరికృష్ణారావు, చెరుకుపల్లి రఘోత్తమ రావు రాసిన కథలు ఆనాటి పత్రికలలో అచ్చ య్యాయని, 1930 దశకంలో తాళ్ళూరి రామానుజాచార్యులు చాలా నాటకాలు, నవలలు, కథలు రచించారని ఇవన్నీ ఆనాటి పత్రికలలో వెదికితే దొరకవచ్చునని ప్రముఖ సాహితీవేత్త, పరిశో ధకులు ముదిగంటి సుజాతారెడ్డి గారు అభిప్రాయపడుతున్నారు.

శాతవాహనుల కాలంలోనే గుణాఢ్యుడు రాసిన 'బృహత్కథ' గొప్ప సంకలనం, ప్రపంచ సాహిత్యంలోనే తొలి ప్రయోగం. బృహత్కథ స్ఫూర్తితోనే 'కథా సరిత్సాగరము', ఇంకా ఆవల పశ్చిమాన పర్షియన్ 'హజార్ అఫ్సాన్' – అరబ్బులో 'వెయ్యిన్నొక్క రాత్రులు' (అరేబియన్ నైట్స్) వెలువడ్డాయి. ఆంగ్ల సాహిత్యంలో

'కాంటర్బరీ టేల్స్' రూపుదిద్దుకున్నది. కలాల నుంచి జాలువారడానికి ముందే ప్రజల నాలుకలపై కథలు నర్తించాయి, రూపు మార్చుకొని విశ్వవ్యాప్తమయ్యాయి. 'బతుకమ్మ' కథల పోటీల ద్వారా సేకరించి మనదైన గొప్ప సంకలన సంప్రదాయాన్ని కొనసాగించడం గర్వంగా ఉన్నది.

కథా సృజన అంటే సాహిత్య ప్రక్రియ ద్వారా సమాజాన్ని, మనిషిని దర్శించడం, విశ్లేషించడమే. పోటీకి వచ్చిన కథలు భిన్న ప్రాంతాలకు చెందిన విభిన్న కథావస్తువులు గలవి. వర్తమాన సమాజ ఆర్థిక పోకడలను, పేదల స్థితిగతులను, మానవ సంబంధాలను, మనిషి అంతరంగాన్ని, నైతిక విలువలను రంగరించి సృజించినట్టివి. పల్లెటూరిలో వ్యవసాయ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మార్చడం వల్ల ఏర్పడిన దుస్థితితో పాటు దానిని చక్కదిద్దడం, జీవన సంధ్యలో వృద్ధుల పరిస్థితి, సేవాభావానికి ప్రతిఫలం పొందడం, మారుతున్న కుల వృత్తులు మొదలైన భిన్నాంశాలతో కథా సాహిత్యం సారవంతమైంది. కథలు చదువుతూ పోతుంటే మాయాదర్శినిలో నుంచి ప్రపంచాన్ని పరికించినట్టు, మనకు ప్రపంచమంతా భిన్న కోణాలలో కనిపిస్తుంటుంది.

పోటీలు నిర్వహించినందుకు ముల్కనూరు గ్రంథాలయం వారికి, ఉత్సాహభరితంగా అనేక ఉత్తమమైన కథలను అందించిన రచయితలకు అభినందనలు. ఈ పోటీ నిర్వహణలో భాగస్వాములం అయినందుకు మాకు ఆనందంగా ఉన్నది. ఈ ఉమ్మడి కృషి, అనుబంధం ఇకముందు కూడా కొనసాగుతుందని ఆశిస్తున్నాం. ముల్కనూరు గ్రంథాలయం వారికి, ఈ కృషిలో కీలక పాత్రధారి అయిన శ్రీనివాసులు గారికి, వారి బృందానికి పరిపరి అభినందనలు. కథలన్నింటినీ చదివి ఉత్తమమైనవాటిని ఎంపిక చేసిన ఎగుమామిడి అయోధ్యా రెడ్డిగారికి, నలేశ్వరం శంకరం గారికి, జూపాక సుభద్రగారికి, జి. మధుసూదన రెడ్డిగారికి, కె. అనంత్ కుమార్ గారికి కృతజ్ఞతలు. పోటీల నిర్వహణలో అన్ని విధాల సహకారం అందించిన పరాంకుశం వేణుగోపాల స్వామిగారు, కరణం జనార్ధన రావు గారికి, వారి బృందానికి ధన్యవాదాలు.

**–తిగుళ్ళ కృష్ణమూర్తి**

# ద్వితీయం - అద్వితీయం



**వేముల శ్రీనివాసులు**

తెలుగు కథకు, కథానాయకులకు పట్టం కట్టాలనే సంకల్పంతో ముల్కనూర్ ప్రజాగ్రంథాలయం, నమస్తే తెలంగాణ మొదటిసారి సంయుక్తంగా నిర్వహించిన *కథ 2019* విజయవంతం అయింది.

కథ 2020 మలి ప్రయత్నం. అనూహ్యంగా తొమ్మిది వందల కథలు పోటీకి వచ్చాయి. ఇన్ని కథలు రావడం నిర్వాహకులుగా మాకు ఆనందాన్ని ఇవ్వడమే కాకుండా, పెద్ద పని కూడా పెట్టింది. ఎన్నో మంచి కథలు పోటీలో నిలబడ్డాయి. ఐదుగురు న్యాయనిర్ణేతలు వారి అమూల్యమైన సమయాన్ని వెచ్చించి నిర్ణయాన్ని ప్రకటించారు.

ఈ సంవత్సరపు కథల్లో స్థూలంగా పరిశీలిస్తే కరోన దెబ్బకు ఆర్థికంగా కుంగిపోయిన మధ్యతరగతి, పేద వర్గాల కథలు, వృద్ధాప్యంలో ఒంటరి జీవితాలు, మత సామరస్యపు అవసరం వంటి అంశాలు కనిపిస్తాయి. అలాగే సమాజంలో మనమింత వరకూ తెరచి చూడని 'గస్సాల్' వంటి వృత్తులు, పడువు వృత్తిలో ఒకరు, భిక్షువులో ఇంకొకరు అయినా గొప్ప మానవ సంబంధాలను చూపిన 'అమృతం', తెలంగాణ మాండలికంలో స్వచ్ఛంగా పారే గోదారిలాంటి 'కుక్కసద్ది', ఊర్లను ముళ్ల కంచెలతో నింపి ఎడార్లుగా చేస్తున్న రియల్ వ్యాపారపు పెడ ధోరణులను వ్యతిరేకించే 'ఆకుపచ్చ తివాచి', వార్ధక్యపు అచేతన స్థితిలో కావాల్సిన వాల్లు కాలయములైతే ప్రశ్నించే గొంతు 'ఇది హత్యేకదా', ఆధునిక సమాజంలో ఇంకా కులాలకు, చేసేపనికి లంకె ఉందని భావించే మనుషుల మథనం..

22 katha 1-203 page-1_Layout 1 9/25/2021 3:32 PM Page 6

'వృత్తి'. కూరగాయలమ్మే ఒక అమ్మ బలమైన ఆర్థిక సూత్రాలను ప్రదర్శించిన 'తక్కెడ', మతం పేర విషాన్ని చిమ్మితే ఒక కుటుంబం దెబ్బతిన్న, ఆ మతం నషాను మానవత్వంతో ఓడించిన 'నషా', ఆకర్షణను ప్రేమగా భావించి మోసపోతే అమాయకపు అమ్మాయిల మనస్తత్వంను అర్థం చేసుకొనే 'ఉత్తమ నటుడు'. కరోనా నెగటివ్ నుంచి బయట పడేసే 'పాజిటివ్'. భూస్థాపితం చేసిన అనాచారాలను మళ్లీ బయటకు తీస్తే బలమైన శిక్ష వేయడానికి సిద్ధంగా ఉన్న 'ఆరాధ్య'. అన్నీ ఉన్నా ఏకాకి 'Die Empty' అని కలవరించే 'నిర్వాణ' లాంటి వైవిధ్యమైన కథలు. విద్యాదానం చేసిన గురువు చివరి కోరికను తీర్చే 'రుణం', అందరివాడైన ఆపదలో ఆదుకొనే 'రాంరాం తాత', బతికుంటే శివం.. ప్రాణం పోతే శవం.. చావు తప్పించుకోలేని ప్రకృతి ధర్మం. కానీ దాని చుట్టూ ఎన్నో భయాలు. అనవసరపు ఆంక్షలు వాటిని ఎత్తి చూపే ప్రయత్నం చేసిన 'కర్మకాండ', హిందూ – ముస్లిం కుటుంబాల మధ్య ఉండే ఆప్యాయతలను చూపిన 'ఈద్ కా చాంద్', కొడుకులో మొలకొత్తుతున్న మగ భావాలను తట్టుకోలేని తల్లి ఇచ్చిన 'తీర్పు', నోరు లేని జీవాలకు, దానిని సాకిన తల్లికి మధ్య గొప్ప అనుబంధం 'సుక్క బర్రె', అలాగే చీకటి వెలుగులు, మనసున మనసై, గంగిరెద్దు గానుగెద్దు, శభాష్ గౌండ్ల రామక్క, నియ్యత్ గల్లోడు, గుప్పెడు గంథం.. ఇలాంటి మంచి కథలెన్నో...

ఈ సంవత్సరం మొదటి బహుమతి పొందిన 'గస్సాల్'. ఇది రచయిత శ్రీ ఆనందాచారి గారు రాసిన మొదటి కథ కావడం విశేషం. అలాగే ఆరుగురు రచయితలు మొదటి ప్రయత్నంలోనే బహుమతి పొందారనే విషయం తెలిసి ఆనందం వేసింది. కొత్త రచయితలను గుర్తించే లక్ష్యం కూడా నెరవేరింది.

పోయిన ఏడాదిలాగనే 22 కథలను గుర్తించాలని భావించినా, వచ్చిన కథల్లో ఉన్న మంచి కథలను గుర్తించాలనే ఉద్దేశ్యంతో 50 కథలను బహుమతులకు అర్హమైనవాటిగా ప్రకటించాం. న్యాయ నిర్ణేతలెవరికీ కథా రచయితల పేర్లు పంపలేదు. న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన శ్రీ నలేశ్వరం శంకరం, శ్రీమతి జూపాక సుభద్ర, శ్రీ ఎగుమామిడి అయోధ్యారెడ్డి, శ్రీ కె. అనంత కుమార్, శ్రీ జీ మధుసూధన్ రెడ్డి గార్లకు ధన్యవాదాలు..

ఈసారి బహుమతి ప్రదానోత్సవంలో రచయితలతో ఇష్టాగోష్ఠి నిర్వహించి కథలో వస్తున్న మార్పులు, పాఠకుడి కోణం, రచయిత తన కథకు కారణమైన నిజ జీవిత ఘటనలను చర్చించడం జరిగింది.

బహుమతి ప్రదాన సభకు ముఖ్యఅతిథిగా వచ్చి సభను ఉర్రూతలూగించిన ఆధునిక తెలుగు వాగ్గేయకారుడు, శాసన మండలి సభ్యులు శ్రీ గోరటి వెంకన్న

గారికి కృతజ్ఞతలు. హుస్నాబాద్ శాసన సభ్యులు, మా గ్రంథాలయానికి పెట్టని కోట శ్రీ సతీశ్ గారు, జిల్లా పరిషత్ అధ్యక్షులు డాక్టర్ సుధీర్ గారు, నమస్తే తెలంగాణ సంపాదకులు శ్రీ కృష్ణమూర్తిగారు, గ్రామ సర్పంచ్ శ్రీ కొమరుయ్యగారు, తెలుగు నటులు శ్రీ సంపూర్ణేశ్ బాబుగారు, శశిధర్, రావుల గిరిధర్ గార్లకు ధన్యవాదాలు.

2019 కథ సంకలనానికి అందమైన బతుకమ్మ కవర్ ఫొటో వేసిన మల్లిభట్ వాసు, ఈ సంవత్సరం కథ–2020కి మంచి చిత్రాన్ని అందించారు. వారికి ధన్యవాదాలు.

ముల్కనూర్ ప్రజా గ్రంథాలయం అనగానే గుర్తొచ్చే మిత్రబృందం ప్రమోద్ రెడ్డి, తిరుపతి, శ్రీ లక్ష్మయ్య గారు, గోవర్ధన్ రెడ్డి, వీరేశం, గన్ను కృష్ణమూర్తి వీరితో పాటు నిరంతరం కృషి చేస్తున్న కిషన్ ప్రసాద్, సుగుణాకర్, శ్రీనివాస్, సుద్దాల సంపత్, శ్యాంసుంధర్, శంకర్ రావు, నటరాజ్ సుందర్, దర్శన్, వెంకట్ రెడ్డి, మిన్ హజ్, భిక్షపతి, వెంకట్, అయితా ప్రవీణ్, చొల్లేటి సంపత్, హనుమయ్య, మిగతా ముల్కనూరు మిత్రబృందానికి ధన్యవాదాలు.

మా గ్రంథాలయం అధ్యక్షులు శ్రీ వంగా రవీందర్, కార్యవర్గ సభ్యులందరి కృషి వల్ల అనేక కార్యక్రమాలు ఈ సంవత్సరం చేపట్టడం జరిగింది. వీటిలో ముఖ్యంగా శ్రీ కోడూరి రాజయ్య గారి స్మారకార్థం క్విజ్, వక్తృత్వ, వ్యాస రచన జిల్లా స్థాయి పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ సంవత్సరం బహుమతి ప్రదానానికి ఆర్థిక సాయం అందించిన శ్రీ దాసరి వెంకట రమణ కుటుంబానికి ధన్యవాదాలు.

ముల్కనూర్ ప్రజాగ్రంథాలయం పుస్తక పఠనమే కాకుండా పిల్లల, యువతీ–యువకుల వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేసేలాగా కార్యక్రమాలు చేస్తోంది. దానిలో భాగంగా వాలీబాల్ ఆటను దత్తత తీసుకొని ముల్కనూర్ మరియు చుట్టూ ఉన్న గ్రామాల నుంచి దేశానికి వాలీబాల్ ఆడే గొప్ప ఆటగాళ్లను తయారు చేయాలని నిర్ణయించాం..

చివరగా నా మిత్రుడు సుగుణాకర్ ప్రతిజ్ఞచేసినట్టుగా కథల పోటీని ప్రతి సంవత్సరం నిర్వహించేట్లుగా శక్తినివ్వాల్సిందిగా భగవంతున్ని ప్రార్థిస్తూ...

**–వేముల శ్రీనివాసులు**

**ముఖ్య సలహాదారు**

**ప్రజాగ్రంథాలయం, ముల్కనూర్.**

22 katha 1-203 page-1_Layout 1 9/25/2021 3:32 PM Page 8

నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజా గ్రంథాలయం

# కథల పోటీ – 2020


| | | | |
|---|---|---|---|
| | ప్రథమ బహుమతి (1) | | పేజీ నంబర్ |
| 1 | గస్సాల్ | కటుకోజ్వల ఆనందాచారి | 11 |
| | ద్వితీయ బహుమతులు (2) | | |
| 2 | అమృతం | సయ్యద్ సలీమ్ | 19 |
| 3 | కుక్కసద్ది | డా.కాలువ మల్లయ్య | 26 |
| | తృతీయ బహుమతులు (3) | | |
| 4 | ఆకుపచ్చ తివాచీ | బి.వి.రమణమూర్తి | 36 |
| 5 | ఇదీ హత్యే కదా? | బి.వి.గిరిజ (కలం పేరు సుశోభ) | 50 |
| 6 | వృత్తి | కె.వి.నరేందర్ | 61 |
| | ప్రత్యేక బహుమతులు (6) | | |
| 7 | తక్కెడ | చందు తులసి | 70 |
| 8 | నషా | సయ్యద్ గఫార్ | 77 |
| 9 | ఉత్తమ నటుడు | యన్నంరెడ్డి వెంకటరెడ్డి | 89 |
| 10 | పాజిటివ్ | డా. వెల్దండి శ్రీధర్ | 101 |
| 11 | ఆరాధ్య | పొన్నాడ గౌరి | 109 |
| 12 | నిర్వాణ | ప్రొ. రామా చంద్రమౌళి | 117 |
| | విశిష్ట బహుమతులు (10) | | |
| 13 | ఋణం | ఎంఆర్‌వి సత్యనారాయణ మూర్తి | 126 |
| 14 | మా ఊరి ధన్వంతరి రాంరాం తాతా | డా.జనపాల శంకరయ్య | 134 |
| 15 | కర్మకాండ | బి.నర్సన్ | 142 |
| 16 | ఈద్ కా చాంద్ | హనీఫ్ | 150 |
| 17 | తీర్పు | గాజోజు నాగభూషణం | 158 |
| 18 | సుక్కబర్రె | వేముగంటి శుక్తిమతి | 165 |
| 19 | చీకటి వెలుగులు | స్ఫూర్తి కందివనం | 172 |
| 20 | మనసున మనసై | చింతపట్ల పద్మా రమేష్ | 179 |
| 21 | గంగిరెద్దు గానుగెద్దు | సుగంధ శ్రీనివాస్ | 187 |
| 22 | అడవి బతుకులు | డా. దిలావర్ | 197 |

| | 'బతుకమ్మ'లో ప్రచురణకు ఎంపికైన కథలు (10) | | పేజీ నంబర్ |
|---|---|---|---|
| 23 | శభాష్ గౌండ్ల రామక్కా! | డా. ప్రభాకర్ జైనీ | 206 |
| 24 | నియ్యతి గల్లోడు | శిరంశెట్టి కాంతారావు | 213 |
| 25 | గుప్పెడు గంధం | రావుల పుల్లాచారి | 222 |
| 26 | కొత్త వెలుగు | సుంకోజి దేవేంద్రచారి | 231 |
| 27 | హనీ | తటపర్తి నాగేశ్వరి | 242 |
| 28 | వారసత్వం | గన్నవరపు నరసింహమూర్తి | 251 |
| 29 | పునరాగమనం | డా.రాయపెద్ది వివేకానంద్ | 259 |
| 30 | లెక్క తేల్చుండి | ఈ. కోటేశ్వరరావు | 272 |
| 31 | సంస్కృతి రక్షితో.. | కె. శ్రీనివాస్ (కంచర్ల) | 280 |
| 32 | ఊరు పొమ్మంది, రమ్మంది | పంతంగి శ్రీనివాసరావు | 287 |
| | 'కథ–2020' ప్రచురణకు ఎంపికైన కథలు (17) | | |
| 33 | వీర | ఎనుగంటి వేణుగోపాల్ | 295 |
| 34 | చావు | మంచికంటి వెంకటేశ్వర్లు | 305 |
| 35 | పుట్టిన ఊరు | ఈతకోట సుబ్బారావు | 313 |
| 36 | మరో ప్రపంచం పిలిచింది! | మండ శ్రీకర్ | 320 |
| 37 | క్షమించవా! | కె. మనోహరాచారి | 326 |
| 38 | పాయెమాల్ | ఐతా చంద్రయ్య | 334 |
| 39 | కుదుపు | డా.బి.వి.ఎన్. స్వామి | 340 |
| 40 | ప్రశ్న | దాసరి వెంకటరమణ | 350 |
| 41 | ఊషర క్షేత్రం | పోతుబరి వెంకట రమణ | 383 |
| 42 | స్పర్శ | శ్రీమతి కె.వాసవదత్త రమణ | 356 |
| 43 | అమ్మ వస్తున్నది | పి.వి.ఎస్.కృష్ణ కుమారి | 366 |
| 44 | అమ్మ కడుపు చల్లగా | శ్రీమతి పి.వి. శేషరత్నం | 373 |
| 45 | వానకారు కోయిల | ఉమా మహేష్ ఆచాళ్ల | 392 |
| 46 | మా రోజులు మారాయి | వియోగి (కె.విజయ ప్రసాద్) | 400 |
| 47 | ఒక గీత ఆత్మకథ | డా.రమణ యశస్వి | 408 |
| 48 | రుణం | డా.సిద్దెంకి యాదగిరి | 414 |
| 49 | ముక్కలైన రెక్కల కష్టం | వేముగంటి మురళి కృష్ణ | 425 |
| | సంస్మరణార్థం ఎంపికైన కథ | | |
| 50 | మిత్రమా క్షమించు | దివంగత జీడిగుంట రామచంద్రమూర్తి | 432 |

22 katha 1-203 page-1_Layout 1 9/25/2021 3:32 PM Page 10

# ఐదుగురు న్యాయ నిర్ణేతలు




నలేశ్వరం శంకరం



జూపాక సుభద్ర



ఎగుమామిడి అయోధ్యారెడ్డి



కె. అనంత కుమార్



జీ మధుసుదన్ రెడ్డి

# గస్సాల్

కటుకోజ్వల ఆనందా చారి
99487 87660

'బేటా! ఐసా మత్ కర్‌నా, అందర్ జాయియే' తండ్రి మాటలు పెడచెవిన పెడుతూ, ఇంటి చూరు వాసానికి గూడు కట్టే పనిలో ఉన్న పిచ్చుకలలో చిన్న పిచ్చుకపైకి వేలు పెడుతూ అదిలించే పని చేస్తూనే వుంది సలీమా. పెద్ద పిచ్చుకలు ఎక్కడెక్కడి నుండో గడ్డిపోచలు తెచ్చి చెదిరిన గూడుపై పెడుతుంటే, ఆ చిన్న పిల్ల పిచ్చుక వాసంపైన అప్పటికే చెదిరిపోయి ఉన్న గడ్డిపోచల్ని అటూ ఇటూ జరుపుతూ పేరుస్తోంది. పిచ్చుకల నిర్మాణాన్ని వాటి సేకరణ విధానాన్ని అనుకరిస్తున్న పిల్ల పిచ్చుకను పరిశీలిస్తూ దాన్ని బెదిరించే పని చేస్తున్నది సలీమా. తండ్రి వద్దని వారిస్తున్నాడు. కానీ, పిల్లలు ఏదైనా శ్రద్ధగా గమనిస్తూనే ఉంటారు. సలీమా కూడా.

అది మూడు గదుల ఇంటి వెనకాల వసారాకు ఆనుకొని ఉన్న చూరు. చాంద్ చిన్న కూతురు సలీమా. ఎప్పుడో ఎర్రమట్టితో కట్టిన గోడలు. సున్నంతో గిలాబు చేయబడి వుంది. అక్కడక్కడా పెచ్చులూడిపోగా తడిసిపోయిన ఎర్రమట్టితో జాజు రంగులోకి మారాయి గోడలు. ఆ గోడలు కనిపించినప్పుడల్లా పాతకాలపు అనుబంధాలు కండ్లముందు కదలాడతాయి. అందుకనే పేదల ఇండ్లల్లోని తడి మరకలో ప్రేమలింకా మిగిలే ఉన్నాయి. ఆ మూడు గదులనానుకుని ఇంకో మూడు గదుల పోర్షన్ కూడా ఉంది. ఇంగ్లీష్ పెంకులతో మూడు స్టెప్పుల కప్పు. చాంద్ వాళ్ళ దూరపు బంధువులెవరో అందులో ఉంటారు. ఎత్తయిన గోడలతో ఓ కాంపౌండు వాలూ ఉంది. ఇంటి ముందర ఖాళీ స్థలమూ ఉంటుంది. కాంపౌండుకు పెద్దదే దర్వాజ. ఆ దర్వాజలోంచి ఇంట్లోకి వెళ్ళే ముందు లోపల దర్వాజకెదురుగా రెండు గుంజలు పాతి, గోనె బస్తాలను కలిపి కుట్టిన ఒక పెద్ద పరదా కట్టి ఉంటుంది. ఇంటి ద్వారాలకు, కిటికీలకూ పరదాలు కట్టి ఉన్నాయి. అవి మాసిపోవడం వల్ల ఏ రంగో చెప్పలేము. మధ్యగది మాత్రం రాత్రిరైనట్టుగానే ఉంటుంది. నట్టింట్లో తాండవించే దారిద్ర్యంలా. ఇంటి గోడలచుట్టూ గింజలకోసం తిరుగుతూ ఉన్న కోడిపిల్లలు.

ఇల్లందు పెద్దపట్టణంగా అభివృద్ధి చెందినదేమీ కాదు. అయినా చారిత్రక ప్రాముఖ్యం

ఉన్న పెద్ద ఊరే. నిజాం పరిపాలన నాటి శకలాలు ఇప్పటికీ కనపడుతుంటాయి. ఊర్లో రెండే బజార్లు. రెండో బజారు తూర్పున ఉన్న రోడ్డు చివర్న కుడివైపు సందులో కొంత లోపలికి పోయినాక మళ్ళీ కుడివైపు తిరిగితే దక్షిణం వైపు ఉన్నదే చాంద్ ఉంటున్న ఇల్లు. చాంద్‌కు నలుగురు ఆడపిల్లలు. ఒక్కడే కొడుకు. ఇద్దరు ఆడపిల్లలకు అతికష్టం మీద పెండ్లిళ్లు చేసి పంపాడు. ఉన్న ఊర్లోనే వుంటారు.

అక్కడి ఆమ్‌బజార్‌లోనే సైకిళ్ళు అమ్మే సమద్ సైకిల్ షాపులోనే ఓ పక్కన రిపేర్లు, పంక్చర్లు వేసి బతుకుబండిని లాక్కొచ్చాడు చాంద్. తాను పని చేసే క్రమంలోనే కొడుకుకూ రిపేర్ నేర్పించాడు. సైకిళ్ల ఫిట్టింగ్ నేర్చుకున్నాడు. చదువుకొమ్మని ఎంత కోరినా వాడికి అబ్బలేదు. అతి కష్టం మీద పది వరకు చదివి, పరీక్ష తప్పి సైకిల్ దుకాణానికి రావటం మొదలుపెట్టాడు. ఒక్కడే కొడుకు. ఇద్దరాడపిల్లల తర్వాత కలిగిన సంతానం. కొంత గారాబంగా చూశారు.

'చాంద్ చాంద్' అనే కేకలు వినపడగానే 'అబ్బా ఆప్‌కో కిసినే బులాయా' అని తండ్రిని పిలిచాడు కొడుకు జావెద్. 'ఆరై ఆరై, కౌన్' అని బయటి దిక్కుకు వెళ్ళాడు. 'చాంద్ భాయ్ వో దో నెంబర్ బస్తీమే గఫూర్ సాబ్‌కే ఘర్‌మే బుడ్డేమియా గుజర్‌గయేకతే. ఆప్‌కో ఆనేకో కహ' అని చెప్పారు వచ్చినోళ్ళు. 'ఆరూ.. ఆరూ..' అంటూ టోపీ పెట్టుకొని, చెప్పులేసుకుని వేగంగా ఉత్సాహంగా వెళ్ళాడు చాంద్.

ఊర్లో ముస్లింలు ఎవరైనా చనిపోయినప్పుడు వారికి స్నానం చేయించి, శుభ్రపరిచే పనిని చేస్తాడు చాంద్. 'జనా జే నమాజ్'కు వాళ్ళను సిద్ధం చేసే 'గుసుల్' పని గత పాతికేండ్ల నుండీ చేస్తున్నాడు. లేకుంటే ఒక్క పంక్చర్, సైకిల్ రిపేర్లతోటి అంతింటిని ఎలా వెళ్ళదీస్తాడు. నెలలో ఒకటి రెండుసార్లు ఈ పని చేయాల్సి వస్తుంది. ఒక్కరిని శుభ్రం చేసి, తయారు చేసి వస్తే ఎంత తక్కువయినా ఇప్పుడు ఐదు వందల రూపాయల నుండి వారి స్థోమతనుబట్టి రెండు, మూడు వేల రూపాయల వరకూ వస్తాయి.

అలా కొంతకాలం గడిచిపోయింది. ఇప్పుడు సైకిళ్ళు అమ్ముడుపోవడం లేదని సమద్ షాపు మూసేశాడు. అవును, ఎవరు చూసినా మోటరు సైకిళ్ళే నాయే. ఎంత పేదోడయినా హీరోహోండా కొనాల్సిందే. అవి కొనటానికి బ్యాంకులు పిలిచి మరీ అప్పులిస్తున్నాయాయే. చాంద్‌కున్న ఆదాయ ఆదరువు పోయింది. కొడుకును ఓ సైకిలు షాపులో పనికి కుదిర్చాడు. పంక్చర్లు, రిపేర్లు చేసి వాడు తెచ్చే డబ్బులతోనే కనాకష్టంగా నడుస్తున్నది బతుకు. చాంద్ భార్య ఇంట్లో మిషను పని చేస్తుంది. జాకెట్లు, లంగాలు కుడుతుంది. కానీ, అదంతా పాతకాలపు కుట్టుపని. ఇప్పటి డిజైన్లు కుట్టడం రాదు. ఏదో అడపాదడపా ఆ పని చేస్తుంది. ఆడపిల్లల బట్టల ఖర్చు ఎల్లిపోతోంది.

చాంద్‌కు వయస్సు అరవై దాటింది. అనారోగ్యమూ చేరింది. ఛాతీలో నొప్పి వస్తుంటే స్థానిక డాక్టర్‌కు చూపించాడు. 'గుండెకు సంబంధించిన సమస్య' అని చెప్పి జిల్లా

కేంద్రానికి వెళ్ళమన్నాడు. వెంటనే ఖమ్మంలోని మెడికల్ కళాశాల ఆసుపత్రికి తీసుకుపోయారు. వాళ్ళు స్టంట్ వేయాలన్నారు. తక్కువ ఖర్చుతోనే స్టంట్ వేశారు. స్నేహితుల సహాయంతో త్వరగానే ఇంటికి వచ్చాడు. రెండు మూడు నెలలు విశ్రాంతి తీసుకున్నాడు. చాలా కష్టంగా ఇల్లు గడుస్తున్నది. సైకిలు షాపులన్నీ కనుమరుగయి పోతున్నాయి. కొడుకు జావెద్ కూడా ఖాళీగా వున్నాడు. 'మోటారు సైకిల్ రిపేర్ నేర్చుకోరా' అంటే పెడ చెవిన పెట్టాడు. తండ్రికూడా ఒత్తిడి పెట్టలేదు. ప్రస్తుతం పేపరు బాయ్‌గా పనిలో చేరాడు. దానికి సైకిల్ కావాలి. దానికోసం వెతుకుతున్నారు.

ఇలా కొన్ని నెలలు గడిచిపోయాయి. కొద్దిగా తేరుకున్నాడు చాంద్. ఏదో ఒకటి చేయకపోతే ఎట్లా గడుస్తుంది. రోజూ 'ఏం చేయాలా' అని ఆలోచిస్తూనే ఉన్నాడు. ఇక లాభం లేదనుకొని స్నేహితులను కలిశాడు. ఆరోగ్యం బాగానే వుందని చెప్పాడు. 'ఎవరైనా పోతే నాకు కబురు పెట్టండి. ఇప్పుడు చేయగల స్థితిలోనే ఉన్నా' అని అందరికీ చెప్పుకొచ్చాడు. స్నేహితులందరూ మంచివాళ్ళే. వాళ్ళుకూడా కష్టాల గట్టెక్కుతున్న వాళ్ళే. అప్పుడప్పుడూ కొంత సహాయం చేస్తూనే ఉన్నారు. అలా ఎంతకాలం చేస్తారు! పిల్లలు కూడా తల్లిదండ్రికి అనుకూలంగానే పెరిగారు. అదే ఆయనకున్న అదృష్టం. ఇప్పుడు చావుల రేటు కూడా తగ్గిపోయింది. ఎప్పుడో నెలకొకటి జరుగుతున్నది.

*అసలే ఆత్మాభిమానం అధికంగా ఉన్నవాడు చాంద్. ఎన్నిసార్లు చేయి చాస్తాడు. మనస్కరించడం లేదు. లేమితనాన్ని మధ్యతరగతి వాళ్ళు ఎదుర్కోవడం చాలా కష్టమైన పని. ఎవడు సృష్టించాడు ఈ తరగతి! పరువూ మర్యాదలు, మానాభిమానాలు, సంస్కృతి సంప్రదాయాలు, ఆచారాలు అన్నీ వీళ్ళకు సవాళ్ళుగా మూగుతాయి. లేనిపోని కంచెల్ని మనసు పొరలపై నిర్మిస్తాయి.*

***

'అజీ! ఆజ్ ఘర్‌మే ఛావల్ నహీహై' అంది సన్నగొంతుతో పిల్లలెవరికీ వినపడకుండా చాంద్ భార్య. 'థోడా టైరోనా మై భీ సోంచరహా హూ' అంటూ గదమ కింద చేయి ఆనించి, ఇంటి ముందు గద్దెపై కూచుని ఆలోచిస్తున్నాడు చాంద్. కొద్దిసేపు ముంగిట్లో అటూ ఇటూ తిరిగాడు. 'దేఖోనా కుచ్ హైతో!' అని ఇంట్లోకి వంగి ఆమెతో చిన్నగా మూలిగాడు. ఆమెకర్థమయింది. పక్కన ఎవరినైనా అడగమని దానర్థం. 'ఛావల్ కైసే పూఛూ..' అని తనలో తానే ప్రశ్నించుకుంది. మధ్యాహ్నం ఒంటి గంటయింది. అసలే స్టంట్ వేసుకున్నోడని ఇంట్లోవాళ్ళు ఎక్కువ ఒత్తిడి చేసే మాటలు అనడం లేదు. కానీ, ఆయనలో ఒత్తిడి పెరగకుండా వుంటుందా? ఏం చేయాలో అర్థం కావడం లేదు. పరిపరి విధాలుగా

ఆలోచిస్తున్నాడు. అసలే ఆత్మాభిమానం అధికంగా ఉన్నవాడు చాంద్. ఎన్నిసార్లు చేయి చాస్తాడు. మనస్కరించడం లేదు. లేమితనాన్ని మధ్యతరగతి వాళ్ళు ఎదుర్కోవడం చాలా కష్టమైన పని. ఎవడు సృష్టించాడు ఈ తరగతి! పరువూ మర్యాదలు, మానాభిమానాలు, సంస్కృతి సంప్రదాయాలు, ఆచారాలు అన్నీ వీళ్ళకు సవాళ్ళుగా మూగుతాయి. లేనిపోని కంచెల్ని మనసు పొరలపై నిర్మిస్తాయి. ఆ ముళ్ళపైబడి రక్తార్పణ చేసుకుంటారు మన కళ్ళ ముందే. ఏమీ చేయలేం.

మధ్యాహ్నం కావస్తుందనగా ఇంటి బయటినుండి ఇద్దరెవరో నిలబడి 'ఛాంద్ భాయ్ జల్దీ ఆవో' అన్నారు. ఆ పిలుపు వినగానే 'హమ్మయ్య' అనుకొన్నాడు. ఒక ఆశావహ పిలుపేదో భగవంతుని దగ్గరినుండి వచ్చినట్లు ఉత్సాహపడ్డాడు. 'క్యా హై భాయ్' అంటూ బయటికి వచ్చాడు. 'తేరా నెంబర్ బస్తీమే హమారా సలీమ్ సాబ్ హైనా, ఉన్కే బావా గుజర్ గయే. ఓ ఆప్‌కో బులారై' అని చెప్పారు.

'కబ్ హువా!'

'అబీ తీన్ చార్ గంటే హువా, బచ్చే సబ్ మెహమాన్ నజ్దీక్ వాలే ఆగయే' అని చెప్పగానే, 'ఆ.. ఆ.. అభీ నికులుంగా' అంటూ గబగబా ఇంట్లోకి వెళ్లాడు. టోపీ తీసుకుని, చెప్పులేసుకుని 'చార్ బజే తక్ ఆవుంగా, ఆతే ఆతే హిబీ ఛావల్ లేకరావుంగా, థోడా సబర్ కరో' అంటూ ఉత్తేజంగా అడుగులేస్తూ బయటికి నడిచాడు చాంద్.

చాంద్ భార్య తన మిషన్ సొరుగులో ఉన్న దస్తీతీసి ముడి విప్పింది. చిల్లర డబ్బులు ఎన్నున్నాయో తీసి లెక్క గట్టింది. మొత్తం లెక్కేస్తే పది రూపాయలు తేలాయి. నీరసంగా కూర్చున్న సలీమాను పిలిచింది. 'ఏలో బేటీ బాజుకే దుకాణ్ సే దో బిస్కట్ ప్యాకెట్స్ లేకే ఆవో' అంటూ పది రూపాయలిచ్చింది. 'బహెన్! థోడా పానీలావోనా' అని అక్కను మంచినీళ్ళు అడిగి తాగింది సలీమా. ఉరికి వెళ్ళి బిస్కట్లు తెచ్చి ఒక ప్యాకెట్ అన్న జావెద్‌కు ఇచ్చింది. రెండో ప్యాకెట్ అక్కాచెల్లెళ్ళిద్దరూ కూర్చుని తిన్నారు. 'ఏలో అమ్మీ' అని కొడుకు బిస్కట్లు అందిస్తూ పిలిచినా, తల్లి మనసు ఎక్కడో ఉంది. 'ఆయన ఎప్పుడొస్తాడో' అని పిల్లల ఆకలి తలచుకుని కన్నీళ్ళు కడుపులోనే నింపుకుంటున్నది.

నాలుగన్నరకల్లా చేతిలో బియ్యం సంచీతో లోపలికి అడుగుపెట్టాడు చాంద్. సలీమా ఎదురెళ్ళి సంచీ తీసుకుని ఇంట్లోకి ఉరికింది. చాంద్ పక్కనుండి ఇంటి వెనుకకు పోయి బట్టలిప్పేసి స్నానం చేసి లోపటికి వచ్చాడు. అలసటతో ఉన్న చాంద్ మంచంలో అలా కూలబడ్డాడు. 'అబ్బా హమ్ లోగ్ బిస్కట్ ఖాలియే, ఏ లేవ్ దో బిస్కట్ ఖాలో' అంటూ సలీమా తండ్రికి బిస్కెట్లు అందించింది. అన్నం వండేవరకు కొద్దిగా ఆసరా ఉంటుందని తల్లిలాగే బిడ్డకూడా తనకు బిస్కెట్లు ఇవ్వడంతో చాంద్ గుండె బరువెక్కింది. అంతేకాదు, మాకిప్పుడు ఏమంత ఆకలిగా లేదు, బిస్కెట్లు తిన్నామన్న నిండుతనమూ పన్నెండేండ్ల సలీమాలో కనపడటంతో 'బేటా ఇదరావో' అని దగ్గరకి తీసుకుని, చేతిని ముద్దు

పెట్టుకున్నాడు చాంద్. ఇంతలో ఇంట్లోంచి 'జీ ఖానా తయార్ హై ఆజాయి యే' అన్న పిలుపు వచ్చింది. సలీమా అక్క జుబేదా అందరికీ ప్లేట్లు పెట్టింది. అందరూ కూర్చుని వేడి వేడి అన్నం పచ్చి పులుసు, కోడిగుడ్ల కూరతో కడుపునిండా భోజనం చేశారు.

భుక్తాయాసాన్ని తీర్చుకుంటూ మంచంలో పడుకున్నాడు చాంద్. తనుకూడా తిని జాకెట్ హుక్స్ కుట్టే పనిని ముందేసుకొని మంచం పక్కనే కూర్చుంది భార్య. 'ఓ కైసా హువా కతేజీ' అని అడిగింది. 'ఓ బూడాపన్ ఆయేగానా సుభా సుభా. సబ్‌సే బాత్ కరే కతే, గ్యారాబజే సబ్ లోగోంకో నజ్దీక్ బులాయే కతే.. బస్ బచ్చోంకే హాత్ మేయి జాన్ చెలేగయి కతే, హార్ట్ ఎటాక్ బోల్‌రై' అని వివరిస్తూ చెప్పాడు.

హు.. మహానుభావుడు తన ఇన్నేండ్ల జీవితాన్ని ముగించి వెళ్ళిపోయాడు. మనకు ఈ రోజు కడుపు నింపాడు. ఎంత వింతయిన దునియా ఇది. 'ఆజ్ వే గుజర్ నా జాతేతో ఆజ్ హమారీ భూక్ క్యాహోగి! ఖుదా క్యాకర్త హై!' తనలో తాను తాత్త్వికతలోకి పోయాడు. చనిపోయిన ఆయనను తలచుకుని ఒక నమస్కారం పెట్టుకున్నాడు. అవును ఎంత విచిత్రం. ఒక చనిపోయిన వార్త వీళ్ళకు జీవం పోస్తున్నది. చిత్రం చిత్రం.

చాంద్‌తో చాలా గారాబంగా చనువుగా మాట్లాడేది సలీమా ఒక్కతే. కొడుకూ ఇంకో కూతురూ తల్లితో ఎక్కువగా వుంటారు. చాంద్‌కూడా పరిస్థితులు, కష్టాలు మరిచిపోవడానికి సలీమాతోనే మాట్లాడుతూ ఉంటాడు. ఏవో ఏవో విషయాలు తీసుకొచ్చి చెబుతుంది. అన్నీ శ్రద్ధగా వింటాడు. బదులిస్తాడు. తన మనసులోని విషయాలు, పెద్దల విషయాలు కూడా సలీమాతో పంచుకుంటాడు చాంద్. తల్లిలా ఫోజులు పెట్టి అన్నీ తండ్రిని అడుగుతూ ఉంటుంది. కొన్ని సమస్యలకు జవాబులు, పరిష్కారాలూ చెబుతుంది. మధ్యమధ్యలో నవ్విస్తూ ఉంటుంది. అన్ని విషయాలు పెద్దలు మాట్లాడినట్లే అబ్బాతో మాట్లాడుతుంది.

ఆ రోజు కూడా సలీమాతో మాట్లాడుతున్నాడు చాంద్. 'బేటీ బాతే కర్తేహీరె'

'ఆప్ ఊ కహతేరె బోలింగే, అబ్బా! తుమ్ సోరై'

'నై మా నై'

'మై ఏక్ కహానీ బోలుంగా సునో'

'ఊ.. ఊ.. ' అంటూనే ఏదో ఇబ్బందిగా ఛాతీమీద చేయి వేసి పట్టుకున్నాడు. ఒక్కసారిగా తలెత్తి బిడ్డవైపు చూశాడు. చేతిని గుండెకు హత్తుకున్నాడు. 'అబ్బా! అబ్బా!.. క్యా హువా.. క్యా హువా!' తండ్రి తలను చేతుల్లోకి తీసుకుంది. 'బేటీ..' అంటూ సలీమా చేతుల్లోనే కళ్ళు మూతలు పడ్డాయి చాంద్‌కు. లోపటి నుండి భార్య, కొడుకు, కూతురు వచ్చి 'అబ్బా! అబ్బా!' అంటూనే వున్నారు. సలీమా చేతిలో 'ఊ' కొడుతూనే చివరిశ్వాస వొదిలాడు.

తండ్రి గుండెలపై తలపెట్టి 'అబ్బా..! అబ్బా..!' అంటూ గట్టిగా పిలుస్తున్నది సలీమా.

22 katha 1-203 page-1_Layout 1 9/25/2021 3:32 PM Page 16

**హు.. మహానుభావుడు తన ఇన్నేండ్ల జీవితాన్ని ముగించి వెళ్ళిపోయాడు. మనకు ఈ రోజు కడుపు నింపాడు. ఎంత వింతయిన దునియా ఇది. 'ఆజ్ వే గుజర్ నా జాతేతో ఆజ్ హమారీ భూక్ క్యాహోగి! ఖుదా క్యాకర్త హై!' తనలో తాను తాత్త్వికతలోకి పోయాడు. చనిపోయిన ఆయనను తలచుకుని ఒక నమస్కారం పెట్టుకున్నాడు. అవును ఎంత విచిత్రం. ఒక చనిపోయిన వార్త వీళ్ళకు జీవం పోస్తున్నది. చిత్రం చిత్రం.**

చుట్టుపక్కల వాళ్లు వచ్చారు. ఎవరో చేయి పట్టుకుని చూశారు. 'నాడీ నయ్యే' అన్నారు. భార్య కుప్పకూలి పోయింది. కొడుకు కాళ్ళ దగ్గర కూలబడ్డాడు. చాంద్ స్నేహితులకు కబురు పోయింది. భార్య, కొడుకు, కూతురు ఏడుస్తున్నారు. సలీమా మాత్రం బాధతో నిట్టూరుస్తున్నది. కానీ, కన్నీళ్ళు కార్చడం లేదు. ఏడ్వబోయి దుఃఖాన్ని ఆపుకుంది. అబ్బా చెప్పింది గుర్తుకొచ్చింది. ఒక్క కన్నీటి చుక్క కింద పడితే గుట్టంత బరువు మోయాల్సి వస్తుందని ఎప్పుడో చెప్పాడు తనకు. తండ్రికి బరువు పెంచదలచలేదు. అమ్మ దగ్గరకు వెళ్ళి ఏడ్వద్దని చెప్పింది. అక్కతో, అన్నతో కూడా చెప్పి ఊరకుంచింది.

స్నేహితులొచ్చారు. ఎలా జరిగిందో తెలుసుకుంటున్నారు. ఊర్లోనే ఉన్న బిడ్డలూ, అల్లుండ్లూ, మనవలూ వచ్చారు. కాలం గడుస్తూనే వుంది. ఇంకేముంది నేల గర్భంలోకి ప్రయాణించాల్సిన సమయం ఆసన్నమవుతూనే వుంది.

ఇంట్లో ఒక్క పైసా లేదు. కనీసంగా ఏడెనిమిది వేలు అవుతాయి. స్నేహితులు కూడా పేదవాళ్ళే. అయినా కొద్దిగా సమకూర్చారు. అల్లుండ్లూ అంతంత మాత్రమే. వాళ్ళూ కొంత సర్దారు. ఇంకా అవసరమే వుంది. ఎవరో ఓ పండు ముసలి ఇంటిముందు గద్దెపై కూర్చుని 'అరె క్యా దేఖ్‌రై ఓ గస్సాల్‌కు బులావోనా' అన్నాడు.

'ఎక్కడ గస్సాల్. ఆయనే గస్సాల్' అని ఆ పెద్దాయనకు వినిపించేలా పెద్దగా చెప్పాడు ఎవరో ఇంకో అతను. 'తేరా నంబర్ బస్తీలో ముసలాయన ఉన్నాడు. పిలిపించండి' అన్నాడు. 'వెయ్యో రెండు వేలో ఇవ్వాలి మరి' ఇంకో వైపున ఎవరో అన్న మాటలు వినపడుతున్నాయి. ఇంతలో 'తేరా నంబర్ బస్తీ వాలా నయ్యే కతే' అంటూ వార్త మోసుకొచ్చాడు పక్కింటాయన. 'పుట్టుక ఎంత ఉత్సవమో చావుకూడా అంతేరా బాబు. ఇది కూడా అంతే. పవిత్ర కార్యంగానే చేయాలి. ఎంతో మందిని పవిత్రంగా శుభ్రంగా చేసి చివరి వీడ్కోలుకు సిద్ధం చేశాడు. ఇప్పుడేమిటి ఈ విధి. అతన్ని శుభ్రం చేయటానికి ఎవరూ లేకుండా అయ్యిందే' అని అనుకుంటున్నారు కొందరు పెద్దలు.

ఇలా అనుకుంటూ ఉండగానే గబగబా సలీమా వాళ్ళ దగ్గరకు వచ్చింది. 'అబ్బా కో మై గుసుల్ దూంగీ. ఫికర్ మత్ కరో' అంటూ నిబ్బరంగా చెప్పింది. పెద్దవాళ్ళు కొద్దిగా ఆశ్చర్యపోయారు. కొద్దిసేపటి తర్వాత 'చిన్నపిల్లవి నువ్వు చేయొద్దు' అన్నారు. 'అయినా నువ్వెలా చేయగలవు చెప్పు, నీకేం తెలుసు?' అని ప్రశ్నించారు. 'నువ్వు ఆడపిల్లవి. నువ్వెలా చేస్తావు' ఇంకెవరో అన్నారు.

'నేను ఆడపిల్లనే. కానీ, అబ్బా శరీరానికి నేను కూడా వారసురాలిని. ఇన్నేండ్లుగా మాకోసం కొట్టుకున్న గుండె ఆగిపోయింది. చమటలు కార్చిన శరీరం అలిసిపోయింది. అబ్బా రుణం ఎప్పుడు తీర్చుకుంటాం? ఆడపిల్లనైతే ఏం? కొడుకులు లేని వాళ్ళకు ఆడపిల్లలే కొరివి పెట్టడం చూడటం లేదా? ప్రాణానికి ఆడా మగా వుంటుందా? చివరిసారిగా శుభ్రం చేసే వాళ్ళుకూడా దిక్కు లేరనే భారాన్ని మేము ఉండీ మోయాలా? పక్షులు తమ పిల్లలపట్ల మగా ఆడా అని బేధం చూపుతాయా? ఒక తండ్రిమీద ప్రేమకు ఈ రకమైన విభజనలా? నా ప్రేమను ఆడపిల్ల అనే నెపంతో అడ్డుకోవద్దు. అబ్బా నాకు అన్నీ చెప్పాడు. నాకే చెప్పాడు. వారసత్వమంటే ఆయన సంపాదించిన ఆస్తి పంచుకోవటమే కాదు. ఆయన నేర్పింది కొనసాగించడము కూడా. ప్రేమగా, మర్యాదగా, స్వచ్ఛంగా వీడ్కోలు చెప్పటం నా బాధ్యత కాదా! లేదు. నాకంతా తెలుసు. నేను చేయగలను. అబ్బాకు నేను చేయటమే న్యాయం. నాకు చెప్పాడు. ఏమేమీ చేయాలో, ఎలా చేయాలో అన్నీ తెలుసు నాకు' అన్నది సలీమా.

***

'పద్నాలుగు మీటర్ల తెల్లనిబట్ట కావాలి. మూడు మీటర్ల గుడ్డలు రెండు ముక్కలు చేయాలి. ఒకటి పైన వేయాలి. గ్లౌసు తొడగాలి. అరమీటరు దస్తీ చేయాలి. మూడు మీటర్లది మూడు ముక్కలు చేసి, రెండు ముక్కల గుడ్డను చాపమీద వేయాలి. ఒక్క ముక్కతో షర్టు చేయాలి. చుట్టూ పరదా కట్టాలి. బల్లమీద పడుకోబెట్టాలి. అవును అబ్బా లేవలేడు కదా! బట్టలు విప్పి ఇటుక పెల్లకు దూది చుట్టి ముడ్డి తుడవాలి. పది చెంబుల నీళ్ళు కొట్టి శుభ్ర పరచాలి. షాంపూతో కడగాలి. రేగుపళ్ళ ఆకులు వేసిన పదిహేను బిందెల నీళ్ళతో శరీరాన్నంతా కడగాలి. స్నానం చేయించాలి. హారతి కర్పూరం శరీరానికంతా పూయాలి. చెవి గులిమి తీయాలి. గోర్లు తీయాలి. కండ్లలో సుర్మా పెట్టాలి. అత్తరు చల్లాలి. కాళ్ళ కాడ, నడుము, తలాపును గుడ్డతో కట్టి ముడి వేయాలి. తల ముందుభాగంలో ఉండేట్టు జనాజాలో పడుకోబెట్టాలి. సెంటు వేయాలి. అప్పుడు మౌలీసాబ్ 'జనాజేకి నమాజ్' చదువుతాడు. అక్కడినుండి ఖబరస్తాన్‌కు చివరియాత్ర జరుగుతుంది' అబ్బా చెప్పిన ఈ మాటలన్నీ సలీమా మదిలో మార్మోగుతున్నాయి.

ఒకసారి శుభ్రం చేసి వచ్చిన తండ్రిని 'ఎలా చేస్తారు అబ్బా' అని అడగటంతోనే ఇదంతా పూస గుచ్చినట్లు చెప్పాడు చాంద్. అవన్నీ ఇప్పుడు సలీమా కండ్లముందు

వినపడుతున్నాయి. సలీమా ఆలోచనల్లో 'నాన్నకు చివరిసారిగా ఈ సేవ చేసే అవకాశాన్ని విడువకూడదు. ఎలాగైనా నేనే చేస్తాను. నేనే చేస్తాను'.

'గత పాతికేండ్లుగా వందలమంది శరీరాలను శుభ్రపరిచిన చేతులవి. చివరియాత్రకు ముస్తాబు చేసిన హస్తాలవి. ఈ లోకంలో అంటిన మలినాలన్నింటినీ కడిగి దేహాన్ని స్వచ్ఛంగా చేసిన చేతులవి. మానవీయ పరిమళాలను అద్దిన చేతులవి. అబ్బా చేతులను శుభ్రం చేయటం నా బాధ్యత. నా కర్తవ్యం. నా అదృష్టం. నన్నెవరూ ఆపొద్దు.'

'లేదమ్మా ఆడపిల్లవి. నువ్వు చేయొద్దు' అని ఓ పెద్దాయన బిడ్డను సముదాయించాడు.

అప్పుడు సలీమా ఒక నిర్ణయానికి వచ్చింది.

'అరె భాయ్ జావెద్! నువ్వు రా.. నేను చెప్పినట్లు చెయ్' అంటూ అన్నను పిలిచింది.

ఆమె కన్నీళ్లను దిగమింగి నీళ్ళను అందించింది. ప్రేమ పరిమళం కాయమంతా పూయబడుతున్నది. ఓ తల్లి బిడ్డని తీర్చినట్లు తలుపుల జోలపాటతో ఓదార్చినట్టు అపురూపంగా, ఆప్యాయంగా శుభ్రమయ్యాడు చాంద్, తెల్లని మంచుకొండలా.

ఒక నిశ్శబ్ద సన్నివేశం. ఎవరూ ఏమీ మాట్లాడటం లేదు. అంతా జరిగిపోతున్నది. ముగింపు యాత్ర మొదలయింది. ఒక ప్రశాంతమైన నదిలా పావురాల గుంపు కదిలి పోయింది. ఒక బతుకు యాతన ముగిసిపోయింది. ఒక అత్తరు వాసన దారి మలుపు తిరిగి సాగిపోయింది.

## కటుకోజ్వల ఆనందా చారి

*ఖమ్మం పట్టణానికి చెందిన కటుకోజ్వల ఆనందా చారి, ఎంఏ(తెలుగు), బీఈడీ చదివారు. ప్రభుత్వ తెలుగు ఉపాధ్యాయుడిగా 30 ఏండ్లపాటు పనిచేసి, 2019 జనవరిలో ఉద్యోగ విరమణ చేశారు. 2018లో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డును అందుకున్నారు. నాలుగు దశాబ్దాలుగా కవిత్వాలు, విమర్శలు రాస్తున్నారు. 'మొలక', 'స్ఫూర్తి శిఖరం' కవితా సంపుటాలను వెలువరించారు. 'ధిక్కార గళం మన కాళోజీ', 'మహోన్నతుడు మార్క్స్' పేరుతో కాళోజీ నారాయణరావు, కార్ల్ మార్క్స్ జీవిత చరిత్ర పరిచయాలను రచించారు. సన్మానాలు, అవార్డులు అందుకున్నారు. 2016లో సినారెగారి చేతుల మీదుగా 'ఉత్తమ కవి' బహుమతి సత్కారం పొందారు. 1999 నుంచీ సాహిత్య సభలను నిర్వహిస్తున్నారు. 'సాహిత్య ప్రస్థానం' అనే సాహిత్య పత్రికకు 12 ఏండ్లపాటు సంపాదకవర్గ సభ్యుడిగా పనిచేశారు. ప్రస్తుతం 'తెలంగాణ సాహితి'కి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు.*

# అమృతం

సయ్యద్ సలీం

75886 30243

లాక్‌డౌన్ ఎత్తేశారు. పంజా విసరడానికి పొంచి ఉన్న గండుపిల్లికి భయపడి కలుగులో దాక్కున్న ఎలుకల్లా, ఇన్ని రోజులూ గడిపిన మనుషులు మెల్లమెల్లగా బైటికి రావడం మొదలైంది. రకరకాల మాస్కులు తొడుక్కుని ముసుగు వీరుల్లా మనుషులు. 'ఆకలికి కూడా లాక్‌డౌన్ ఉంటే ఎంత బావుండేదో కదా' అనుకుంది రోష్నీ. తినడానికేమీ లేనప్పుడల్లా లాక్‌డౌన్ విధిస్తే చాలు, ఆకలిని బైటికి రాకుండా కట్టడి చేయొచ్చు. కానీ, అది ఆకలి కదా! ఎవరి మాటా వినదు. తిండికి తప్ప మరి దేనికీ లొంగదు. మూడు రోజులుగా కడుపులో రగులుతున్న ఆకలి మంటను మంచినీళ్ళు పోసి చల్లార్చే ప్రయత్నం చేస్తున్నది. చల్లారడం మాట అటుంచి.. అగ్నిలో ఆజ్యం పోసినట్టు మరింత భగ్గుమంటున్నది.

ఆమె మెల్లగా నడవసాగింది. నీరసం వల్ల అడుగులు తడబడుతున్నాయి. చీకటి పడింది. వీధి దీపాలు వెలిగాయి. చీకటి పారిపోయింది. కానీ, తనలో ఉన్న చీకటో.. కడుపులో చిక్కగా ఘనీభవించిన చీకటి. పదహారేండ్ల వయస్సులో తన కండ్లు ఎంత కాంతివంతంగా ఉండేవో.. సూర్యకాంతి పడి తళతళ మెరిసే తేటనీటి కొలనుల్లా. ఇప్పుడు పొరలు పొరలుగా అల్లుకున్న చీకటేదో వాటిలో స్థిరనివాసం ఏర్పర్చుకుంది. అందుకే ఏడ్చినపుడల్లా కన్నీళ్ళతోపాటు చీకటి బొట్లు బొట్లుగా కారుతూ ఉంటుంది. ఈ చీకట్లనుంచి తనకు విముక్తి లేదని తెలిసే, వాటితో సహజీవనం చేయడానికి అలవాటు పడిపోయింది. 'రోష్నీ అంటే వెలుతురు కదా' అని గుర్తొచ్చినపుడల్లా, ఆమె పెదవులమీద విరక్తితో కూడిన నవ్వు క్షణకాలం మెరిసి మాయమవుతూ ఉంటుంది.

***

ఆమె అసలు పేరు రోష్నీ కాదు. చిన్నప్పుడు అమ్మానాన్న పెట్టిన పేరు మర్చిపోయి ఎన్నేండ్లయ్యిందో. పదహారేండ్ల వయస్సులో శీనుని నమ్మి, వాడితోపాటు ఈ పట్నానికి రావడమే తను చేసిన తప్పు. ప్రేమ అనుకుంది. వాడికి తనంటే పిచ్చి అనుకుంది. వయస్సు పొంగులో కండ్లు మూసుకుపోయి, కసాయివెంట నడిచే గొర్రెపిల్లలా వచ్చేసింది. వాడు నాలుగు రోజులు సరదా తీర్చుకుని, తనను అమ్మేసి, అంగడి సరుకును చేసి వెళ్ళిపోయాడు. ఎన్నిసార్లనుకుందో.. వాడు గొంతు నులిమి చంపేసి ఉంటే, ఒకేసారిగా తన ప్రాణం పోయి

ఉండేదిగా అని. ఇలా రోజురోజుకూ రకరకాల చావులు చచ్చే బాధ తప్పేదిగా అని..

ఈ నరకకూపంలోకి అడుగుపెట్టి అప్పుడే పద్నాలుగేండ్లు దాటిపోయాయి. తనెప్పుడో చచ్చిపోయింది మానసికంగా. శరీరం బతికే ఉంది. తను చేసే వ్యాపారానికి ముడిసరుకు ఈ శరీరమే. దీన్ని పోషించక తప్పదు. అందుకు తిండి కావాలి. తిండి కావాలంటే డబ్బులుండాలి. ఎన్నాళ్ళయిందో తను డబ్బుల మొహం చూసి. లాక్‌డౌన్ తమ వృత్తిని దెబ్బతీసినంత ఘోరంగా ఏ వృత్తినీ, వ్యాపారాన్నీ దెబ్బతీసి ఉండదు. సాయంత్రం ఆరు అయ్యేటప్పుడికి తమ వీధంతా విటులతో కిటకిటలాడుతూ ఉండేది. ట్యూబ్‌లైట్ల కాంతితో పోటీ పడుతూ బొమ్మల్లా అలంకరించుకున్న తనలాంటి అభాగినులందరూ గుమ్మాలకు వేలాడదీసిన పూలదండల్లా నిలబడి ఉండేవారు. ఒంటికి పూసుకున్న సెంటు పరిమళంతోపాటు ప్లాస్టిక్ నవ్వుల్ని ఉదారంగా వెదజల్లుతూ, హొయళ్ళు పోతూ, వంకర్లు తిరుగుతూ, లిప్‌స్టిక్ పూసిన ఎర్రటి పెదాలమధ్య ఎర్రటి నిప్పు కణికల్లాంటి అశ్లీల పదాల్ని పలుకుతూ..

***

లాక్‌డౌన్ విధించినప్పటినుంచీ ఆ వీధంతా నిర్మానుష్యమైపోయింది. అంతా శ్మశాన నిశ్శబ్దం. అగ్గి పెట్టెల్లాంటి ఇరుకిరుకు ఇండ్లలో జీవచ్ఛవాల్లా తనూ, తనలాంటి అభాగినులు. లాక్‌డౌన్ ఎత్తేసినా తమ పరిస్థితిలో మార్పు లేదు. కరోనా భయంతో ఎవ్వరూ అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఇన్నేండ్లలో వీధిగుమ్మం ముందు నిలబడి విటుల్ని ఆకర్షించడం తప్ప, ఇలా రోడ్డున పడి విటుల కోసం ఎదురుచూసే అవసరం ఎప్పుడూ కలుగలేదు. అంతా కరోనా ప్రభావం. దీనివల్ల ఎందరి జీవితాలు అతలాకుతలం అయ్యాయో..

రోష్ని ఓ వీధిలైటు కింద నిలబడింది. కొద్దిదూరంలో రోడ్డుకి అవతల బండ్లమీద రకరకాల తినుబండారాలు అమ్ముతున్నారు. ఇడ్లీలు, దోసెలు, బజ్జీలు, పునుగులు, నూడుల్స్.. ఆకలి మళ్లీ జూలు విదిలించింది. ఈ రోజైనా కడుపులో ఘనపదార్థం ఏదైనా పడకపోతే, తను ఆకలితో చచ్చిపోవడం ఖాయం. ఆకలికన్నా కరోనా భయంకరమైందని అన్పించడం లేదు. కరోనా సోకినా ప్రాణాలతో బయటపడే అవకాశం ఉంది. కానీ, ఆకలి జబ్బు సోకితేనో? దానికి మందేముంది? ఓ ముద్ద అన్నం తప్ప. ఆమెవైపు అదోలా చూస్తూ కనిపించాడొకడు. వయస్సు యాభైకిపైనే ఉండొచ్చు. జుట్టు సగానికిపైగా నెరిసింది. పొట్టిగా, లావుగా ఉన్నాడు. మొహానికి తెల్లటి మాస్క్ తొడుక్కుని ఉన్నాడు. అతని చూపుల్లోని ఆకలిని ఆమె పసిగట్టింది. అతను దగ్గరగా వస్తుంటే అన్నం ముద్ద నోటికాడికి వస్తున్నట్టనిపించింది. ఆమె తన మొహానికున్న మాస్క్‌ను తీసేసి, అతనివైపు ఆహ్వానం నిండిన చూపొకటి విసిరింది. ఆమెకు కొద్దిగా ఎడంగా వెళ్ళి నిలబడి ఆమెవైపు చూశాడతను. ఆమె నవ్వింది. అతను మొహం తిప్పుకున్నాడు. రోష్ని రెండడుగులు

అతనివైపు వేసి 'కావాలా?' అని అడిగింది. ఊహించని విధంగా అతను విరుచుకుపడ్డాడు. 'బుద్ధుందా నీకు? కరోనాతో మనుషులు పిట్టల్లా రాలిపోతున్నా మీకు మీ వ్యాపారం తప్ప మరేమీ పట్టదా? ఎంతమందికి కరోనా అంటించాలనుకుంటున్నావు? ఇప్పటివరకూ ఎంతమందికి అంటించావు? పోలీసుల్ని పిలువమంటావా?' అతను పెద్దపెద్దగా అరుస్తూనే ఉన్నాడు. పిచ్చికుక్కేదో వెంటబడినట్లు రోష్ని అక్కడినుంచి వేగంగా ముందుకెళ్ళి, మరో వీధిమలుపులో నిలబడింది. రాత్రి తొమ్మిదైనా బేరం తగల్లేదు. 'ఈ పూటక్కూడా మంచినీళ్ళే గతి' అనుకుని కాళ్ళీడ్చుకుంటూ ఇంటివైపు నడక సాగించింది.

***

ఆమెకు లాక్‌డౌన్ రోజుల్లో పడిన కష్టాలు ఒక్కొక్కటిగా గుర్తుకు రాసాగాయి. మార్చి 22న జనతా కర్ఫ్యూ పెట్టారు. 'అది శాంపుల్ మాత్రమేనని, ముందుంది మొసళ్ళ పండగ' అని అప్పుడు తనకు తెలియదు. అందరితోపాటు తనుకూడా ఆ రోజు సాయంత్రం ఐదింటికి గడపలో నిలబడి చప్పట్లు కొట్టింది. మార్చి 25 నుంచి 21 రోజుల లాక్‌డౌన్ విధించారు. ఎవ్వరూ గడపదాటి బైటికెళ్ళడానికి వీలు లేదు. ఎవ్వరూ లోపలికి రావడానికి లేదు. జైల్లో బంధించినట్లే. ఊపిరాడదు. ఏమీ తోచదు. కస్టమర్లు లేరు. ఆదాయం లేదు. ఖర్చులో మాత్రం పెద్దగా మార్పు లేదు. దాచిపెట్టుకున్న డబ్బులు కరిగిపోసాగాయి. మూడు వారాలు ఎలాగోలా ప్రాణం ఉగ్గబట్టుకుని గడిపేస్తే చాలనీ, ఆ తర్వాత ఎప్పటిలాగే వ్యాపారం చేసుకోవచ్చని ఆశ. కానీ, 21వ రోజున పిడుగులాంటి వార్త. లాక్‌డౌన్ మరో 19 రోజులు పొడిగించారని. ఆ వార్త వినగానే తన గుండెల్లో రాయి పడింది. దిగులు సునామీలా చుట్టేసింది. చేతిలో చిల్లిగవ్వ లేదు. 19 రోజులు ఎలా గడపాలో అర్థం కాలేదు. పేద కుటుంబాల కోసం ప్రభుత్వం బియ్యం, కందిపప్పు, కూరగాయలు సరఫరా చేయడం మొదలెట్టింది. దానికి రేషన్ కార్డు చూపించాలట. తనకు రేషన్ కార్డు లేదు. తనకే కాదు, ఆ వీధిలో తనలా ఒళ్ళమ్ముకొని బతికే చాలామందికి రేషన్ కార్డులు లేవు. ఆకలి.. చుట్టుపక్కల ఇండ్లలోనూ నెగడులా మండుతూ ఆకలి.

ఓ రోజు ఏదో స్వచ్ఛంద సంస్థ తరపున ఒకావిడొచ్చి అన్నం పొట్లాలు పంచింది. అందరూ ఎలా ఎగబడ్డారో.. తోసుకుంటూ, తొక్కుకుంటూ, తిట్టుకుంటూ.. ఆమెకు సాయంగా వచ్చిన ఇద్దరు పోలీసులు లేకపోతే జుట్లు పట్టుకుని కొట్టుకునే వాళ్ళు కూడా. ఆ పొట్లంలో ఉన్న అన్నంలో సగం తిని మిగతా సగం రాత్రి కోసం దాచుకునేది. అర్ధాకలితో పడుకున్నా సగమైనా కడుపు నిండుతున్నందుకు ఆ స్వచ్ఛంద సంస్థ వాళ్ళకు ఎన్నిసార్లు మనసులోనే చేతులెత్తి మొక్కిందో.. లాక్‌డౌన్ మరో నాలుగు వారాలు పొడిగించారు. ప్రభుత్వం పేద, బడుగు వర్గాలకోసం, వలస కార్మికులకోసం ప్రకటించిన సంక్షేమ పథకాలేవీ తన గుమ్మం దాకా రాలేదు. ఆ వీధిలో ఉండే తనలాంటి అభాగినులు కూడా శ్రామికులేగా. కార్మికులు కండల్ని కరిగించి భవన నిర్మాణాల్లోనో, ఫ్యాక్టరీల్లోనో

పనిచేస్తే, తాము కూడా తమ శరీరాల్ని, ఆరోగ్యాల్ని ఫణంగా పెట్టి గుండెల్ని కొలిమిలో కాల్చుకుంటేనేగా కడుపుకింత కూడు దొరికేది. మరి ప్రభుత్వం తమను ఎందుకు పట్టించుకోదో ఆమెకు అర్థమయ్యేది కాదు. లాక్‌డౌన్ ఎత్తేశాక తన కష్టాలు తీరుతాయని ఆశ పడింది. అది అడియాసగానే మిగిలిపోయింది. కరోనా చేస్తున్న కరాళనృత్యం రోజురోజుకూ తీవ్రమవుతున్నది. రక్షణ కోసం మాస్కులు తొడుక్కోవడం, భౌతికదూరం పాటించడం తప్పనిసరైంది. ఇలాంటి పరిస్థితుల్లో కస్టమర్లు ఎవరొస్తారు? తమ వీధికొచ్చే కస్టమర్లలో ఎక్కువమంది వలస కార్మికులు, లారీ డ్రైవర్లు, క్లీనర్లు, ఆటో నడిపేవాళ్ళు, క్యాబ్ డ్రైవర్లే. ఇప్పుడు వాళ్ళకే ఉపాధి లేక అల్లాడుతుంటే, తనలాంటివాళ్ళ మీద ఖర్చు చేయడానికి డబ్బులెక్కడి నుంచి వస్తాయి? ఎయిడ్స్ భూతం భయపెట్టిన రోజుల్లో అయినా రక్షణ తొడుగుల పుణ్యమా అని తన వ్యాపారం సజావుగానే సాగింది. కానీ, ఇప్పుడు కరోనా మహమ్మారి నుంచి రక్షించే రక్షణ కవచాలతో దేహవ్యాపారం ఎలా సాధ్యం. అప్పుడే ఆమెకు రమేశ్ గుర్తొచ్చాడు. చిన్న చెప్పుల దుకాణం నడుపుతుంటాడు. ఆమె అంటే ప్రాణం అన్నట్టు ప్రవర్తిస్తాడు. అప్పుడప్పుడూ 'ఇదంతా వదిలేసి నాతో వచ్చేయరాదూ.. నేను ఉంచుకుంటాను' అంటుంటాడు. అతనికి ఫోన్ చేసి రమ్మంటే వస్తాడేమోనన్న ఆశ. ఒక్క 500 రూపాయలు ఇస్తే చాలు. కొన్ని రోజుల వరకు ఆకలికి బలి కాకుండా కాపాడుకోవచ్చు. వెంటనే రమేశ్‌కు ఫోన్ చేసింది.

'బాగున్నావా?' అన్నాడు.

'బాగున్నాను. రాకూడదూ? చాలా రోజులైంది నిన్ను చూసి. బాగా గుర్తొస్తున్నావు.'

'నువ్వు కూడా బాగా గుర్తొస్తున్నావు. కానీ, వచ్చి ఏం చేయమంటావు?'

'నేను చెప్పాలా ఏమిటి? నీకు తెలియదా?'

'తెలుసు కాబట్టే అడుగుతున్నా. నోటికి మాస్క్ వేసుకుని, వొళ్ళంతా పీపీఈ కోటు వెనుక దాచేసుకుని, ఆరడుగుల దూరం పాటిస్తూ.. అదెలా సాధ్యం? నువ్వే చెప్పు' అంటూ తనేదో జోక్ పేల్చినట్టు పెద్దగా నవ్వాడతను.

'పోన్లే.. అదేమీ వద్దులే. ఓ 500 ఇచ్చి పో.. చాలు. సరుకులు కొనుక్కుంటాను. అన్నం తిని మూడు రోజులైంది.'

'అయ్యో.. అలానా.. ఐనా ఊరికే 500 ఎవరైనా ఎందుకిస్తారనుకుంటున్నావు?'

'ఊరికే వద్దు. అప్పుగా ఇవ్వు. ఈ కరోనా ఎప్పటికైనా తగ్గుతుందిగా. అప్పుడొస్తే నీ అప్పు వడ్డీతోసహా తీరేలా నీకు సహకరిస్తాను.'

'ఇటువంటి వ్యవహారాల్లో అప్పు ప్రసక్తే మంచిది కాదు. ఈ చేత్తో డబ్బులిస్తే ఆ చేతికి కోరుకున్నది దొరకాలి. నాలెక్క అంతే.'

రోష్నికి కోపం వచ్చింది.

'నేనంటే ఇష్టమంటావుగా. అవన్నీ ఉత్త మాటలేనా?' అంది.

'ఇష్టమే. కాదని ఎవరన్నారు? కానీ, డబ్బుదగ్గర మాత్రం నేను చాలా నిక్కచ్చి' అన్నాడు.

ఫోన్ కట్ చేస్తూ 'ఎదవ సచ్చినోడు.. ఛీ. నిక్కచ్చట నిక్కచ్చి' అంటూ గొణుక్కుంది.

తమ వీధిలోకి మలుపు తిరగంగానే గోడవారగా నిలబడి ఉన్న రషీద్ కనిపించాడు. అతనికి దాదాపు 60 ఏండ్ల వయస్సుంటుంది. పుట్టు గుడ్డి. ఎడం చేతిలో ఉన్న కర్రను నేలకు తాకిస్తూ, కుడి చేతిని చాపి 'అల్లాకే నామ్పే అంధే కో ఖైరాత్ దో బాబా' అంటూ అడుక్కుంటూ ఉంటాడు. కర్రకు పైన కట్టి ఉన్న మువ్వలు శబ్దం చేస్తూ అతని గొంతుతో శ్రుతిని కలుపుతూ ఉంటాయి. నలుగురు మగ పిల్లలు.. ఇలా అడుక్కున్న దాంతోనే వాళ్ళను పెంచి, పెద్దవాళ్ళను చేశాడు. కానీ, ఇప్పుడు 'పిల్లలు ఎవరిదారి వాళ్ళు చూసుకున్నారనీ, తననీ తన బేగంని పట్టించుకోరని' అడిగిన వాళ్ళందరికీ చెప్తూ ఉంటాడు.

ఆ వీధిలో ఉండే తనలాంటి స్త్రీలందరూ అతన్ని 'రషీద్ చాచా' అంటూ ఆదరంగా పలుకరిస్తారు. వ్యాపారం బాగా జరిగిన రోజు అతని చేతిలో ఐదో పదో ఖైరాత్గా ఇస్తుంటారు. అక్కడికొచ్చే విటులుకూడా తమకు తోచినంత దానం చేస్తుంటారు. కానీ, లాక్డౌన్ సమయంలోనేకాదు అది ఎత్తేశాక కూడా ఆ వీధిలోకి ఎవ్వరూ రాకపోవడంతో రషీద్, అతని భార్య పస్తులుంటున్న విషయం రోష్నికి తెలుసు.

'సలాం వలేకుం రషీద్ చాచా. ఈ రోజైనా ఖైరాత్ దొరికిందా?' అని అడిగింది రోష్ని.

'వలేకుం అస్సలాం రోష్నీ బేటీ. ఎవ్వరైనా ఈ వీధిలోకి వస్తే కదా తల్లీ ఖైరాత్ దొరికేది? ఈరోజు బక్రీద్ పండగ. నేనూ నా బేగం ఈ ఈద్ రోజు కూడా పస్తులుండక తప్పేలా లేదు. ఏం చేస్తాం.. ఆ పర్వర్దిగార్కి ఇంకా మామీద దయ కలిగినట్టు లేదు' అన్నాడు.

'మా మీదకూడా రషీద్ చాచా' అని మనసులో అనుకుని,

'ఈ వీధిలోకి కొన్నాళ్ళపాటు రావొద్దని చెప్పాగా చాచా. మేమే పస్తులుంటుంటే నీకు ఖైరాత్ ఎలా దొరుకుతుంది? రద్దీగా ఉండే వీధి వెతుక్కుని వెళ్ళొచ్చుగా. ఎన్నాళ్ళు పస్తులుంటావు?'

'ఎన్నో యేళ్ళుగా నాకు అన్నం పెట్టిన వీధి తల్లీ ఇది. అలవాటైన దారి.. వద్దని చెప్పినా నా మువ్వలకర్ర వినదుగా. ఇటుకే లాక్కొస్తుంది. అయినా మీతోపాటే నేను.. మీరు పస్తులుంటుంటే నేను మరో వీధిలో అడుక్కుని కడుపునిండా తింటే ఒంటబడ్తుందా తల్లీ? అల్లా మెచ్చడు' అన్నాడు.

రోష్ని యిల్లు చేరుకున్న రెండు నిమిషాలకే ఎవరో తలుపు తడ్తే కస్టమరేమో అనుకుని ఆశగా తలుపు తీసింది. ఎదురుగా ఇంటి ఓనర్ గోపాల్.. మనిషి భారీగా ఎద్దులా, నల్లగా తుమ్మమొద్దులా ఉంటాడు. ఇంట్లోనే ఏవో కెమికల్స్ తయారుచేసి అమ్ముతుంటాడు. అందువల్లేనేమో అతనికి చర్మ రోగమేదో అంటుకుంది. వొళ్ళంతా పొడలు. కొన్నిటినుంచి రసి కారుతూ.. చూస్తేనే వికారం కలిగేలా..

'మూడు నెలల అద్దె బాకీ ఉన్నావు. ఎప్పుడిస్తావు?' ఎప్పటికిమల్లే ఆమె శరీరం వైపు ఆకలిగా చూస్తూ అడిగాడు.

'బేరాలుంటేగా, తిండానికే తిండి లేదు. ఇంక అద్దె ఎక్కడినుంచి కట్టమంటావు?' అంది రోష్ని.

గోపాల్ ఆమె పొందుకోసం ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నాడు. అడిగిన ప్రతిసారీ ఆమెనుంచి తిరస్కారాన్నే పొందాడు. ఆమె చూపులో ఇన్నాళ్ళూ అసహ్యం తప్ప మరేదీ కన్పించలేదతనికి. కానీ, ఇప్పుడామె నిస్సహాయత అతన్ని ఉసిగొల్పుతున్నది. ఇన్నాళ్ళూ అందకుండా పరుగుపెట్టిన లేడిపిల్ల ఇప్పుడు కాళ్ళు విరిగి దీనంగా పడిఉంది. చేతికి చిక్కకుండా ఎలా తప్పించుకుంటుంది?

'నా కోరిక తీర్చావనుకో. ఒక నెల అద్దె మాఫీ చేస్తాను' ఆశగా చూస్తూ అన్నాడు.

రోష్ని ఎప్పటిలా 'ఛీ.. నీతోనా?' అన్లేదు. అలా అనేసి మొహం మీద అద్దె విసిరి కొట్టడానికి తన దగ్గర ఇప్పుడు డబ్బులు లేవు.

ఆమె మౌనంగా ఉండటం చూసి గోపాల్ మరింత ఉచ్చు బిగించే ప్రయత్నం చేశాడు.

'హోటల్ నుంచి మటన్ బిర్యానీ పార్శిల్ తెచ్చివ్వమంటావా? నువ్వు కడుపునిండా తిన్నాకే ఏదైనా..' అన్నాడు.

మటన్ బిర్యానీ పేరు వినగానే ఆమె నోట్లో నీళ్ళూరాయి. అతనివైపు కండ్లెత్తి చూసింది. నల్లటి చర్మం.. పైన తెల్లటి పొడలు.. వాటిలోంచి రసి కారుతూ.. అసహ్యం వేసింది. 'ఆకలిని భరించడం సులభమా? లేక అసహ్యాన్ని భరించడమా? కళ్ళు మూసుకుంటే చాలు.. అసహ్యం కన్పించదు. కానీ, ఆకలి? అది తన శరీరంలోని కణకణంలో అగ్నిపర్వతంలా విస్ఫోటనం చెందుతూ.. మనసునీ గుండెనీ చివరికి ఆత్మని కూడా ఛిద్రం చేస్తూ..' రోష్ని కొన్ని క్షణాలు కండ్లు మూసుకుని, ఓ నిశ్చయానికొచ్చి కండ్లు తెరిచింది. వ్రతం చెడబోతున్నది. కనీసం ఫలితం దక్కాలనుకుంది.

'ఒకనెల అద్దె మాఫీ చేస్తే ఎలా సరిపోతుంది?' అంది.

'మూడు నెలల అద్దె మాఫ్' తన కోరిక తీరబోతుందన్న ఉత్సాహంతో అన్నాడు.

'వెయ్యి రూపాయలు కూడా ఇవ్వాలి.'

'మూడు నెలల అద్దె మాఫీ చేశాగా.. ఇంకా అదనంగా డబ్బులివ్వాలా? ఇవ్వను.'

'నీ ఇష్టం. ఈపూట బిర్యాని తెచ్చిస్తానన్నావు. మరి రేపో.. ఎల్లుండో.. నాకు నెలంతా గడవొద్దా?'

అతను అయిష్టంగానే 'సరే' అన్నాడు.

'మొదట నా చేతిలో డబ్బులు పెట్టు. తర్వాత హోటల్‌కెళ్ళి బిర్యానీ పట్టుకురా. ఆ తర్వాతే నువ్వు కోరుకుంది దొరుకుతుంది' అంది.

గోపాల్ ఆమె చేతిలో పది వంద రూపాయల నోట్లు పెట్టాడు. హోటల్ కెళ్ళి మటన్

బిర్యానీ పార్శిల్ తెచ్చి, ఆమె ముందు పెట్టాడు. అతను ఎదురుగా ఉంటే తిండి సయించదని ఆమెకర్థమైంది.

'మొదట నీ పని కానీ. తర్వాత తీరిగ్గా తింటాలే' అంది. కొన్ని నిమిషాలు కండ్లు మూసుకుంది. అతను వెళ్ళిపోయాక బిర్యానీ పొట్లం విప్పింది. లావాలా ఎగ్రటి ఆకలి.. దాన్ని చల్లార్చే నీటి వూటలా ఎదురుగా బిర్యానీ. ముద్ద నోట్లో పెట్టుకోబోతుండగా రషీద్ చాచా మొహం కండ్లముందు మెదిలింది. 'మీతో పాటే నేను.. మీరు పస్తులుంటే నేను కడుపు నిండా తింటే అల్లా మెచ్చడు తల్లీ' అన్న రషీద్ చాచా. అతనూ అతని బేగం పస్తులుంటే తను కడుపునిండా తింటే అల్లా మెచ్చుతాడా ? మెచ్చడు గాక మెచ్చడు. రోష్ని ఓ ప్లేట్లో మూడోవంతు బిర్యానీని తీసి పెట్టుకుంది. మిగతా బిర్యానీని పొట్లం కట్టి, వేగంగా బైటికి నడిచింది. అప్పుడే రషీద్ చాచా తన మువ్వల కర్రను తాటించుకుంటూ మెల్లగా నడుచుకుంటూ వెళ్తున్నాడు. 'రషీద్ చాచా' అని పిలిచింది. అతను ఆగిపోయి వెనక్కి తిరిగాడు. అతని చేతిలో బిర్యానీ పొట్లం పెట్టింది. 200 రూపాయలు తీసి అతని జేబులో పెడ్తూ 'ఈద్ ముబారక్ రషీద్ చాచా' అంది. అతని కండ్లలో నీళ్ళూరాయి. 'షుక్రియా బేటీ.. అల్లా తుమ్కో ఖుష్ రఖే.. బర్కత్ దే' అన్నాడు. రోష్ని ఇంటికి తిరిగొచ్చి, ప్లేట్లో తీసిపెట్టుకున్న బిర్యానీ తింటుంటే.. తనలా ఆకలితో అలమటిస్తున్న మరో ఇద్దరితో పంచుకున్నందువల్లేమో.. అచ్చం అమృతంలానే అనిపించింది.

## సయ్యద్ సలీం

*ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా, త్రోవగుంట గ్రామంలో 1959 జూన్ 1న సయ్యద్ సలీం జన్మించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి భూభౌతిక శాస్త్రంలో ఎమ్మెస్సీ (టెక్) చేశారు. ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్‌లో అడిషనల్ కమిషనర్‌గా ఉద్యోగ విరమణ పొందారు. సాహిత్యంపై అభిలాషతో ఇప్పటి వరకూ మూడు కవితా సంపుటాలు, పది కథా సంపుటాలు, 24 నవలలను వెలువరించారు. బాలల కోసం నాలుగు నవలికలు రాశారు. కొన్ని నవలు, కథలు ఇంగ్లిష్, హిందీ, మరాఠీ, ఒరియా, కన్నడ, మలయాళం, తమిళభాషల్లోకి తర్జుమా అయ్యాయి. ఆయన రచించిన 'కాలుతున్న పూలతోట' నవలకు కేంద్ర సాహిత్య వల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక శాఖ నిర్వహించిన పోటీలో బహుమతిని గెలుచుకున్నది. సయ్యద్ సలీం రాసిన 'వెండి మేఘం' నవల ఉస్మానియా యూనివర్సిటి, పాలమూరు యూనివర్సిటి, మహాత్మాగాంధీ యూనివర్సిటి, తెలంగాణ యూనివర్సిటిలలో 'ఎంఏ తెలుగు' విద్యార్థుల సిలబస్‌లో చేర్చారు.*

# కుక్క సద్ది

కాలువ మల్లయ్య

91829 18567

అంబటాల్లయింది. సాకలోల్లు ఊళ్ళే తిరుగుతాంర్రు. 'సాకల్దాన్నవ్వ' పిలుపులు ఇండ్లముందు వినబడుతున్నయ్. కంకెడంత బువ్వదెచ్చి సాకలామె బొడ్లె కుక్కుకున్న బట్టలేత్తున్నరు. అందరిండ్లల్ల పొద్దుగాల్టి బువ్వండుడయిపెయ్యింది. బువ్వదిని కైకిలికి పోవుటానికి ఆడోల్లు, మొగోల్లు తయారైతున్నరు. గొల్లవాడ.. సల్లకవ్వాల సప్పుడుతోని ప్రతిధ్వనిస్తున్నది. సాలెవాడ.. మగ్గం నాడెల టక్‌టక్ శబ్దాలతో చెవులకు విందు చేస్తున్నది. అవుసులవాడ నిండా సుత్తెల టక్ టక్ ధ్వని. గౌండ్లోల్లు పొద్దాటి కల్లు గీక్కొచ్చి కుండల్ల నింపి, ఇండ్ల ముంగట వెట్టింర్రు. ఆ కుండల్లనుంచి కమ్మటి కల్లు వాసననొత్తంది. కాపోల్లు నాగండ్లను తిర్రమర్ర గట్టి పొలాలల్లకు ఎడ్లను తోలుక పోతున్నరు. కుమ్మరోల్లు సారెమీద మన్నువెట్టి సారె దింపుతున్నరు. అడ్లకమ్మరోల్లు బాడిశెలకు, కొలుములకు పని జెప్పుతున్నరు. మంగలోల్లింటి ముంగట సవురాల పని నడుత్తాంది. మాదిగ బుచ్చయ్య అంబలిదాగి శెప్పులు కుట్టే పనిల నిమగ్నమైండు. బెస్తోల్లు తోపెలలు భుజానికేసుకొని శాపలు వట్టుడానికి శెరువు దిక్కు నడుస్తంర్రు. తెనుగోల్లు కందగడ్డ, జామపండ్లు గుల్లలల్ల ఏసుకొని అమ్ముటానికెళ్తుంర్రు. అరొక్క కులపోల్లు తమతమ పనులల్ల నిమగ్నమైంర్రు.

***

కోడికూతతోనే నిద్రలేశింది గొల్ల పోశవ్వ. ముంతబట్టుక పొయ్యొచ్చింది. ఆకిలూడ్సింది. అలుకు జల్లింది. ముగ్గేసింది. పొయ్యిల బూడిదెత్తి పోశింది. పొయ్యంటువెట్టింది. గడుకెసరు వెట్టింది. ఎసరు మరిగినంక అండ్ల గడుకవోసింది. తెడ్డుతోని రుద్దింది. కూరాట్ల కెల్లి కలినీల్లు దీసి అండ్లవోసింది. ముద్ద పప్పేసింది. పచ్చిపులుసు సేసింది. గంటెల ముత్తెమంత నూనెవోసి పప్పుల, పులుసుల సుర్ మనిపిచ్చి. తాలుపు వెట్టింది.

కవ్వమందుకుంది. సల్లజేత్తంది.

'అంబటాల్లయితంది. పనేమొ ఎంత కొడుత్తలేకపాయె. నీయవ్వ బతుకులు పాడుగాను. ఎంత జేసినా ఏడే మాన్కలన్నట్టుండె. గా ఉన్నొక్కపోరన్నైనా సదివియ్యాలె. గీ గొర్రెముడ్డికి మూతి తుడుసుకునే పనితోని బతుకులానికి రానియ్యద్దు.' తనలో తానే అనుకుంటూ కవ్వం శిలుకుతాంది.

'పోశవ్వా! ఇంక సల్లజేసుడు కాలేదానె. జిడ్డు వాసనత్తంది. ఎంతయిన గొర్రె పాడేకద మీ ఇంట్లుంది' అరుగెక్కుకుంటూ అంది కాపు రాజవ్వ.

పోశవ్వకు శిర్రుమని కోపమచ్చింది. సల్లజేసుడాపి బయటకచ్చింది.

'జిడ్డు జిడ్డనుకుంటనే గా జిడ్డుపెరుక్కెందుకచ్చుడో?' అంది.

'ఆ.. నువ్వేమన్న పెరుగువోత్తన్నవా తియ్యలేవు? సల్లేగద గిలాసెడంత పోత్తన్నవు. ఇప్పుడు మా ఇంట్ల బర్రె సుడిదాయె. పాడి లేకపోయెపటికె మీ ఇంటికత్తి. మీ ఇంట్ల పాడి లేకుంటె మా ఇంటికి రావా ఏంది?' అంది రాజవ్వ.

'వత్తం రాజవ్వ! కని మా గొల్లోల్ల పాడిని జిడ్డు గుంటదంటరెందుకు..?'

'ఏదో వదినవని అట్లన్నందుకు గంత కోపానికట్లెత్త పోశవ్వ? బర్రెపాలతోని సూసినపుడు గొర్రెపాలు కొంచెం జిడ్డంటరు.'

'సాల్తియ్యి రాజవ్వ బాగ సెప్పచ్చినవు.. మేకపాలు ఔషధమంటరు. గవ్వి గొల్లోల్లయిగావా? గవ్వీట్ని మందులకు వాడుతరు గద! పైత్యానికి వాడుతరు గద. గాంధి మహాత్ముడు మేకపాలు తాగెటోడట మా మల్లన్న జెప్పిండు. బడికివోతండు గద నా కొడుకు' అంది పోశవ్వ.

'సరెగని నీ కొడుకేడే పోశవ్వ..' అంది రాజవ్వ తన గ్లాసులో సల్లపోత్తున్న పోశమ్మతో.

'అగో.. వత్తుండు. శెరువుకు పెయిండు. గక్కన్నే శంబట్కు పొయ్యి, ఈత పుల్లతోని పండ్లు తోముకుంటడు. శెర్లనే తానం జేశత్తడు. మన బాయి నీల్లు ఉప్పు నీల్లు గద. రోజూ గాన్నే తానం జేసచ్చి, బువ్వదిని బడికి వోతడు. ఇయ్యాల్ల ఐతారమాయె. బడికి తాతీలు గద. కొంచెమంత ఆల్చెమైంది. లేకుంటే గిప్పటివరకు తిని బడికి వోతడు. మావోడు రోజూ మొదటి గంట కొట్టకముందే బల్లుంటడు' అంది పోశవ్వ.

రాజవ్వ ఎల్లిపోయింది.

మల్లన్న రానే అచ్చిండు..

ఇంతల్నే వెంసాని ఈరమ్మ అచ్చిందాడికి.

'గా బింగిసెవుల పిలగాని గురించే బాగ శెపుతున్నవత్త. పోశవ్వకు కొడుకంటే మా లావు ప్రేమ' అంది నవ్వుతూ.

మల్లన్న మూతి ముడుసుకున్నడు.

'అవ్వా! నన్నూకె గీమె బింగిసెవుల పిల్లగాడంటదే..! నాయి బింగిసెవులా?' అన్నడు.

22 katha 1-203 page-1_Layout 1 9/25/2021 3:32 PM Page 28

'వదిన వరుసయెపటికె గట్లంటది బిడ్డ..' అంది పోశమ్మ.

'ఇగో ఈరవ్వా! నా మనుమన్నే మనుకుంటున్నవు? మంచిగ సదువు కుంటండు. నేం జూత్తనాకని నువ్వు మా సూత్తవు నా మనుమడు తాలూక దారయితడు. తాసీల్దారైతడు. అంది కొంరమ్మ. పోశమ్మ అత్త.

'కాంగ నేను అడ్డంటున్ననా? మన కులంలకెల్లి సదువుకోని పైకత్తె మంచి దేనాయె.. మరిది వరుసాయెపటికె అట్లంటి' అని శెంబులో పోసిన సల్లను తీసుకొని ఎళ్ళిపోయింది వీరమ్మ, రాజమ్మ కూడా ఆమె ఎనుకే ఎళ్ళిపోయింది.

**'అగో.. వత్తుండు. శెరువుకు పెయిండు. గక్కన్నే శంబట్క పొయ్యి, ఈత పుల్లతోని పండ్లు తోముకుంటడు. శెర్లనే తానం జేశత్తడు. మన బాయి నీల్లు ఉప్పు నీల్లు గద. రోజూ గాన్నే తానం జేసచ్చి, బువ్వదిని బడికి వోతడు. ఇయ్యాల్ల ఐతారమాయె. బడికి తాతీలు గద. కొంచెమంత ఆల్చెమైంది. లేకుంటే గిప్పటివరకు తిని బడికి వోతడు. మావోడు రోజూ మొదటి గంట కొట్టకముందే బల్లుంటడు' అంది పోశవ్వ.**

***

'సాకల్దాన్నవ్వా..' అంటూ వాకిట్లో నిలుసుంది నర్సమ్మ

'ఊరంతా దిరిగి ఆఖరికి మా ఇంటికచ్చినావె నరుసమ్మ.'

తపుకుల కంకెడంత గటుకబోటు తెచ్చి, పేగులో ఏస్తూ అంది పోశమ్మ.

'నాకున్న ఇండ్లల్ల ఇదే కొసకున్న ఇల్లుగదా పోశవ్వ.. నీ శెయ్యి పెద్దది. నువ్వు బువ్వేత్తే ఒక్కలకు తినేంతయితది' అంది నర్సమ్మ.

ఇడిశిన బట్టలను ముల్లెగట్టి తలకు తగిలించుకుంది. 'పోతన్న పోశవ్వా' అంటూ వెళ్ళిపోయింది.

'అక్కా! నేనచ్చిన్నే.. జెప్పన కుక్క సద్దివెట్టు' శెప్పులిడిసి అరుగెక్కుకుంటన్నడు బోకె రాములు, గొల్లబోయేడు.

'కుక్క సద్ది.. కుక్కసద్దని బాగ ఏగిర్తపడ్తవు. గదెంతసేపే రామన్న! నీళ్లెత్తుకచ్చి బువ్వదినె వరకు నేం బెట్టనా?'

'పోశవ్వా! అల్లుడు గూడ ఇంటికాన్నే ఉన్నడుగద ఇయ్యాల్ల. ఐతారం గద. నాతోని గొర్లకాడికి తీసుకపోవన్నా?' అన్నడు రామయ్య ఖాళీ బిందె తీసుకొని అరుగుమీది కచ్చుకుంట.

'గా సదువుకున్న పొల్లగానికి గొర్లు బర్లెందుకుర రామన్న.. మంచిగ సదువుకుంటండు నా కొడుకు.'

'సదువుకోంగ ఎవ్వలద్దన్నరే అక్క.. ఇయ్యాల్ల ఐతారమే కద! ఎంత సదువుకున్నా కులకస్పి గురించి తెలువన్నే. మా అల్లుడు మంచిగ సదువుకుంటడు. బడిలేనప్పుడు గొర్లపొంటి, ఎడ్లగాయవోతడు. గిదేమొ కొత్తగన్నట్టు సెప్పవడ్తివక్క'

'అవ్వా! నేనియ్యల్ల గొర్లెంబడి వోత. బాగ పనున్నప్పుడు నేను మోట కొట్టటానికి, నీల్లు గట్టుటానికి పోతలేనా? కల్లాలప్పుడైతె బంతి గొడితి. గొర్లకాడికి గూడ అప్పుడప్పుడు పోతున్నగాదె. నేనియ్యాల్ల గొర్ల కాడికివోత'

'అల్లుడు మంచోడు.. నేనింటికి రానప్పుడు మంచిల్ల బాయికాడికి పొయ్యి నీల్లెత్తుకత్తడు గద' అన్నడు రామయ్య చేద బొక్కెన తీసుకొని పోకుంట.

'రామన్న ఇంట్లున్నంతసేపు బొలబొల గంటమోగినట్టు వదురుతనే ఉంటడు' అని. 'మల్లన్నా! బువ్వ దింటవా బిడ్డ అంబటాల్లైంది' అంది పోశవ్వ..

'గిప్పడ్దాక పొల్లగానికి బువ్వ పెట్టలేదానె! కైకిలోల్లు శేండ్లల్లవడిరి. ఏం జేత్తున్నవే పోశమ్మ' అంది కొంరవ్వ.

'మనుమని మీనలావు ప్రేమ ముసలామెకు. నేనేమన్న రికాముంటినా? కోడికూతతోని లేత్తి. కొడిసేపన్న కూసున్ననా? మల్లన్న శెర్లకువొయ్యి ఇప్పుడే అచ్చే. సత్తెవ్వ పొల్లుంటె కొంచెమంత ఆసరవుగని మా అన్నింటికిపాయె. ఇగ నువ్వేమొ అత్తిరుకం జేసుడేకని ఒక్క పనన్న అందుకోకపోతివి.'

'ఏందే పోశమ్మ నన్నాడి పోసుకోవడ్తివి. బారెడు పొద్దెక్కె. పొల్లగానికి ఇంకా బువ్వవెట్టలేదన్నందుకు గిన్ని మాటలంటివి' అంది కొంరమ్మ.

అత్తనేమో అనవోయింది పోశమ్మ.

'అవ్వా.. అట్లాగే నాయిన్నవ్వా. నాకేం ఆకలయితలేదే. బడికి వోతెనేమొ జెప్పున తిని పోత గద. ఇయ్యాల్ల ఆదివారమాయె. కొద్దిగంతాల్చేమైతేం బోతుంది? నా కోసురం మీరెందుకు కొట్లాడుతరు?' అన్నడు మల్లన్న నవ్వుకుంట.

'రా బిడ్డ. రా.. బువ్వ తిందువు గని' సాయమాన్లకు పోవుకుంట అంది పోశమ్మ.

'నాయిన్నవ్వా! నువ్వు తిన్నవానె' అన్నడు మల్లన్న.

'గామె గింతసేపాగుతదా! ఉడుకుడుకు గడుకల ఇంతంత అంబలి పోసుకొని ఉల్లిగడ్డ కొరుక్కుంట గడుకంబలి తాగింది. నువ్వచ్చేముందే తిని బైటకచ్చింది. ఇంకా నువ్వు తిన్లేదని ఆరాటపడ్తంది.'

'ఏం కూరజెయ్యలేదానె అవ్వ.. వట్టంబలితోనెట్ల తింటదది? నాయిన్నవ్వకు మంచిగవెట్టాలె బువ్వ. గింతమందిని సాది సవరిచ్చింది.'

'పప్పు, పులుసు మానేసిన బిడ్డ.. కని గవ్వి ఆమెదాకనన్న ఆగకపాయె. పగటీలి దింటది గద! గప్పుడు పప్పుశారుతోని తింటత్తియ్యి.'

'పప్పాయెదాక ఆగకపెయినవే నాయిన్నవ్వ' నవ్వుకుంట అన్నడు మల్లన్న.

'ఏదయితేంది బిడ్డ. నాలుగు బుక్కలు మింగుటానికి.. ఎండకాలం గద! పొద్దెక్కేవారకే గాల్తది కడుపుల. సురసురంటది. పోసుక తాగుటానికింత అంబలి, సల్లబొట్టుంటె అయిపాయె. సరెగని నువ్వు బువ్వదినుపో' అంది కొంరమ్మ.

'మా తింటగని. గీ బోకె రామయ్య ఎవ్వలే అవ్వ..! నువ్వన్న సెప్పే నాయిన్నవ్వ..! నన్ను 'అల్లుడా' అని ముద్దుసేత్తడు. నాకు తేలు కుడితె ఎత్తుకొని శేరిపటేలింటికి తీసుకపొయ్యి మంత్రమేపిచ్చిండు. అవ్వను 'అక్కా' అంటడు. నాయిన్నను 'బావా' అంటడు. గీనెవ్వలు..?' అన్నడు మల్లన్న.

'ఏ ఊరో తెలువది బిడ్డ! మూడేండ్లకింద మనింటికచ్చిండు. నాయిన్నతోని గొర్లు కొనిపిచ్చిండు. గొల్లోల్లకు గొర్లు లేకుంటే నల్లమొకమని కొనిపిచ్చి, తానే గొర్లగాత్తండు. మనింట్లనే తింటడు. మందకావలయినప్పుడు మందకాడ పంటడు. లేకుంటే ఇగో.. గీ అరుగుమీద పంటడు. మన కుటుంబంల ఒక్కటై పెయిండు. ఇంట్ల పన్నప్పుడు కొట్టంకాడికి పొయ్యి పెండదెత్తడు. మంచి నీళ్ళెత్తుకత్తడు. బువ్వదిని కుక్క సద్దులు, మందకాడున్నోల్లకు సద్దులువట్టుకోని వోతడు. పొద్దంత గొర్లెంబడి తిరుగుతడు. శెట్టనక, పుట్టనక, రాయనక, రప్పనక తిరిగి గొర్లమేపుతడు' అంది పోశమ్మ.

'గయినెకు జీతమెంతనే'

'బట్ట, పొట్ట, సుట్టాకు, పొగాకు.. అన్నీ పోంగ యాడాదికి నూరు రూపాలు.. గవ్వి గూడ ఏం జేసుకుంటడు? మన దగ్గర్నే దాసి వెట్టుకుంటడు. మన ఇంటి మనిషే అయిపెయిండు. కట్టంల, సుఖంల, పండుగల, పబ్బంల.. అన్ని సమయాలల్ల మనతోనే ఉంటడు. '

'గంత పనిజేత్తడు గదనే పాపం.. గదా జీతం. నేనియ్యాల్ల రామయ్య మామతోనే కల్సి బువ్వ తింట' అని అర్రలున్న గొర్రె బొక్కలను తెచ్చి నిమురుతండు మల్లన్న.

'ఆరో తరగతి సదువుతండు మల్లన్న. కని గొర్రెపిల్లలంటే పానం' అంది సల్లకోసం అచ్చిన సుంకెనపల్లి రాజవ్వ.

'గసోంటి పిలగాడు గొర్లపొంటి పోక బడికెందుకువోతండు' అంది శాంతమ్మ. ఆళ్ళిద్దరూ దెచ్చుకున్న గిలాసలల్ల సల్ల బోసింది పోశమ్మ.

ఆళ్ళిద్దరు ఎల్లిపెయింర్రు.

ఇంతల్నే రామయ్యచ్చిండు. బిందె దించి కుదురుమీద వెట్టిండు.

'అక్కా! ఆ కుండనిండ మంచినీల్లున్నయి. రేపటిదాక మా ఐతయి. ఇగ నాకు బువ్వెయ్యి. కుక్క సద్ది గూడ కట్టు. పొద్దు బాగెక్కింది. పోవాలె' అన్నడు.

'అగో.. నీ అల్లుడు నీతోనే కల్సి తింటడట ఇయ్యాల్ల. కూసోంర్రి' అన్నది పోశవ్వ.

గొంగడి ముద్దగ జేసుకొని కూసున్నడు రామయ్య. పీటమీద కూసోని, సకులం ముకులం బెట్టుకున్నడు మల్లన్న.

ఇద్దరి ముంగట కంచుట్ల వెట్టింది పోశమ్మ.

రామయ్య కంచంల గడుకబోటేసింది. మల్లన్న కంచం దగ్గరికచ్చి ఆగింది.

'నువ్వేందింటవు బిడ్డ.. గడుక దింటవా.? నూకల బువ్వా..?' అంది.

'ఏందే అవ్వ! గిదేమన్న మంచిగున్నదానె..! పొద్దంత మన గొర్లగాత్తడు. పనులు జేత్తడు. రామయ్య మామకేమొ గడుకేత్తవు. నాకేమొ నూకల బువ్వా..! నాగ్గూడ గడుకెయ్యి..' అన్నడు మల్లన్న.

'నా మనుమంది దయగల గుణం కని గొర్ల గాసెటోళ్ళకు, సాకలోల్లకు, మందకాడి కుక్కలకు గూడ మెతుకుల బువ్వో, నూకల బువ్వో పెట్టన్నంటే మనకేడెల్లుతది బిడ్డ..? మనకే ఒక్కపూట మెతుకులు తినుడు కట్టమాయె. నువ్వు రోజేందింటున్నవు, పొద్దుగాల, పగటీలి గడుక. రాత్తిరి మెతుకులు గద. సారెడన్ని నూకలుంటె నువ్వింట్లున్నవని పెట్టినట్టుంది మీ అవ్వ. మన బతుకులు ఎంత జేసినా ఏడేమాన్కలన్నట్టే ఉంటయిగదా బిడ్డ..!' అంది కొంరమ్మ.

మల్లన్న మొకం చిన్నవోయింది.

'అవ్వా! పాపం రామయ్య మామ మనగొర్లను పానమోలె సూసుకుంటడు. కుక్క మంద కావలి గాత్తది. తోడేల్లు రాకుండ మందను కాపాడుతది. సాకలామె మన మురికి బట్టలుతుకుతది. గిన్ని పనులు జేసెటోల్లకు సలిదో, బొలిదో, గడుక బువ్వేసుడు మంచిగనిపిత్తలేదే నాకు' అన్నడు.

'అంతకంటెక్కువ మనమేం తింటున్నం బిడ్డ.. మనం గూడ గిదే తింటున్నం గద. రాత్రిపూట బుక్కెడన్ని మెతుకులు తింటున్నం. ఐదారేండ్ల కింది దాక మనం గూడ రొండుపూటలు గడుకే తిన్నం. గీనడుమ ఒక్కపూట మెతుకులు తింటున్నం. మునుపు ఏదన్న పండుగత్తనే మెతుకులు తినేది. ఇంక గా మాదిగ మన్నెపోల్ల ఇండ్లల్ల జూడు. పండుగనాడు గూడ మెతుకులు తినుడు కట్టమే! మెతుకులు తింటె గానాడు పండుగన్నట్లే' అంది పోశమ్మ కొడుకు కంచంల గడుక బువ్వేసుకుంట. ఇద్దరి కంచాలల్లో పప్పేసింది, శారువోసింది.

గడుక బోటును దుల్లుదుల్లు జేసి, పప్పు శారుతో కలుపుతున్నరాల్లు. ఒత్తుగా పులుసు వోసుకొని జుర్రుతండు రామయ్య.

'అవ్వా.. నేను పంతులింటికి, గదే కర్నప్పంతులింటికి సదువుకోను వోత గద..! గాల్లింట్ల పాలేరోల్లకు గూడ మెతుకుల బువ్వేత్తరు. కానీ, ఆకిట్ల కూసుండవెట్టి మీదికెల్లేత్తరు. ఆల్లింట్ల రొండు కుక్కలున్నయి గద..'

'అవ్ బిడ్డ.. గా కుక్కలు పాడుగాను. దున్నపోతులంతున్నయి. ఇంటిముందటి కడుగు వెద్దె 'భౌ' మంటయి.. భయమైతది.. ఆటి పేరేందో ఉండె..'

'లైకా, భయంకర్.. గా కుక్కలకేం బెడుతరో ఎరికేనా అవ్వ..! తెల్లటన్నం.. బోట్లకు

బోట్లేత్తరు. బొక్కలేత్తరు. మిగిలిన కూరలు పడేత్తరు. ఆల్లు తినరుగని బొక్కలు దెప్పిచ్చి పడేత్తరు' అన్నడు మల్లన్న.

'గవ్వన్ని నాకెరికే బిడ్డ.. వాళ్ళు దొరలు. భూములున్నోల్లు. పెద్దపెద్ద శాతలు. ఊళ్లె సరిపంచులు, పటేండ్లు, పట్వార్లు ఆల్లే కదా!'

ఇద్దరి కంచాల్లో మరింత గడుక బువ్వేసింది పోశమ్మ.

'అంబలి పొయ్యిమంటరా? సల్ల బోసుకుంటరా..?' అంది.

'అంబలే పొయ్యి..' అన్నడు రామయ్య.

ఇద్దరి గిన్నెల్లో కడుముంత అంచి అంబలి పోసింది పోశమ్మ. మల్లన్న ముఖం ఇంకా శిన్నబోయే ఉంది.

'మల్లన్నా..! నీ మనసు మెత్తన. నువ్వు ధర్మరాజసొంటోనివి. సదువుకుంటున్నవు. బుద్ధుని పాఠం ఇనచ్చి, బుద్ధునోలె ఉండాలంటవు. హరిశ్చంద్రుని పాఠం ఇనచ్చి అబద్ధాలాడద్దంటవు. మొగురాల నిండ గవ్వే రాత్తివి. గిదానికి గింత బాధ పడవడ్తివి. మనమన్న గడుకో అంబలో తింటున్నం. గింతసుత దొరుకనోల్లెంతో మందున్నరు' అంది కొంరమ్మ.

గడుక అంబలి కలుపుకొని తాగుతున్నరు వాళ్ళు.

'అక్కా! ఉప్పెయ్యలేదే ఇండ్ల..'

ఉప్పురాల్లు దెచ్చి రెండు కంచాలల్ల ఏశింది పోశమ్మ.

'అల్లుడింకా ఏదో ఆలోచిస్తున్నడు?' అన్నడు రామయ్య.

'సదువుకుంటున్న పొల్లగాడు గద..! వానికెప్పుడూ ఆలోచనే.. నా కొడుకు మనుసు నాకు తెల్వదా..? ఆడిప్పుడేం ఆలోచిస్తున్నడో చెప్పన్నా..?' అంది పోశమ్మ.

'శెప్పే అక్కా..!' అన్నడు కంచంల చేతిక డుక్కుంట రామయ్య.

'గా దొరలింట్ల కుక్కలు తిన్న తిండిగూడ మనం తింటలేక పోతిమని!'

తన హృదయాన్ని పట్టుకున్న తల్లి దిక్కు తలెత్తి సూశిండు మల్లన్న. చెయ్యి కడుక్కొని నిలుసున్నడు.

పేగులో కుక్క సద్ది గట్టి రామయ్యకిచ్చింది పోశవ్వ. అందులోంచి బొట్లు బొట్లుగా నీళ్ళు కారుతున్నయి.

'అవ్వా! ఏందే గది..!'

'సలిగడుక గద బిడ్డ.. పాశిపెయినట్టుంది. నీళ్ళు నీల్లయి కారుతంది..'

మల్లన్న కండ్లపొంటీ నీళ్ళుగారుతున్నయి.

'అయ్యో! ఏంది బిడ్డ.. గింతదానికేడ్వబడ్తివి..' అంది కొంరమ్మ..

సాయమాన్లోంచి అందరూ అరుగుమీది కచింద్రు..

'అల్లుడా.. నాతోని వత్తవా? నేను సద్దులు జమ జేసుకత్తుండు..' అని కట్టె వట్టుకోని

ఊళ్ళెకెళ్ళిండు రామయ్య.

'బిడ్డా.. నీ మనసంత కలికలయినట్టుంది. కాపుదనపిండ్లల్ల, దొరలిండ్లల్ల గూడ పాలేరోల్లకు, కుక్కలకు రోజూ బువ్వ వెట్టవల్సత్తె వాళ్ళకేవో వండుతరు. సలిది, బొలిది వెడ్తరు. నువ్వు పంతులింట్ల పాలేర్లకు పెట్టంగ సూసింది పండుగప్పుడనుకుంట. ఇంకా మనసొంటోల్లే కుండలగలది కుక్కలకైనా, పాలేర్లకైనా పెడుతం. అయితే ఉన్నదాంట్ల మంచిది మనం దిని కుక్కలకు మిగిలింది పెడ్తం. నువ్వన్నట్టు ఉన్నోలిండ్లల్ల కుక్కలకు, పాలేరోల్లకు వేట్టేది గూడ మనకు దొరుకుత లేదు బిడ్డ..' అంది పోశమ్మ.

'గాల్ల కుక్కసద్ది గూడ మనం దినే బువ్వకంటే మంచిగనే ఉంటదిగదానె అవ్వ..' అన్నడు మల్లన్న.

ఔననక తప్పలేదు పోశమ్మకు.

***

ఆరు కుక్క సద్ది, సద్ది మూటలతోని అచ్చిండు రామయ్య. అరుగుమీదున్న గొంగడి భుజం మీదేసుకున్నడు. భుజం మీద కట్టె వెట్టుకొని అటిన్ని, ఇటిన్ని, సద్ది డబ్బాలు తగిలించుకున్నడు. శెప్పు లేసుకున్నడు.

'మందకాడికి వత్తనంటివి వత్తవా అల్లుడు?'

ఇంతల్నే ఊళ్ళెకు వోయిన ఓదెలచ్చిండు.

'మల్లన్న నేడికో రమ్మంటున్నవు రామయ్య?' అన్నడు.

'మందకాడికి బావ..'

'పోతవార మల్లన్న?'

'పోతనే నాయిన్న.. ఇయ్యాల్ల ఆదివారమే కద!'

మల్లన్నను తోలుకొని మందకాడికి నడుస్తున్నడు రామయ్య.

ఊరుపక్క దొరగారి శేండ్ల మంద వెట్టింద్రు. ముత్తెవంత సేపట్లనే ఆడికి శేరుకున్నరు. ఈత బరిగెల తడుకల నడుమ గొర్లమంద. గొర్రెరువు గెదడు వాసనత్తంది. తోకలూపుకుంట 'కుయ్ కుయ్' అని మూలుక్కుంట కుక్కలురికచ్చినయి. గంగయ్య, అంకయ్య గూడ ఆడికొచ్చింద్రు.

ఎవరి సద్దిముల్లె, కుక్క సద్దిముల్లె ఆళ్లు తీసుకున్నరు.

ముళ్ళెలు ఇప్పి దూర దూరంగ పెట్టింద్రు.

ఆకలిమీద ఉన్నట్టున్నయి కుక్కలు.

ఎగబడి తినబట్టినయి. లప్పలప్ప గత్కబట్టినయి. ఒక్క రవ్వగూడ ఇడువకుండ నాకినాకి తింటున్నయి.

ఆటి దిక్కే సూస్తున్నడు మల్లన్న

'మందను కాపాడే కుక్కలకూ సలిదో బొలిదో, పాసిపోయిందో గడుక. దొరింటి

కుక్కలను మాంసపు ముక్కలు. మృష్టాన్న భోజనం..'

ఆలోచిస్తున్నడా పసివాడు మల్లన్న.

'గీ మందల ఎన్ని గొర్లుంటయి మామ'

'మూడొందల గొర్లమంద ఇది. ఎనిమిది ఓటలున్నయి'

'మరి ఎవ్వల గొర్లను ఆళ్లు ఎట్లేర్పాటుజేత్తరు?'

'శెవులకు పెనుకలు వెడుతరు. అంటె ఒక్కొక్కల గొర్లకు ఓ తీరుగ శెవికాడ గత్తిరిచ్చి గుర్తువెడ్తరన్నట్టు'

మిగితా బోయెలందరూ అచ్చింద్రు. సద్దులు తిన్నరు. బుర్ర కాయలున్న నీళ్ళు తాగింద్రు. మందలేపింద్రు. ఎవ్వలగొర్ల నాల్లు వాపుకున్నరు. తలో దిక్కు మందను తోలుకుంట పోతంద్రు. రామయ్య ఎన్క కుక్క నడుస్తాంది.

***

'అవ్వా... అవ్వా! కుక్క సద్ది.. కుక్క సద్ది.. పాశిపోయిన బువ్వ..' కలువరిస్తున్నడు ఆరున్నర దశాబ్దాల వయసుదాటిన మల్లన్న.

దిగ్గున లేశి కూసున్నడు.

'ఏమయ్యో.. ఏమన్న కలచ్చిందా..? మీ అవ్వయ్యలకు బియ్యమిచ్చి, తిని పడుకుంటివి. ఆళ్లు యాదికచ్చింద్రా? అవ్వ అవ్వ.. అంటున్నవ్. కుక్క సద్దంటున్నవ్. లెవ్వు. మొకం గడుక్కో. నిద్ర మత్తువోతది' అంది విజయమ్మ.

'అవునోయ్.. బియ్యమిచ్చి తిని పండుకున్న. నా ఆలోచన్లు మా ఊరుసుట్టూ తిరిగినయ్. మా అవ్వయ్యల సుట్టూ తిరిగినయ్. నా శిన్నతనం సుట్టూ తిరిగినయ్. కన్నంటుకున్నదో లేదో.. కలొచ్చింది. కలల నా బాల్యం.. గొర్లు.. గొర్లకాపర్లు.. మందకాడ కుక్క... కుక్క సద్ది. అన్నీ సినిమారీళ్లలా తిరిగినయ్' అన్నడు మల్లన్న.

లేచి, బాత్‌రూమ్‌లోకెళ్ళి మొకం కడుక్కున్నడు. అవ్వయ్యల ఫొటువ ముంగట నిలుసున్నడు. పబ్బుతివట్టి దండం బెట్టిండు.

భర్త పక్కనే నిలుసుంది విజయమ్మ.

'అవ్వా! నాయినా.. నన్ను మీరు సదివిచ్చింద్రు. మీరు 'కుక్క సద్ది' తినుకుంట నన్నా బతుకునుండి విముక్తం సేసింద్రు. మీరిచ్చిన సదువుతో నాకు గౌరవమచ్చింది. జ్ఞానమచ్చింది. కని నా తమ్ముల్లు, పాలోల్లు, కులపోల్లు సానమందింక కుక్క సద్ది తినే బతుకులే బతుకుతున్నరమ్మా! గతుక, సలి బువ్వ, పాశిపెయినన్నం తిన్న కుక్క, మంద కావలి గాసింది. గొర్లను తోడేల్లనుండి కాపాడింది. మరి మీరిచ్చిన సదువుతోని మిరాలమెతుకులు తింటున్న. నేను నా కులం మందనైనా కాపాడలేక పెయిన. 'పే బ్యాక్ టు సొసైటీ' పాటించలేకపెయిన.

నన్ను పానం కంటెక్కువ జూసుకున్న నాయిన్నవ్వా! నేను నలుపయేండ్లు నౌకరి సేసిన.

యాభై ఏండ్లకింద నేను దొరలిండ్లల్ల సూసిన తిండిగూడ తినలేకపోతున్ననే. నా తమ్ములు, పాలోల్లయితే అప్పటి దొరింటి కుక్క తిండి కూడా తినలేకపోతున్నరే. ముసలోన్నయినా కిటుకెక్కడుందో అరుతమై సత్తలేదే'.

తనండ్ల తాననుకుంట ఒక్కొక్కమల్క పైకనుకుంట గొడగొడా ఏడుస్తున్నడు మల్లన్న. ఎక్కెక్కి పడేడుస్తున్నడు. మల్లన్న కన్నీళ్లు అవ్వయ్యల ఫోటువను తడుపుతున్నయి. విజయమ్మకేం సముజయితలేదు.

'బతికున్నప్పుడు అవ్వయ్యల మంచిగ జూసుకోవాలెగాని, బియ్యమిచ్చుడేందంటడు? ఇగ వాదనెందుకని ఇత్తడు. బియ్యమిచ్చిన్నాడల్ల గిదే భాగోతం. అవ్వయ్య యాదికచ్చి శిన్నపోరనోలేడుత్తడు. అట్టి పిసోడు' తనండ్ల తాను గొణుక్కున్నట్టనుకుంటనే పైకనేసింది.

'ఊకో.. ముసలోనివైనవు. శిన్నశిన్న దానికి మొల్లి పిల్లగానోలేడుత్తవు' అని మల్లన్న కన్నీటిని కొంగుతో తుడుత్తాంది విజయమ్మ.

## కాలువ మల్లయ్య

*కాలువ మల్లయ్య.. ఉమ్మడి కరీంనగర్ జిల్లా (ప్రస్తుత పెద్దపల్లి) జూలపల్లి మండలం తేలుకుంటలో జన్మించారు. ఎమ్మెస్సీ బీఈడీ, పీజీ డీపీఆర్, ఎంఏ, పీహెచ్‌డీ చేశారు. తల్లిదండ్రులు పోశమ్మ–ఓదెలు. 1972లో పీయూసీ చదివే రోజుల్లో కథా రచనను ప్రారంభించారు. 1983లో రాసిన 'వెలి' కథ.. ఆయనను అభ్యుదయ రచయితగా మార్చింది. దాదాపు 50 ఏండ్లకు పైగా సాహితీ ప్రయాణం. వెయ్యికిపైగా కథలు, 18 నవలలు, 6 కవితా సంపుటాలు, 800 వ్యాసాలు ఉన్నాయి. ఇప్పటి వరకూ 70 పుస్తకాలు ప్రచురించగా, వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన 30 మందికిపైగా విద్యార్థులు, ఆయన సాహిత్యంపై పీహెచ్‌డీ, ఎం ఫిల్ పట్టాలు తీసుకున్నారు. మరో పదిమందిదాకా పరిశోధనలు చేస్తున్నారు. 'సామాజిక ప్రయోజనం లేని సాహిత్యం వృథా' అని నమ్మే కాలువ మల్లయ్య తన రచనలతో సామాజిక మార్పునకు కృషి చేస్తున్నారు. స్త్రీవాద దృక్పథంతో అనేక రచనలు చేశారు. 'అవ్వతోడు గిది తెలంగాణ', 'కాలువ మల్లయ్య కథలు', 'నేలతల్లి', 'మా కథలు', 'కట్నం కథలు', 'తెలంగాణ మట్టికథలు', 'రాజు కోడి', 'తెలంగాణ తాతలు చెప్పిన కథలు', 'చెప్పుల తయారీ'లాంటి అనేక కథలు రాశారు. 'భూమి పుత్రుడు', 'సాంబయ్య చదువు', 'మాట్లాడే బొమ్మలు', 'బతుకు పుస్తకం', 'తెలంగాణ దేవదాసు', 'గువ్వల చెన్నా', 'మాదిగ విజయం'లాంటి కథా సంపుటాలను వెలువరించారు.*

# ఆకుపచ్చ తివాచి

బీవీ రమణ మూర్తి,
98489 87239

**మి**ట్ట మధ్యాహ్నం..

ఎండ మండిపోతున్న వేళ..

'రోడ్డుకు వెళ్లి పెరుగు తీసుకురండి' అంటూ మా ఆవిడ ఆర్డర్.

విసుక్కుంటూనే బయలుదేరాను.

నడిచి వెళ్తున్న నన్ను హఠాత్తుగా ఎవరో ఆపినట్టు అనిపించింది.

బక్కచిక్కి, సత్తువ తగ్గి నీరసంగా నడిచి వస్తున్న వ్యక్తిని చూడగానే.. ఏదో గుర్తుకు వచ్చినట్టు ఆగిపోయాను.

'ధర్మయ్యలా ఉందే! అవును వాడే.. ఇక్కడే ఉంటున్నాడా?' కాసింత ఆశ్చర్యం.

దగ్గరకు రాగానే భుజం పట్టి ఆపాను. తల వంచుకుని వెళ్లిపోతున్నాడేమో.. ఉలిక్కిపడ్డాడు.

నావంక తేరిపార జూశాడు. కాసేపటికి గుర్తుకు వచ్చినట్టు 'ఒరేయ్.. సుబ్బూ' అంటూ ఆప్యాయంగా కౌగిలించుకున్నాడు.

***

ధర్మయ్య, నేను సమకాలికులం. ఊరి బడిలో కలిసి చదువుకున్నాం. కాలం కలిసి వచ్చింది. నేను సర్కారు ఉద్యోగిని అయ్యాను. ధర్మయ్యకు చదువు అబ్బలేదు. మట్టిమనిషిగా ఊర్లోనే మిగిలిపోయాడు. ఎప్పుడు ఊరెళ్లినా తప్పక కలిసేవాడిని. ఐదారేండ్ల క్రితం నుంచి సాధ్యం కాలేదు. 'పనులు వెతుక్కుంటూ పట్నం వెళ్లిపోయాడు' అని చెప్పారు. 'ఎక్కడికంటే?'.. ఎవరూ చెప్పలేకపోయారు. నేనూ నా పనుల్లో పడి మర్చిపోయాను. మళ్లీ ఇన్నాళ్లకు కనిపించాడు. వాడి దీనావస్థ చూసి ఆశ్చర్యపోయాను. ఒంటిమీద సరైన బట్టలుకూడా లేవు. గొప్పింటి బిడ్డ కాకపోయినా కడుపునిండా తిండి, కట్టుకునేందుకు బట్టకు లోటు లేని కుటుంబం. నాకు కండ్లవెంట నీళ్లు తిరిగాయి.

ధర్మయ్య కుటుంబానిది కష్టాన్ని నమ్ముకునే మనస్తత్వం. అతని తండ్రి మా పొలాన్నే కౌలుకు తీసుకుని పండించేవాడు. నిజాయితీపరుడని నాన్న చెప్పేవారు. రెక్కల కష్టంతోనే కాలక్రమంలో ఓ రెండెకరాల భూమిని సొంతంగా కొనుక్కోగలిగాడు. తండ్రి కాలం చేశాక ధర్మయ్య కూడా అతని మార్గాన్నే నమ్ముకున్నాడు. అందుకే.. ఇప్పుడలా చూడగానే అమితాశ్చర్యానికి లోనయ్యాను.

'అలా నీడలోకి వెళ్లి మాట్లాడుకుందాం రా' అంటూ ఓ బహుళ అంతస్తుల భవనం పక్కకు తీసుకువెళ్లాను.

'నువ్వేంటిరా ఇక్కడ.. ఇలా?' అని ప్రశ్నించా.

శూన్యంలోకి చూశాడు.

***

'నాయనా! వద్దురా.. నా మాటిను. భూమిని నమ్ముకోవాలి. అమ్ముకోకూడదు. నేల తల్లి బీడు వారితే ఊరికే అరిష్టం' ధర్మయ్య కొడుకును మందలించాడు.

సూరీడు చిరాగ్గా చూశాడు.

'ఎంత చెప్పినా నీ చాదస్తం నీదేనా. అమ్మినోళ్లంతా అమాయకులా' తండ్రిపై గయ్యిమన్నాడు.

'ఒకరితో పోలికెందుకురా. భూమి బంగారు బాతులాంటిది. రోజుకో గుడ్డుకోసం వేచిచూసే ఓపిక ఉండాలి. కడుపుకోసి మొత్తం తీసుకుందామన్న దురాశ వద్దు. అనుభవంతో చెబుతున్నాను. నా మాటిను. ఆ సైతానుగాడి మాయలో పడకు. భూమి బేరం పెట్టకు' ధర్మయ్య కొడుకును ప్రాధేయపడుతున్నాడు.

'ఎహేయ్.. నసపెట్టకు. ధర వచ్చినప్పుడు అమ్మకపోతే ఆ తర్వాత బాధ పడాలి. లక్ష రూపాయలు కూడా పలకని ఎకరానికి రెట్టింపు ఇస్తానంటున్నాడు. తీసుకోవడానికి నొప్పా. చుట్టూ ఉన్న భూములు అమ్మేస్తున్నారు. మధ్యలో మనమేం వ్యవసాయం చేస్తాం' తండ్రిపై సూరీడు చిరాకు పడ్డాడు.

ధర్మయ్య మంచం పైనుంచి లేచే ప్రయత్నం చేశాడు. లేవలేకపోయాడు.

వారం రోజుల నుంచీ జ్వరం. మంచం పట్టాడు. ఈ లోగా కొడుకు భూమి బేరం పెట్టాడు. చెప్పినా వినేలా లేడు.

ధర్మయ్య విలవిల్లాడిపోతున్నాడు. కొడుక్కు నచ్చజెప్పేందుకు తల్లి లేదు. ఐదేండ్ల క్రితమే కాలం చేసింది.

మొగుడి ఎదుట మాట్లాడాలంటేనే వాడి పెళ్లానికి భయం. మూర్ఖుడు.. మీదపడిపోతాడని.

'భగవంతుడా! నాకేది దారి' ధర్మయ్య కన్నీటి పర్యంతమవుతున్నాడు.

'ఒక్కగానొక్క కొడుకు. ఊరిని నమ్ముకున్న కుటుంబం. ఉన్న భూమి పోతే వాడి భవిష్యత్తు ఏమిటో? వీడికి ఈ పాడు ఆలోచన ఎందుకు వచ్చిందో? ఎవరు ఉసిగొలిపారో?' ధర్మయ్యకు బెంగ పట్టుకుంది.

తండ్రి వేదనను పట్టించుకునే స్థితిలో లేడు సూరి. అతని కండ్లముందు లక్షల నోట్ల కట్టలు మెదులుతున్నాయి. అగ్రిమెంట్‌పై తండ్రి వేలిముద్ర బలవంతంగా వేయించి వెళ్లిపోయాడు. ధర్మయ్య కొడుకువైపు నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయాడు.

***

సుబ్రహ్మణ్యం కలిసిన సందర్భంగా జరిగిన సంగతి గుర్తు చేసుకుని ఏడ్చేశాడు ధర్మయ్య.

'ఎక్కడినుంచి వచ్చాడో ఓ సైతాను. రెండు రెట్ల ధర ఆశ చూపాడు. నోట్ల కట్టలు చూసి ఒక్కొక్కరే వాడి మాయలో పడ్డారు. రెండు పంటలు పండే భూమి వాడి చేతుల్లో పెట్టారు. రెండేండ్లలో వందెకరాలు ప్లాట్లుగా మారిపోయింది. ఊరి కుర్రాళ్లకు కమీషన్ ఎరవేశాడు. వాడిచ్చే చిల్లర డబ్బులకు ఆశపడ్డారు. కొన్నాళ్లు అందరికీ అదే వ్యాపకం. ఎక్కడెక్కడి వారో వచ్చారు. వేలం వెర్రిగా ప్లాట్లు కొన్నారు. పచ్చని నేల తల్లి శ్మశానంలా మారిపోయింది. ఇప్పుడు అక్కడ రాళ్ల హద్దులు, వాటిమధ్య పిచ్చిమొక్కలు తప్ప మరేమీ లేవు' ధర్మయ్య తలదించుకునే మాట్లాడుతున్నాడు.

'పంటభూమితోపాటు ఉపాధీ పోయింది. సాగుకాలంలో మన ఊరి కూలీలు మరోవైపు చూడాల్సి వచ్చేది కాదు. లేఅవుట్లు అయ్యాక అందరికీ పని లేదు. ఆశ చావక కొందరు పక్కఊర్లకు వెళ్లారు. అక్కడా అదే పరిస్థితి. పదిమందికి పని ఉంటే వందమంది పోటీ. కష్టానికి ఫలితం లేదు. కడుపునిండా తిండి లేదు. డబ్బు చూశాక సూరీడు జల్సాలకు, వ్యసనాలకు బానిసయ్యాడు. మద్యం మత్తులో ఉన్నవాడిని ఓ రోజు ప్రమాదం రూపంలో దేవుడు తీసుకుపోయాడు. కోడలు, మనవడి బాధ్యతకూడా నాపైనే పడింది. ఊరిలో బతుకు తెరువు పోయింది. ఇదిగో ఇలా పట్నంలో బతుకీడుస్తున్నాం. ఇక్కడా అంతంతే జీవితం. కాకపోతే ఏదో ఒక పని దొరుకుతుందన్న ఆశ. ఆ ఆశే నడిపిస్తున్నది' నీళ్లు నిండిన కండ్లతో, ఆవేదన నిండిన స్వరంతో ధర్మయ్య చెబుతున్నది వింటున్న సుబ్రహ్మణ్యం.. అంతులేని ఆవేదనకు లోనయ్యాడు.

అతనికి నోటమాట రాలేదు. ఏడాదికో, రెండేండ్లకో ఓసారి సొంతూరు వెళ్లి వస్తుంటాడు. ప్లాట్లుగా మారిన భూముల్ని చూసేవాడు. తనలాగే అవసరాలకు అమ్ముకున్నారనుకున్నాడు. వెనుక ఇంతటి విషాదం దాగుందని అనుకోలేదు.

ఏదో మిల్లులో కూలీకి పనిచేస్తున్నానన్నాడు ధర్మయ్య. వెంటనే జేబులోంచి ఓ వెయ్యి తీసి అతని చేతిలో పెట్టాను. ఏదైనా అవసరమైతే తనతో మాట్లాడాలని ఓ కాగితంపై నా ఫోన్ నంబర్ రాసిచ్చాను.

డబ్బు వద్దన్నాడు. ఒత్తిడి చేస్తే తీసుకున్నాడు. ఆ సందర్భంగా ఓ మాటన్నాడు.

'ఇలా ఎంతమందికి ఇవ్వగలవు సుబ్బూ. ఎన్నాళ్లు ఇవ్వగలవు. మన ఊరివాళ్లే ఇక్కడ ఓ వందమంది ఉంటారు. అందరినీ పోషించగలవా?'

ధర్మయ్య ప్రశ్నకు అవాక్కయ్యాను. ఎవరో చెంప చెల్లు మనిపించినట్టయింది.

***

అక్కడికి వారం తర్వాత రెండు రోజులు సెలవు పెట్టి సొంతూరుకు వెళ్లాను. నిజమే! ఊరి చుట్టూ శ్మశానంలా ఉంది.

పొలిమేరల్లోనే విషాదం స్వాగతం పలికినట్టయింది. అప్పటికే ఆ విషాదాన్ని ఎన్నోసార్లు చూసిన నా కండ్లు దాన్ని పసిగట్టలేకపోయాయి. ఊరిలో పెద్దగా వ్యాపకాలు లేవు. ఇలావచ్చి చెల్లెని చూసి, అలా వెళ్లిపోయేవాడిని. అందుకేనేమో ధర్మయ్యను కలిశాకే నేను ఈ లోకంలోకి వచ్చాననిపించింది. ఎక్కడో మెరక పొలాల్లో కనిపించే ఇటుక బట్టీలు సుబ్బయ్య పల్లం భూమిలో దర్శనమిస్తున్నాయి. ఎక్కడినుంచో వచ్చిన మేస్త్రీ ఊరివాళ్లను పెట్టుకుని ఇటుక బట్టీ నడుపుతున్నాడట. పనిలేక, వలసపోలేక ఊర్లోనే కాళ్లీడుస్తున్న కొందరికి ఇప్పుడదే జీవనాధారమయ్యింది. ఇచ్చేది అరకొర కూలీనే. శ్రమను దోచుకుంటున్నా అదే మహద్భాగ్యం అన్నట్టుంది వారి పరిస్థితి.

కనకయ్య పొలంలోని బోరుబావి మూలకు చేరింది. బోరుకోసం కట్టిన చిన్న గది నేడో రేపో కూలిపోయేలా ఉంది. గదికి ఉన్న చెక్క తలుపు పుచ్చిపోయింది. కింద భాగంలో పెద్ద ఖాళీ ఏర్పడింది. ఆ సందులోనుంచి గదిలోకి కుక్కలు వెళ్లి వస్తున్నాయి. ఆ పక్క భూమిలోని ఓ పది ప్లాట్లను కలుపుతూ ఎవరో కాంక్రీట్ స్తంభాలు పాతి, ఇనుప కంచె వేసి ఉన్నారు. మధ్యలో అక్కడక్కడా కొబ్బరి మొక్కలు నాటారు. ఆలనాపాలనా లేదేమో వాటి ఆకులు ఎర్రగా మారి, మొక్క చనిపోయేలా కనిపిస్తున్నది.

ఊరి చివరి మర్రిచెట్టు వద్ద ఎప్పుడూ కనిపించే సత్యంనాయుడు జోడెద్దుల జాడగాని, వీరాస్వామి ఒంగోలు గిత్తలుగాని, నారాయణ దున్నపోతుల ఊసుగాని లేదు. చెట్టు మొదలుకు ఓ యాభై అడుగుల దూరంలో పొలంలోకి చొచ్చుకుపోయిన ఊడలకు వాటిని కట్టేవారు. మధ్యాహ్నం వేళ చెట్టుకింద కూర్చుని విశ్రాంతి తీసుకునే ఊరివాళ్లు వాటిని చూస్తూ ఏదో ఒక వ్యాఖ్య చేయడం, దానిపై చర్చ సాగడం నాకు తెలుసు. 'వ్యవసాయమే లేదు. వాటిని ఉంచుకుని ఏం పెట్టి పోషించగలమని అమ్మేశారట'. ఆరా తీస్తే ఎవరో చెప్పారు.

ఖరీఫ్ సీజన్‌కు రెండు నెలల ముందు మొదలు, పంట ఇంటికి చేరేవరకు రైతులకు అన్ని విధాలా ఉపయోగపడే నాటుబండ్లు మాత్రం చెట్టుకింద విశ్రాంతి తీసుకున్నట్లు పడి ఉన్నాయి. వాటిని ఉపయోగించి చాలా రోజులైనట్టుంది. బండ్లపై పేడ, చెత్తాచెదారం

పేరుకుపోయి ఉంది. చక్రాలు ఓ పది అంగుళాల మేర మట్టిలో కుంగి ఉన్నాయి. ఊరి మొదటివీధిలో ఉండే ధాన్యం మిల్లుకు తాళం వేసి ఉంది. సంక్రాంతికి నెలముందు ప్రారంభమయితే ఉగాదివరకు ఉదయం ఆరునుంచి రాత్రి పదిగంటల వరకు ధాన్యం పడుతూ కళకళలాడేదా మిల్లు. అలాంటి మిల్లు ఏదో పార్టీ కార్యాలయంలా మారినట్టుంది. అక్కడ పెట్టి ఉన్న కటౌట్లు, గోడలకు వేసిన రంగులు చూస్తే అర్థమయ్యింది. మిల్లులో ధాన్యం ఆడించే కూలీలు చాలావరకు వలసపోయారు. ఉన్నవాళ్లు ఎప్పటి బియ్యం అప్పుడు ఊర్లో శెట్టి షాపులో కొనుక్కుంటున్నారట. మోతుబరులు పట్నంలోని పెద్దమిల్లులకు ధాన్యం ఇచ్చి, బదులుగా బియ్యం తెచ్చుకుంటున్నారట. వడ్లు పట్టించడం లేక మిల్లు మూతపడింది. పక్కనే ధాన్యం ఆరబోసేందుకు ఉన్న ఖాళీ స్థలంలోని కాంక్రీట్ గచ్చుపై పిల్లలు క్రికెట్ ఆడుకుంటున్నారు. విషయం తెలిశాక ఊర్లోకి వచ్చిన నాకు, వంద విషాదాలు ఒకేసారి స్వాగతం పలికిన అనుభవం కలిగింది. ఊరికి ఇంతకుముందు వచ్చినప్పుడు కూడా వీటన్నిటినీ చూసినవాడినే. కానీ, నా కండ్లు, మనసు వాటి వెనుక ఉన్న విషాదాన్ని అప్పట్లో గుర్తించలేకపోయాయి.

***

కనుచూపు మేరలో లే అవుట్లే. ఒక్కరూ ఇల్లు కట్టలేదు. కొనిపడేస్తే భవిష్యత్తులో అధిక ధరకు అమ్ముకోవచ్చన్న ఆశ. ఈ దుస్థితికి అదే కారణం. నా మనసు వికలమయ్యింది. దురాశతో మనిషి తన సమాధిని తానే కట్టుకుంటున్నాడని అనిపించింది. భారమైన మనసుతో నగరానికి చేరుకున్నాను. ఏం చేయాలో అర్థం కాలేదు. కానీ, 'ఏదో ఒకటి చేయాలి. కూలీల కన్నీరు తుడవాలి. వారు పట్నం వీడి పల్లెబాట పట్టాలి. అది సాధ్యమేనా? అంత సులభం కాదేమో? అయినా ప్రయత్నిస్తే'.. ఈ ఆలోచన రాగానే ఓ నిర్ణయానికి వచ్చాను.

నేను రైల్వేలో మూడో తరగతి ఉద్యోగిని. ఎక్కడెక్కడో పనిచేశాను. రిటైర్మెంట్‌కి ఐదేండ్ల ముందు మా ఊరికి వంద కిలోమీటర్ల దూరంలోని నగరానికి బదిలీ అయ్యింది. రిటైరయ్యాక ఆ నగరంలోనే స్థిరపడిపోవాలనుకున్నాను. ఓ ఇల్లు కొనుక్కున్నాను. నాకు ఒక కొడుకు, ఒక కూతురు. కూతురిని ఓ ఇంటిదాన్ని చేశాను. కొడుకు విదేశాల్లో స్థిరపడ్డాడు. ఖర్చు తగ్గిపోయింది. వెనకేసిన డబ్బుతో ఓ నాలుగు స్థలాలు కూడా కొన్నాను. ఉద్యోగ విరమణ తర్వాత శేషజీవితాన్ని ప్రశాంతంగా గడిపేయాలనుకున్నాను.

ఇప్పుడు నా మనసు ఊరివైపు అడుగులు వేయమంటున్నది.

'మరో మూడు నెలల్లో రిటైర్ అవుతున్నాను. ఊరిలో వారసత్వంగా వచ్చిన ఇల్లుంది. మరమ్మతులు చేయిస్తే నేను, నా భార్య ఉండేందుకు సరిపోతుంది. నెలకు

22 katha 1-203 page-1_Layout 1 9/25/2021 3:32 PM Page 41

దాదాపు ముప్పైవేల పింఛన్ అందుతుంది. పల్లెటూరిలో ఆ మొత్తం చాలా ఎక్కువ. బతకడానికి ఇబ్బంది లేదు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ మరో రూ.50 లక్షల వరకు అందుతాయి. ఈ మొత్తంతో ఏదైనా చేయగలిగితే..' అలా అనుకోగానే రకరకాల ఆలోచనలు నన్ను చుట్టుముట్టాయి.

చాలావాటితో ప్రయోజనం అంతంతే అనిపించింది. తాత్కాలికమేనని భావించాను. చాలాసేపు ఆలోచించాక ఓ నిర్ణయానికి వచ్చాను. ఇప్పుడున్న పరిస్థితుల్లో అదే సరైన మార్గమని తోచింది. ఉదయాన్నే సొంతూరులో ఉన్న బావమరిదికి ఫోన్ చేశాను.

***

సుబ్రహ్మణ్యం చెప్పింది విన్నాక, గోపాలానికి బుర్ర తిరిగిపోయింది.

'మా బావకు వయసుతోపాటు చాదస్తం ఎక్కువైనట్టుంది. కొంపదీసి పిచ్చి పట్టలేదు కదా! లేకపోతే ఈ ఆలోచనలేంటి. బుద్ధున్నవాడెవడైనా ఇలా ఆలోచిస్తాడా. రిటైరయ్యాక ఎవడైనా ప్రశాంతంగా ఉండాలనుకుంటాడు. ఈయనేంటి.. ఈ వయసులో లేనిపోనివి మెడకు చుట్టుకుంటున్నాడు' చిరాకు పడుతూ వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

దూరం నుంచి మొగుడిని గమనిస్తున్నది గోపాలం భార్య విశాలాక్షి. గోపాలం తీవ్ర అసహనంతో ఉన్నాడనిపించింది.

'అసలేమయ్యుంటుంది'.. అని ఆమె ఆలోచనలో పడింది.

'ఏమయ్యింది.. ఉదయాన్నే మా అన్నను ఆడిపోసుకుంటున్నావు' మొగుడి తీరు చూసి వ్యంగ్యంగా అన్నది.

గోపాలం ఆమెవైపు చిరాగ్గా చూశాడు.

'ఎందుకలా టెన్షన్ పడిపోతావు. విషయం చెప్పు' మొగుడివైపు చూస్తూ అంది విశాలాక్షి.

బావ చెప్పిన విషయాన్ని పెళ్లానికి వివరించాడు గోపాలం.

అది విన్నాక విశాలాక్షి కూడా ఆశ్చర్యపోయింది. కాసేపు నోట మాట రాలేదు.

పెళ్లాం బిక్కచచ్చిపోవడంతో గోపాలానికి ధైర్యం వచ్చింది.

'ఇప్పుడర్థమయ్యిందా మీ అన్నకు పిచ్చి పట్టినట్టుందని ఎందుకన్నానో?' అన్నాడు కసిగా.

'ఇదిగో వంకర టింకరగా మాట్లాడకు. నోరు పారేసుకోకు. మా అన్న బాగా ఆలోచించిగానీ ఏ నిర్ణయానికీ రాడు. వాడి నిర్ణయాలను తప్పుపట్టేంత సీను నీకు లేదు. సాయంత్రం మా అన్నతో మాట్లాడుతాను. అప్పటి వరకు నిమ్మళంగా ఉండు' గయ్యిమంది విశాలాక్షి.

'అన్నకు తగ్గ చెల్లెలు'.. అనుకుంటూ విసురుగా బయటకు వెళ్లిపోయాడు గోపాలం.

***

సుబ్రహ్మణ్యానికి ఊరిలో వారసత్వంగా వచ్చిన పదెకరాల భూమి ఉండేది. కూతురి పెండ్లి సమయంలో బేరం పెట్టాడు. ఊళ్లో వాళ్లే కొనుక్కున్నారు. ఆ తర్వాత వాళ్లూ అమ్మేశారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వారి పరమైంది. పచ్చని పైరుతో కళకళలాడాల్సిన భూమి, బీడులా మారింది. ఎప్పుడు ఆ భూమి మీదుగా వెళ్లినా విశాలాక్షి మనసు గాయపడేది. అన్న వచ్చినప్పుడల్లా ఇదే మాట అనేది. 'ఏం చేస్తాం. మనకు ప్రాప్తం లేదు' అనేవాడు.

'కొడుకు చేతికొచ్చాక అన్న బాగానే వెనకేసాడంటారు. కానీ, ఎప్పుడూ ఊరివైపు చూడలేదు. మరిప్పుడెందుకీ ఆలోచన' విశాలాక్షికి ఏమీ అర్థం కాలేదు.

సాయంత్రం అన్నతో మాట్లాడింది. సుబ్రహ్మణ్యం చెప్పిన విషయం వినగానే ఆమె మనసుపై పన్నీరు చిలుకరించినట్టయింది.

'నిజమే కొందరి డబ్బుపిచ్చికి పచ్చని నేలతల్లి బీడువారింది. ఊరివాళ్లకే పనుల్లేని దుస్థితి తెచ్చిపెట్టారు. అన్న నిర్ణయం వల్లయినా మంచి జరిగితే అదే చాలు. కానీ, జరుగుతుందా?' విశాలాక్షిలో ఏదో అనుమానం. అన్న విజయం సాధించాలని మనసులోనే కోరుకుంది.

***

గోపాలం ద్వారా విషయం ఊరంతా పాకింది. తలో రకంగా మాట్లాడటం మొదలుపెట్టారు.

రెండు మూడు రోజులపాటు రాత్రి రచ్చబండ వద్ద ఇదే కాలక్షేపం. వ్యంగ్యాలు, విమర్శలు, ఊహాగానాలు, పెడార్థాలు.

సుబ్రహ్మణ్యం అసలు ఉద్దేశాన్ని మాత్రం వారెవరూ గ్రహించలేకపోయారు.

బావ చెప్పాక గోపాలం ఊర్లో నలుగురైదుగురి వద్ద విషయం ప్రస్తావించాడు. ఒకరిద్దరు పెదవి విరిచారు. 'అది సాధ్యం కాని పని' అన్నారు. మరో ముగ్గురు 'కష్టమే అయినా ప్రయత్నిస్తాం' అని చెప్పారు. వారం తర్వాత ముగ్గురూ జట్టుగా వచ్చారు.

'మొత్తం వ్యవహారం మాకు వదిలేయండి. నెలరోజుల్లో సెటిల్ చేస్తాం' అన్నారు. గోపాలం ఆశ్చర్యపోయాడు. పని పూర్తయ్యేసరికి తలప్రాణం తోకకు వస్తుందనుకున్నాడు. వారి మాటలు వింటే రెండు నెలల్లోనే వ్యవహారం తేలిపోయేలా ఉంది. అతనికి చాలా సంతోషం అనిపించింది.

'బావ దగ్గర మాట దక్కుతుంది. అది చాలు' పెద్ద భారం దిగినట్టు ఫీలయ్యాడు గోపాలం.

అక్కడికి వారంరోజుల తర్వాత వీరబాబు నుంచి పిలుపొచ్చింది.

'విషయం తెలిసుంటుంది. వివరాలు రాబట్టేందుకు పిలుస్తున్నాడు' అనుకున్నాడు

గోపాలం.

వీరబాబు గ్రామ మాజీ సర్పంచ్. ముప్పై ఏండ్లనుండి సర్పంచ్‌గిరీ ఆ కుటుంబానిదే.

రేపు ఎన్నికలైతే మళ్లీ అతనే ప్రెసిడెంట్. 'లిటిగెంట్' అన్న పేరుంది.

సుబ్రహ్మణ్యం ప్రయత్నంపై ఊరిలో పెద్ద చర్చే నడిచింది. విషయం తెలిసి వీరబాబుకూడా ఆశ్చర్యపోయాడు. తర్వాత అనుమానం మొదలైంది.

'అప్పుడు అవసరానికి భూమి అమ్మేశాడు. ఇప్పుడెందుకు పునరాలోచన చేస్తున్నట్టు' వీరబాబు తత్వమే అంత. ఎవరినీ ఓ పట్టాన నమ్మడు. ఏ అవకాశాన్నీ ఇతరులకు వదులుకునేంత పెద్ద మనసూ లేదు.

'వాడసలే పట్నంలో ఉన్నోడు. పదిమందితో పరిచయాలున్నోడు. ఇప్పుడీ ఆలోచన చేస్తున్నాడంటే ఏదో మతలబు ఉండే ఉంటుంది. వాడిని తక్కువగా అంచనా వేయకూడదు. తీసిపారేయడానికి వీలులేదు' వీరబాబు తనలో తానే తర్కించుకుంటున్నాడు.

సుబ్రహ్మణ్యం రాకను రాజకీయ కోణంలోనూ చూస్తున్నాడు. ఊర్లో తనతో సమానంగా బంధుగణం ఉన్నోడు. కొడుకు విదేశాల్లో స్థిరపడ్డాడు. బాగా సంపాదిస్తున్నాడు. అల్లుడిది మంచి పరపతి ఉన్న ఉద్యోగం. భవిష్యత్తులో ఏ రూపంలోనైనా పోటీ కావచ్చు. అదీ అతని భయం. అందుకే ఏదోలా మోకాలడ్డే ప్రయత్నాలు మొదలెట్టాడు.

పిలిచాక వెళ్లకపోతే బాగోదని వీరబాబు ఇంటికి వెళ్లాడు గోపాలం. వసారాలో కూర్చున్న వీరబాబు అతన్ని చూడగానే ఆప్యాయంగా పలుకరించాడు. ముఖంలో నవ్వు పులుముకున్నాడు.

విషయం తెలియనట్టు మాట్లాడాడు. చిన్న హెచ్చరికలాంటి హింటిచ్చాడు.

'మా బావకు మన ఊరంటే ప్రాణం వీరబాబు. ఇక్కడైతే అంతా మనవాళ్లుంటారని ఎప్పుడూ అనేవాడు. ఉద్యోగంలో ఉన్నప్పుడు సాధ్యం కాలేదు. రిటైరవుతున్నాడు కదా. సొంతూరుకి వచ్చేద్దామనుకుంటున్నాడు. ఏదో వ్యాపకం పెట్టుకోవాలి కదా. అందుకే ఎంతో కొంత భూమిని కొనమన్నాడు. ఆ పని చేసిపెట్టమని మనోళ్లకు పురమాయించాను అంతే' నింపాదిగానే చెప్పాడు గోపాలం.

వీరబాబు గుణం గోపాలానికి తెలుసు. తాను చెప్పింది నమ్మడని తెలిసినా ఏదో ఒకటి చెప్పాలని చెప్పాడంతే.

'బావా, బావమరుదులు ఇద్దరూ ఘటికులే. భూమి కొనమని చెప్పాడంటున్నాడు. కానీ, తాను అమ్మేసిన భూమే కొనమన్నాడని చెప్పడం లేదు. ఇక్కడే ఏదో మతలబు

ఉంది'.. మనసులోనే అనుకున్నాడు వీరబాబు.

'సరేలే గోపాలం! మనోడు మనూరికి వస్తున్నాడంటే నాకూ ఆనందం కాదా. నా అవసరం ఏదైనా పడితే మొహమాట పడకు. మనోడికి సాయం చేయకపోతే ఇంకెవరికి చేస్తాను' నాటకీయంగా మాట్లాడుతూ 'ఇక వెళ్లిరా' అన్నట్లు కుర్చీలోంచి లేచాడు.

'తొత్తు కొడుక్కి ఒళ్లంతా విరుపులే' అని తిట్టుకుంటూ బయలుదేరాడు గోపాలం.

***

సుబ్రహ్మణ్యం కొనాలనుకుంటున్న భూమిలో ప్లాట్లున్న యజమానులతో వారం తర్వాత వీరబాబు ఊర్లో సమావేశం ఏర్పాటు చేశాడు.

'మీటింగ్ ఉంది. మీ బావను కూడా రమ్మను' అంటూ గోపాలానికి కబురుపెట్టాడు.

ఏదో పితలాటకానికే పిలుస్తున్నాడని గోపాలం అనుమానించాడు. విషయం సుబ్రహ్మణ్యానికి చెప్పాడు.

'కంగారు పడకు, నేను చూసుకుంటా' అని సుబ్రహ్మణ్యం ధైర్యం చెప్పాడు.

అనుకున్న రోజు వీరబాబు చావిడీలో మీటింగ్ మొదలయ్యింది. యాభై శాతం మంది ప్లాట్ ఓనర్లు వచ్చారు. మిగిలిన వారుకూడా 'అందరి నిర్ణయమే మా నిర్ణయం' అంటూ మధ్యవర్తులకు సమాచారం పంపించారు. అక్కడ ఎవరిలోనూ ఆ డీల్‌పై వ్యతిరేకత లేదు. ఏదోలా సెటిల్‌మెంట్ అయిపోవాలని కోరుకుంటున్నారు. ఏదో ఒక రాద్ధాంతం చేయాలని చూస్తున్నది వీరబాబు మాత్రమే.

ఎదురుగా ఉన్న కుర్చీలో వీరబాబు కూర్చున్నాడు. కాస్త దూరంగా సుబ్రహ్మణ్యం, గోపాలం కూర్చున్నారు. అప్పటికే ఐదారుసార్లు లేచి ప్యాంటు సర్దుకున్నాడు. అటూ ఇటూ తిరిగాడు. కాసేపు తలపంకించాడు. లేనిపోని చిల్లర చేష్టలన్నీ చేస్తున్నాడు.

వీరబాబు తీరుచూసి అక్కడి వారు చిరాకు పడుతున్నారు.

'బావా ఎందుకు అలా కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు మన వీరబాబు' ఊరిలో వరసైన వీరేసు పక్కనే ఉన్న ఈరేసుతో అన్నాడు.

'బుర్రకేదీ తోచనప్పుడు వాడు అలాగే బిల్డప్ ఇస్తాడురా. మనకేం బోయింది. నలుగురితో నారాయణ' అన్నాడు ఈరేసు.

'ఎంతవేగంగా సెటిల్‌మెంట్ తేలిపోతే అంత బాగుండు' అని కోరుకుంటున్న వారే అక్కడున్నరంతా.

'మంచి పార్టీ వచ్చింది. కొన్నదానికి మూడు రెట్లు ధర ఇస్తామంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అదే ఎక్కువ. అటువంటప్పుడు లేనిపోని ఈ పంచాయతీలు ఎందుకు' అన్నది వారి ఉద్దేశం.

అందుకే వీరబాబు ఈ విషయాన్ని సాగదీయడం వారికి నచ్చడం లేదు. అయినా ఆ విషయం చెప్పలేకపోతున్నారు. ఏం పితలాటకం పెడతాడో అని భయం.

వీరబాబు ఈసారి సుబ్రహ్మణ్యం వైపు తీక్షణంగా చూశాడు. ముఖం చిట్లించాడు. చిరాగ్గా ముఖం పెట్టాడు.

సుబ్రహ్మణ్యం అవేవీ పట్టించుకోవడం లేదు. అసలు వీరబాబును కేర్ చేస్తున్నట్టే కనిపించలేదు.

'ఏటండీ సుబ్రహ్మణ్యం గారు. ఈ పంచాయతీ ఏంటి? ప్రశాంతంగా ఉన్న ఊర్లో ఈ పితలాటకాలేంటి?' నోరు విప్పిన వీరబాబువైపు అదోలా చూశాడు సుబ్రహ్మణ్యం. ఆ చూపునకు అర్థం ఏంటో తెలియక కాస్త జంకాడు వీరబాబు. 'ఏం చెబుతాడా' అని కళ్లప్పగించి చూస్తున్నాడు.

'పంచాయతీ ఏం లేదు వీరబాబు. ప్రాధేయపడుతున్నాను. మీ నాన్న, నేను సమకాలికులం. ఆ రోజు భూమి అమ్మకానికి పెట్టినప్పుడు మీ నాన్నే పెద్దమనిషి. ఇప్పుడు మీ నాన్న లేడు. నా భూమి నాకు కావాలి. నా ప్రయత్నం నేను చేసుకుంటున్నాను. ఇందులో పితలాటకం ఏముంది' సుబ్రహ్మణ్యం నింపాదిగానే చెప్పాడు.

'ప్రాధేయపడటం అంటే ఇదా. పదేండ్ల క్రితం మీ అవసరానికి భూమి అమ్ముకున్నారు. ఇప్పుడదే భూమి నాకే అమ్మాలంటున్నారు. ఇది పితలాటకం కాదా. ఆ భూమి అమ్మాలో, వద్దో చెప్పడానికి మీరెవరు. ఇలా బలవంతం చేయొచ్చా' వీరబాబు కోపం నటిస్తున్నాడు.

'నేనూ ఈ ఊరి వాడినే వీరబాబు. ఊరిపై మమకారం పోలేదు. రిటైర్ అవుతున్నాను. సొంతూరిపై ధ్యాస కలిగింది. ఎలాగూ వచ్చేస్తున్నాను. నా భూమి నా చేతుల్లో ఉండాలనుకున్నాను. అందుకే ఈ ప్రయత్నం. ఇవ్వడానికి ఎవరికైనా ఇష్టం లేకపోతే చెప్పమను. బలవంతం లేదు' అక్కడి వారి అభిప్రాయం ముందే తెలియడంతో ఓ అస్త్రం ప్రయోగించాడు.

కూర్చున్న వారిలో కలకలం మొదలయ్యింది. సుబ్రహ్మణ్యం నవ్వుకున్నాడు.

'తమలో తాము గొణుక్కుంటున్నారు తప్ప తొత్తు కొడుకులు ఒక్కడూ నోరు విప్పరేం' మనసులోనే తిట్టుకున్నాడు వీరబాబు.

'పచ్చని పంటభూమిని నేను అమ్మాను. ఇప్పుడది శ్మశానంలా ఉంది. కొన్నవాళ్లంతా స్థలాలపై పెట్టుబడి పెట్టిన వారే. సాగుకోసం కాదు. ఇల్లు కట్టుకున్న వారూ లేరు. వారికి కావాల్సింది లాభం. ఆ లాభమేదో నేనే ఇస్తానంటున్నాను. ఇప్పుడు ఎంత ధర ఉందో అంతే చెల్లిస్తాను. కొన్నవాళ్లను నేను తప్పు పట్టడం లేదు. ఎందుకు ఇవ్వరని అడుగడం లేదు. నా భూమిపై నాకున్న మమకారాన్ని చెప్పాను. అందరూ ఇస్తేనే నా

పదెకరాలు నా స్వాధీనం అవుతుంది. మళ్లీ ఆ భూమిని నేనెలా వినియోగించుకోవాలనుకున్నా వీలవుతుంది. అంతే తప్ప పితలాటకం ఏమీ లేదు' సుబ్రహ్మణ్యం అందరివైపూ చూస్తూ అన్నాడు.

దాదాపు గంటపాటు అక్కడ చర్చ సాగింది. వీరబాబు ఎన్ని కొర్రీలు, ప్రశ్నలు లేవనెత్తుతున్నా మద్దతుగా అక్కడికి వచ్చిన వారిలో ఒక్కడూ మాట్లాడలేదు. మనసులోనే అందరినీ తిట్టుకున్నాడు వీరబాబు. తన పాచిక పారేట్టు లేదనిపించింది అతనికి. అయినా.. ఏదో ఆశ. అంత ఈజీగా వదిలేయకూడదన్న మూర్ఖత్వం. అదీ ఇదని చెప్పి ఆ రోజుకి పంచాయతీ ముగించేశాడు.

***

ఆ తర్వాత ప్లాట్ల ఓనర్లకు ఫోన్లు చేసి మరోసారి ఎగదోశాడు.

'వద్దండి వీరబాబు గారు. ఇప్పటికే నష్టపోయాం. ఏదోలా సెటిల్ చేసేద్దురూ' అని అనడంతో గాలి తీసేసినట్టయింది.

అమాంతం భూమి ధర పెరుగుతుందని అప్పట్లో వారంతా కొనేశారు. అనుకున్నట్టేమీ పెరగలేదు. బ్యాంకు వడ్డీ డబ్బులుకూడా వచ్చే పరిస్థితి లేదు. ఈ పరిస్థితుల్లో ఎవరో కొంటున్నారనగానే ఎగిరి గంతేశారు. 'వచ్చిందే మహద్భాగ్యం' అన్నట్లు ఉంది వారి పరిస్థితి. వీరబాబు మాటల్ని అందుకే వారు పట్టించుకోవడం లేదు. ప్లాట్ ఓనర్లు వినడం లేదని, మధ్యవర్తులను బెదిరించాలని చూశాడు వీరబాబు. వాళ్లూ కేర్ చేయలేదు. దీంతో లీగల్‌గా ఏదైనా పాయింట్ దొరుకుతుందేమోనని వెదకడం మొదలు పెట్టాడు.

అతనికి లేఅవుట్లలోని రోడ్లు గుర్తుకు వచ్చాయి.

'నిజమే.. ప్లాట్లు కొంటాడు. మరి రోడ్లు పంచాయతీవి కదా' ఈ ఆలోచన రాగానే వీరబాబుకు వెయ్యేనుగుల బలం వచ్చినట్టయింది.

ఎగిరి గంతేశాడు. అదే విషయాన్ని గోపాలానికి చెప్పాడు.

'గాడిద కొడుకు.. కొర్రీ కోసం చూస్తున్నాడు. అయినా మా బావ భూమి కొనుక్కుంటే వీడికి వచ్చిన బాధేమిటి. కుళ్లు నాయాల' అంటూ మనసులోనే తిట్టుకున్నాడు గోపాలం.

'విషయం బావ దృష్టికి తీసుకువెళ్తా' అని చెప్పాడు.

గోపాలం విషయం చెప్పగానే సుబ్రహ్మణ్యం నేరుగా వీరబాబుకే ఫోన్ చేశాడు.

సుబ్బు ఫోన్ అనగానే వీరబాబుకు ఏదో సాధించేసినంత ఆనందం కలిగింది.

ఫోన్‌లో బింకాలకు పోయాడు.

'అవును.. కరెక్టే కదా.. అదెలా అవుద్ది. పంచాయతీ ఒప్పుకోదు కదా' అంటూ

అడ్డగోలుగా మాట్లాడాడు.

'చూడు వీరబాబు.. అది ప్రైవేట్ లే అవుట్. వెంచర్ వేసినవాడు రోడ్లకు కేటాయించిన స్థలం విలువకూడా ప్లాట్ల ఓనర్ల నుంచే వసూలు చేస్తాడు. అందువల్ల రోడ్లుకూడా ప్లాట్ల ఓనర్లవే అవుతాయి. అంటే మొత్తం ప్లాట్లు ఎవరివైతే రోడ్లుకూడా వారికే చెందుతాయి. కావాలంటే తెలిసిన వాళ్లను అడుగు' సుబ్రహ్మణ్యం అటునుంచి నింపాదిగా చెప్పడంతో వీరబాబు నీరుగారిపోయాడు.

తనకు వచ్చిన ఆలోచనతో సుబ్బు కాళ్ల బేరానికి దిగి వస్తాడనుకుంటే తనకే ఎదురుదెబ్బ తగిలినట్లు ఫీలయ్యాడు.

చాలాసేపు లిటిగేషన్ మాటలు మాట్లాడాడు. సుబ్రహ్మణ్యం ఏ మాత్రం దిగిరాలేదు.

'నువ్వలా వాదిస్తే నేనేం చెబుతాను సుబ్బూ. సరేలే.. రూలు ఎలా వుంటే అలాగే జరుగుతుంది' అంటూ ఫోన్ పెట్టేశాడు.

వెంటనే తెలిసిన లాయర్‌కి ఫోన్ చేశాడు. విషయం వివరించాడు. రిజిస్ట్రేషన్ నంబర్లు, సర్వే నంబర్లు చెప్పాడు. రెండురోజుల తర్వాత అతను చెప్పింది విని మరింత నిరుత్సాహ పడిపోయాడు.

'సార్.. అది ప్రైవేటు లే అవుట్. ఎవరో అనామకంగా రాళ్లు పాతేసి ప్లాట్లకింద విభజించి అమ్మేశారు. రిజిస్ట్రేషన్లన్నీ సాగుభూమి కింద జరిగివున్నాయి. ప్రభుత్వం దృష్టిలో అది ఇంకా సాగుభూమే. ఎటువంటి కొర్రీలు వేసినా ప్రయోజనం ఉండదు. విషయం తెగేవరకు లాగితే జరిగిన మోసం బయట పడుతుంది. ప్లాట్లు కొని సాగుభూమి కింద రిజిస్ట్రేషన్ చేశారని తేలుతుంది. రిజిస్ట్రార్ ఫిర్యాదు చేస్తే కేసు పీకకు చుట్టుకుంటుంది. జరిమానాతో తేలిపోతే పర్వాలేదు. అప్పట్లో సర్పంచ్‌గా మీ బాధ్యత ఉందని తేలితే జైలుకు వెళ్లాల్సి వస్తుంది. ఆ తర్వాత మీ ఇష్టం' ఆ మాటలు వినగానే వీరబాబుకు ఒళ్లంతా చెమటలు పట్టేశాయి.

'వాడు అన్నీ చూశాకే పితలాటకం పెట్టాడు. ఎంతయినా పట్నంలో తిరిగిన బుర్రకదా' వీరబాబు కుతకుతలాడిపోయాడు.

'ఇక తానేమీ చేయగలిగింది లేదు. రాజీ పడి ఎంతోకొంత దక్కించుకోవడమే బెటర్. కాకపోతే అలా కనిపించకూడదు. ఊరిలో లోకువైపోతాను.

తానే వ్యవహారం సెటిల్ చేసినట్టుండాలి'. ఈ ఆలోచన రాగానే గోపాలానికి ఫోన్ చేసి కూర్చుని మాట్లాడుకుందామని చెప్పాడు.

వీరబాబు ఉద్దేశం ఏమిటో సుబ్రహ్మణ్యం, గోపాలానికి తెలుసు. తన పెద్దరికానికి ఎక్కడ ముసలం వస్తుందో అన్న భయం ఒకటి. తన చేతిలో ఏమీ పడకుండా వ్యవహారం

ఎలా సెటిల్ అవుద్దన్నది రెండోది. అందుకే నాటకాలుడుతున్నాడని వారికి తెలుసు.

'మరో పది రోజుల్లో తన రిటైర్మెంట్. అక్కడికి పక్షం రోజుల్లో చేతికి డబ్బు వస్తుంది. అప్పటిలోగా అన్ని అడ్డంకులూ తొలగించుకోవాలి. చిన్న లిటిగేషన్ వచ్చినా వీరబాబు దాన్ని పెద్దది చేస్తాడు. అతని భయం, ఆశ తెలుసు. వాడి భయాలతో మాకు పనిలేదు. ఎంతోకొంత చేతిలో పెడితే రాజీకొస్తాడు. బ్రోకర్లకు ఎలాగూ కమీషన్ ఇస్తున్నాం. వీరబాబును కూడా ఓ బ్రోకర్ అనుకుంటే సరి'.. ఈ ఆలోచన రాగానే వీరబాబు వద్దకు గోపాలాన్ని పంపించాడు సుబ్రహ్మణ్యం. విషయం విని వీరబాబు మహదానంద పడిపోయాడు.

'పైసామే పరమాత్మ' అని అనుకుంటూ అక్కడినుంచి వచ్చేశాడు గోపాలం.

***

మరో రెండు మూడు సిటింగ్‌లకు మొత్తం వ్యవహారం తేలిపోయింది. రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. పదెకరాలు సుబ్రహ్మణ్యం సొంతమయ్యింది. ఈ విషయం తెలిసి చట్టుపక్కల లేఅవుట్లలోని ప్లాట్ ఓనర్లు కూడా తమ భూమి ఇచ్చేస్తామంటూ ముందుకు వచ్చారు. లెక్కేస్తే దాదాపు ఇరవై ఎకరాలు తేలింది. అంతా ఒక్కచోటుదే. 'ఇదీ శుభసూచకమే' అనుకున్నాడు సుబ్రహ్మణ్యం. కానీ, 'పెద్దమొత్తం డబ్బు కావాలి. రిటైర్మెంట్ వల్ల వచ్చిన డబ్బు అయిపోయింది. అలాంటప్పుడు ఇంత పెద్ద ప్రయత్నం చేస్తే అత్యాశకు పోయినట్టవుద్దేమో'.. తర్జనభర్జన పడ్డాడు. ఓసారి కొడుకుతో మాట్లాడి చూద్దామని ఫోన్ చేశాడు. విషయం వివరిస్తే అతను వెనుకడుగు వేయొద్దన్నాడు. కావాలనుకుంటే లోన్ తీసుకుంటానన్నాడు. మరికొంత తాను సర్దుతానన్నాడు. సుబ్రహ్మణ్యానికి ధైర్యం వచ్చింది. నగరంలో ఉన్న నాలుగు ప్లాట్లలో రెండు ప్లాట్లు అమ్మకానికి పెట్టాడు. ప్లాట్లు అమ్మగా వచ్చిన మొత్తం, కొడుకు సమకూర్చిన దానితో వ్యవహారం సెటిలైపోయింది. మొత్తం ముప్పై ఎకరాలు సుబ్రహ్మణ్యం సొంతమయ్యింది. శ్మశానంలా మారిన భూమిలో దాదాపు మూడోవంతు చేతికి రావడంతో అతని ఆనందానికి హద్దేలేదు.

ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లు పెట్టి మొత్తం భూమిని ఐదారు కమతాలుగా మార్పించాడు. రెండు బోర్లు వేయించాడు. ఖరీఫ్ సీజన్‌కూడా కలిసి రావడంతో నారు పోయించాడు. నారు అందేసరికి భూమిని నాటుకు సిద్ధం చేయించాడు. బీడుభూమి పంటభూమిగా మారిన దృశ్యం చూడగానే సుబ్రహ్మణ్యం మనసు పులకించిపోయింది. తన కల నెరవేరిందనుకున్నాడు. ఊరివాళ్లంతా సుబ్రహ్మణ్యాన్ని ఆకాశానికి ఎత్తేశారు. ఆ సమయంలో అతనికి ధర్మయ్య గుర్తుకువచ్చాడు. 'ఇంతటి బృహత్తర ప్రయత్నానికి తన బుర్రలో చిన్న ఆలోచన వెలిగించిన వ్యక్తి ధర్మయ్య. అతని చేతులమీదుగా నాట్లు

22 katha 1-203 page-1_Layout 1 9/25/2021 3:32 PM Page 49

ప్రారంభించాలి' అనుకున్నాడు. ధర్మయ్యను ఏకంగా ఊరికి రప్పించాడు. దమ్ము మడిని చూడగానే ధర్మయ్య ముఖం వెలిగిపోయింది.

'చాలా గొప్ప పనిచేశావు సుబ్బూ' అన్నాడు.

అప్పటికే నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్న మహిళలు చప్పట్లు కొట్టారు.

'అంతా బాగుందయ్యా.. బీడువారిన మిగిలిన భూముల సంగతి చూడండయ్యా. మా నోటికి ఇంత కూడు దొరుకుతుంది' పొలంలో నిల్చున్న కూలీల్లోని ఓ మహిళ గట్టిగా అరుస్తూ చెప్పింది.

సుబ్రహ్మణ్యం అది ఊహించిందే.

బీడువారిన భూమిలో తాను ముప్పై ఎకరాలు సాగులోకి తేగలిగాడు. నాలాగే మరికొందరు ప్రయత్నిస్తే..

'నేను విత్తు వేశాను. అది వృక్షం అయి తీరుతుంది' అని మనసులోనే అనుకున్నాడు.

రెండు నెలల్లో ముప్పై ఎకరాల్లో పచ్చదనం అల్లుకుంది. తివాచీలా దర్శనమిచ్చి అటు వెళ్తున్న వారికి స్వాగతం పలుకుతున్నది.

సుబ్రహ్మణ్యం ఆనందపరవశుడయ్యాడు.

'నేనో ప్రయత్నం చేశాను. ఇది తప్పక మరికొందరికి ప్రేరణ ఇస్తుంది' అనుకున్నాడు.

'తన మనసుకు ఇప్పుడు నిజమైన విశ్రాంతి దొరికింది' అని సంతోషించాడు.

## బి.వి.రమణమూర్తి

*ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం నగరానికి చెందిన బి.వి.రమణమూర్తి, ఎం.ఏ, బీఈడీ చేశారు. 1995లో పాత్రికేయరంగంలో డెస్క్ జర్నలిస్ట్‌గా జీవితాన్ని ప్రారంభించారు. 2016 నుంచి కథలు రాయడం మొదలుపెట్టారు. ఇప్పటి వరకూ వివిధ పోటీల్లో 18 కథలు బహుమతులు గెలుచుకున్నాయి. 2021లో టీబీకే బాలకృష్ణారెడ్డి కథల పోటీల్లో రెండో బహుమతి, సాలూరు సాహిత్య బృందం వారు నిర్వహించిన వ్యంగ్య కథలపోటీల్లో ప్రోత్సాహక బహుమతి అందుకున్నారు.*

# ఇదీ హత్యే కాదా?

బి.వి.గిరిజ

89850 38173

'**ఒక్కగానొక్క** కొడుకు తన కన్నతండ్రినే హత్య చేశాడని మీరెందుకు పోలీస్ స్టేషన్లో కంప్లయింట్ ఇచ్చారు?' అడిగాడు డిఫెన్స్ లాయర్, కోర్టు బోనులో నిలబడి ఉన్న మాణిక్యమ్మను.

'ఎందుకంటే, ఆ కొడుకు తండ్రి మరణానికి కారకుడైనాడనేది నాకు మాత్రమే బాగా తెలుసు కాబట్టి. వాడెంత క్రిమినల్ మైండ్ ఉన్నవాడో తెలుసు కాబట్టి'

'అంటే ఆయన తన తండ్రిని చంపడం మీరు కళ్లారా చూశారా? ఏ ఆయుధంతో చంపాడు? గొంతు పిసికాడా? విషం పెట్టాడా? ఎలా చంపాడు? పైగా హత్య చేసేందుకు ఏదో ఒక బలమైన కారణమో, ఉద్దేశమో ఉంటుంది. అదేమిటి?'

'కంటికి కనిపించే ఎలాంటి మారణాయుధాలూ ఉపయోగించలేదు. విష ప్రయోగం చేయలేదు. భౌతికదాడికి పాల్పడలేదు. అతను.. కన్నతండ్రిని ఎలా చంపాడో ఏ ఫోరెన్సిక్ సైంటిస్టులు, పోలీసులుకూడా కనుక్కోలేరు' అంటూ ఎదురుగా బోనులో ఉన్న 30 ఏండ్ల యువకుడు శంతనకుమార్ వైపు ఉరిమి చూస్తోందామె.

'ఇంతకీ మీకూ, మృతుడు సంజీవరావుకు ఉన్న సంబంధమేంటి?' రెట్టించాడు డిఫెన్స్ లాయర్.

'సంబంధమంటే ఏం చెబుతాను సర్? మనిషికీ మనిషికీ మధ్య ఉన్న సంబంధమే సర్! ఆయనకు భార్య చనిపోయింది. ఒంటరితనంతో బాధ పడుతున్నారు. పొరుగునే ఉన్న నాకు భర్త చనిపోయాడు. ఇద్దరమూ వృద్ధులం. తోడు కోల్పోయినవాళ్లం. కాబట్టి, ఒకరికొకరం కష్టసుఖాలు చెప్పుకుని ఓదార్చుకునేవాళ్లం. ఈ న్యాయదేవత గుడిలో ప్రమాణపూర్వకంగా చెబుతున్నాను, ఇంతకుమించి మా మధ్య గుచ్చిగుచ్చి అడుగాల్సిన మరెలాంటి అనైతికమైన సంబంధమూ లేదండి!'

'సరే, శ్రీరాముడు పుట్టిన ఈ దేశంలో తండ్రిని ఏ కన్న కొడుకైనా చంపగలడని నువ్వెలా అభియోగం మోపగలవు?' అడిగాడు డిఫెన్స్ లాయర్.

'అబ్జెక్షన్ యువరానర్. డిఫెన్స్ లాయర్ గారు ఏ కన్న కొడుకూ తండ్రిని చంపేటంత నేరాన్ని ఈ దేశంలో చేయడనేటట్లు మాట్లాడుతున్నారు. ఇది న్యాయశాస్త్రానికే విరుద్ధం. అసంబద్ధం. ఎందుకంటే, మన దేశంలో సొంత తల్లిదండ్రులను చంపిన నేరాలు నిరూపితమై ఎంతోమంది కొడుకులు జైళ్లలో ఊచలు లెక్కపెడుతున్నారు. నేను అలాంటివారి జాబితాను ఓ వారం రోజుల్లో కోర్టు ముందుంచుతాను, కావాలంటే..'

'అక్కర్లేదండీ! ఆ జాబితాతో ఈ కేసుకేం పని? డిఫెన్స్ లాయర్‌గారు ఏదో ఉద్వేగంలో అలాంటి మాట అన్నారంతే' అన్నారు జడ్జిగారు.

'మైలార్డ్! ఇక్కడ కొడుకు శ్రీరాముడు లాంటివాడు కాదు. ఈ కేసులో తండ్రి మృతికి కన్న కొడుకే కారణమయ్యాడనేది నా అనుమానం. దాని గురించి పోలీసులు దర్యాప్తు చేసి, ఏవైనా సాక్ష్యాధారాలను సంపాదించి, కోర్టు ముందుంచాలి. నాకు ఫలానా వారిమీద అనుమానముందని చెప్పేంతవరకే నేను చేయగలను' అంది మాణిక్యమ్మ.

'నిరాధారంగా, బాధ్యతా రాహిత్యంతో గౌరవప్రదంగా బతుకుతున్న ఓ మంచి కొడుకుపై పనీపాటల్లేక నిందలు వేయడం తగదు మీలాంటి పెద్దవారికి' అన్నాడు డిఫెన్స్ లాయర్.

'ముమ్మాటికీ కొడుకు నిర్వాకం వల్లే ఆయన మరణించాడనేది నా అభియోగం. అది తప్పనుకుంటే మరి ఆయన ఎలా చనిపోయాడో మీరు చెప్పండి చూద్దాం!!' తిరిగి డిఫెన్స్ లాయర్నే ఎదురు ప్రశ్నించింది మాణిక్యమ్మ.

దాంతో డిఫెన్స్ లాయర్‌గారు గొంతు సవరించుకుని,

'మృతుడు సంజీవరావు 30 ఏండ్లుగా మధుమేహ వ్యాధిగ్రస్తుడు. సాధారణంగా వయసుమీద పడి, ముసలితనం రావడంతోనే తన ఎనభయ్యో ఏట చనిపోయాడు. పైగా ఆయనకు లేని జబ్బులేమిటి? హై బీపీ ఉంది. గ్యాస్ట్రిక్ సమస్య ఉంది. ప్రోస్టేట్వాపు రావడంతో దాని గురించి గతంలో ఒకసారి ఆపరేషన్ కూడా జరిగింది. కాలు ఫ్రాక్చర్ అయింది. తరచుగా బాధించే ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ ఉంది. వీటన్నిటికంటే ఆయనకు కిడ్నీలు కూడా అరవై శాతం దెబ్బతిన్నాయి. అందువల్ల ఆయన పడుకున్నప్పుడు ప్రశాంతంగా నిద్రలోనే హృదయాఘాతంతో గుండె ఆగిపోయి, హాయిగా సుఖమరణం సంభవించింది. ఆయన చావు గురించి బంధువుల్లో మరెవ్వరికీ రాని అనుమానం పొరుగున ఉన్న మీకే ఎందుకు వచ్చింది మాణిక్యమ్మగారూ..? మీరేమైనా ఆయనకు దగ్గరి బంధువా? అసలు ఆయన చావు గురించి మీకేం సంబంధం ఉందని పోలీసులకు రిపోర్టు చేశారు? ఇలాగే మన దేశంలో ఉత్తుత్తి అనుమానాలతో ఇరుగుపొరుగు మీద కంప్లయింట్ చేసుకుంటూ పోతే, వాటిని విచారించేందుకు ఎన్ని లక్షల కోర్టు భవనాలు, దర్యాప్తు చేయడానికి ఎన్నివేల మంది పోలీసు సిబ్బంది కావాలో ఒకసారి ఆలోచించండి!'

గర్జించాడు డిఫెన్స్ లాయర్.

'అబ్జెక్షన్ యువరానర్! ఎలాంటి రక్త సంబంధం లేకున్నా, ఒక మనిషి మరణం గురించి మరొకరు పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. కేవలం రక్త సంబంధీకులే పోలీసు కంప్లయింట్ ఇవ్వాలనేం లేదు. అలాగే, అనుమానించడమే పెద్ద నేరమైనట్లు మాట్లాడుతున్నారు డిఫెన్స్ లాయర్‌గారు. ఇది కలికాలం. రోజులు బాగా లేవు. మన నీడను సైతం అనుమానించాల్సిన దుర్భరమైన రోజులు. మా క్లయింటును డిఫెన్స్ లాయర్‌గారు భయపెట్టేందుకు ఏవేవో అసంబద్ధమైన ప్రశ్నలు, వాదనల్ని తెరమీదకి తెస్తూ, నిజానికి వారే కోర్టు సమయాన్ని చాలా వృథా చేస్తున్నారు' అన్నారు ప్రాసిక్యూషన్ లాయర్.

**మృతుడు సంజీవరావు 30 ఏండ్లుగా మధుమేహ వ్యాధిగ్రస్తుడు. సాధారణంగా వయసుమీద పడి, ముసలితనం రావడంతోనే తన ఎనభయ్యో ఏట చనిపోయాడు. పైగా ఆయనకు లేని జబ్బులేమిటి? హై బీపీ ఉంది. గ్యాస్ట్రిక్ సమస్య ఉంది. ప్రోస్టేట్వాపు రావడంతో దాని గురించి గతంలో ఒకసారి ఆపరేషన్ కూడా జరిగింది.**

'అబ్జెక్షన్ సస్టెయిన్డ్..' అన్నారు కళ్లద్దాల్లోంచి జడ్జిగారు.

మళ్లీ మాణిక్యమ్మ తన వాగ్దాటిని కొనసాగించింది.

'సర్! ఆ అబ్బాయి తన తండ్రి గురించి ఏదైనా ఉపయోగపడే ఒక్క మంచి పనిని మనస్ఫూర్తిగా చేశాడేమో కనుక్కోండి? ఎన్నడైనా తన తండ్రికి ఒక జత బట్టలు కుట్టించి ఇచ్చాడా? ఒక జత చెప్పులుగానీ, బూట్లుకానీ కొనిచ్చాడా? ఆయనకు మంచి ఆహారం తెచ్చి, తినిపించాడా? ఆయన ఒంటేలు ఎత్తి వేశాడా? ఆయన వాంతి చేసుకుంటే కడిగాడా? ఆయన గుడ్డలు శుభ్రం చేసి ఇచ్చాడా? ఆయనకు స్నానానికి వేడినీళ్లు తోడి ఇచ్చాడా? లేకపోతే ఆయనకు నెలవారీ మందులకయ్యే ఖర్చు భరించాడా? చెప్పమనండి.. ఏదైనా తన తండ్రికి అతను తన చేజేతులా కొనిపెట్టినట్లు ఒక్క షాపు బిల్లు ఉన్నా చూపించమనండి..' అంది.

కోర్టులో నిశ్శబ్దం నెలకొంది. మాణిక్యమ్మ వైపు కొరకొరా చూస్తున్నాడు ముద్దాయి శంతనకుమార్.

'ఈ ముదనష్టపు కొడుకు ఆ పెద్దాయనతో ఒకరోజు సాయంత్రం గొడవపడి, ఆ పాతబడ్డ ఇంట్లో ఆయనను ఒంటరిగా వదిలేసి, రాత్రికి రాత్రే ఇల్లు ఖాళీ చేసి భార్యను

తీసుకుని కొత్త ఇంటికి వెళ్లిపోయాడు. అదివరకే కొత్తగా కట్టుకున్న ఇంట్లోకి వెళ్లేందుకు ఏదో ఒక సాకుతో ఊరకనే గొడవపడి వెళ్లిపోయారంతే. ఆ తర్వాత పెద్దాయన హోటల్లో తింటుండటంతో, ఊర్లో వాళ్లందరూ 'కన్నతండ్రికి ఇంత అన్నం పెట్టలేవా?' అని మందలించడంతో, తండ్రికి రోజుకు రెండు పూటలా భోజనం తెచ్చి పెట్టేవాడు. అదికూడా వేళకు తగినట్లుగా ఠంచనుగా రోజూ తెచ్చి పెట్టేవాడా? లేదు. పైగా ఆ తెచ్చిన భోజనాన్ని ఇంటి లోపలికి వెళ్లి ఇచ్చేవాడు కూడా కాదు. ఆ పాత ఇంటి గేటువద్ద, తిరస్కారంగా బ్యాగును విసిరేసి వెళ్లిపోయేవాడు. అదికూడా ఒక్కోరోజు తను ఊర్లో లేకపోతే, ఆ రోజు పెద్దాయనకు ఎవరూ భోజనం తెచ్చి పెట్టేవారు కాదు. ఆయనకు కనీసం ఫలానా రోజు అన్నం తేవట్లేదని ఫోన్లో ముందుగానే ఒక్కమాట కూడా చెప్పేవారు కాదు. చివరికి ఏ రోజైనా భోజనం తెచ్చి పెట్టకపోతే పొరుగునే ఉన్న మా ఇంట్లోంచి భోజనం పంపించే వాళ్లం. ఆ కన్న కొడుకనేవాడు ఏ రోజూ తన తండ్రితో ఆప్యాయంగా ఒక్క నిమిషం కూడా మాట్లాడింది నేను చూడలేదు. వృద్ధాప్యంలో ఉన్నవారు చిన్న పిల్లలతో సమానం సార్! మరి అలాంటివాళ్లను ఎవరైనా ఒంటరిగా పాత కొంపలో వదిలేసి, భార్యను తీసుకుని వెళ్లి వేరే కాపురం పెడతారా? మీరే చెప్పండి! వర్షం కురుస్తున్న రాత్రుల్లో ఒంటరిగా అంత పెద్ద పాత ఇంట్లో ఆయన ఒక్కడే ఉన్నప్పుడు, విద్యుత్ సరఫరా బంద్ అయినప్పుడు, చీకట్లో ఆయన ఎంత అవస్థ పడ్డాడో ఆ సర్వేశ్వరుడికే తెలుసు. ఇలాంటి కొడుకు మాత్రం ఎవరికీ పుట్టకూడదు సార్!'

'అదేమిటి? ఊర్లో అందరూ ఈ అబ్బాయిని వేనోళ్ల కొనియాడుతుంటే నువ్వేమో దుర్మార్గుడిలాగా చిత్రిస్తున్నావు. ఈ అబ్బాయి స్వయంకృషికి మారుపేరు. కష్టపడి జీవితంలో పైకొచ్చాడు. పెద్దలంటే అతనికి ఎంతో వినయం! పైగా ఒక్క పాడు అలవాటు లేదు. సిగరెట్లు కాల్చడు. మద్యం తాగడు. పరాయి మహిళవైపు ఎప్పుడూ కన్నెత్తి చూడలేదు. ఇలాంటి శ్రీరామచంద్రుడిని పట్టుకుని ఒక దుష్టుడని చెబుతున్నావే? నీ ఆలోచన సరిగ్గానే ఉందా?' గట్టిగా

> **'సార్! మానాన్న మంచోడు కాదుసార్. ఆయనకు ఎనభై ఏండ్లు వచ్చినా ఆడపిచ్చి సార్! ఆయన నా భార్యపై కన్నేశాడు సార్. ఇప్పుడు స్త్రీలపైన దేశంలో ఎన్నో అఘాయిత్యాలు జరుగుతున్నాయి కదండి సార్. అందువల్లనే నా భార్య 'ఆయన ఇంట్లో ఉన్నంత వరకూ నేను నీతో కాపురం చేయను' అని తెగేసి చెప్పింది సార్. పైగా ఆయన నా భార్య ఒంటరిగా ఉన్నప్పుడు అఘాయిత్యం చేసేందుకు ఒకసారి ప్రయత్నించాడని కూడా చెప్పింది సార్'**

నిలదీశాడు డిఫెన్స్ లాయర్.

'సార్.. శ్రీరామచంద్రుడు పితృవాక్య పరిపాలనకోసం అడవికి వెళ్లాడు. ఆయనతో ఇతనికి పోలికేంటి సర్! భార్య కొంగు పట్టుకుని, కన్నతండ్రిని అసహ్యించుకుని వేరే కాపురం పెట్టాడితను. ఆ పెద్దాయనకు ఇంకో కొడుకో, కూతురో ఉండివుంటే కనీసం వారైనా ఆయన బాగోగులు చూసుకునేవారు. భార్యకూడా బతికి లేదాయె. ఎవ్వరూ లేరాయె. దేశంలో ఇలాంటి వృద్ధుల పరిస్థితి ఏమిటి? రోగాలతో బాధ పడుతూ ఎనభై ఏండ్లు పైబడిన వృద్ధుడిని ఇంట్లో ఒంటరిగా వదిలేసి ఎవరైనా వెళ్లిపోతారా? ఇది అన్యాయం కదా?'

'మైలార్డ్.. ఆయన ఎలాంటి పరిస్థితుల్లో ఇల్లు ఖాళీ చేసి, తండ్రినొక్కడినే ఇంట్లో వదిలేసి వెళ్లాడో మా క్లయింట్ తన నోరారా చెబుతాడు. ముద్దాయిని మాట్లాడేందుకు అనుమతించండి!'

సరేనన్నట్టు జడ్జి తలూపారు.

***

బోనులో నిలబడ్డ యువకుడు శంతనకుమార్ జడ్జివైపు తిరిగి చేతులు పైకెత్తి మొక్కి చెప్పసాగాడు.

'సార్! మానాన్న మంచోడు కాదుసార్. ఆయనకు ఎనభై ఏండ్లు వచ్చినా ఆడపిచ్చి సార్! ఆయన నా భార్యపై కన్నేశాడు సార్. ఇప్పుడు స్త్రీలపైన దేశంలో ఎన్నో అఘాయిత్యాలు జరుగుతున్నాయి కదండి సార్. అందువల్లనే నా భార్య 'ఆయన ఇంట్లో ఉన్నంత వరకూ నేను నీతో కాపురం చేయను' అని తెగేసి చెప్పింది సార్. పైగా ఆయన నా భార్య ఒంటరిగా ఉన్నప్పుడు అఘాయిత్యం చేసేందుకు ఒకసారి ప్రయత్నించాడని కూడా చెప్పింది సార్'

'నో మైలార్డ్! ఇదంతా పచ్చి అబద్ధం. కేవలం ఆ పెద్దాయనమీద నింద వేసేందుకు ఇలాంటివి చెబుతున్నారు. అతని భార్య తనపై అఘాయిత్యం చేసేందుకు ముసలాయన ప్రయత్నించాడని ఊరూరకనే కన్నీళ్లు పెట్టుకుని, నటించి, అసత్య ఆరోపణలు చేసింది. దీన్ని చూసిందెవరూ లేరు. భర్తకు ఆయన కన్నతండ్రిపైనే అనుమాన బీజం నాటి, ఆ తర్వాత దూరం చేయాలని ఆమె ఆడిన నాటకం సార్ ఇది. ఎనభైలో ఉన్న వృద్ధుడు కోడలిపై అఘాయిత్యం చేయబోయాడంటే మీరు నమ్ముతారా? ఆయన తన భార్యలోనూ తల్లిని దర్శించేటటువంటి మహోన్నతుడు సార్! ఎందుకంటే ఆ పెద్దాయన గురించి నాకంటే వేరెవ్వరికీ బాగా తెలీదు సర్'

'అంటే.. మీకంటే వేరెవ్వరికీ బాగా తెలీదా? మీకు తెలిసిందేమిటో! మీకే ఆయన గురించి ఎందుకంత బాగా తెలుసో? ఇందులో ఏదో మతలబు ఉంది' వ్యంగ్యంగా

అన్నాడు డిఫెన్స్ లాయర్.

'సర్! నేను సిగ్గు విడిచి చెబుతున్నాను. ఆయనంటే నాకు చాలా అభిమానం, ప్రేమ. కానీ, ఆయన నన్నెప్పుడూ ఆ దృష్టితో చూసేవారు కాదు సార్. వృద్ధాప్యంలో ప్రేమంటే ఏముంటుంది సార్? ఆప్యాయంగా మాట్లాడుకోవడం తప్ప ఇంకేముంటుంది సార్? ఆయన నాతో మాట్లాడేటప్పుడు కూడా చాలా గౌరవంగా పలకరించేవారు. నన్నెప్పుడూ ఏకవచనంతో సంబోధించలేదు. ఆయనెంతో మర్యాద, మన్నన తెలిసిన వ్యక్తి. ఎంతో గొప్పగా బతికారు. ఎంతోమందికి ఆయన గుప్తదానాలు చేశారు. ఎవరికైనా ఆరోగ్యం బాగా లేకపోతే ఆయనే తీసుకెళ్లి ఆసుపత్రిలో చూపించేవారు. అలాంటి మంచి మనిషిపై నింద వేయడం తగదండీ. పైగా వీళ్లు క్షుద్రులు సార్! వీరికి మర్యాద తెలీదు. సంస్కృతి తెలీదు. నాగరికతా లేదు. కేవలం ప్యాంటు, చొక్కా వేసుకుని తిరుగుతున్నారు. సల్వార్ కమీజులు, చూడీదార్లు వేసుకుని ఫ్యాషనబుల్‌గా ఉంటున్నారు తప్ప నిజంగా వీరిలో మానవత్వం ఏ కోశానా లేదు. తండ్రిపైనే ఒక నీచమైన, మురికి ఆరోపణ చేస్తున్నాడంటే ఆ కొడుకు ఎంత నికృష్టుడో! నిరపరాధి అయిన మామగారిపైనే నింద వేసే ఆ కోడలి నేపథ్యం ఏమిటో మీరొకసారి అర్థం చేసుకోండి'

'మైలార్డ్! ఈ మాణిక్యమ్మగారికి, మృతుడైన సంజీవరావు గురించి సానుభూతి ఉందనేది తెలుస్తోంది. అందువల్లనే ఈవిడ ఆయన కొడుకు, కోడలు సరిగ్గా ఆయనను చూసుకోలేదని ఉత్తుత్తి ఆరోపణలు చేస్తూ, కేవలం మానసిక బాధతో, ఏది తోచితే అది మాట్లాడుతోంది. ఇలాంటివి ఎలాగూ కోర్టు నమ్మదుకూడా. ఆ పెద్దాయన మరణానికి కన్న కొడుకే కారణమనే విషయాన్ని రుజువు చేసేందుకు తిరుగులేని, బలమైన సాక్ష్యాధారాలు కావాలి. అలాంటివి ఈ కోర్టు ఎదుట ప్రాసిక్యూషన్ ఏమీ ప్రవేశపెట్టలేదని సవినయంగా కోర్టు దృష్టికి తీసుకుని వస్తున్నాను'

'పోలీసులు సాక్ష్యాధారాలను సేకరించారు మైలార్డ్. మా వద్ద డాక్టర్లు ఇచ్చిన నివేదికకూడా సాక్ష్యంగా రాబోతోంది. ఆయన హైపోగ్లైసీమియాకు గురై.. అంటే శరీరంలో గ్లూకోజు స్థాయి తగ్గిపోయి, మెదడుకు గ్లూకోజు అందకుండా అంతిమంగా కోమాలోకి వెళ్లి చనిపోయే ఛాన్స్ ఉందంట. ఈ విషయం పాతిపెట్టిన ఆయన శవాన్ని పోస్ట్‌మార్టమ్ కోసం బయటకు తీయడం వల్లే తెలియబోతుంది. ఏదేమైనా ఈ కేసుకు సంబంధించి మాణిక్యమ్మగారు ఇచ్చిన కంప్లయింటే కీలకం. దీనికి ఈమెను తప్పక అభినందించాల్సిందే. పక్కింట్లో కళ్లెదుటే నేరం జరుగుతున్నా మనకెందుకులే అని చూసి ఊరుకునే రకం కాదావిడ' అన్నారు ప్రాసిక్యూషన్ లాయర్.

'ఆ పెద్దాయన వృద్ధాప్యంలో వచ్చిన అనేక రోగాల సమాహారం వల్ల ఈ లోకంలో నూకలు చెల్లి, చనిపోయాడు. అంతే. ఆయన మెదడుకు గ్లూకోజ్ అందకుండా

చనిపోయాడనేది అవాస్తవం. ఇది పోస్ట్‌మార్టంలో తేలడం అసాధ్యం' అని డిఫెన్స్ లాయర్ అన్నాడు.

కేసు విచారణ మరో రోజుకు వాయిదా పడింది.

***

'సంజీవరావు కోమాలోకి వెళ్లి, చనిపోయిన సంఘటన అక్టోబరు 5నాటి రాత్రి జరిగింది. ఆ రోజు నువ్వేం చూశావో కోర్టుకు వివరించు?' అడిగారు ప్రాసిక్యూషన్ లాయర్ గారు, మాణిక్యమ్మను.

'సార్! ఆ రోజు రాత్రి ఎనిమిది గంటలప్పుడు విపరీతమైన వర్షం కురుస్తున్నది. గాలివాన తోడవ్వడంతో, ఊర్లో అంతా విద్యుత్ సరఫరాను ఆపివేశారు. అక్కడక్కడా కరెంటు తీగలు, స్తంభాలు, చెట్లు నేలకూలాయి. షుగర్ పేషెంట్ కావడంతో, వేళకు ఆయన కొడుకు భోజనం తెచ్చి పెట్టాడో లేదోనని సంజీవరావును పరామర్శిద్దామని పక్కింటికి వెళ్లాను. ఆ ఇంట్లో కటిక చీకటి. కరెంటు లేకపోవడంతో నేనే అగ్గిపెట్టె వెతుక్కుని కిరోసిన్ ల్యాంప్ వెలిగించాను. ఆయన అచేతనంగా బెడ్‌మీద ఒకవైపునకు పడుకొని ఉన్నారు. ఒక చేయి మంచం మీదనుంచి కిందకి వేలాడుతూ ఉంది. ఏం జరిగిందోనని వెళ్లి మొహం మీద నీళ్లు చిలకరించా. కానీ, ఆయన స్పృహలోకి రాలేదు. వెంటనే ఆయన కొడుకైన, ఇక్కడ ముద్దాయిగా బోనులో నిలబడ్డ శంతనకుమార్‌కు ఫోన్ చేశా. కానీ, అతను చాలా తాపీగా.. 'మా తండ్రి గాఢనిద్ర పోతుంటారులే' అని బదులిచ్చాడు.

'అసలు రాత్రి భోజనం తెచ్చి పెట్టావా?' అని అడిగాను. 'ఔను, పెట్టాను' అని పొడిపొడిగా మాట్లాడాడు. నాతో మాట్లాడటం అతనికి ఇష్టం లేదుమరి. 'అయితే ఆయన తిన్న గిన్నెలు ఇక్కడ లేవేమిటి?' అని నిలదీశాను. 'ఆయన భోం చేసేంతవరకూ తాను అక్కడే ఉండి, వాటిని తీసుకుని వాపసు వచ్చాను' అని అబద్ధం చెప్పాడు. సాధారణంగా ఎప్పుడూ ఆయన భోజనం చేసేంతవరకూ ఈ కొడుకు వేచి ఉన్న దాఖలాలు నా కంట పడలేదు. ఆయన భోంచేసే టేబుల్‌మీద కొంచెం అన్నం కింద పడుతుంటుంది. దాన్ని ఎప్పుడూ ఈ కొడుకు శుభ్రం చేసి వెళ్లడు. కానీ, నాకు సందేహం వచ్చి భోజనం టేబుల్‌మీద చూశాను. అక్కడ భోజనం చేసిన ఆనవాళ్లేమీ కనిపించలేదు. అంటే ఆ రాత్రి ఆయన భోజనం చేయలేదన్నమాట. మరిప్పుడు తండ్రికి స్పృహ తప్పిందంటే వెంటనే వైద్యం చేయించాలి కదా? లేకపోతే ఏదైనా జరగరానిది జరగవచ్చు కదా? అందువల్ల 'నీకు ఒక కారు ఉంది కదా? దాన్ని తీసుకుని వస్తే, సిటీకి తీసుకెళదాం?' అని శంతన కుమార్‌ను ఫోన్లోనే వేడుకున్నాను. దానికి అతను కోపంతో నామీద అంతెత్తు ఎగిరాడు. 'నా తండ్రి బాగోగుల్ని చూసుకునేందుకు నీకేం సంబంధం ఉంది' అని నన్ను నానా దుర్భాషలాడాడు. వెంటనే ఆ పల్లెటూరిలో ఉండే ఏకైక ఆర్ఎంపీ డాక్టర్ వద్దకు నా కొడుకును తీసుకుని

వెళ్లాను. గతంలో ఇలా శరీరంలో గ్లూకోజ్ స్థాయి పడిపోయినప్పుడు ఆ ఆర్ఎంపీ డాక్టర్ సెలైన్ బాటిల్ పెడితే, సంజీవరావుగారు కోలుకున్నారు. ఆ గత అనుభవాలతో ఇప్పుడుకూడా అలాగే జరిగిందేమోననీ ఆదుర్దాతో ఆర్ఎంపీ వైద్యుడిని బతిమాలాడాను. కానీ, తను రానని భీష్మించుకుని కూర్చున్నాడు. ఈ ముద్దాయి, ఆ ఆర్ఎంపీ డాక్టర్‌తో మాట్లాడి, తన తండ్రి గురించి వెళ్లవద్దని చెప్పి, ఏదో గూడుపుఠాణి చేశాడు. ఎందుకంటే, ఆ ఆర్ఎంపీకూడా ఈ ముద్దాయి భార్యకి పిన్ని కొడుకు అవుతాడు.

సాధారణంగా ప్రతిరోజూ కొడుకు తండ్రికోసం తెచ్చిన భోజనం బ్యాగును బయట గేటువద్ద విసిరేసి, వెంటనే వెనుదిరిగి వెళ్లిపోతుంటాడు. తర్వాత ఇన్సులిన్ తీసుకుని, ఓ ఏడెనిమిది నిమిషాలకు పెద్దాయన భోజనం మొదలు పెడతారు. ఆ భోజనం సంచికోసం ప్రతిరోజూ ఎదురు చూస్తూ పడిగాపులు పడే పెద్దాయన తను భోజనం ముగించాక ఖాళీ క్యారియర్లను, తన టేబుల్ మీద పెట్టుకుని ఉంటాడు. మళ్లీ తర్వాతి రోజు ఉదయం ఆ పెద్దాయన తనకు చేదోడువాదోడుగా ఉండాలని పెట్టుకున్న పనిమనిషి వచ్చి, ఇంటి ముందంతా కసువు ఊడ్చి, టాయ్‌లెట్లోని డ్రమ్ములో నీళ్లు నింపి, రాత్రి భోజనం చేసిన గిన్నెల్ని కడిగి పెట్టి వెళుతుంది. ఆ పనిమనిషికి నెలకు రెండువేల రూపాయల జీతం కూడా సంజీవరావు గారే ఇస్తుంటారు. ఆ అక్టోబరు 5వ తేదీ రాత్రి పెద్దాయన గనుక నిజంగా కొడుకు తెచ్చిన భోజనం తినివుంటే, అక్కడ ఖాళీ గిన్నెలు, క్యారియర్లు ఉండేవి మరి. కానీ అక్కడ అవేవీ లేవు. అంటే భోజనం తేలేదని అర్థం. వాస్తవానికి ఆ రోజు రాత్రి జరిగిందేమిటి? ఆయనకు తను భోజనం తీసుకొచ్చానని, ఇక ఇన్సులిన్ వేసుకొనమని ఆ కొడుకు తండ్రితో చెప్పాడు. తీరా ఆయన ఇన్సులిన్ వేసుకున్నాక 'అరరే.. పొరపాటున ఖాళీ గిన్నెలు ఉన్న బ్యాగు తెచ్చాను. మళ్లీ వెంటనే వెళ్లి భోజనం తెస్తాను' అని చెప్పి, ఇంటికెళ్లిన కొడుకు తిరిగి భోజనం తీసుకుని రాలేదు. కొడుకు తెచ్చే భోజనం కోసం వేచి చూస్తున్న పెద్దాయనకు కడుపు ఖాళీగా ఉండటం వల్ల, ఆ ఇన్సులిన్ ప్రభావం వల్ల శరీరంలో గ్లూకోజ్ స్థాయి పడిపోయి కోమాలోకి వెళ్లాడు'

'నో యువరానర్. ఆ రోజు రాత్రి కొడుకు తన తండ్రికి భోజనం తెచ్చిపెట్టిన సంగతిని గుడిసెలో ఉండే హమాలీ రంగయ్య చూశాడు. రంగయ్యను సాక్ష్యంగా ప్రవేశపెడుతున్నాం'

'ఏంటి రంగయ్యా! ఆ రోజు నువ్వేం చూశావో చెప్పు'

'ఈ బాబు తన తండ్రికి భోజనం తెచ్చిపెట్టిన క్యారియర్ బ్యాగును వెనక్కి ఇంటికి తీసుకెళుతున్నప్పుడు నేను చూశానండీ'

ఈ సాక్ష్యం తప్పకుండా తనకు బాగా పనికొస్తుందని చెప్పి, శంతనకుమార్ నవ్వుకుంటున్నాడు.

'భోజనం తీసుకొచ్చిన గిన్నెల్ని బ్యాగులో వెనక్కు తీసుకెళుతున్నప్పుడు చూశావు, అంతేనా?'

అడిగాడు ప్రభుత్వ లాయర్.

'అంతేనండీ!'

'కానీ, తన కొడుకు తీసుకొచ్చి పెట్టిన భోజనాన్ని ఆ పెద్దాయన తింటున్నప్పుడు మాత్రం నువ్వు చూడలేదు కదా?'

'అవునండీ.. అది నేనయితే చూళ్లేదు' అన్నాడు రంగయ్య.

'అందువల్ల.. ఇక్కడ జరిగిందేమంటే ఆ రోజు శంతన కుమార్ భోజనం తీసుకుని రాకుండా, ఖాళీ క్యారియర్లను తెచ్చి, భోజనం తెచ్చానని తన తండ్రితో అబద్ధం చెప్పాడు. ఆయన ఇంకెలాగూ కొడుకు భోజనం తెచ్చాడని ఇన్సులిన్‌ను సిరంజీతో శరీరంలోకి ఎక్కించుకున్నాడు. ఆ తర్వాత ఈ దూర్తుడైన కొడుకు తన తండ్రితో భార్య భోజనం సర్దిపెట్టిన క్యారియర్ బదులు పొరపాటున ఖాళీ క్యారియర్లను తెచ్చానని, వెంటనే వెళ్లి మరో క్యారియర్లో భోజనం తెస్తానని చెప్పి ఇంటికెళ్లాడు. కానీ, అలా వెళ్లినవాడు ఎంతసేపటికీ తిరిగి రాలేదు. ఇక్కడ భోజనం కోసం ఎదురు చూసీ చూసీ ఈయన ఇన్సులిన్ ప్రభావంతో శరీరంలో గ్లూకోజ్ స్థాయి కోల్పోయి, మెదడుకు గ్లూకోజ్ అందకుండా, స్పృహతప్పి పడిపోయారు. పైగా ఇంట్లో సంజీవరావు పడుకునే బెడ్ పక్కన గూటిలో ఉండాల్సిన పంచదార డబ్బాకూడా విచిత్రంగా మాయమైపోయింది. ఆ బాక్సు ఎంత వెతికినా ఇంట్లో ఎక్కడా కనిపించలేదు. ఇంక ఆ ఖాళీ ఇంట్లో తినేందుకు ఏమీలేవు. ఆ పంచదార డబ్బా హఠాత్తుగా ఎందుకు మాయమైంది? అంటే 'ఇదంతా చాలా తెలివిగా చేసిన హత్య' అని ముమ్మాటికీ చెప్పవచ్చు యువర్ ఆనర్!'

'నో.. ఇదంతా కట్టుకథ.. అసలు నేను ఆ రోజు భోజనం తెచ్చిచ్చాను. మా నాన్నగారు తిన్నారు. తిన్నాక నేను ఖాళీ క్యారియర్ బాక్సులను ఇంటికి తీసుకెళ్లాను. ఆ పంచదార డబ్బాలను ఆయన ఎక్కడైనా పడేసుకుని ఉండవచ్చు' అన్నాడు శంతనకుమార్.

'కానీ, పోస్ట్‌మార్టం నివేదికలో బ్రెయిన్‌కు గ్లూకోజ్ అందకుండానే చనిపోయాడని కచ్చితంగా ఏమీ తేల్చలేదు' అంటూ అప్పుడే పోలీసులు అందించిన, వైద్యుల నివేదికను చూసిన జడ్జి గారు చెప్పారు.

'కాబట్టి, ఈ మాణిక్యమ్మగారు చెప్పేదంత కట్టుకథ. నా క్లయింట్ నిర్దోషి ' అని అన్నాడు డిఫెన్స్ లాయర్ ఇదే అదనుగా.

విచారణ మళ్లీ వాయిదా పడింది.

***

'మైలార్డ్! చనిపోయిన సంజీవరావుకు ఎనభై సంవత్సరాలు. ఈ వయసులో ఎవరికైనా మృత్యువు సహజంగానే దాపురిస్తుంది. ఎంతోమంది డబ్బున్నవాళ్లు, ఆధునిక వైద్యం అందుబాటులో ఉన్నవారుకూడా మన కళ్లెదుటే మరణించారు. వారికి

డబ్బుకుగానీ, వైద్యానికిగానీ లోటు లేదు. కాబట్టి, ఈ కేసులో శంతనకుమార్ దోషమేమీ లేదు. నిజానికి ఆ రాత్రి వృద్ధుడైన సంజీవరావు స్పృహ కోల్పోయినప్పుడు సకాలంలో వైద్యుడి వద్దకు తీసుకెళ్లలేదనే నెపంతోనే, ఆయన మరణానికి అతని కొడుకైన నా క్లయింట్ ముందుగానే పథకం వేసి, తన తండ్రిని మృత్యువుకు అప్పగించాడని చెప్పలేం. దాన్నిబట్టే ఆయనను దోషిగా నిర్ధారించలేం. పైగా అది వర్షపు రాత్రి. సమీపంలోని పెద్ద ఆసుపత్రికి తీసుకెళ్లాలంటే ఎనభై కిలోమీటర్లు ప్రయాణించాలి. అందువల్ల తెల్లవారాక వెళదామని అనుకోవడంలోనూ తప్పులేదు. వారి నాన్నకు తలెత్తిన సమస్య ప్రాణాంతకమనే జ్ఞానం కూడా పెద్దగా నా క్లయింటుకు లేదు' అన్నాడు డిఫెన్స్ లాయర్.

అనేక దఫాలుగా సుదీర్ఘ విచారణలు జరిగాయి. కోర్టుముందు పెట్టేందుకు ఇంకేమీ సాక్ష్యాధారాలు దొరకలేదు పోలీసులకు. చివరకు జడ్జి తన తీర్పు చదవసాగాడు.

'సంజీవరావు మరణానికి వృద్ధాప్యంతోపాటు అనేక వ్యాధులు తోడయి ఉండవచ్చు. ముద్దాయి శంతనకుమార్ ఉద్దేశ్యపూర్వకంగానే, ఆ రాత్రి ఇన్సులిన్ తీసుకున్న తండ్రికి సకాలంలో భోజనం అందించకపోవడం వల్లనే ఆయన చనిపోయాడనేందుకు తగిన సాక్ష్యాధారాలు లేవు. అందువల్ల ఆ విషయం కచ్చితంగా అలాగే జరిగిందని చెప్పలేం' అని అన్నారు.

'తన తండ్రి చావుబతుకుల మధ్య కోమాలో కొట్టుమిట్టాడుతున్న విషయాన్ని తెలుసుకున్నా స్పందించని కొడుకుది తప్పు కాదా యువరానర్? ఎలాగూ వృద్ధుడయ్యాడని, ఈ రోజో రేపో చనిపోతాడనీ, ఆయనను ఆసుపత్రికి తీసుకెళ్లకుండా ఉండటం క్రిమినల్ నెగ్లిజెన్స్ కిందకి రాదా? నిందితుడి మనసులో పక్కా ప్రణాళిక ప్రకారం జరిగిన కుట్రకు భౌతికంగా తగిన సాక్ష్యాధారం లేనందువల్ల అతడిని విడిచి పెట్టడం సరైంది కాదు. ఈ కేసులో కేవలం కొడుకే కాదు, ఆర్ఎంపీ డాక్టర్, కోడలుకూడా ఆ పెద్దాయన మరణానికి బాధ్యత వహించాల్సి ఉంటుంది. వాళ్లందరూ నిజంగా దోషులే. ఈ దేశంలో వృద్ధుల దుస్థితిని పట్టించుకునేదెవరు?' అంటూ ఆవేదన వ్యక్తం చేసింది మాణిక్యమ్మ.

జడ్జిగారు తీర్పు చెప్పేటప్పుడు అడ్డు పడకూడదని అందరూ మాణిక్యమ్మను వారించారు.

జడ్జి తన తీర్పును కొనసాగించారు.

'కాబట్టి.. సంజీవరావు మరణం కేవలం ఒక విషాదకరమైన, ఎవరూ తప్పించలేని సంక్షోభం. పైగా సంజీవరావుకు ఉన్నది ఒక్కడే కొడుకు. అందువల్ల ఆస్తికోసం ఎనభై ఏండ్లు దాటిన తండ్రిని చంపాల్సిన అవసరం కూడా ఆ కొడుక్కు లేదు. ఎందుకంటే ఎలాగూ తండ్రి చనిపోయాక ఆ ఆస్తి కొడుకుకే చెందుతుంది. కాబట్టి, ఈ కారణాల రీత్యా ముద్దాయిని నిర్దోషిగా తేల్చి విడిచి పెడుతున్నాం. కానీ, కోమాలో ఉన్న తండ్రిని సకాలంలో

ఆసుపత్రికి తీసుకెళ్లి ఉంటే బాగుండేది' అని జడ్జిగారు తీర్పు పాఠాన్ని పూర్తిగా చదివి వినిపించారు.

'సార్.. నా మాట ఓసారి వినండి. ఇక్కడ ఆస్తికోసం తండ్రిని కొడుకు చంపాడనేది కాదు నా అభియోగం. తండ్రికి రోజూ కూడు తెచ్చి పెడుతూ ఆయన బాగోగులు చూసుకోవడం కష్టమనీ, ముసలివాడు చావకుండా ఇంకా ఎందుకు బతికి ఉన్నాడనే కారణంతోనే, ఆయనకు మరణం ఆసన్నం కావడానికి ముందుగానే కుట్ర పూరితంగా చంపారని నేను చెప్పదలచుకున్నాను. అందుకే ఆ పెద్దాయనను భోజనానికి ముందు ఇన్సులిన్ తీసుకునేలా పురికొల్పి, తర్వాత ఆయనకు భోజనం పెట్టకుండా, ఆయనను కోమాలోకి వెళ్లేలా చేసి, ఆ తర్వాత పట్టించుకోకుండా వదిలేయడంతోనే ఆయన చనిపోయాడు. ఇది కూడా హత్యే. ఎనభై ఏండ్ల వ్యక్తిని చంపినా, ఏడాది పసికందును చంపినా మానవహత్య హత్యకాకుండా పోతుందా? ముసలివాళ్లు బతకడం వ్యర్థమనీ, వారిని చావుకు వదిలేయడం మేలని భావించి, సాక్షాత్తు సొంత కొడుకు కన్నతండ్రి కోమాలో ఉన్నప్పుడు సకాలంలో ఆసుపత్రికి తీసుకెళ్లకపోవడం నేరమే కదా? కన్నకొడుకులు, కూతుళ్లే వృద్ధుల చావును కోరుకుంటే, ఎవరి ఆసరా లేకుండా ముసలివాళ్లు ఈ దేశంలో బతికేది ఎలా? ఇదీ హత్యే కాదా? మీరందరూ దీని గురించి కాస్త ఆలోచించండి.. కోర్టుల సంగతి వదిలేయండి! నిజంగానే నిందితుడు ఈ కేసులో నిర్దోషేనా? అతనికెలాంటి నేరపూరిత మనస్తత్వం లేదా? వృద్ధుడికి చాకిరీ చేయాల్సి వస్తున్నదని కన్నకొడుకు తండ్రి చావును ఇక్కడ కోరుకోలేదా? మీరే ఆలోచించండి! ఇదీ హత్యే కదా?' అని కోర్టు హాలు దద్దరిల్లేలా మాణిక్యమ్మ అరిచి అరిచి, స్పృహ తప్పి పడిపోయింది. మరోవైపు ఈ కేసులో నిర్దోషిగా తేలడంతో చిద్విలాసంగా నవ్వుతూ బయటకు వచ్చిన శంతనకుమార్, తన లాయర్‌కు ఒక పెద్ద పార్టీ ఏర్పాటు చేశాడు.

## బి.వి.గిరిజ

*'సుశోభ' కలంపేరుతో బి.వి.గిరిజ రచనలు చేస్తున్నారు. తనది అనంతపురం జిల్లాలోని పుల్లీకుంట అనే ఓ కుగ్రామం. బీఎస్సీ చదివారు. బెంగళూరులో అతి తక్కువ వేతనాలకే చిన్నా చితక ప్రైవేటు ఉద్యోగాలు చేశారు. కన్నడ, తెలుగు సాహిత్యాలతో కొద్దిపాటి పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలోనే కథలు రాయడం మొదలుపెట్టారు. ఇప్పటివరకూ ఐదు కథలు రాశారు. స్వార్థపూరిత సమాజంలో రోజు రోజుకూ తీవ్రమవుతున్న నేరాలు, వృద్ధులకు సరైన భద్రత, భరోసా లేని సమాజాన్ని ప్రశ్నించేలా 'ఇదీ హత్యే కాదా?' అనే కథను రాశారు. ఎంతోమంది వృద్ధుల దీనగాథలు విని, వారి కష్టాలను చూసిన గిరిజ, వాటన్నింటినీ ఈ కథలో హృద్యంగా ఆవిష్కరించారు.*

22 katha 1-203 page-1_Layout 1 9/25/2021 3:32 PM Page 61

# వృత్తి

కె.వి. నరేందర్

94404 02871

**ఆ రోజు..** రమణశాస్త్రి ఇంటిల్లిపాదీ మౌనంగా వున్నారు. విశ్వనాథ్ నిర్ణయం వల్ల అందరూ ఖంగు తిన్నారు. ధూపదీప నైవేద్యాలు కూడా పెట్టలేదు. ప్రతిరోజూ ఘుమఘుమల వంటకాలతో ఇంటినిండా ఉండే పొగ లేదు. పూజగదిలోంచి వినిపించే గంటల శబ్దం కూడా ఆగిపోయింది.

రమణశాస్త్రి కట్టె ఊయలలో కూర్చొని ఉన్నాడు. అవమానంతో ఎర్రబడ్డ ఆయన మొహం మరింత గంభీరంగా మారింది.

విశ్వనాథ్ నెమ్మదిగా వచ్చి తండ్రి ముందర నిలబడ్డాడు.

'నాన్న గారు.. మీకిష్టం లేకుంటే వద్దు..' అన్నాడు భయం భయంగా..

'మీ నాన్నగారికి ఈ జిల్లాలో ఎంత గొప్ప పేరుందో నీకు తెలుసుగదరా విశ్వా..' వంటింటి తలుపు దగ్గర నిల్చొని అంది తల్లి మహాలక్ష్మి.

విశ్వనాథ్ తలొంచుకొని నిలబడ్డాడు.

'ఈ పేరు.. ప్రఖ్యాతులు కడుపునింపవు కదా..' అన్నాడు విశ్వ.

'అయితే.. నీకు బతకడానికి, నాలుగు మెతుకులు మింగడానికి ఇంతకన్నా వేరే దారే దొరక లేదా..' కోపంగా అన్నాడు రమణశాస్త్రి.

రమణశాస్త్రి అసహనంగా కదిలాడు.

'అలాగనీ.. మన కుటుంబ సంస్కృతీ సాంప్రదాయం మంటగలిపే పనులే చేసుకోవాలా? ఈ ప్రపంచంలో చేసుకోవాలంటే చాలా పనులున్నాయి' రమణ శాస్త్రి కోపం చూసి విశ్వ భయపడ్డాడు.

విశ్వ నిర్ణయాన్ని రమణశాస్త్రి జీర్ణించుకోవట్లేదు.

మళ్ళీ ఏదో చెప్పబోయాడు విశ్వ..

'నా కండ్లముందు కనబడకు.. నిన్ను చూస్తేనే అసహ్యంగా వుంది నాకు..' అరిచినట్టు

అన్నాడు రమణశాస్త్రి.

విశ్వనాథ్ దీనంగా తల్లివైపు చూసాడు.

ఆమె 'నీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోరా' అన్నట్టు కండ్లతోనే బాధగా చెప్పింది.

అప్పటికి మధ్యాహ్నం మూడు దాటింది. రమణశాస్త్రి స్నానం కూడా చేయలేదు.

'సరే.. మీరన్నట్లుగానే కానీయ్..' విశ్వ చెప్పేసి, విసురుగా బయటకు వెళ్ళిపోయాడు.

***

రాత్రి ఏడయింది..

రమణశాస్త్రి ఉయ్యాలపైనే ఒరిగి ఆలోచిస్తూ ఉన్నాడు.

అప్పటికే ఆ వార్త ఊర్లోకి చేరడంతో, అగ్రహారం అంతా అట్టుడికి పోయింది. ఒక్కొక్కరు మెల్లిగా రాసాగారు. అందరూ అదేదో పాపం చేసినట్టు మాట్లాడటం రమణశాస్త్రికి లోలోపల నచ్చలేదు.

'రమణా.. విశ్వనాథ్ ఏదో వ్యాపారం మొదలెట్టాడట కదా? అగ్రహారంలో పుట్టి అదేం పనిరా..' అన్నాడు వంగిపోయిన నడుంతో వచ్చిన చిదంబర శాస్త్రి.

'బతకడానికి సవాలక్ష పనులున్నాయి గానీ.. మన కులానికి తలవంపులు తెచ్చే పనేంట్రా..' అన్నాడు పతంజలి శాస్త్రి కుర్చీలో కూర్చుంటూ..

రమణశాస్త్రి నిశ్శబ్దంగా వున్నాడు.

అవమానం భరించలేనట్లు.. మహాలక్ష్మి వంటింటి లోపలికెళ్ళింది.

'ఇంకా పెండ్లి కావల్సిన వాడు. ఇలాంటి వ్యాపారాలు చేస్తే వాడికి పిల్లనెవడిస్తాడురా..' అన్నాడు రఘురామయ్య పంతులు.

'అసలే మనది సాంప్రదాయ కుటుంబం. నువ్వు గాయత్రీ ఉపాసకుడివి. నీ కడుపున ఇలాంటోడు పుట్టాడేమిట్రా ..' మళ్లీ ఆయనే అన్నాడు.

'ఇప్పటికే మన కులం ఆడపిల్లలు పంచె కట్టుకొని గుడిలో పూజలు చేసే పురోహితుల్నే పెండ్లి చేసుకోం అంటుంటే.. ఇంకా వీడు ఇలాంటి పని చేస్తానంటే ఒప్పుకుంటావేంట్రా..?' పంచాంగాలు చూసే పరంధామశాస్త్రి కొంచెం కోపంగానే అన్నాడు.

'విశ్వనాథ్ ఇంట్లో ఉంటే పిలువరా రమణ.. మేమైనా చెప్పిచూస్తాం..' అని అడిగాడు నరహరి.

'లేడు.. బయటికెళ్ళాడు. నేనూ మీలాగే చెప్పిచూశాను' అవమానంతో రమణశాస్త్రి గొంతు వణికింది.

కట్టె ఊయల గొలుసును బిగపట్టుకున్నాడు.

కండ్లల్లో నిప్పుల చారలు పాకాయి. మొహం ఎర్రగా అయింది.

'మాకైతే ఒళ్ళు జలధరిస్తోంది. ఇంతటి జుగుప్సాకరమైన పనిచేయాలన్న ఆలోచన

ఎలా వచ్చిందిరా వాడికి..' నిలదీసినట్టే అడిగాడు చిదంబరశాస్త్రి. వంటింట్లోంచి మహాలక్ష్మి ఏడుపు సన్నగా వినిపిస్తున్నది.

రమణశాస్త్రి కండ్లలో సన్నటి నీటితెర కదిలి వచ్చింది.

అంతా అదేదో చావు వార్త విన్నట్టు నిశ్శబ్దమైపోయారు.

అప్పుడే లాండ్ ఫోన్ రింగయింది.

రమణశాస్త్రి లేచివెళ్ళి క్రెడిల్ ఎత్తాడు. అవతల్నించి..

'ఏరా రమణా.. బాగున్నావా?' తన చిన్నప్పటి స్నేహితుడు, ఒకప్పుడు 'చిల్కాకోడూర్' దొర కొడుకు.

'నర్సింగ్.. బాగున్నారా.. హైదరాబాద్ నుంచేనా..?' తడబడుతూ అడిగాడు రమణశాస్త్రి.

'ఎల్లుండి నాన్నగారి 30వ సంవత్సరికంరా.. నువ్వేకదా ప్రతి సంవత్సరం కర్మకాండ చేసేది. నువ్వు జూబ్లీ బస్టాండ్ కొచ్చి ఫోన్ చేస్తే.. నేను రిసీవ్ చేసుకుంటాను'

'తప్పకుండా వస్తానురా..'

'పొద్దుటే వచ్చి.. నాకు ఫోన్ చేయి..'

ఫోన్ పెట్టేసి మౌనంగా ఉన్నాడు రమణశాస్త్రి.

'ఎవర్రా ఆ ఫోను.. నర్సింగరావ్ దొరనా..' అడిగాడు పురంధరశాస్త్రి.

'అవును.. వాళ్ళ నాన్నగారిది 30వ సంవత్సరికమట! హైదరాబాద్ రమ్మంటున్నారు' అన్నాడు రమణశాస్త్రి.

'చూశావా.. నీకు ఎంతగొప్ప పరిచయాలున్నాయో. అలాంటిది.. విశ్వనాథ్ నీ పరువు, మన కులం పరువు తీస్తే ఏం బావుంటుంది..'

'నేను.. వాళ్ళమ్మ చాలా చెప్పి చూశాం. వాడు వినట్లేదు. అంతా మా ఖర్మ..'

'సత్కర్మ భిశ్చ సత్ఫలితం
దుష్కర్మ ఏవ దుష్ఫలం
అచ్యుత్కట పుణ్య పాపానాం
సత్యం పరాణి భవ మిహం '.. అన్న శ్లోకాన్ని తనలో తానే గొణుక్కుంటూ వచ్చి ఊయలలో కూర్చున్నాడు.

విశ్వనాథ్ బయటనించి రాగానే.. నచ్చజెప్పాలని పిచ్చాపాటి మాట్లాడుతూ కూర్చున్నారు వాళ్లంతా.

కోపంగా వెళ్ళిన విశ్వనాథ్ ఇంకా రాలేదు.

చీకటి పడుతుండటంతో నిదానంగా లేచారు. రమణశాస్త్రి వాళ్ళని గుమ్మం వరకు సాగనంపాడు.

మహాలక్ష్మి మానసికంగా కుంగిపోయి.. వంటింట్లోంచి బయటకి రాలేదు.

22 katha 1-203 page-1_Layout 1 9/25/2021 3:32 PM Page 64

**మన బోడగుట్ట ఎలా ఉందిరా? పోశమ్మ కాడి చెరువు, అందులోని కొంగ బాగున్నాయా? ఎలుక బాయి, చిలుకవాగు, పోద్దాటి కల్లు, ఎల్లమ్మ గుడి, పీరీల గుండం, ఊడలమర్రి, మల్లన్న జాతర, కాట్రేగుల పండుగ, రామల్కపండు, నాగేటి సాల్లు.. ఎలా ఉన్నాయి రా..?' అని అడిగాడు నర్సింగ్‌రావు.**

***

రమణశాస్త్రిని రిసీవ్ చేసుకోడానికి నర్సింగ్‌రావు బస్టాండ్‌కి వచ్చాడు. బస్సు దిగిన వెంటనే మిత్రున్ని గాఢంగా హత్తుకొని కారెక్కించుకొని బయలుదేరాడు.

'ఏంట్రా.. మనూరి విశేషాలు?' అడిగాడు నర్సింగ్‌రావు.

రమణశాస్త్రి ఏం మాట్లాడలేదు. ముభావంగా కూర్చున్నాడు.

'ఏమైందిరా రమణా.. వచ్చినప్పట్నుంటి చూస్తున్నాను. ఏదో దిగులుగా ఉన్నావ్. నాక్కూడా చెప్పకూడనిదా..' అన్నాడు నర్సింగ్‌రావు కార్ డ్రైవ్ చేస్తూ..

'ఏం లేదులే. అయినా ఊరు విడిచి 30 యేండ్లవుతున్నది. ఏదెలా ఉంటే నీకెందుకురా..' చిరునవ్వుని పులుముకొని అన్నాడు రమణశాస్త్రి.

'నాన్నను 30 యేండ్లకింద నక్సలైట్లు చంపినప్పుడు చిన్న పిల్లలం. మనూరి జ్ఞాపకాలు ఇంకా గుర్తొస్తాయి. నేను రంగారావు దొర కొడుకునని నన్ను మీరంతా ప్రత్యేకంగా చూసేవారు కదా. నా మనసులో ఇంకా ఆ జ్ఞాపకాలు ఎండిపోలేదు..' అన్నాడు.

రమణశాస్త్రి భారంగా నిట్టూర్చాడు.

'మన బోడగుట్ట ఎలా ఉందిరా? పోశమ్మ కాడి చెరువు, అందులోని కొంగ బాగున్నాయా? ఎలుక బాయి, చిలుకవాగు, పోద్దాటి కల్లు, ఎల్లమ్మ గుడి, పీరీల గుండం, ఊడలమర్రి, మల్లన్న జాతర, కాట్రేగుల పండుగ, రామల్కపండు, నాగేటి సాల్లు.. ఎలా ఉన్నాయి రా..?' అని అడిగాడు నర్సింగ్‌రావు. మళ్లీ ఆయనే అందుకొని..

'భైరుపులపాట, అయ్యగారి పద్యం, పెద్ద పిట్ట అరుపు నాకింకా వినిపిస్తున్నాయి. నెత్తిమీద బోనం, సారవ్వ పూనకం, బొడ్డెమ్మల ఆట, బత్తీసుల దండ, డప్పుల సప్పుడు నా చెవుల్లో ఖంగుమంటున్నాయి. జెమ్మికింది రాత, బెల్లంపూస ముద్ద, మొలకమండే, సట్టి తీర్థం, మట్టి గాజులు, సాంచెల చప్పుడు ఇంకా విన్పిస్తున్నాయి. తెలకపిండి రుచి, బొమ్మలకొండ, గన్నేరు పూలు, ఎర్రటి ధూళి, అంబా అనే పిలుపు, చింతాకు పులుపు

యాదికొస్తే ఇంకా నోరూరుతుంది. ఇవన్నీ ఏ పార్క్‌లో దొరుకుతాయి రా? ఏ పబ్‌లో కనిపిస్తాయి? ఏ ఐమ్యాక్స్‌లో వినిపిస్తాయి?' అన్నాడు.

'ఇప్పుడు అవేవీ లేవుగానీ, నీకు బాగా గుర్తున్నాయి రా..' అన్నాడు రమణశాస్త్రి నవ్వుతూ, మనసుని తేలిక పర్చుకొని..

'ఎంతైన చిన్నప్పటివి కదా.. అవునూ విశ్వనాథ్ ఎలా ఉన్నాడు?' అనడిగాడు నర్సింగ్‌రావు.

'వాడే మాకు, మా కులానికీ సమస్యయ్యాడు..' అన్నాడు అసహనంగా కదులుతూ..

'మీకు.. మీ కులానికా..?'

'అవును..' అంటూ బాధగా మొత్తం వివరించాడు రమణశాస్త్రి.

అంతా విని.. 'ఇది సమస్యా..?' తేలిగ్గా నవ్వాడు నర్సింగ్‌రావు.

కొంచెం దూరం వెళ్లాక, రోడ్డు పక్కనే ఉన్న ఒక పెద్ద షోరూం దగ్గర కారు ఆపాడు. 'పాదరక్షలు.. గొడుగులు తీసుకుంటావా? దానమివ్వడానికి..' అడిగాడు రమణశాస్త్రి.

'కాదు.. ఇది నాదే..'

కారు దిగుతున్న రమణశాస్త్రి నిర్ఘాంతపోయాడు.

వెలిగిపోతున్న లైట్లలో.. మెరిసిపోతున్న చెప్పులు, బూట్లు..

షోరూం లోపలికి వెళ్తూ చెబుతున్నాడు నర్సింగ్‌రావు.. 'ఇప్పుడు చెప్పు. నాదేం కులం. నేను చేస్తున్న పనేంటి? పనివాళ్ళు లేనప్పుడు కస్టమరొస్తే, వాడి కాలికి నేనే చెప్పు తొడుగుతా.. రమణా! మనం చేసే పని ఇతరులకు హాని కలిగించక పోతే చాలు. సంసారాల్ని ఛిద్రం చేసి సమాజాన్ని చెడగొట్టే వైన్ షాపులకన్నా.. నీ కొడుకు చేయాలనుకున్న పని చాలా గొప్పదిరా. రోడ్డుకు అటు పక్కన చూడు. పట్టపగలే లైట్లతో ధగధగా మెరిసిపోతున్న బ్యూటీ పార్లర్. అది నడిపేది ఎవరో తెలుసా? మిర్జాపూర్ సంస్థాన దొరసాని మనవరాలు. ఆమె కులానికి.. ఆమె చేసే హెయిర్ కటింగ్ పనికి సంబంధంలేదే! రా.. కారెక్కు.. నీకింకా చూపిస్తాను'

షోరూం బయటకొచ్చిన రమణశాస్త్రి కారెక్కాడు.

**'రమణా.. నీ భయం.. ఆందోళన.. ఆవేదన.. బెంగను నేనర్థం చేసుకోగలను. అగ్రవర్ణాలు తమదికాని వృత్తిని తమ చేతుల్లోకి తీసుకునేముందు ఎంతటి క్షోభకు గురవుతారో నాకు తెలుసు. 27 ఏండ్ల కింద షూ షోరూం ప్రారంభించినప్పుడు.. మొదటిసారి కస్టమర్ కాళ్ళకు చెప్పులు తొడిగినప్పుడు.. నాకూ కన్నీళ్ళొచ్చాయి.**



ముల్కనూరు ప్రజా గ్రంథాలయం,నమస్తే తెలంగాణ

'మన జిల్లాలోనే ఉన్న రాజంపేట గడీ శేఖర్‌రెడ్డి దొర కొడుకు ఏం చేస్తున్నాడో తెల్సా? తెల్ల పందుల్ని పెంచుతున్నాడు. ఇదిగో ఆ షాప్ ఇదే'

రోడ్ పక్కన కారాపి షాప్‌ని చూపించాడు..

'మరి వాడి కులం ఏంటీ? చేస్తున్న పనేంటి? పనివాళ్ళతో సమానంగా వాడూ పనిచేస్తాడు. వాటిని కోసి అమ్ముతాడు. వాటి ధర కిలో 800 రూపాయలు'

నర్సింగరావ్ మళ్ళీ కారును పోనిచ్చాడు.

'రమణా.. నీకిప్పుడు కరోనా కంటే భయంకరమైన ఒక ఆకలి దృశ్యాన్ని చూపిస్తాను. ఆ చౌరస్తా వైపు చూడు..' అన్నాడు నర్సింగ్‌రావు.

అక్కడ దాదాపు 15 మంది వరకు పురోహితులు..

మాటిమాటికీ జంధ్యాలను సరిజేసుకుంటూ వచ్చేపోయే వారిని ఆశగా చూస్తున్నారు. అందులో అన్ని వయసుల వారూ ఉన్నారు.

'ఎవరైనా.. ఏదైనా వ్రతం చేసుకుంటేనో.. పిండప్రదానాలు చేసుకుంటేనో.. ఇక్కడికొచ్చి తీసుకెళ్తారు..'

ఇంతలో ఒకతను వచ్చాడు.. అందరూ అతన్ని చుట్టుముట్టారు.

రమణశాస్త్రి కండ్లు తడితడి అయ్యాయి.

కారు మళ్ళీ స్టార్టయ్యింది.

'రమణా.. అటు చూడు.. డ్రై క్లీనింగ్ షాప్. దాంట్లో కొన్ని వందల మిషిన్లు పనిచేస్తాయి. బెడ్ షీట్లు, ఆప్రాన్లు ఉతికేస్తారు. నాలుగైదు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులతో మాట్లాడుకొని ఈ దుకాణాన్ని నడుపుతున్నది రమేష్ గుప్తా కోడలు. వీళ్ళెవరూ కులాన్ని నమ్ముకోలేదు. పనినే ఛాలెంజ్‌గా తీసుకొని జీవితాల్నే గెలుస్తున్నారు. ఈ పని చాకలి పని. ఆ పని మంగళి పని. ఇంకొకటి మంత్రసాని పని.. అంటూ కూర్చోవట్లేదు. మార్పు అనే గుర్రం మీద దౌడు తీస్తున్నారు'

రమణశాస్త్రి ఏమీ మాట్లాడలేదు.

ఇంతలో నర్సింగ్‌రావు ఇల్లొచ్చింది. అప్పటికే ఆయన భార్య పిండప్రదానానికి కావాల్సినవి సర్దిపెట్టింది. కాళ్ళు కడుక్కొని పీటలమీద కూర్చొని పూజ ముగించాడు రమణశాస్త్రి.

సాయంత్రం మళ్ళీ రమణశాస్త్రిని బస్టాండ్‌లో దింపి, ఆప్యాయంగా చేతిని నొక్కి..

'రమణా.. నీ భయం.. ఆందోళన.. ఆవేదన.. బెంగను నేనర్థం చేసుకోగలను. అగ్రవర్ణాలు తమదికాని వృత్తిని తమ చేతుల్లోకి తీసుకునేముందు ఎంతటి క్షోభకు గురవుతారో నాకు తెలుసు. 27 ఏండ్ల కింద షూ షోరూం ప్రారంభించినప్పుడు.. మొదటిసారి కస్టమర్ కాళ్ళకు చెప్పులు తొడిగినప్పుడు.. నాకూ కన్నీళ్ళొచ్చాయి. కులాన్ని

తిట్టుకున్నాను. కానీ, వృత్తిని కాదు..' అన్నాడు నర్సింగ్‌రావు.

రమణశాస్త్రి కడుపుబ్బరం అనిపించి టాయిలెట్‌కి వెళ్లొచ్చాడు.

'రమణా.. దేశమంతా ప్రతి బస్టాండ్‌లో కనిపించే సులభ్ కాంప్లెక్స్ టాయిలెట్స్ నిర్మించిన బిందేశ్వర్ పథక్ కులం ఏంటో తెలుసా? బ్రాహ్మణ కులం. పథక్ సోషియాలజీ చదువుతున్న ఉన్నత విద్యావంతుడు. బీహార్ రాష్ట్రంలో ఓ చిన్న గ్రామంలో పుట్టాడు. ఒకసారి ఒకాయన ఎర్రటి చొక్కా వేసుకొని పొలానికెళ్తుంటే ఒక ఎద్దు అతన్ని పొడవడానికి వచ్చింది. కొందరు అతన్ని కాపాడటానికి వెళ్ళి ఎద్దును తరిమికొట్టారు. అప్పటికే ఎద్దు కుమ్మడంతో అతను కింద పడిపోయాడు. అతన్ని లేపడానికి వచ్చిన వాళ్ళలో ఒకడు 'అరే.. వీడు సఫాయోడురో' అని అరిచేసరికి అందరూ దూరంగా పరిగెత్తారు. అది గమనించిన బిందేశ్వర్ పథక్ ఆ అంటరాని వాడి శరీరానికి అంటిన దుమ్ము దులిపేశాడు. కానీ, అప్పటికే అతను చనిపోయాడు. ఈ విషయం ఆనోటా ఈనోటా అగ్రహారం దాకా చేరింది. పథక్‌ను శిక్షించాలని జాతకాలు చెప్పే వాళ్ళ నాన్నను అగ్రహారం పెద్దలు కోరారు. దాంతో వాళ్ళ నాన్నమ్మ పథక్‌కి ఆవు పేడ తినిపించి, ఆవు మూత్రం తాగించి చలికాలం తెల్లవారుజామున గంగనీళ్ళతో స్నానం చేయించింది. ఆ సంఘటనలతో చలించిపోయిన అతడు సులభ్ కాంప్లెక్స్ నిర్మించడానికి పూనుకున్నాడు. ఇప్పుడు మోడ్రన్ టెక్నాలజీ వచ్చి వృత్తులన్నీ పరాయీకరణం చెందాయి. కానీ, కులాలు మాత్రం ఇంకా బలపడ్డాయిరా..' అన్నాడు.

రమణశాస్త్రి ఎక్కిన తర్వాత బస్సు బయల్దేరింది.

***

'అంకుల్.. టిక్కెట్..' అంది లేడీ కండక్టర్.

ఏదో దీర్ఘాలోచనలో ఉన్న రమణశాస్త్రి ఉలిక్కిపడ్డాడు.

ఆ వెంటనే తేరుకొని..'జగిత్యాల' అన్నాడు.

ఆ లేడీ కండక్టర్‌ను చూడగానే చప్పున 'అరుంధతి' గుర్తొచ్చింది.

అరుంధతి.. తన ఒక్కగానొక్క కూతురు. పెండ్లయిన ఆర్నెల్లకే మృత్యువాత పడిన బిడ్డ. తను చనిపోయేటప్పటికే నాలుగు నెలల గర్భవతి. అప్పటికీ విశ్వనాథ్‌కు పదమూడేండ్లు.. ఆ రోజు తనతో.. తమ్ముడితో చెప్పుకోలేక వాళ్ళమ్మతో చెప్పుకుంది.

'మన బాయి పాయిఖాన నిండిపోయిందే అమ్మ.. దాన్ని తోడేయించుమని నాన్నకి చెప్పమ్మా..' అని.

మహాలక్ష్మి తనకు ఆ మాట చెప్పగానే సఫాయి రాజిగానింటికి స్వయంగా వెళ్ళి చెప్పాడు. వాడు దొడ్డుప్పు, బొగ్గులు తెచ్చి దాంట్లో పోశాడు.

'అది రెండ్రోజుల్లో మట్టిలెక్క అయితది బాంచెన్.. అప్పుడు ఆ మట్టిని తట్టల్తో తోడేస్తం. ఎట్లనన్న ఓర్చుకోండ్రి. రెండ్రోజులు ఎవరింటికైన వెళ్ళండి' అని చెప్పి వెళ్లాడు.

అప్పటికీ.. ఎవరింట్లో లెట్రిన్‌లు లేవు.

కానీ.. ఓరోజు అరుంధతి చెంబు తీసుకుని బిక్కుబిక్కుమనుకుంటూ.. వాగొడ్డుకు పోయింది. అక్కడే సర్కార్ తుమ్మ పొదల మాటున ఉన్న అయిదారు ఊరకుక్కలు.. ఒక్కసారిగా మీదపడ్డాయి.

తను అరుస్తూ.. ఆయాసంతో భయంగా పరిగెత్తుకొచ్చింది.

వేటగాడిలా వెంటాడాయి.. అందిన చోటల్లా కరిచాయి..

కాళ్ళు, చేతులు రక్తసిక్తమయ్యాయి. చీర, జాకెట్టు పీలికలైపోయాయి. అటుగా వెళ్లిన కొందరు కుక్కల్ని తరిమికొట్టారు.

గాయపడ్డ అరుంధతికి అప్పుడు నాలుగో నెల. వైద్యం ఫలించలేదు. ఉలిక్కిపడుతూనే మూడో రోజు కన్ను మూసింది.

మహాలక్ష్మి హృదయ విదారకంగా ఏడ్చింది. తన గుండె చెరువయ్యింది. విశ్వనాథ్ బిక్కచచ్చిపోయి నెల రోజుల వరకూ కోలుకోలేదు.

ఈ సంఘటన జరిగి పదేండ్లవుతున్నది. చెరిగిపోని అరుంధతి రూపం.. ఆ కండక్టరు అమ్మాయిని చూడగానే కన్నీరు కప్పేసి చెదిరిపోయింది.

'టికెట్.. టికెట్.. టికెట్..' అంటూ హ్యాండిల్ రాడ్‌ని లేడీ కండక్టర్ క్లిప్‌తో కొట్టడంతో.. రమణశాస్త్రి ఈ లోకంలోకి వచ్చాడు.

బస్సు జగిత్యాల చేరేసరికి రాత్రి పదయింది.

***

ఇల్లు నిశ్శబ్ధంగా ఉంది.

రమణశాస్త్రి గంగాళంలోని నీళ్ళతో కాళ్ళు కడుగుతుంటే.. మహాలక్ష్మి వంటింట్లోంచి వచ్చింది.

విశ్వనాథ్ భయం భయంగా తన గదిలోంచి వచ్చాడు.

విశ్వనాథ్‌ని చూసి.. రమణశాస్త్రి నిండుగా నవ్వాడు.

కాళ్ళు తుడుచుకోకుండానే కొడుకుని ఆలింగనం చేసుకున్నాడు.

ఆనందంగా కొడుకు చేతిలో ఓ గిఫ్ట్ ప్యాకెట్ పెట్టాడు.

అది చూసి.. 'నాన్న.. కొత్త సెల్‌ఫోన్..' అని సంతోషంగా అరిచాడు విశ్వనాథ్.

'ఫోన్ మాత్రమే కాదు.. సిమ్‌కూడా కొత్తదే..' అన్నాడు రమణశాస్త్రి చిరునవ్వుతో..

విశ్వనాథ్‌కు ఆ ప్యాకెట్లో ఏదో చీటీ కనిపించింది.

దాన్ని చేతిలోకి తీసుకొని మడత విప్పాడు.

'మీ ఇంట్లో సెప్టిక్ ట్యాంక్ నిండినదా...

అయితే.. నూతన పద్ధతిలో తోడివేయబడును.

అరుంధతి ట్యాంక్ క్లీనర్స్.

వివరాలకు సంప్రదించండి..

సెల్ : 987....123'

గుండె నిండా శ్వాస పీల్చుకుని రమణశాస్త్రికి సాష్టాంగ నమస్కారం చేశాడు విశ్వనాథ్.

***

నాలుగేండ్ల తర్వాత ఢిల్లీలో.. ఓ పెద్ద హాలులో.. దేశ ప్రధానమంత్రి తన పేరు పిలవటంతో..

ఎనిమిది వేలమంది ఒక్కసారిగా చప్పట్లు కొట్టడంతో.. ఆ జ్ఞాపకాల్లోంచి బయటపడ్డాడు విశ్వనాథ్.

'అధునాతన యంత్రాంగంతో.. ఆరు వందలమందికి ఉపాధి కలిపించి, సెప్టిక్ ట్యాంక్ క్లీనర్స్‌గా ఎదిగి.. దాంతో బయోగ్యాస్‌ని, సేంద్రియ ఎరువుల్ని సృష్టించిన అభినవ సైంటిస్ట్ అయిన విశ్వనాథశాస్త్రి గారిని 'స్వచ్ఛ సర్వేక్షణ్' అవార్డు అందుకోవల్సిందిగా కోరుతున్నాం..'

ప్రధాని స్వయంగా ప్రకటించడంతో.. వేదిక మెట్లు ఎక్కి కన్నీళ్ళతో చూస్తే.. తండ్రి, తల్లి మసక మసకగా కనపడ్డారు.

కానీ, ప్రధాన మంత్రి అందజేసిన అవార్డు నిండా.. అక్క 'అరుంధతి' నవ్వుతూ కనిపించింది విశ్వనాథ్‌కు..

(బ్రాహ్మణ సోదరులకు క్షమాపణలతో.. ఒక యథార్థ సంఘటన ఆధారంగా..)

## కె.వి.నరేందర్

*కందుకూరి వెంకట్ నరేందర్ స్వస్థలం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్నారు. అంతకు ముందు ఈటీవీలో స్క్రిప్ట్ రైటర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఇప్పటి వరకు 12 కథా సంపుటాలు, నాలుగు నవలలు, నాలుగు నాటకాలు, తెలంగాణ గడీలపై పరిశోధనాత్మక వ్యాసాలు రాశారు. ఎక్కువగా ఏకాంశ కథ(అమ్మమీద, నాన్నమీద, ఇల్లాలిమీద, ఊరుమీద, సిటీమీద..) పుస్తకాలు వెలువరించారు. 2016 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాడు ముఖ్యమంత్రి, గవర్నర్ చేతుల మీదుగా ఉత్తమ కథా రచయిత అవార్డు, విశాల సాహితీ అవార్డు, ఎమెస్కో అవార్డు, తెలుగు యూనివర్సిటీ అవార్డు వంటివెన్నో అందుకున్నారు. 2014లో ప్రభుత్వం నిర్వహించిన నవలల పోటీలో నరేందర్ రాసిన 'శిథిలస్వర్గం' నవల రూ.25,000 బహుమతిని గెలుచుకుంది.*

# తక్కెడ

చందు తులసి

99855 83022

**సమయం.. సాయంత్రం ఆరు గంటలు.**

'టమాట.. బెండకాయ.. వంకాయ.. ఏవైనా కిలో నలభై.. అగ్గువ.. అగ్గువ.. రావాలె.. రావాలె'

దర్గా సంతలో.. కూరగాయలు అమ్మే నర్సమ్మ, గట్టిగా అరుస్తూ పిలుస్తున్నది.

కరోనా రాకుండా కట్టుకున్న మాస్కు.. మూతి కిందికి జారింది.

'టమాటలు రెండు కేజీలు తీసుకుంటా.. ముప్పై రూపాయలకిస్తవా?' ఒకామె బేరమాడింది.

'గిట్టదమ్మా.. నాకే ముప్పై ఐదు చొప్పున పడ్డది. రోజంతా కష్టపడితే ఐదు రూపాయలు దొర్కకపోతే ఎట్లా బతికేది..? ఓ అమ్మా.. బోణీ బేరం నువ్వే.. అడిగి ఉత్తగనే పోతున్నవ్'

నర్సమ్మ పిలుస్తున్నా ఆ మనిషి ఆగకుండా పోయింది.

'బోణీ బేరమే ఇట్లయింది. ఇంక ఇయ్యాళ్ల తెల్లారినట్టే..' మనసులోనే గులిగింది.

హైదరాబాద్ శివారులోని దర్గా, మణికొండలాంటి కాలనీల్లో వారంలో రోజుకో చోట సంత జరుగుతుంది. కూరగాయలు అమ్మేటోళ్లు, ఇనుప మూకుళ్లు అమ్మే సిక్కులోళ్లు, మాంసం దుకాణాలు, పాత బట్టలు, మిఠాయిల దుకాణాలు.. ఇలా రకరకాల బేరగాళ్లు అక్కడికి వస్తారు. రోడ్డుకు అటుపక్క ఇటుపక్క.. ఎక్కడ జాగా దొరికితే అక్కడ కూర్చొని అమ్ముతారు. ఆ సంతకు దగ్గర్లోనే మోర్, డీమార్టు లాంటి సూపర్ మార్కెట్లు ఉన్నాయి. ఐతే అవి పైసలున్నోళ్లకే. కూలీనాలీ చేసి బతికే జనాలు ఇలాంటి సంతలోనే వారానికి సరిపోయే సామాన్లు కొనుక్కుంటరు.

నర్సమ్మను అక్కడ పల్చగా ఉన్న జనం కంటే.. ఆకాశంలో గుంపులుగా ఉన్న మబ్బులే చాలా భయపెడుతున్నాయి. 'ఎప్పుడు వాన పడుతదో' అనే భయంతో నిమిషానికోసారి ఆకాశం వైపు భయం భయంగా చూస్తున్నది. కూరగాయలు అమ్మేటోళ్లకు వర్షాకాలం అంటే పెద్ద గండమే! ఎప్పుడు కురుస్తదో తెలియని వానకు భయపడి జనాలు

సంతకు రారు. వానకు తడిస్తే కూరగాయలు పాడైపోతయి. పాలకూర, మెంతికూర లాంటి ఆకుకూరలు ఉట్టిగనే పాశిపోతయి.

'వట్టి చేపలు.. పాకెట్ పది రూపాయలు' అని అరుస్తూనే 'ఓ నర్సక్కా.. వందకు చిల్లర ఉంటే ఇయ్యవా?' అంటూ పిలిచింది పక్కనే కూర్చున్న ఎల్లమ్మ.

వాళ్లు పక్కపక్కనే ఉన్నా గట్టిగా అరిస్తే కానీ వినపడదు. అమ్మకందార్ల కేకలతో ఆ ప్రాంతమంతా గందరగోళంగా ఉంది.

కరోనా మొదలైనంక జనాలు సంతకు రావడం తగ్గింది. అసలు పట్నంలనే జనం తగ్గారు. చాలామంది ఊళ్లకు పోయింద్రు. కరోనా వచ్చినంక సంతలే కాదు, అసలు పట్నం మొత్తమే ఏదో కళ తప్పినట్టు అయింది.

నర్సమ్మ భర్త అప్పులు ఎక్కువై ఆత్మహత్య చేసుకొని పదేండ్లు దాటింది. ఆ రోజు నుంచి ఒక్కతే ఇద్దరు ఆడపిల్లలను సాకుతూ.. ప్రతీక్షణం బతుకుతోని కొట్లాడుతనే ఉంది. పెద్ద బిడ్డ గురుకుల హాస్టళ్ల ఇంటర్ చదువుతున్నది. చిన్నబిడ్డ సర్కారు స్కూళ్లో పదో తరగతి.

'బిడ్డలను బాగా సదివియ్యాలె' అనేది నర్సమ్మ కోరిక. దానికోసమే కంటికి నిద్ర లేకుండా కష్టపడుతున్నది.

ఇంతలనే నర్సమ్మ నడుముకు దోపుకున్న చెయ్యి సంచిల సెల్లు రింగ్ అయ్యింది. 'ఎవరా' అని చూసింది. 'చిట్టీల శంకర్..' అతని పేరు చూడగానే ఉలిక్కి పడ్డది. అతని దగ్గర యాభై వేలు డైలీ ఫైనాన్స్ తీసుకుంది. దాని కింద రోజూ ఐదొందల చొప్పున వంద రోజులు వసూలు చేసుకుంటడు. వడ్డీ కింద ముందుగాలనే.. పది వేలు కట్ చేసుకుంటడు. ఇచ్చింది నలభై వేలు ఐతే.. కట్టేది యాభైవేలు. ఒక్కరోజు ఇయ్యకపోయినా ఆగమాగం చేస్తడు. శంకర్.. మళ్ల ఫోన్ చేస్తనే ఉన్నడు. ఫోన్ రింగ్ అయితనే ఉంది. పొద్దున జరిగిన గొడవ గుర్తుకొచ్చి నర్సమ్మ కండ్లలో నీళ్లు తిరిగినయి.

***

ఒకపక్క కరోనా.. ఇంకోపక్క వాన ముసురు. సంతల కూరగాయలు కొనేటోళ్లు తగ్గిపోయారు. వారం రోజులనుంచి ఐదొందలుకూడా బేరం కావట్లే. వచ్చిన పైసలు ఆటో కిరాయిలకే సరిపోతున్నయి. రోజూ పొద్దుగూకంగనే ఎక్కడ సంత ఐతే అక్కడికి వస్తున్నడు శంకర్. బేరాలు కానిదే చిట్టీ ఎక్కడికెళ్లి కడతది.

రెండ్రోజులు 'రేపు ఇస్త.. మాపు ఇస్త' అని వాయిదా వేసింది.

'చేతగాని దానివి ఎందుకు ఫైనాన్స్ తీసుకున్నవ్..' అంటూ అమ్మనా బూతులు తిట్టుకుంట పోయిండు. నిన్న మణికొండ సంతలకూడా ఐదొందలు కాలేదు. ఇగ శంకర్ వస్తే.. పెద్ద గొడవ ఐతదని భయపడతనే ఉంది. అంతలోనే పెద్ద వాన.. గబగబ

కూరగాయలు మూట గట్టుకొని ఒక ఆటో కిరాయికి మాట్లాడుకొని ఇంటికి పోయింది. 'హమ్మయ్య.. ఒక్కనాడన్నా శంకర్ గాని గండం తప్పింది' అని అనుకుంది. కానీ, తెల్లవారక ముందే ఇంటిదగ్గరకొచ్చి లొల్లి చేయబట్టిండు.

'రాత్రి బాగా వాన కురిసింది.. వంద రూపాయలు కూడా బేరం కాలేదు. అందుకనే ఇంటికొచ్చిన. నీకు ఫోన్ చేద్దామంటే ఫోన్ ఛార్జింగ్ ఐపోయింది. నీకు తెల్వనిది ఏముంది. ఇయ్యాల దర్గా సంత కద. అక్కడ ఎంత లేదన్న మూడు వేల దాకా గిరాకీ ఐతది. మొత్తం నీకే ముట్ట చెబుత..' అని బతిమాలుకుంది.

ఐనా శంకర్ వచ్చింది డబ్బుల కోసం కాదని వాని మాటలనుబట్టి అర్థమైంది.

'చేతగానోళ్లు ఎందుకు చేస్తరమ్మా బేరాలు.. నీకు చేతకాకపోతే నీ బిడ్డతోని చేయి బేరాలు. పిల్ల వయసుమీద ఉంది కదా.. మంచి గిరాకీలు వస్తయి' అని వెకిలిగా మాట్లాడిండు.

తననెన్ని మాటలన్నా భరించింది. కానీ, బిడ్డను అనేసరికి తట్టుకోలేకపోయింది.

'దొంగ లమ్డీ కొడుకా.. ఏం మాట్లాడుతున్నవ్ రా!' అని చెప్పు తీసుకుని నాలుగు బాదింది. ఆ గొడవకు చుట్టుపక్కల జనం పోగైంద్రు.

'నా దగ్గర అప్పు తీసుకున్నది. ఇయ్యమంటే నన్నే కొడ్తంది..' అని దొంగ ఏడ్పులు ఏడ్శిండు శంకర్.

'నీ బొందల పైసల్.. పొద్దుగాల దర్గా సంతకాడికి రాపో.. నీ మొఖాన పడేత్త' అని అందరి ముందట ఈడ్చి కొట్టినట్టు చెప్పింది.

'పొద్దుగాల పైసల్ ఇయ్యకపోవాలె.. నీ సంగతి చెప్త' అనుకుంట చినిగిపోయన అంగీ, పాయింటు సర్దుకుంట అక్కన్నుంచి పోయిండు.

ఒక్క నర్సమ్మదే కాదు.. చిన్న చిన్న బేరాలు చేసే అందరిదీ అదే కథ. ఈ డైలీ ఫైనాన్స్ నడిపేటోళ్లు జలగల్లాగ రక్తం తాగుతరు.

డబ్బులు ఇయ్యకపోతే అన్ని రకాలుగా దోచుకుంటరు.

***

తేళ్లు పాకినట్లు జరజరా పాకుతున్నయి ఆకాశంలో మబ్బులు. శంకర్ మళ్ల ఫోన్ చేసిండు. చాలా సేపట్నుంచి చేస్తున్నడు. ఇక తప్పక లిఫ్ట్ చేసింది.

'ఏం సంగతి నర్సమ్మ.. వచ్చినవా లేదా..?'

'ఇస్తా అన్న కద.. తొమ్మిదింటి కల్లా రా..' అని ఫోన్ కట్ చేసింది.

'పాలకూర ఎంత? కొత్తి మీర ఎంత?' అంటూ మూతికి కట్టుకున్న మాస్కు లోపలనుంచే వట్టిగ అడిగిపోతున్నరు జనం. చాలామంది కొంచెం సేపు సంత అంత తిరిగి వస్తరు. అదొక ఆనందం. చిట్టీల శంకర్‌కు మూడువేలు ఇయ్యాలెనన్న సంగతి

గుర్తొచ్చినప్పుడల్లా గుండె గుభిల్లుమంటున్నది. ఒక పక్క 'ఎక్కడ వాన వచ్చి కూరగాయలు పాడైతయో' అనే భయంల ఉన్న నర్సమ్మకు.. జనాలు గీసి గీసి బేరమాడటం చూసి పట్టరాని కోపం వస్తున్నది.

ఓ పెద్దమనిషి వచ్చిండు. మొఖానికి ఖరీదైన మాస్కు వేసుకున్నడు. అతనితోపాటు ఇద్దరు మనుషులు కూడా వచ్చింగ్రు. వాళ్ల చేతుల్ల పెద్ద పెద్ద సంచులున్నయ్. చూడబోతే ఎక్కువ కూరగాయలు కొనేటట్టు ఉన్నరని ఆశపడ్డది నర్సమ్మ.

'ఏమ్మా .. టమాట, వంకాయలు, బెండకాయలు పది కేజీల చొప్పున కావాలె. ఎంత తగ్గిస్తవు' అని అడిగిండు.

ఒక్కసారిగా నర్సమ్మకు పానం లేచి వచ్చింది.

'సార్.. మాములుగా ఐతే నలభై చొప్పున అమ్ముత. పది కేజీలు అంటున్నరు కద. నాకు పడ్డ ధర ముప్పై ఐదు చొప్పున ఇస్త. తీసుకోండ్రి సార్' బతిమాలినట్లే అడిగింది.

నర్సమ్మ మాట తీరు చూస్తే.. 'బేరం లాగితే ఇంకా తగ్గేట్లుంది' అని అర్థమైంది.

'కిలో ముప్పై చొప్పున ఇస్తవా..' అని బేరానికి దిగిండు.

'పడదు సారూ.. నాకు పడ్డదే మూప్పై ఐదు' తేల్చి చెప్పింది నర్సమ్మ.

'ఔ సారూ.. ఇంతగనం కొంటున్నరు.. ఏమన్న ధావతు గిట్ల ఉన్నదా?' మాటల్లో పెడితే మనసు కరుగుతుందని ఆశపడి మళ్లీ అడిగింది.

'ఔనమ్మా.. రేపు మా మనవడి బర్త్ డే ఉన్నది. పెద్ద దావత్ ఇస్తున్నం'

'లక్ష రూపాయలు పెట్టి దావత్ చేస్తరు కద సారు. మా దగ్గర ఐదు రూపాయల కోసం గీసిగీసి బేరమాడుతున్నరా. మేం కూడా బతుకాలే కద సారూ..'

నర్సమ్మ మాటలకు అహం దెబ్బతిన్నది ఆ పెద్దమనిషికి. పైగా కూరగాయలు అమ్మే ఆడమనిషి తనను ప్రశ్నించడం అవమానంలా అనిపించింది.

'ఏమ్మా.. ఇస్తే ఇయ్యి.. లేకుంటే లేదు' అని కోపంగా వెళ్లిపోయాడు.

అయినా, ఆ పెద్దమనిషి వెనకాల బతిమాలుకుంటూ వెళ్లింది నర్సమ్మ.

'సారూ.. ఏమనుకోకుర్రి. నా పిల్లల మీద ఒట్టు. నాకు పడ్డదే కేజీ ముప్పై ఐదు రూపాయలు. ఆ చొప్పున ఇస్త.. తీసుకోర్రి'

నర్సమ్మ బేరానికి దిగినట్లు అనిపించగానే..

'కిలో ఇరవై చొప్పున ఇస్తవా?' ఇంకా తగ్గించాడు.

'అదేంది సారూ.. ఇప్పుడే ముప్పైకి అడిగింగ్రు కదా!' బిత్తరపోయినట్టు అడిగింది.

'మరి అప్పుడే ఇస్తే ముప్పై రూపాయలు ఇచ్చేటోడ్ని. అవసరం నీది. ఇరవైకి ఇవ్వు..?' వెకిలిగా నవ్వాడు ఆ పెద్దమనిషి.

ఏమీ మాట్లాడకుండా వెనక్కి వచ్చి కూర్చుంది నర్సమ్మ. ఇలాంటి బేరాలు

నర్సమ్మకు కొత్తేం కాదు. కూరగాయలు జోకేటప్పుడే కాదు.. కూరగాయలు బేరం చేసే జనాల మధ్యకూడా అక్కెరని బట్టి బతుకు తక్కెడ అటూ ఇటూ మొగ్గు చూపుతుంది.

ఇంతలనే మోటర్ సైకిల్ మీద శంకర్ రానే వచ్చిండు. యమదూతను చూసినట్లు ఉలిక్కి పడ్డది. ఏం మాట్లాడకుండ వచ్చి మౌనంగా నిలబడ్డడు. గుర్రుమంటూ గుడ్లు మిటకరిస్తుండు. నర్సమ్మ పైసల డబ్బాలోకి చూసింది. నాలుగైదు పాత పది రూపాయల నోట్లు, రెండు యాభై రూపాయల నోట్లు ఎక్కిరించినట్లు చూసినయ్.

'రెండువేల నోట్లకు చిల్లరకోసం మనిషిని పంపిన.. మిగిలిన దగ్గర వసూలు చేసుకొని ఒక పావు గంట తర్వాత రాపో..' అని చెప్పింది.

కాసేపు కిందామీదకి చూసిండు.

'నువ్వు ఇయ్యాల డబ్బులు ఇయ్యకపోవాలె.. నీ సంగతి చెప్తా..' అని ఇంకో దిక్కు పోయిండు.

పక్కనే వట్టిచాపలు అమ్మే ఎల్లమ్మను బదులు అడిగింది.

'నా బేరం ఎంతదక్కా.. తిప్పితిప్పి కొడితే ఐదు వందలు కావు.. నాకాడ ఉంటే ఇయ్యనా అక్క' బాధ పడుతూ చెప్పింది ఎల్లమ్మ.

సరిగ్గా అప్పుడే.. 'తటిళ్'మంటూ ఒక్కసారిగా ఆకాశంలో మెరుపు. ఆ వెంటనే గుండెలు దద్దరిల్లేలా ఒక్కసారిగా ఉరుము. ఉలిక్కిపడింది నర్సమ్మ. చూస్తుండగానే చెరువు కట్ట తెగినట్లు.. కుంభవృష్టి మొదలైంది. ఊహించని ఆ వానకు 'పులిని చూసిన మేకల్లా' జనం తలోదిక్కు ఉరుకుతున్నరు. ఐదే ఐదు నిమిషాల్లో.. అక్కడ వాతావరణం పూర్తిగా మారిపోయింది. సంత అంతా నీటి మడుగులాగా కనిపిస్తున్నది. గిరాకీ ఆశలు వదిలేసుకొని చాలామంది బేరగాళ్లు అక్కడినుంచి మూటాముల్లె సర్దుకొని ఆటోలల్ల ఇంటిబాట పట్టిండ్రు.

'నర్సక్కా.. చూడబోతే వాన ఇంకా పెరిగేలా ఉంది. నేను పోతున్న. నువ్వుకూడా ఆటో తీసుకొని పో..' అంటూ ఎల్లమ్మ కూడా గబగబా పోయింది. నర్సమ్మకు ఒక్క నిమిషం ఏమీ అర్థం కాలేదు. అప్పటి దాకా ఉన్న 'దింపుడు కల్లం ఆశ' కూడా కొట్టుకుపోయింది. కండ్ల ముందట టమాటలు, బెండకాయలు, వంకాయలు తడిసిపోతున్నయ్. పాలకూర, మెంతికూర కట్టలు నీళ్లమీద సుడి తిరుగుతున్నయ్. డబ్బులే నీళ్లలో కొట్టుకొని పోతున్నట్టు అనిపించింది. వాననీటికి పోటీగా నర్సమ్మ కండ్లల్ల నీరు కారబట్టింది. వానల అట్లనే కూలబడిపోయింది.

వాన జోరు పెరిగింది.. చూస్తుండగనే సంత ఖాళీ ఐపోయింది. దూరంగా అక్కడొకరు ఇక్కడొకరు తడువకుండ చెట్ల కిందా, రేకుల కిందా దాక్కున్నరు. ఇంత వానల కూడా కదలకుంట రాయిలాగా కూర్చున్న నర్సమ్మ వైపు విచిత్రంగా చూస్తున్నరు. కుండకు

చిల్లులు పడ్డట్టు కురుస్తనే ఉన్నది వాన. గబగబ లేచిపోయి దూరంగా ఉన్న ఇటుక పెళ్లలు తెచ్చి, నీళ్లు లోపలికి రాకుండా అడ్డంగా పెట్టింది. బోరున కురుస్తున్న అంతపెద్ద వానను కూడా లెక్కచేయలేదు నర్సమ్మ.

'టమాట, బెండకాయ.. పాలకూర.. అగ్గువ.. అగ్గువ.. రావాలె.. రావాలె..' అని తడుచుకుంటూనే అరుస్తున్నది.

నర్సమ్మ మాటలు వాన సప్పుడికి వినపడటం లేదు. అసలు ఆ చుట్టు పక్కల జనం కూడా లేరు. అయినా ఒంట్లోని శక్తి మొత్తం కూడదీసుకొని పిలుస్తనే ఉంది. కరెంటుకూడా పోయింది. అంతా చీకటి. ఆ సంత మొత్తంలో ఒక్క దుకాణం లేదు. ఆకాశం నిండా మబ్బులు. పైన జోరు వాన. కింద వరదలాగా కొట్టుకొస్తున్న నీళ్లు. ఇవేవీ భయపెట్టలేదు నర్సమ్మను. ఆ నీళ్లలో తడుచుకుంటూనే జనాల్ని పిలుస్తున్నది. దూరంగా ఉన్న ఒకలిద్దరికి నర్సమ్మ ఏం జేస్తుందో అర్థం కావడం లేదు. కొంపదీసి 'పిచ్చిగిట్ల లేసిందా' అనుకున్నరు.

***

సమయం ఎనిమిదిన్నర దాటింది. వాన కురుస్తూనే ఉన్నది. చలికి గజగజా వణుకుతున్నది నర్సమ్మ. అయినా భయపడటం లేదు. కదులకుండా అలాగే కూర్చొని ఇంకొంత గొంతు పెంచి..

'బెండకాయలు, వంకాయలు, టమాటలు' అని అరుస్తూనే ఉంది.

దాదాపు గంటసేపు కురిసిన వాన మెల్లగా ఆగిపోయింది. నర్సమ్మ మాత్రం ఆగలేదు. పిలుస్తూనే ఉంది. సంతలో కూరగాయల వాళ్లంతా ఎప్పుడో వెళ్లిపోయారు. ఒక్క నర్సమ్మ తప్ప. అసలు 'వాన వచ్చిందా? పోయిందా?' అన్న సంగతి కూడా పట్టించుకోలేదు. అప్పటిదాకా ఎక్కడ దాక్కున్నరో కానీ, ఒక్కొక్కరే మెల్లగా బయటకి వచ్చారు జనం.

'ఏందమ్మా.. నీకేమన్న పిచ్చి పట్టిందా. అంత వానలోనూ విగ్రహం మాదిరి కూర్చున్నావు. నీ దగ్గర గొడుగు ఉంది కదా. కనీసం అదన్నా పట్టుకోవచ్చు కదా..' గంట కింద నర్సమ్మతో కూరగాయల బేరం చేసిన పెద్దమనిషి అడిగాడు.

'తక్కువకి ఇస్తరా' అని అడుగుతూ అడుగుతూ.. ఎవరి దగ్గరా కొనలేకపోయాడు. ఈ లోపు కురిసిన వానకు చిక్కుకొనిపోయాడు. ఇప్పుడు నర్సమ్మ దగ్గర తప్ప ఇంకో మార్గం లేదు.

'టమాటలు, బెండకాయలు, వంకాయలు.. ఏం కావాలె సారూ..' ఆయన్ని ఇంతకు ముందు చూడనట్టే అడిగింది నర్సమ్మ.

'నువ్వు చెప్పిన ధరకే.. కిలో ముప్పైఐదు చొప్పున పది కేజీలు ఇవ్వమ్మా..' నవ్వలేక నవ్వుతూ అడిగాడు ఆ పెద్దమనిషి.

'టమాట కేజీ వంద. టమాటే కాదు.. ఏదైనా కేజీ వంద..' ఆజ్ఞాపిస్తున్నట్లు చెప్పింది.

నర్సమ్మ చెప్పిన ధర విని ఉలిక్కిపడ్డాడు ఆ పెద్దమనిషి.

'ఇంతకు ముందే ముప్పైఐదు అన్నావు కదమ్మా'

'అప్పుడే కొనుక్కోక పోయినవ్ సారు.. అప్పుడు తక్కెడ నీవైపు మొగ్గింది. ఇప్పుడు తక్కెడ నావైపు మొగ్గింది. కొంటే కొను.. లేకుంటే పక్కకు జరుగు.. ఆ.. టమాట, వంకాయ.. కిలో వంద రావాలె.. రావాలె..'

కరెంటు షాక్ కొట్టినట్టు అయిపోయింది ఆ పెద్దమనిషికి. మొఖంలో నెత్తురు చుక్కలేదు. బేరమాడేందుకు మరో దుకాణం లేదు. ఇంకో మాట మాట్లాడకుండా మొత్తం మూడువేలు ఇచ్చి కూరగాయలను సంచీల్లో నింపుకొన్నాడు. అతనితో వచ్చిన కూలీలు నర్సమ్మవైపు చూసి చిన్నగా నవ్వుకుంటూ.. సంచులు మోసుకుంటూ పోయారు.

అతడిచ్చిన ఆరు ఐదొందల నోట్లు తడిచిన తన చేతులకు వెచ్చగా తాకాయి. ఇంకొందరు కూడా నర్సమ్మ చెప్పిన ధరకే కిలో, అరకిలో కొనుక్కొని పోయింౡు. ఇప్పుడు నర్సమ్మ చేతిలో సరిగ్గా నాలుగు వేలు ఉన్నయి.

సెల్‌ఫోన్ తీసుకుని చిట్టీల శంకర్‌కు ఫోన్ చేసింది.

'అరేయ్ శంకరీ.. ఎక్కడున్నవ్ రా..?' నర్సమ్మ పిలుపు అక్కడ ఉరుములా ప్రతిధ్వనించింది.

***

## పి.చంద్ర శేఖర్

*'చందు తులసి' కలంపేరుతో చిరపరిచితులైన పి.చంద్ర శేఖర్, విస్తృతంగా కథలు రాస్తున్న వర్ధమాన తెలంగాణ కథకుల్లో ఒకరు. పూర్వ నల్లగొండ ప్రస్తుత సూర్యాపేట జిల్లాలోని బండమీది చందుపట్ల వీరి స్వగ్రామం. వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. 2015లో వచ్చిన తొలికథ 'ఊరవతల ఊడలమర్రి', వీరికి మంచి గుర్తింపు తెచ్చింది. 'నమస్తే తెలంగాణ బతుకమ్మ' సంచికలో వచ్చిన 'పాలపిట్టల పాట' కథ, నేషనల్ బుక్‌ట్రస్ట్ యువ కథా సంకలనానికి ఎంపికైంది. 22 భారతీయ భాషల్లోకి అనువాదమైంది. 'బతుకమ్మ పుట్టింది' కథ ప్రతిష్ఠాత్మక 'గుర్రాల లక్ష్మీ ప్రసాద్ అవార్డు' గెలుచుకున్నది. వీటితోపాటు 'నీళ్ల బిందె', 'బుక్కెడు బువ్వ', 'తల్లి గారిల్లు' కథలు పలు కథా సంకలనాలకు ఎంపికయ్యాయి. కథలతోపాటూ పలు పత్రికల్లో కథా సమీక్షలు జరిపారు. 'సారంగ' వెబ్ పత్రికలో 'రేపటి కథ' శీర్షికన అనేకమంది యువకథకుల పరిచయాలు నిర్వహిస్తున్నారు. తుపాకీ రాముడు, హృదయాంజలి సినిమాలకు రచయితగా పనిచేశారు.*

# నషా

సయ్యద్ గఫార్

81067 40593

**బిర్రుగ** కుతికలోతు మందుతాగి.. మిక్సింగు పాటలతో, కిర్రాక్ డ్యాన్సింగులతో ఊర్లె జనానికి ఉచిత వినోదం పంచి.. అలిసిపోయి, రాత్రి తొమ్మిదింటికి కాళ్లీడ్సుకుంటూ ఇంటికొచ్చిండు నాటుకోళ్ల కోటేశు.

పెద్దర్వాజ గోడవారగున్న నీళ్ల తొట్టికాడ కాళ్లూచేతులూ, మొఖం కడుక్కొని లోపలికొచ్చిండు.

కోటేశు ఆంజనేయస్వామికి వీర భక్తుడు. గోడకున్న స్వామి పటానికి కండ్లు మూసుకొని దండం పెట్టుకున్నడు. తనకోసమే ఎదురుచూస్తున్న భార్య శాంత కాడికొచ్చిండు. రేప్పొద్దటికి ఉతారకోసం తెచ్చుకున్న చీప్ లిక్కర్ కోటర్ బాటిల్‌ను ప్యాంటు జేబులోంచి తీసి, భార్య చేతికిస్తూ..

'భద్రంగ పెట్టు' అన్నడు.

ఆమె బాటిల్‌ను గూట్లె పెట్టొచ్చి.. 'అన్నం పెట్టనా..? తింటవా..?' అని అడిగింది.

కొడుకును యాదికి తెచ్చుకొని.. 'మా నాయ్న, అరవిందు వచ్చిండా..?' అనడిగిండు కోటేశు.

'వచ్చిండుగని, అన్నం పెట్టనా..? తిని పంటవా..?' అంది మళ్లీ.

'మా నాయ్న తిన్నడా..?'

'ఆ! తిన్నడు.. పన్నడు!' అంది శాంత.

కొడుకు పడుకున్న మంచం కాడికిపోయి కింద కూకున్నడు కోటేశు. కొడుకు కాళ్లు పట్టుకొని..

'నాయ్నా అరవిందూ.. నన్ను మాఫ్‌జెయ్యి కొడుకా! అక్క పెండ్లికి చేసిన అప్పు తీర్చలేక, నీ చదువు మాన్పించి పనిలో పెట్టిన కొడుకా.. నాలాంటి బేవార్సు తండ్రి ఏ కొడుక్కూ ఉండద్దు బిడ్డా.. గా బాధను తట్టుకోలేక, బయటికెవరికీ చెప్పుకోలేక మందు తాగుతున్న. నన్ను మాఫ్‌జెయ్యి కొడుకా!' అంటూ ఏడ్వబట్టిండు.

'ఓ అయ్యా.. నీ ఏడ్పు ఆపు! ఆడి నిద్ర చెడగొడ్తవా ఏంది? మల్ల వాడు తెల్లారగట్టనే పనికిబోవాలె. ఆడికెల్లి లే..' అంటూ కోటేశును లేపింది. పట్టుకొచ్చి కుర్చీల కూకోబెట్టింది.

'గింతన్నం సల్లల గలిపియ్యన్నా..? తాగి పంటవా?' అని అడిగింది.

'తాగుతా' అన్నట్లు తలూపిండు కోటేశు.

అన్నం కలిపిన సల్లను తాగిపించి, బయటి వాకిలి ముందు గడెమంచం ఏసింది. తాగడానికి మంచినీళ్లు పెట్టి, కోటేశును పట్కపోయి మంచం మీద కూకోబెట్టింది.

'ఇంక పండుకో!' అని చెప్పి, ఇంట్లకుపోయి లోపల్నుంచి గడె పెట్టుకుంది శాంత.

పంట పొలాలమీంచి సల్లటి గాలొత్తదని ఊర్లళ్ల శానామంది బయట్నే పండుకుంటరు. కోటేశుకూ అదే అలవాటు.

చేతివేలికున్న ఆంజనేయస్వామి వెండి ఉంగరాన్ని కండ్లకు అద్దుకొని, ముద్దువెట్టుకొని మంచమ్మీదికి ఒరిగిండు. బజార్ల ఆడిపాడి, ఎగిరి దుంకి అలసి ఉంటాన, ఎంటనే నిద్ర వట్టింది.

ఎవరో తరుముతున్నట్లు సుక్కపొద్దున్నే మెలుకువ అచ్చింది కోటేశుకు. ఆకాశంలో సుక్కలు మినుకు మినుకుమని మెరుస్తున్నయ్. కరెంటు లేదు. శిమ్మ శీకటిగుంది. వీధికుక్కలు మొరుగుతున్నయ్. రాత్రి జరిగింది యాదికొచ్చి, ధిగ్గన లేసి కూకుండు. దూపైతుంటే.. మంచం కిందున్న చెంబు తీసి నీళ్లు తాగిండు. గాలిలేదు. సల్లని చెమటలు పడ్తున్నయ్. రాత్రి జరిగింది మళ్లోసారి యాదికి దెచ్చుకున్నడు. కలకాదు.. నిజమే!

***

రాత్రి తను నిద్రబోయిన కొద్దిసేపటి తర్వాత ఎవరో తట్టి లేపుతున్నరు.

'భక్తా.. భక్తా..' పిలుస్తున్నరెవరో.. తొలుత కలలో అనుకున్నడు. కానీ, కలకాదు.

'భక్తా.. భక్తా..' మళ్లీ అదే పిలుపు. పచ్చినిద్ర. కండ్లు తెర్చుకోవడం లేదు. మళ్లీ లేపుతున్నరెవరో..

'భక్తా.. కోటేశు.. లే నాయనా!' పేరుతో పిలిచేటప్పటికి బలవంతంగా కండ్లు తెరిచిండు. ఎదురుగా నమ్మలేని దృశ్యం. కరెంటు లైట్ల కాంతిలో ధగధగా మెరిసిపోతూ.. గదాధారుడైన ఆంజనేయస్వామి.

స్వామి ప్రసన్నంగా.. 'లెమ్ము భక్తా.. భయపడకుము. నేను నీ ఆరాధ్య ఆంజనేయుడను. లే నాయనా!' అని అభయ హస్తం చూపించిండు స్వామి.

తను గభాల్న లేచి రెండు చేతులూ జోడించి దండం పెట్టిండు.

'స్వామీ.. ధన్యుడిని నాకు మీ ప్రత్యక్ష దర్శనభాగ్యం.. నమ్మలేకపోతున్నాను స్వామీ! నా జన్మ తరించిపోయింది స్వామీ! చాలు.. ఈ బతుక్కు ఇది చాలు!'.. ఇంకా ఏవేవో మాట్లాతోంటే..

'భక్తా! మద్యానికి బానిసవై సంసారాన్ని దరిద్రంలోకి నెట్టుకుంటున్నావు కదూ!' అన్నాడు స్వామి.

తన రెండు చేతులతో చెంపలు వేసుకొని.. 'అవును స్వామీ! తప్పుడు మనిషిని.. తప్పు చేస్తున్నాను. మాఫ్ జెయ్యండి స్వామి!'

'నా భక్తుడివి కనుక క్షమించితిని! ఈ రోజు నుంచి నీవు మద్యము తాగుటను మానివేయవలె! అర్థమైనదా?'

'అర్థమైంది స్వామి! మందు మానేస్తాను స్వామి'

'అంతేకాదు భక్తా! నీ కూతురి వివాహం కోసం చేసిన అప్పు తీర్చడానికి నీ కుమారుడిని పనిలో పెట్టావు. పిల్లాడిని చదువు మాన్పించి పనిలో పెట్టడం మంచిదికాదు. వెంటనే నీ కుమారుని పని మాన్పించి, బడికి పంపుము. అప్పుడే నీ సమస్యలు అన్నీ తీరిపోతాయి. నా ఆశీస్సులు నీకు తోడుగా ఉంటాయి. అర్థమైందా..?'

'మీరు చెప్పినట్టే నడుసుకుంటా స్వామి! తెలిసీ తెలియక చేసిన తప్పులను మాఫ్ జెయ్యండి స్వామి!' అంటూ స్వామికి పాదాభివందనం చేసేందుకు కిందకు వంగాడు. ఆశ్చర్యం! స్వామి కాళ్లకు పాదుకలు ఉండాల్సిన చోట.. తల పైకెత్తి స్వామిని చూడబోయాడు. అంతే.. కండ్లముందు తెల్లని మబ్బులాంటిది కదిలినట్టయింది. కండ్లు మత్తుగా మూసుకుపోతున్నయ్. స్వామివారే తన భుజం పట్టుకొని మంచమ్మీద పడుకోబెడుతూ..

'ఇక సుఖముగా నిద్రపొమ్ము భక్తా!' అన్నారు. ఆ మాటలు మాత్రమే యాదికున్నయ్. తను పూర్తిగా మైకంలకు జారిపోయిండు. తిరిగి ఇప్పుడు మెలుకువ వచ్చింది.

'నిజంగా ఆంజనేయస్వామి ప్రత్యక్షమైండా?' అనుకున్నడు. అది అసాధ్యమని తనకూ తెలుసు.

'మరైతే.. ఈ ఆంజనేయస్వామి ఎవరు? ఎవరైనా స్వామి వేషం కట్టుకొని వచ్చింద్రా..? అంత రిస్క్ తీసుకోవాల్సిన అవసరం ఎవరికుంది? నా మంచి, నా భార్యాపిల్లల మంచి ఎవరిగ్గావాలె? నేనెవ్వరికీ ఏ సహాయం చేసిందీ లేదు. తాగుబోతు దోస్తులకెప్పుడైనా కాసింత మందు బోయించిన్నేగానీ, చీమలకు చిటికెడు శెక్కర ఏసినోన్ని కాను. ఎంగిలి చేత్తో కాకుల్ని తోలినోన్నీ కాను. నా బాగు ఎవరిగ్గావాలె? అదిగూడా నేను ఇష్టపడే ఆంజనేయస్వామి వేషంలో వచ్చి..' ఇట్లా ఆలోచిస్తూ కూర్చున్న కోటేశుకు దస్తగిరి యాదికొచ్చిండు.

***

చాలాకాలం కిందటి సంగతి. దస్తగిరి ఈ ఊర్లెనే టైలర్ పనిచేసేటోడు. తనకంటే పెద్దోడైన దస్తగిరిని 'బావా' అని, అతని భార్య ఆయేషాను 'అక్కా' అని పిల్సేటోడు కోటేశు.

ఇద్దరూ మంచి దోస్తుల్లెక్క ఉండేటోళ్లు. దస్తగిరి మంచి టైలరే కాదు, అంతకంటే మంచి రంగస్థల పౌరాణిక నటుడు కూడా. తను ఆంజనేయస్వామి పాత్రకు పెట్టింది పేరు. ఆ పాత్ర చేయడం దస్తగిరికి ఎంత ఇష్టమంటే.. తన సొంత డబ్బులతో గదతోసహా అలంకరణకు కావాల్సినవన్నీ కొనుక్కున్నడు. 'శ్రీ రామాంజనేయ యుద్ధం' నాటకంలో ఆంజనేయస్వామి పాత్ర కట్టిండంటే.. సాక్షాత్తూ స్వామే దిగి వచ్చినట్టు ఉండేది. పద్యం పాడిండంటే.. ఎంత గాంభీర్యం, ఎంత మధురం అతని గొంతులో! చూసి, వింటేగానీ.. వర్ణించలేం.

అసొంటి దస్తగిరి, తన మూలంగానే ఊరిడ్సి ఎల్లిపోయిండు.

అప్పట్లో కోటేశుకు కూడా ఆంజనేయుడి పాత్రలో పద్యాలు, డైలాగులు నేర్చుకొని, దస్తగిరి కంటే మంచిగ నటించాలని ఉండేది. నాటకం నేర్పే హార్మోనియం పంతులు ఎంత నేర్పినా రాగం, పద్యం అబ్బలేదు. 'రెండు పెగ్గుల మందు తాగితే స్వరం తెగి, రాగం వస్తది' అని ఎవరో అంటే.. మందు తాగడం మొదలుపెట్టిండు. అయినా, స్వరం తెగలే.. రాగం అబ్బలే!

'మన కోటేశుకు పద్యం అబ్బలేదు గనీ, మద్యం అబ్బింది' అని నవ్వుకునేటోళ్లు ఊర్లె కొంతమంది.

ప్రతియేడూ వచ్చినట్టుగానే.. ఆ యేడుకూడా శివరాత్రి జాతరొచ్చింది. ఆ రోజు రాత్రి 'శ్రీ రామాంజనేయ యుద్ధం' నాటకముంది. తనలో ఏదో వెలితి. ఆంజనేయుడి పాత్ర వేయడం లేదని.

అదేరోజు సాయంత్రం కోటేశు దోస్తు ప్రేమ్‌సాగర్ ఫోన్ చేసిండు..

'మా ఇంటికి సుట్టం వచ్చిండు. మందు దావత్ చేసుకుంటున్నం. నువ్వు కూడా రారా' అని అన్నడు.

వాళ్లింటికెళ్లిండు కోటేశు. అక్కడ ప్రేమ్‌సాగర్‌తోపాటు ఆయన సుట్టం, మరో ముగ్గురు కొత్తోళ్లున్నరు. అందరూ కల్సి మస్తు మజా చేస్తూ, మందు తాగిండ్రు. ఎంత తాగిండ్రంటే.. మాట్లాడుతంటే నాలుక మడత పడేంత. అప్పుడే ప్రేమ్‌సాగర్ సుట్టం ఆరోజు ఊర్లె ఉన్న 'నాటకం' కరపత్రాన్ని చదువుతూ.. 'ఆంజనేయుడు – గాన గంభీర షేక్ దస్తగిరి' అని చదివి కాసేపు ఆగిండు..

మళ్లీ తనే.. 'చ్ఛ.. చ్ఛ.. ఇదే మన వెర్రితనం. మన దరిద్రం. మన ఆంజనేయు స్వామి పాత్రను ఒక ముస్లిం వేయడానికి వాడికెంత ధైర్యం? ఇది మనందరికీ అవమానమా? కాదా?' అని అడిగిండు.

మద్యం మత్తులో ఉన్న మిగతావాళ్లంతా 'అవును మనకు అవమానమే!' అన్నరు.

'అసొంటి అవమానం మనం ఎందుకు భరించాలె? వాడిని నాటకం ఆడకుండా ఆపాలె' అన్నడు.

'అవును! నాటకం ఆపాల్సిందే!' అన్నరు అందరూ.

'అయితే పదండి!'.. అనంగనే అందరూ కల్సి నాటకం ఆడే స్టేజీ దగ్గరికి వచ్చింరు. అక్కడ నాటకం నడుస్తంది. ప్రేక్షకులు ఏకాగ్రతగా చూస్తున్నరు. సరిగ్గా అప్పుడే ఆంజనేయుడి పాత్రలో నటిస్తున్న దస్తగిరి పద్యం అందుకున్నడు..

'బండనభీముడు ఆర్తజన బాంధవుడు ఉజ్వల బాణ తూణకోదండ కళా ప్రచండ భుజతాండ కీర్తికిన్.. రామమూర్తికిన్' అంటూ శ్రీరాముడిని కీర్తిస్తూ.. శంకరాభరణం రాగంలో నాలుగో శృతిలో పద్యం పాడితే స్టేజీ అదిరిపోయింది. ప్రేక్షకుల్లో అద్భుతమైన స్పందన. చప్పట్లు, కేకలు, ఈలలు, 'వన్స్‌మోర్' అంటూ ఆ ప్రాంగణమంతా హోరెత్తిపోయింది.

మత్తులో ఉన్న మందు పార్టీ బ్యాచ్‌కు ప్రేమ్‌సాగర్ సుట్టం రెచ్చగొట్టుడు ఎక్కువైంది. కోటేశులో కూడా ఏ మూలనో అణిగి ఉన్న ఈర్ష్య రాజుకుంది. తాగి వచ్చిన అందరూ కలిసి ఒక్కపాలి స్టేజీ ఎక్కింరు. కోటేశు మైక్ అందుకొని..

'మనూరి జనులారా ఇనండి! ఇక్కడ మనందరికీ అవమానం జరుగుతంది. ఒక ముస్లిం వ్యక్తి, మన ఆంజనేయ స్వామి ఏషం కట్టి, మన సమాజానికి అవమానం జేస్తుండు. ఇంక ఈ అవమానం జరుగడానికి వీల్లేదు. అందుకే, ఈ నాటకం జరుగడానికీ వీల్లేదు. ఇంక జరుగదు. అంతే.. ప్రేక్షక జనులారా.. అందరూ ఎవరిండ్లకు వాళ్లు ఎల్లిపోండని మనవి' అని చెప్పి, మైక్ కట్ చేసిండు. ఆ తాగుబోతు బ్యాచ్‌లో ఒకడు ఆంజనేయుడి వేషధారణలో ఉన్న దస్తగిరి దగ్గరికి వెళ్లి, తోక కత్తిరించిండు. ఇంకొకడు కిరీటం పీకేసిండు. ఒకడు విగ్గు, మరొకడు గద గుంజుకొని నేలకేసి కొట్టింరు. ఆఖరికి మెడలోని దండను తెంపేసింరు. స్టేజీ కర్టెన్లు, కరెంటు కనెక్షన్ కూడా పీకేసింరు. ఏం జరుగుతుందో తెల్వక జనం ఎటోళ్లటు ఎల్లిపోయింరు. ప్రతి యేడూ ప్రోగ్రాములన్నీ ప్రశాంతంగా జరుగుతుండటంతో పోలీసు ప్రొటెక్షన్ కూడా లేదు. దీంతో వాళ్ల పని ఇంకా సులువైంది.

చిందరవందరగా పడి ఉన్న తన క్యాస్టూమ్స్‌ను ఏరుకొని, బ్యాగులో పెట్టుకొన్నడు దస్తగిరి. అవమానభారంతో కంటనీరు పెట్టుకుంటూ, చీకట్లోనే ఇంటికెళ్లిపోయిండు.

ఒక్క అరగంటలోనే వేదిక దగ్గర చిమ్మ చీకటై, నిశ్శబ్దం అలుముకున్నది.

మర్నాడు.. అన్నివర్గాల పెద్దలు జమైంరు.

'కళలకు, కళాకారులకు కులమతాలు అంటగట్టడం తప్పు. దస్తగిరి మంచి నటుడు. ఆయనకు ఇలా జరుగడం బాధాకరం' అంటూ అందరూ ఏక గొంతుకతో రాత్రి జరిగినదాన్ని ఖండించింరు.

'అసలు ఇలాంటి కులమతాల వేర్పాటు ఆలోచనలు మన ఊరోళ్లవి కావు. బయటి

నుంచి వచ్చిన వ్యక్తి పెట్టిన చిచ్చు. దీన్ని అందరూ అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉన్నది. మన మధ్య విభేదాలు సృష్టించే చీడ పురుగు మన ఊర్లె ఎవరింటికొచ్చిండో..? వాణ్ని లాక్కొచ్చి నడి బజాట్లే మక్కెలిరగ దన్నాలె. ముక్కు నేలకు రాయించి, బట్టలూడదీసి ఊర్లెకెళ్లి ఎల్లగొట్టాలె' అని తీర్మానించిండ్రు.

ఈ వార్త తెలుసుకున్న ప్రేమ్‌సాగర్ సుట్టం పరార్ అయ్యిండు. ప్రేమ్‌సాగర్ కూడా పదిరోజులు ఊర్లె ఎవ్వలకూ కన్పించలే. కోటేశు కూడా వారంరోజులు ఊర్లె లేకుండా తప్పించుకున్నడు. కానీ, ఆత్మాభిమానమున్న దస్తగిరి అవమాన భారాన్ని తట్టుకోలేక తనకున్న రెండెకరాల భూమిని, సొంతింటినీ అమ్ముకొని, భార్యా పిల్లల్నీ తీసుకొని ఊరిడ్సి ఎల్లిపోయిండు. ఇది జరిగి పదిహేనేండ్లు దాటింది. తిరిగి దస్తగిరి ఊర్లెకడుగు పెట్టలేదు.

అప్పటికెళ్లి ఇయ్యాల్టి దాకా ఊర్లెగానీ, సుట్టుపక్కల ఊర్లల్లగానీ పౌరాణిక పద్యనాటకాలు ఆడినోళ్లు లేరు. ఊరిడ్సి పోయేటప్పుడు దస్తగిరికి ఆరేండ్ల, ఐదేండ్ల వయస్సున్న ఇద్దరాడపిల్లలు. ఆర్నెళ్ల కిందటే గుండెపోటచ్చి దస్తగిరి కాలం జేసిండని తెల్సింది.

***

'మరి తనకు రాత్రి దర్శనమిచ్చిన ఆంజనేయస్వామి ఎవరు?'

ఇట్లా ఆలోచిస్తూ కూకున్న కోటేశుకు తేటగ తెల్లారిన సంగతి కూడా ఎర్కగాలె..

'ఓ అయ్యా! ఇంకలే.. ఆకిలూడ్సి అలుకు సల్లాలె' అన్న శాంత మాటల్తో.. ఆ ఆలోచనలకెల్లి బయటపడ్డడు. ఇంట్లకు పొయ్యి మొఖం కడుక్కొని, తానంజేసచ్చి కూకున్నడు.

శాంత చేతులు కడుక్కొని కోటేశు రాత్రి తెచ్చిచ్చిన లిక్కర్ బాటిల్, గిలాస, నీళ్లు, నంజుకోవడానికి గిన్నెల కొంచెమంత శింతకాయ తొక్కు పట్టుకచ్చింది. కోటేశు దగ్గరున్న స్టూల్‌మీద పెట్టి, ఎన్కకు దిరిగింది.

కోటేశుకు పొద్దున్నే గింత ఉతార తాగి, రెండు ముద్దలు అన్నం తిని, నాటుకోళ్ల బేరానికి పోవుడు అలవాటు. కానీ, రాత్రి జరిగిన సంఘటనతోని ఒక నిర్ణయానికొచ్చిండు. ఎన్కకు దిరిగిపోతున్న శాంతను పిల్సిండు. 'ఏంది' అన్నట్లు ఆమె వచ్చి కోటేశు దగ్గర నిల్సుంది.

'ఇయ్యాల్టికెళ్లి నేను మందు తాగుడు బంద్జేత్తున్న. ఈడికెళ్లి మందుసీస తీసేసి, గింత సద్దన్నం ఉంటె పెట్టు. తిని బేరానికి పోత' అన్నడు.

తను విన్నది నిజమో.. అబద్ధమో.. అర్థం కాక కోటేశుకెళ్లి రెప్పేయకుండా చూస్తూ నిలబడ్డది శాంత.

కోటేశు మళ్లీ అదే చెప్పిండు. శాంత అక్కడికెళ్లి అవన్నీ తీసేసి, అన్నం పట్టుకొచ్చింది.

అన్నం తిని, చేతులు కడుక్కున్నంక..

'ఇగో.. అరవిందు ఇంటికొచ్చినంక, రేపటికెళ్లి పనికి బోవద్దని చెప్పు. ఆ విషయం వాళ్ల సేటుకు ఫోన్ చేసి శెప్పుమను. బడికి పోయి వాని సదువు సంగతి చూస్కోమని చెప్పు. కరోనా మూలంగ బళ్లు బందున్నయ్. ఆన్‌లైన్ క్లాసులు శెప్తున్నరట. వాళ్ల దోస్తులనడిగి తెల్సుకోమని చెప్పు' అన్నడు.

'మరి.. పిల్ల పెండ్లికి చేసిన అప్పు..?' అనడిగింది శాంత.

'నేనే తీరుస్త!' అని చెప్పి, కోళ్లబుట్ట కట్టిన మోపెడ్ తీసుకొని బేరానికెళ్లిపోయిండు కోటేశు. భర్తలో వచ్చిన ఈ మార్పేందో అర్థం కాక, భర్త పోయిన దిక్కే సూస్తూ మొత్తకానుకొని నిలబడింది శాంత.

కోటేశు మందు మానేసి రెండు వారాలయ్యింది. ఆ సంగతి ఊరంతా ఎర్కయ్యింది.

'గవర్నమెంటు ఆదాయానికి గండికొట్టి, రాజద్రోహ నేరం జేసిండు కోటేశు' అంటూ జోకులేస్కొని నవ్వుకున్నరు కొంతమంది.

ఎవరేమనుకున్నా పట్టించుకోకుండా, తిరిగి మందు జోలికి పోకుండా తన బేరమేదో తను చేసుకుంటున్నడు. కానీ, ఆ రాత్రి 'తనకు దర్శనమిచ్చిన ఆంజనేయస్వామి ఎవరు?' అనే ప్రశ్న కోటేశు బుర్రలో తిరుగుతనే ఉన్నది.

***

ఒకరోజు కోళ్ల బేరానికి మిర్యాలగూడకు బోయి, తిరిగి తమ ఊరికొస్తూ మధ్యలో చాయ్ తాగుదమని దామరచర్లలో ఆగిండు. హోటళ్లకు బోయి, చాయ్ ఆర్డరిచ్చిండు. అదే బెంచిమీద కూకున్న ఓ ఫొటోగ్రాఫర్ బ్యాగులకెళ్లి ఫొటోల కట్ట తీసి, లెక్కబెట్టుకుంటుండు. అండ్లకెళ్లి ఒక ఫొటో జారి కోటేశు కాళ్లకాడ వడ్డది.

'అన్నా.. జర గా ఫోట్వ తీసియ్యవా..?' అని అడిగిండు అతను.

వంగి ఫొటో తీసిన కోటేశు, దాన్ని అతనికిస్తూ ఫొటోవంక చూసిండు. ఒక్క క్షణం ఆశ్చర్యంతో కండ్లెళ్లబెట్టిండు. ఆ ఫొటో.. ఆ రాత్రి తనకు దర్శనమిచ్చిన ఆంజనేయస్వామిది.

'ఆ ఫొటో ఎవరిదో' అడిగి తెల్సుకున్నడు. అతని అసలు పేరు తెల్వదనీ, అందరూ 'టిల్లు' అని పిలుస్తరని చెప్పి, అడ్రస్ కూడా ఇచ్చిండు ఆ ఫొటోగ్రాఫర్.

ఇంతలో చాయ్ తాగి, బయటకచ్చిండు కోటేశు. బండి స్టార్ట్ చేసి, ఐదు నిమిషాలల్ల అతను చెప్పిన అడ్రస్ కాడికొచ్చిండు. అక్కడ ఒక లేడీస్ టైలర్ షాప్ కన్పిస్తే.. టిల్లు గురించి అడుగుదామని షాప్‌కాడికి వచ్చిండు. అప్పుడే లోపటంగ ఒకామె వచ్చి, మిషన్ కుట్టే స్టూలుమీద కూకుంటూ కోటేశు వంక చూసింది. ఆమెను సూడంగనే కోటేశుకు భయమైంది. 'ఇక్కడికి ఎందుకచ్చిన్నా..?' అని అనుకున్నడు. అంతల్నే ఆమె గుర్తువట్టి..

'కోటేశు కదా..? నువ్వు' అని అడిగింది.

'సలాం అక్కా.. కోటేశునే!' అన్నడు.

ఆమె టైలర్ దస్తగిరి భార్య ఆయేషా.

'రా తమ్మీ రా.. కూకో! బాగ ఎండల పడి వచ్చినవ్! ఎన్నాళ్లకు కనవడ్డవ్ తమ్మీ! కూకో మంచినీళ్లు దెస్త' అంటూ లోపలికి పోయింది.

కోటేశు షాప్‌లకచ్చి.. 'మంచి నీళ్లిచ్చినంక, గతంలో తను అవమానపర్చిన సంఘటన గుర్తుచేసి, తిట్టి, నానా శాపనార్థాలు పెడ్తదేమో?' అనుకుంటూ భయపడుకుంటనే కూకున్నడు.

ఇంతల్నే ఆయేషా నీళ్లు తెచ్చిచ్చింది. నీళ్లు తాగి, చెంబు కిందబెట్టిండు. గుండెగట్టి చేసుకున్నడు.

'తిడ్తె తిట్టనీ. నేను నిజంగనే తప్పు చేసిన. ఏదంటే అది అననీ' అనుకున్నడు.

'మా మర్దలు శాంత మంచిగున్నదా.. తమ్మీ! బిడ్డ పెండ్లి చేసినవంట కదా.. బిడ్డ, అల్లుడు మంచిగుంటుంగ్రా..?' అనడిగింది. గతంలో ఏమీ జరుగనట్టు.

ఎంతో ఆత్మీయంగా ఆమె తన కుటుంబం గురించి అడుగుతుంటే.. వాళ్లకు తనవల్ల జరిగిన అపకారం యాదికొచ్చి సిగ్గుపడ్డడు కోటేశు.

'మేమందరం బాగున్నమక్కా!' అని క్షణకాలం ఆగిండు. మళ్లీ తనే..

'దస్తగిరి బావ కాలం చేసిన చాలా రోజుల తర్వాత తెల్సింది నాకు. బావ మంచి ఆరోగ్యంగనే ఉండేటోడు కదా.. ఇట్లెట్లా జరిగిందక్కా..?' అని అడిగిండు.

'అవును.. మంచిగనే ఉండె తమ్మీ! అయ్యాల శుక్రవారం. నమాజుకు పోయి వచ్చిండు. అన్నం తిన్నడు. ఒక జత బట్టలు జర అర్జెంటుంటే మిషిన్‌మీద కూకొని కుట్టుకుంటనే.. మిషన్‌మీద పడిపోయిండు. ఆర్‌ఎంపీ డాక్టర్‌ను పిలిపించే లోపటే..' భర్త జ్ఞాపకాలు యాదికొచ్చి కన్నీళ్లు పెట్టుకుంట.. 'చనిపోయిండు' అన్నది కొంగుతో కన్నీళ్లు తుడుచుకుంటూ..

ఇద్దరూ కొద్దిసేపు మాట్లాడుకోకుండ కూకున్నరు.

కొటేశుకు లోపట బాధేసింది. లేచి నిలబడి రెండు చేతులు జోడించి.. 'అక్కా! నన్ను క్షమించాలె' అన్నడు.

ఆమె ఆశ్చర్యంగా.. 'ఎందుకు తమ్మీ! నువ్వేం జేసినవ్?' అని అడిగింది.

'నావల్లనే కదక్కా.. మీరు మనూరిడ్సిపెట్టి, ఈ ఊరికి రావాల్సి వచ్చింది. అయ్యాల శివరాత్రి జాతర నాడు.. దస్తగిరి బావను నాటకం దగ్గర అవమానించకపోతే..!' కోటేశు గొంతు పశ్చాతాపంతో జీరబోయింది.

ఆమె ఓదార్పుగా.. 'అలా అనుకొని నువ్వేం బాధ పడకు తమ్మీ! మేమేరోజు గూడ

నీ మూలంగనే ఊరిడ్సి పెట్టాల్సి వచ్చిందనుకోలేదు. మీ బావ బతికున్నప్పుడు 'కోటేశు చెడు ఆలోచన గల్లోడు కాదు.. వానికెవరో మందు తాపించి రెచ్చగొట్టిం(రు.. కోటేశు మంచోడే' అనేటోడు' అని అన్నది.

'అవును.. బావ చెప్పింది నిజమే అక్కా! కానీ, తాగి చెప్పుడు మాటలినడం నా తప్పే కదక్కా!' అన్నడు కోటేశు.

'నువ్వట్టా అనుకుంటున్నవేమో గనీ.. మేమెవరి మీదా నిందలేయలేదు తమ్మీ! ఇక్కడ బతుకాలనీ.. ఆఖరికి మీ బావను ఇక్కడి మట్టిల్నే కలుపాలని మా తలరాతల్ల రాసిపెట్టి ఉంది. అందుకనే ఊరిడ్సి పెట్టినం. నీ వల్లనో.. ఇంకెవరి వల్లనో ఇలా జరిగిందనుకోవట్లేదు' అన్నది. పొంగుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ..

'నువ్వు ఎన్నైనా చెప్పక్కా.. అది మీ మంచితనం. కానీ, నేను చేసింది తప్పని నాకు తెలుసక్కా! అందుకే క్షమించమని అడుగుతున్న' అన్నడు కోటేశు.

'చూడు తమ్మీ! నువ్వు చేసిన తప్పు తెల్సుకొని బాధ పడినవంటెనే.. నువ్వు శిక్ష అనుభవించినవ్వన్నట్లే! భగవంతుడు నిన్ను మాఫ్ జేసినట్లే తమ్మీ'

ఆమె మాటల్లోని మంచితనం, సహృదయత, క్షమాగుణం అర్థం చేసుకున్న కోటేశు, ఇంకేం మాట్లాడాలో తెల్వక మూగబోయిండు.

ఇంతల్నే ఇంటి లోపట్నుంచీ.. 'అమ్మీ! కర్రీ' అని పిలుపు. 'అమ్మీ! మజ్జిగ' అని మరొక పిలుపు. 'అమ్మీ! పాపడి' అని మూడో పిలుపు.

'ఆ! వస్తున్నా బేటా!' అంటూ లేసింది ఆయేషా.

'అక్కా! ఎవరీ పిల్లలు?' అడిగిండు కోటేశు.

'మనూర్లె ఉన్నప్పుడు ఇద్దరు ఆడపిల్లలు.. తెల్సుకదా? ఇక్కడికి అచ్చినంక బాబు పుట్టిండు. ఆడ పిల్లల పెండ్లిళ్లు చేసినం. కాపురాలకెల్లిపోయిం(రు. బాబు, వాడి దోస్తులు అన్నం తింటున్నరు. ఇగో.. ఈ కిటికీలోంచి సూడు!' అని చెప్పి లోపలికి పోయిందామె.

లేసి కిటికీలోంచి లోపలికి సూసిండు కోటేశు. ముగ్గురు పిల్లలు అన్నం తింటున్నరు. వాళ్లలో ఒక పిలగాడు లావుగ, అజంగ ఉన్నడు. గా పిలగాడే దస్తగిరి కొడుకు కావచ్చు, ఇంకో పిలగాడెవరో తెలుస్త లేదు. వాడి పక్కన కూకున్నోన్ని సూసి ఆశ్చర్యపోయిండు కోటేశు. తన కండ్లను తానే నమ్మలేకపోయిండు. వాడు తన కొడుకు అరవిందు. వాళ్లనట్టా సూసొచ్చి మళ్లీ కూకున్నడు.

ఆయేషా పిల్లలకు ఏం కావాలో వడ్డించి, తిరిగి షాపులోకి వచ్చింది.

'అక్కా! అరవిందు ఎవరో తెలుసా?' అడిగిండు కోటేశు.

ఆమె చిన్నగ నవ్వి.. 'నీ కొడుకే కదా!' అంది. ఆ ఇంకో పిలగాడి గురించి చెప్తూ.. 'వాడు పక్కనున్న లంబాడి తండా పిలగాడు. పేరు బాలు. వీళ్లు ముగ్గురూ మంచి దోస్తులు.

క్లాసులో వీళ్లే మంచిగ సదువుతరంట. మీ అరవిందు బడి మానేసిండని తెలిసి, గుబులు పెట్టుకొని వీళ్లిద్దరూ బడికి సక్కంగ పోలే. తిరిగి మీ అరవిందు సదూకోనీకి వచ్చినంక హుషారొచ్చి బడికి పోతుంగ్రు' అంది నవ్వుతూ.

అబ్బురమనిపించింది కోటేశుకు. ఈ సమాజంల ఇంకా ఇంత మంచితనం మిగిలి ఉందా? కుల మతాల, తరతమ భేదాల్లేకుండా.. అంతేకాకుండా తమ కుటుంబానికి చెడు చేసినోల్ల పిలగాడిని కూడా తన పేగు బంధంలాగే అక్కున చేర్చుకోవడం తొలిసారి చూసిన కోటేశుకు, ఒక నమ్మలేని అద్భుతాన్ని సూసినట్టు అనిపించింది.

ఇంతల్నే ముగ్గురు పిల్లలు తినడం ముగించుకొని, ఒకరి వెనకాలొకరు షాప్‌లోకి వచ్చింగ్రు.

ఆయేషా.. తన కొడుకు జహంగీర్‌కు, కోటేశును అరవిందు తండ్రిగా పరిచయం చేసింది. వాడు కోటేశును 'నమస్తే అంకుల్' అన్నడు.

'నమస్తే నాయనా!' అని జవాబు ఇచ్చి, వాడి పాదాలకెల్లి సూసిండు. అవే.. ఆ రాత్రి దర్శనమిచ్చిన స్వామి పాదాలకున్న 'ఎర్ర హవాయి చెప్పులు'. కోటేశుకు చాలా విషయాలు అర్థమయినయ్.

'నువ్వెప్పుడొచ్చినవ్ నాన్న?' అడిగిండు అరవిందు. వాడి వెనక వచ్చిన బాలుకూడా 'నమస్తే అంకుల్' అన్నడు. ఇద్దరికీ జవాబిచ్చిండు కోటేశు.

'టిల్లు బేటా! అంకుల్ కాళ్లు కడుక్కోవడానికి జగ్గుల నీళ్లియ్యి' అంది ఆయేషా.

'ఇప్పుడెందుకక్కా..' మొహమాట పడుతూ అన్నడు కోటేశు.

'ఎండల పడి అచ్చినవ్ అన్నం యాళ్లకు. రెండు ముద్దలన్నం తింటే పాణం నెమ్మదైద్ది. ఊర్లె ఉన్నప్పుడు బావతోపాటు టిఫిన్లు చేసింది. చాయ్‌లు తాగింది మర్శినవా ఏంది? లే! కాళ్లు కడుక్కోపో.. అన్నం తిందువు!' అంది ఆయేషా.

టిల్లు జగ్గుల నీళ్లిచ్చిండు. అరవిందు సొంతింట్లకు పోయినట్టే ఇంట్లెకు పోయి, టవల్ తెచ్చిచ్చిండు. కాళ్లు కడుక్కున్నడు కోటేశు.

'తొమ్మిదో క్లాస్ వాళ్లకి రోజూ ఆన్‌లైన్ క్లాసులున్నయ్. మా ఫ్రెండ్ ఇంట్లో ల్యాప్‌టాప్ ఉంది. మేం ఆడికెళ్తున్నం అమ్మీ!' అని చెప్పి, పిల్లలు ఎల్లిపోబోతుంటే..

టిల్లును పక్కకు పిల్సి.. 'అల్లుడూ! అంతా అర్థమైంది. కానీ, ఆ రాత్రి నన్ను నిద్ర బుచ్చడానికి ఏ మంత్రం ఏసినవ్' అనడిగిండు కోటేశు.

టిల్లు నవ్వి.. 'మా స్కూల్ సైన్స్ ల్యాబ్‌లో 'క్లోరోఫామ్' ఉంటది. అది జరంత దస్తిల సల్లుకొని అచ్చిన. అదే వాసన మీకు చూపించిన. అంతే.. మీకు మత్తు కమ్మింది. మిమ్మల్ని మంచమ్మీద పడుకోబెట్టి వచ్చేసిన' అన్నడు వాడు.

అనుమానం తీరింది కోటేశుకు. 'ఇంకెల్లండి నాయనా.. మంచిగ సదువుకోండి' అన్నడు.

పిల్లలు ఎల్లిపోయింర్రు. ఆయేషా అన్నం వడ్డిస్తే తిని, షాప్‌లోకొచ్చి కూకుండు కోటేశు. గిన్నెలు సర్ది వచ్చింది ఆయేషా.

'అక్కా.. నా బిడ్డ పెండ్లయినంక ఈ వచ్చే దీపావళి తొలి పండుగ. బిడ్డ, అల్లుడు వస్తరు. నువ్వేం అనుకోను అంటే.. పండక్కి ముందురోజు వచ్చి నిన్ను, టిల్లు అల్లున్ని మా ఇంటికి పిల్సుకపోత. మీరు రావాలక్కా.. నా ఇంటికి..' అన్నడు.

'నేను ఎవరిండ్లకూ రాకూడదు తమ్మీ!'

'ఎందుకక్కా?'

'మీ బావ చనిపోయిన తర్వాత, నన్ను మా పుట్టింటోళ్లు పిల్సుకపోయి నిద్ర చేయించాలె. కానీ, మా ఇద్దరన్నలు, ఎవరూ కూడా నన్ను నిద్ర జేయించడానికి పిల్సుక పోలేదు. అట్లా నిద్రచేసి రాకుండా, ఎవరింటికీ రాకూడదు తమ్మీ. మల్ల ఒక యేడాది గడిచిపోతే ఎవరింటికైనా రావచ్చు. మన పల్లెల్ల ఎవరి ఆచారమైనా ఇట్లనే ఉంటది తమ్మీ!' అన్నది.

'మరి అన్నలు ఎందుకు పిల్సుక పోలేదక్కా..?' అడిగిండు కోటేశు.

'ఇద్దరన్నలకు ఇద్దరు కొడుకులున్నరు. ఇద్దరికీ సదువబ్బలే. ఆటోలు నడుపుతరు. అన్ని చెడలవాట్లూ ఉన్నయ్. అసొంటోళ్లకు నా సదువుకున్న పిల్లల్ని ఇచ్చి పెండ్లి చేయలేదని కోపం. ఆ కోపంతోనే బావతోపాటు చెల్లెకూడా చచ్చిపోయిందనుకున్నరు' అని చెప్పి కన్నీళ్లు పెట్టుకుంది.

'ఊకో అక్కా! ఏడ్వమాకు. ఏదో ఒకరోజు కోపం తగ్గినంక వస్తర్లే. నాకు తోడబుట్టిన చెల్లెళ్లు గానీ, అక్కలుగానీ లేరక్కా! నన్ను నీ సొంత చిన్న తమ్ముడనుకో. నాకీ పట్టింపులు లేవు. నా ఇంట్లో నాలుగు రోజులుండి వద్దువు. కాదనమాకక్కా..' అన్నడు కోటేశు బతిమాల్తూ.

'నోరారా అక్కా.. అని ఇంత అభిమానంగ పిలుస్తున్నవ్. వస్తంలే తమ్మీ!'

'చాలక్కా! పండక్కి నువ్వు మా ఇంటికొస్తే.. అంతే చాలక్కా. ఇంక నేను ఇంటికి బయలుదేరుతా' అంటూ లేశిండు కోటేశు.

'సరే తమ్మీ! మా మర్దలు శాంతను అడిగినట్లు చెప్పు' అందామె.

'సరే.. చెప్తక్కా' అని చెప్పి, బండి కాడికొచ్చిండు.

కొన్నేండ్లుగా మోస్తున్న బరువేదో దిగిపోయినట్లయింది కోటేశుకు. బండి స్టార్ట్ చేసి, అరగంటలో ఊరికి చేరుకున్నడు.

ఊరి చివరనే ఉన్న లిక్కర్ షాప్‌లో మందుతాగి బయటికొచ్చిన పూలకొట్టు శ్రీను, చాపలకొట్టు కనకయ్యల కంట్లె వడ్డడు. వాళ్లిద్దరూ కోటేశు దోస్తులే.

కోటేశు బండికి అడ్డంబోయి ఆపింర్రు. 'ఒరే కోటేశు. మందు బంజేసి..

పోయేటప్పుడు ఏం కట్క పోదమన్కుంటున్నవ్? నువ్వు ఇయ్యాల మందు తాగాల్సిందే. నిన్నిడ్సి పెట్టేడ్డి లేదియ్యాల! చల్ నడువ్!' అన్నడు కనకయ్య.

'అవునొరే కోటేశు! మాతోని మందు బంజేసినని చెప్పినవ్ గనీ, మాకెర్కలేకుండా ఏదో కొత్తమందు తాగుతున్నట్లున్నవ్‌రా! గా కొత్త మందేదో మాక్కూడా జర శెప్పరాదుర' అడిగిండు శ్రీను.

కోటేశు నవ్వి.. 'అవ్.. కొత్తమందే తాగుతున్నరా! కానీ, మీరనుకుంటున్న మందుకాదు. ఇంట్లే.. భార్యాపిల్లల ప్రేమమందు తాగుతున్న. ఇంకో సంగతెర్కనా మీకు? అపకారం చేసినోళ్లకు ఉపకారం చేసేటోల్లని సూసింద్రా?' అని అడిగిండు.

'సాయం జేసినోన్ని, సందుజూసి సంకల పొడిసేటోల్లు గల్లీకి నలుగురుంటర్రా.. ఇంక నువ్వన్నట్టూ.. చెడు చేసినోనికి మంచి చేసేటోళ్లు కూడా ఉంటరా.. ఈ కాలంల?' అన్నడు శ్రీను.

'ఉంటరు.. ఉన్నరు.. నేనిప్పుడే సూసి వస్తున్నా. నష్టపర్చి, కష్టపెట్టినోల్లని కూడా, ఇష్టంగా దగ్గరకు తీసుకునేటోల్లని చూసి వస్తున్నా. కులమతాలకతీతంగా, కోపతాపాలకతీతంగా మనుషుల్ని ప్రేమించేటోల్లని చూసి, వాళ్ల సొచ్చమైన ప్రేమ, ఆత్మీయతల్నీ, మనిషితనాలనీ, మంచితనాలనీ కుతి తీరా తాగి వస్తున్నా. ఆ ప్రేమాభిమానాలిచ్చే 'నషా' ముందు.. తాగిన రెండుమూడు గంటల్లో దిగిపోయే ఈ లిక్కర్ కిక్కు లెక్కలోకే రాదు' అన్నడు.

***

## సయ్యద్ గఫార్

30 ఏండ్లుగా రచనా వ్యాసంగంలో ఉన్న సయ్యద్ గఫార్, నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి వాస్తవ్యులు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని హఫీజ్‌పేట్‌లో నివాసముంటున్నారు. నాగార్జున డిగ్రీ కళాశాలలో డిగ్రీ చేశారు. నాటకరంగంలో నటనతోపాటు దర్శకత్వంలోనూ అనుభవజ్ఞులు. 'పంచాయతీ రాజ్ లీడర్' పేరుతో స్థానిక సంస్థల విశ్లేషణ మాసపత్రికను ఎనిమిదేండ్లపాటు నడిపారు. నవతెలంగాణ దిన పత్రిక నిర్వహించిన 'బండారు అచ్చమాంబ స్మారక కథలపోటీ'లో వీరు రచించిన 'హంస' కథ మొదటి బహుమతికి ఎంపికైంది. గతేడాది 'నమస్తే తెలంగాణ ముల్కనూరు ప్రజా గ్రంథాలయం' నిర్వహించిన కథల పోటీలో 'ఖుర్బానీ' కథకు ప్రత్యేక బహుమతి లభించింది.

# ఉత్తమ నటుడు

యన్నంరెడ్డి వెంకటరెడ్డి,

98494 18365

**భూమిని** కబ్జా చేయడానికి సముద్రం సునామీని వెంటేసుకొచ్చినట్టుంది.

ఆకాశాన్ని బద్ధలుకొట్టి భూమిని నీటితో నింపేయాలని వర్షం ప్రయత్నిస్తున్నట్లుంది.

అక్కడ రైల్వే స్టేషన్ ఒంటరిగా ఉంది. దీన వదనంతో ఉంది. చెప్పలేని.. చెప్పుకోలేని దిగులు గుబులు గుండెల్లో దాచుకున్నట్టుంది.

చీకటి ఆకాశం.. రైలు పట్టాలు స్టేషన్ పెట్టుకున్న రెండు కన్నీటి చారికల్లా మెరుపు వెలుగులో మెరుస్తున్నాయ్.

బిక్కుబిక్కుమంటున్న ఆ రైల్వేస్టేషన్ బెంచీమీద మరింత బిక్కుబిక్కుమంటూ ఒంటరిగా ఒద్దికగా కూర్చునుంది ఓ అమ్మాయి!

***

**1. అమ్మాయి**

'ప్చ్.. ఇంకా నా రాజు రాడేంటి..?'

..ఈ మాట వర్షంలో తడుస్తూ, చలికి వణుకుతూ ఎన్నిసార్లు అనుకొని ఉంటాను? సెల్ ఆన్ చేయగా 11:59 పన్నెండుగా మారిపోయింది. అంటే.. ఐదు గంటల నిరీక్షణ.. ఐనా, రాలేదు. అబ్బ.. తను వస్తే ఎంత బావుండు. ఈ వర్షం.. ఈ రాత్రి.. ఈ చలి.. ఓ లెక్కా! కాదు. అస్సలు కాదు. ప్చ్.. నా రాజు ఇంకా రాడేమిటి? ఈ రైలూ రాదేమిటి? అమ్మో.. నా రాజు రాకముందే రైలొస్తే ఏం చేయను? ఊహూఁ.. నా రాజు లేని రైలెందుకు? నేనెందుకు? రైలు వస్తే రానీ.. పోతే పోనీ.. తెచ్చిన బ్యాగ్ తడిమాను. నోట్ల కట్టలు వానకు నానక బిరుసుగానే ఉన్నాయి. డబ్బు దర్పం డబ్బుదే కదా! ఆ పక్కనే ఇంకో బ్యాగ్.. ఐదు కేజీల బంగారం.. అనుకుంటుండగా ఓ అమ్మాయి పెద్ద కడుపుతో, వర్షంలో జారి పడతానని కూడా భయం లేకుండా పరుగున వచ్చి నా ముందు నిలబడింది. చెప్పొద్దూ.. అప్పుడు నాకు భయం కలిగింది. డబ్బు, బంగారం గురించి కాదు. నన్నెక్కడ చూసేస్తుందోనన్న భయం.. అందుకే, చున్నీని వర్షానికి కప్పుకున్నట్టు ముఖాన్ని కనబడకుండా కవర్ చేసుకున్నాను.

'అక్కా.. మా ఆయన కనిపించాడా..?' ఆశగా అడిగిందా పిల్ల.

పిచ్చిది. ఆమె అమాయకంగా ఉంది. ఆమే నాకు తెలీదు. వాళ్లాయన నాకెలా తెలుస్తాడు? నేను.. నాక్కాబోయే ఆయనకోసం చూస్తుంటే.. మధ్యలో వాళ్లాయన సంగతి నాకెందుకు?.. అందుకే నేనేం మాట్లాడలేదు.

'అయ్యో.. చూల్లేదా? వీడిబాబు ఎక్కడున్నాడో ఏమో.. ఎతకని సోటు లేదనుకో' అనుకుంటూ ఎత్తుగా ఉన్న పొట్టను నిమురుకుంటూ, గెంతుకుంటూ పోయింది.

పిచ్చిది. మోసపోయి ఉంటుంది. లేదా మోసపోయి పిచ్చిదైనా అయి ఉంటుంది. అసలు ఒకందుకు నన్ను నేను మెచ్చుకోవాలి. నాకు ఎంత రాజు కావాలనుకున్నా.. రాజులేని లోకం వద్దనుకున్నా.. ఇలా పిచ్చిగా మోసపోను. నవ్వొచ్చింది.

'నేను నిజంగా మోసపోవడం లేదుకదా!' ఒక్కక్షణం ఆ ఆలోచన.. ఛ ఛ.. అలాంటి ఆలోచనలే రాకూడదు. ఆ నిజాయితీ.. ఆ మాట తీరు.. అబ్బ.. సూపర్.. నిజాయితీకి బ్రాండ్ అంబాసిడర్ నా రాజు..!

చీకటి ఆకాశంలోంచి.. కుండపోత ముసురులోంచి.. ఆలోచనలు రాజు చుట్టూ ముసురుకుంటున్నాయి. అసలు వర్షంలోనే కదా రాజు పరిచయం.

***

**ఆ రోజు వర్షం..!**

ఆ వర్షంలో ఐస్‌క్రీం తింటూ.. చున్నీ నెత్తిన కప్పుకుంటూ నడుస్తున్న నేను.. పర్స్ తీసి నోట్లు లెక్కపెట్టుకుంటున్న ఒకతన్ని ఢీకొట్టేశా. అతను కింద పడిపోయాడు. చేతిలోని పర్సు.. లెక్కపెడుతున్న నోట్లు.. వర్షపు నీటిలో పడి పడవల్లా పరుగులు తీస్తుంటే.. చెప్పొద్దూ.. అతను ఎంత ఆత్రంగా ఆ నోట్లని అందుకున్నాడు. అంతే ఆత్రంగా బట్టలకు నోట్లని తుడుచుకొని.. ఊదుకొని.. అబ్బ.. ఆ ముఖంలో ఎంత కంగారు.. ఆ కంగారులో ఎంత భయం.. ఆ భయంలో ఎంత అమాయకత్వం.. ఎంత.. అబ్బ..! ఇంక నేను ఇంతకన్నా చెప్పలేను. చెప్పాలంటే.. అతనిమీద చెప్పలేనంత జాలేసింది. అతను నావైపు నిస్సహాయంగా చూస్తుండిపోయాడు.

..పాపం. నాకూ పాపం అనిపించింది. అంతే! అప్రయత్నంగా నా చేతిని అతనికి అందించాను. కొండంత పెన్నిధి దొరికినంత సంబురపడి పోయాడతను. అతను నన్ను చూశాడు. నేను అతన్ని చూశాను. ఆ చూపులో ఏదో అయస్కాంత శక్తి ఉంది. అది నన్ను తనవైపు లాక్కుంటున్నది.

'థాంక్స్' అన్నాడతను.

'సారీ' అన్నాన్నేను.

మళ్లీ ఒకరిని ఒకరం చూసుకున్నాం.

'థాంక్సెందుకు చెబుతున్నారు?' అన్నాన్నేను.

'మీరు సారీ ఎందుకు చెబుతున్నారు?' అన్నాడతను.

మళ్లీ ఒకరినొకరం అలాగే చూస్తుండిపోయాం. అదో అయస్కాంతం.

'మనకీ మనకీ మధ్య సారీలేంటి?' అన్నాడతను.

'అదే నేనూ అంటున్నాను. మనకీ మనకీ థ్యాంక్సులేంటి?' అని.. అలా అంటుంటేనే ఎందుకో నాకు సిగ్గనిపించింది.

మళ్లీ ఇద్దరం ఒకరినొకరం చూసుకున్నాం. అయస్కాంతం!

నన్ను చూసి నవ్వాడు. మెరుపు వెలుగులో అది గమనించాను.

ఉరుముకి.. అతని దగ్గరకు జరిగి అతన్నే చూస్తూ నేనూ నవ్వాను. అప్రయత్నంగా అతనికి దగ్గరైన నన్ను నేను చూసుకొని సిగ్గుతో మళ్లీ నవ్వొచ్చింది.

ఆపైన.. ఇద్దరం నవ్వుకున్నాం.

విడిపోతూనే.. 'మళ్లీ ఎప్పుడు కలుద్దాం..' అన్నట్టున్నాయతని చూపులు.

అన్నట్టు.. నా చూపులూ అలాగే ఉన్నయేమో ఆ క్షణాన.. నాకైతే తెలీదు. కానీ, ఇంకొంచెంసేపు అతనలాగే ఉంటే బావుండేదని మాత్రం అనిపించింది.

ఎందుకో ఆ రాత్రి.. నిద్రకు దూరం అయ్యాను.

**నేను నవ్వాననో ఏమో.. 'నువ్వింకేం మాట్లాడకు. ఎదురు చెప్పకుండా నాన్న చెప్పింది చెయ్. ఆశలన్నీ నీ మీదే పెట్టుకున్నారు. ఐదు కోట్లకే వాళ్లు ఒప్పేసుకున్నారట. బంగారం లాంటి సంబంధం. వదులుకోకూడదని మీ నాన్న పట్టుదల. ఈ సంబంధం ఖాయం చేసిందగ్గర్నుంచీ మీ నాన్నగారు గాల్లో తేలిపోతున్నాడంటే నమ్ము..' ఇలా అమ్మ నన్ను ఊదరగొట్టేసింది.**

అతన్నుంచి దూరం జరగాలంటే.. ఆలోచనలు సైతం వీలు కావడం లేదు.

అతన్ని మొదటిసారి చూశాక ఇన్ని ఆలోచనలు కలిగాయి.

అతన్ని చూడాలని.. మళ్లీ అక్కడికి వస్తాడేమోనని మరుసటి రోజు వెళ్లాను.

అరె.. ఆశ్చర్యం.. అతనూ వచ్చాడు. ఈసారతను పలకరింపుగా నవ్వాడు. నేనూ నవ్వాను. అంతలో.. తుమ్మాడు.

'అయ్యయ్యో.. వర్షంలో నిన్న తడవడం వల్ల జలుబు చేసింది పాపం' అనుకున్నాను.

అతను 'కాఫీ..' అన్నాడు తుమ్ముతూనే.

ఏం అయస్కాంతమో ఏమో.. అతని వెనకాలే వెళ్లి, అతను కూర్చుకున్న టేబుల్

ముందు కూర్చున్నాను.

కాఫీ వచ్చింది. అబ్బ.. ఎంత బావుంది. నా జీవితంలో ఎప్పుడూ ఇంత మంచి కాఫీ తాగలేదు. అమృతంలా ఉంది.

అలా.. ఇద్దరం నడుస్తున్నాం. అతను ఏదో మాట్లాడుతున్నాడు. అతని మాటల్లో అయస్కాంతం ఉంది. నేను దానికి గంగిరెద్దులా తలూపుతున్నాను. నన్ను మంత్రముగ్ధని చేశాడు. అతను ఏం చేసినా.. ఏం చెప్పినా వినాలనిపిస్తున్నది. అతను అవునన్నది నేను కాదనలేని స్థితికొచ్చాను. అవును. అతను ఏది చెబితే అది చేయడానికి సిద్ధంగా ఉన్నాను. అవును అతనే నాకు సర్వస్వం. నిప్పుల్లో దూకమన్నా దూకుతాను. విషమిచ్చి..

'ఇద్దరం కలిసి చద్దాం..' అన్నా నేను రెడీ..!

ఐనా, నా రాజు అలా ఎందుకంటాడు? అనడు. అతనికీ నేనే సర్వస్వం. నేను లేకపోతే అతను బ్రతుకలేడు. కాదుకాదు. అతనికి బ్రతుకే లేదు. అతను నన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటానన్నాడు. అతని రాజ్యానికి నన్ను సామ్రాజ్ఞిని చేస్తానన్నాడు. చేస్తాడు కూడా..! డబ్బులేంది ఈ రోజుల్లో ఏదీ జరగదు కదా. ఏదో బిజినెస్‌కి సంబంధించి ఓ ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారు చేసుకున్నాడు. నన్ను 'ఎండీ'ని చేస్తానన్నాడు.

అన్నీ సిద్ధం చేసుకున్నాడు. ఒక్క డబ్బు తప్ప! పిచ్చి నా రాజు. ఆ రోజు నేనే ఢీకొట్టి ఉండకపోతే.. ఏమై పోయేవాడో.. నాకు నవ్వొచ్చింది. ఈ వరస సంఘటనల తర్వాత.. నేను గట్టిగా ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాత.. మా ఊరెళ్లాను. అమ్మ ఎందుకో టెన్షన్ పడుతున్నది. నాన్న ఊళ్లోలేరు. మెల్లగా అమ్మ దగ్గరకు చేరాను.

'ఈ సంవత్సరం చదువు పూర్తి చేసెయ్.. నాన్నగారు నీకు ఓ సంబంధం ఖాయం చేశారు. అబ్బాయి బుద్ధిమంతుడు. అమెరికాలో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఓనర్. కోట్ల డాలర్ల టర్నోవరట!' అన్నది.

నాకు నవ్వొచ్చింది. 'డాలర్లను కోట్లల్లో చెప్పరే.. పిచ్చి అమ్మ'

నేను నవ్వాననో ఏమో.. 'నువ్వింకేం మాట్లాడకు. ఎదురు చెప్పకుండా నాన్న చెప్పింది చెయ్. ఆశలన్నీ నీ మీదే పెట్టుకున్నారు. ఐదు కోట్లకే వాళ్లు ఒప్పేసుకున్నారట. బంగారం లాంటి సంబంధం. వదులుకోకూడదని మీ నాన్న పట్టుదల. ఈ సంబంధం ఖాయం చేసిందగ్గర్నుంచీ మీ నాన్నగారు గాల్లో తేలిపోతున్నాడంటే నమ్ము..' ఇలా అమ్మ నన్ను ఊదరగొట్టేసింది.

రేపు ఆదివారం అని బ్యాంక్‌నుండి ఈ రోజే రెండు కోట్ల రూపాయలు డ్రా చేసి, ఏదో అర్జంటు పని మీద ఊరెళ్లారట.

అమ్మ అన్నీ చెప్పేస్తున్నది. చెప్పేసుకొని తేలికపడి నిద్రపోతున్నది. నాకేమో నిద్ర రావడం లేదు. నా రాజు ప్రాజెక్ట్ రిపోర్ట్‌కి సరిపడా డబ్బు.. రెండు కోట్ల రూపాయలు

బీరువాలో ఉన్నాయి. బీరువా తాళాలు నా తలదిండు కింద ఉన్నాయి. దిండుకింద తాళాలు నా తలకి గుచ్చుకుంటున్నాయి. ఠక్కున ఓ ఆలోచన.. నాన్నగారికి మూడు కోట్ల రూపాయలు ఆదా చేస్తే.. ఇండియాలోనే ఇండస్ట్రీ పెట్టి గెస్ట్‌గా నాన్నని పిలిస్తే.. సర్‌ప్రయిజ్.. తల్చుకుంటేనే యమా థ్రిల్‌గా ఉంది. ఆ రాత్రి నాన్న రాలేదు. అమ్మ నిద్ర పోతున్నది. ఏదో ఒకటి చేయాలి.

అమ్మంటే నాకు ప్రాణం. నేనంటే నాన్నకు ప్రాణం. నాన్నంటే నాకు భయం.

ఆలోచనలు నా బుర్రని వేడెక్కించేస్తున్నాయి. ఇంకా ఆలోచించి అవకాశాన్ని చేజార్చుకోకూడదు. 'ఆలస్యం.. అమృతం.. విషం..'. అవును. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవడం తెలివిగల వాళ్ల లక్షణం. గాఢంగా నిట్టూర్చి దృఢంగా నిర్ణయించుకున్నాను.

***

చారెడు నీళ్లు మొహాన కొట్టినట్టు వర్షపు తెర.

ఎవరో వస్తున్నారు. అమ్మో.. చున్నీతో ముఖం కనిపించకుండా కప్పుకున్నాను. అతను గమనించి, లైటు వెలుగులో.. వర్షపు ధారలో చూశాడు.

నేను ముఖం తిప్పుకున్నాను.

ఎందుకలా చూస్తూ వెళ్లాడో ఆ స్టేషన్ మాస్టర్.

రైలు రాలేదు. రాజూ రాలేదు. ఈ వర్షంలో నా రాజు ఎక్కడున్నాడో..

****

**2. అబ్బాయి..**

'అబ్బ.. ఈ వర్షం ఎప్పుడు తగ్గుతుందో.. ఇప్పుడే రావాలా..?' అనుకున్నాను. ఇంత వర్షం ఇంకొకటి వచ్చినా నాకు లెక్కకాదు. కానీ, వర్షంలో తడిచొస్తే.. తనూరుకోదు. కోపం వచ్చేస్తుంది. అరిచేస్తుంది. అస్సలూరుకోదు. ఎలా? టైం ఎంతవుతుందో..

పన్నెండున్నరయినా అయి ఉంటుంది.

'ఛ.. వెదవ వర్షం..' అనుకొని వెంటనే నాలుక్కరుచుకొని..

'అమ్మో.. ఈ వర్షం వల్లే కదా.. ఇప్పుడు డబ్బుల వర్షం కురవబోతున్నది'

***

అప్పుడూ ఇలాగే వర్షం..

ఓ చోట.. ఒకతను తడిసి ముద్దయి ఉన్నాడు. అతని ప్యాంట్ బ్యాక్ సీట్ జేబులో 'పర్స్' నేనున్నానంటూ ఎత్తుగా కవ్విస్తూ కనిపిస్తున్నది. అంతే.. ఇక ఆలస్యం లేకుండా అద్భుతమైన నా చేతివాటాన్ని ప్రదర్శించా. అతని జేబులోని పర్స్ నా చేతిలో ఉంది. పర్స్‌తో పారిపోవాల్సింది నేనైతే.. అతను పరుగున కారెక్కాడు. కారు రివర్స్ చేసుకొని

సర్రున నా మీద వర్షపు నీళ్లు చిమ్ముతూ తుర్రుమన్నాడు. అప్పుడు నాకు కోపం రాలేదు. ఎందుకొస్తుంది? అతను నా మీద చిమ్మింది నీళ్లు కాదు. డబ్బులు కదా.. అనుకుంటూ నడుస్తుంటే.. పర్స్‌లోని నోట్లు లెక్కపెట్టుకుంటుంటే.. సడెన్‌గా నన్నెవరో గుద్దేశారు. కిందపడ్డా. చేతిలోని పర్స్.. లెక్కపెడుతున్న నోట్లు.. వర్షపు నీటిలో పడి చేజారిపోతోంటే.. ఆ నోట్లని ఒడిసి పట్టుకొని, తుడిచి ఉఫ్‌ఉఫ్‌న గాలి ఊదాను. ఈలోగా ఎంత కంగారు.. ఎంత భయం.. అసలెంత టెన్షన్.. అప్పుడుగానీ గుద్దిన వాళ్లని చూడలేదు. అబ్బ.. అమ్మాయి.. అందమైన అమ్మాయి.. మెరుపుతీగలాంటి అమ్మాయి.. నన్నే చూస్తోన్న అమ్మాయి.. పడిపోయి నిస్సహాయంగా ఉన్న నన్ను చూసి జాలిపడిందో ఏమో.. అప్రయత్నంగా చేయి అందించింది. ఆ అందాన్నీ.. ఆ చేతినీ చూశాను. అప్పుడే ఓ నిర్ణయానికి వచ్చేశాను. ఆ అందాల చేతిని వదులుకోకూడదని అనిపించింది. ఇక ఒక్క క్షణం కూడా వృథా చేయకూడదు అని చేయి అందుకున్నాను.

'థ్యాంక్స్' అన్నాను. తను 'సారీ' అంది. ఆకాశం ఉరిమిన ఉరుముకు నాకు మరింత దగ్గరయింది. ఇద్దరం నవ్వుకున్నాం.

మొదటిచూపు అంటారే.. ఆ చూపే ఆమెని కట్టి పడేసినట్టు అర్థమయింది. తను మళ్లీ మరుసటిరోజు అక్కడికి వస్తుందని వెళ్లాను. ఆశ్చర్యం. వచ్చింది. నవ్వింది. నాకు జలుబు చేసి తుమ్ములొచ్చాయి. దానికీ.. 'ఇంకెప్పుడూ వర్షంలో తడవద్దు. తడిస్తే నా మీద ఒట్టు' అంది సీరియస్‌గా. తను అంత 'రియాక్ట్' అవుతుందని ఊహించలేదు.

'ఏంటీ పిల్ల' అనుకున్నాను. ఇంకా అలా మాట్లాడుతూనే మనీ మేటర్సే కాకుండా మెనీ మేటర్సే చెప్పేసింది. ఇక అప్పటినుండి నా డ్రామా మొదలుపెట్టా. ఆమే శరణ్యం అన్నట్టు. ఆమె లేనిది నేను లేనన్నట్టు. మాటలతో కాకుండా నా చర్యలవల్ల చెప్పకుండా చెప్పాను. అప్పటికి వారం క్రితం నా చేతివాటానికి బలైంది ఓ బ్రీఫ్‌కేస్. అందులో డబ్బుతోపాటు ఓ ప్రాజెక్ట్‌కి సంబంధించిన రిపోర్ట్స్ కూడా ఉన్నాయి. దాన్ని తెలివిగా మార్చి, నా ప్రపోజల్‌గా ఏమార్చాను. అనుకున్నవి అనుకున్నట్టు కుదిరితే నా ప్రేమదేవతని 'ఎండీ'ని చేస్తానన్నాను. అందుకు డబ్బు కావాలనీ.. అదే లేదనీ.. దాన్నే ఇన్‌డైరెక్ట్‌గా అనుమానం పిసరంతయినా కలగకుండా చెప్పాను. దానికి కళ్లార్పి చిత్రంగా తిప్పింది.

ఆ సైగ భాషకు అర్థం.. 'మై హునా.. ఆ మేటర్ నాకొదిలెయ్' అన్నట్టుంది.

'హమ్మయ్య..' అనుకున్నాను. ఆ తర్వాత మళ్లీ కలిసినప్పుడు తనకు అమెరికా సంబంధాలు చూస్తున్నారనీ, తండ్రిని ఎదిరించే ధైర్యం తనకు లేదని చెప్పుకొని ఏడ్చింది. ఓదార్చాను.

'ఏం చేస్తాం.. నిన్ను 'ఎండీ'ని చేసి సర్‌ప్రైజ్ ఇచ్చే ఛాన్స్ మిస్సయింది' అన్నాను.

ఆ మాట బాగా పని చేసింది అనడానికి ఆమె కళ్ల మెరుపే సాక్ష్యం. లోపల్లోపల రక్తం

ఎగిరెగిరి పడుతున్నది. దాన్ని బలవంతంగా అణచుకొని నేచురల్‌గా ఉండటం కోసం చాలా కష్టపడాల్సొచ్చింది. ఐడియా చెప్పింది. నన్ను నమ్మేసింది. హాయిగా ఊపిరి పీల్చుకున్నాను. ఈ రాత్రి డబ్బు.. బంగారంతో వచ్చేస్తున్నట్టు మెసేజ్ పెట్టింది. అసలు నేనెవరు? నా వెనుకా ముందు ఏమిటి? నా మంచీ చెడ్డా ఏమిటి? నమ్మేసి వచ్చేసి మోసపోతున్నది.

***

..సీసాల చప్పుళ్లకి ఆలోచనల్లోంచి బైటపడ్డాను.

'ఒరేయ్.. నువ్వీ దెబ్బతో కోటీశ్వరుడివై పోతున్నావ్. ఉత్త మందు పార్టీతోనే సరిపెట్టడం అన్యాయం రా.. అమ్మాయి లేకుండా..' అన్నాడొకడు.

'అవున్రా.. అస్సలస్సలు బాలేదు..' రెండోవాడన్నాడు.

'బాలేదంటే బాలేదు..' మూడోవాడు.

'మరి బావుండాలంటే ఏం చేయాలో అది చెయ్.. బావుంటుంది! ఏరా..?' నాలుగోవాడి తాళం.

నలుగురూ నాలుగు మాటలన్నారు. పీకల్దాకా తాగారు. తిన్నారు. త్రేన్చారు.

'సారీరా.. నా టెన్షన్ నాది. మీకెలా చెప్పాలో తెలీడం లేదు' అన్నాన్నేను.

'ఇందులో చెప్పాడానికేముంది.. ఎరేంజ్ చేసెయ్'

'ఎలా రా..? ఈ టైం అప్పుడు?'

'మనసుండాల్రా..'

'ఆపైన డబ్బులుండాలి'

'రెండూ నీ దగ్గరున్నాయ్..'

'అప్పుడింకెందుకాలస్యం..?'

సమాధానం చెప్పలేక పోతున్నాను.

'అక్కడ.. అమ్మాయి రైల్వే స్టేషన్‌కి వచ్చి ఉంటుంది కదా..?'

'రాకుండా ఎలా ఉంటుంది..?'

'మరింకేం రా.. దాన్ని తెచ్చేసుకుందాం..'

'అన్యాయం రా..' అన్నానో లేదు..

'ఆహా.. నువ్వు చేస్తున్నది మహాన్యాయం' అన్నాడు వాడు.

నేను తలదించుకున్నాను.

'తల దించుకోకురా.. తలా పంచుకుందాం..'

'ప్చ్.. వద్దు.. అసలుకే మోసం వస్తుంది' అన్నాన్నేను.

'ఇంకేం చెప్పొద్దు..' నలుగురూ అన్నారు.

'కుదరదు..' గట్టిగా అరిచాను.

ఆ మెరుపు వర్షంలో పిడుగులా ఉరిమానేమో.. కొంచెం తగ్గారు. అంతే.. అక్కడున్న ఓ బాటిల్ ఎత్తి దించకుండా తాగేసి.. అప్పటికే సర్దుకున్న బ్యాగుతో బయలు దేరాను.

ఆ నలుగురూ అలా అచేతనంగా చూస్తుండిపోయారు, నేను వెనక్కి తిరిగి చూసేసరికి!

***

**3. స్టేషన్ మాస్టర్..**

హాఁ.. వర్షం వదిలేలా లేదు. రాత్రి ఒంటి గంటయింది. బండి లేటు. అయినా, ఈ బండికి ఈ స్టేషన్లో పెద్దగా ఎవరూ ఎక్కరు. దిగరు. పైగా.. వర్షం. ఐనా.. స్టేషన్‌లో ఎవరైనా ఉన్నారేమోనని బైటికొచ్చి చూశాను. అంతవర్షంలోనూ ప్లాట్‌ఫాం చివరన ఎవరో ఉన్నారు.

'మా ఆయన కనిపించాడా..? ఆడు రాత్తుర్లప్పుడే తిరుగుతాడయ్యా.. ఆన్నప్పుడే పట్టుకోవాల' బైటికి వెళ్తున్న నాకు ఎదురొస్తూ అంది కడుపుతో ఉన్న యువతి. ముద్దయిన బట్టలు పిండి, దాంతో తల తుడుచుకుంటున్నది.

ఓ నిట్టూర్పు విడిచి, గొడుగు తీసుకొని ప్లాట్‌ఫాం వైపు నడిచాను. నేను ఆమెను సమీపిస్తున్న కొద్దీ తన ముఖం కనపడకుండా చున్నీతో కప్పుకుంటున్నది. 'ఎందుకు?' అనుమానం వచ్చింది. బలపడింది కూడా.

'ప్చ్.. ఏంటో ఈ కాలం పిల్లలు..' అనుకుంటూ స్టేషన్‌వైపు కదిలాను. నా గదికి రాగానే.. ఒకతను లొపలికొచ్చాడు. మందు వాసన గుప్పుమంది. కడుపుతో ఉన్న యువతి అతన్ని చూసి.. సంతోషంతో దగ్గరికెళ్లింది. అతను షాకై కంగారు పడ్డాడు.

'ఒక హ్యాపీ గుడ్‌న్యూస్..' అతనెదురుగా నిలబడి అందామె.

అతను మళ్లీ కంగారు పడ్డాడు.

'మన బిడ్డ..' పొట్ట తడుముకుంటూ అందామె.

అతను గుటకలు మింగడం. టెన్షన్ పడటం గమనించాను. తేరుకొని, గది బైటకు వచ్చి.. ప్లాట్‌ఫాం చివర చూశాడు. అమ్మాయి ఉంది. వెళ్లబోయి ఆగాడు. బ్యాగులోని టవల్ తీసి తల తుడుచుకున్నాడు. షర్ట్ మార్చుకున్నాడు. కడుపుతో ఉన్న యువతి అతన్ని అలాగే చూస్తూ ఉండిపోయింది. అతని షర్ట్‌ని పిండేసింది. అతను ఆమెనే చూస్తున్నాడు. ఇదంతా నేను గమనిస్తూనే ఉన్నాను. అతను ప్లాట్‌ఫాం మీద కూర్చున్న అమ్మాయి కోసం వచ్చాడు. అనుమానం లేదు. ఆలోచనలు పరిపరి విధాల పోతున్నాయి. అతను బైటికి వెళ్లబోయాడు.

'బాబూ.. గొడుగు తెప్పించమంటారా..?' అడిగానతన్ని.

తడిచివస్తే తిడుతుందని ఒక్క క్షణం ఆలోచించి 'అలాగే సార్' అన్నాడు.

'కాస్తాగండి..' పక్కనే ఉన్న గ్యాంగ్‌మెన్‌కి చెవిలో ఏదో చెప్పి పంపాను.

ఇందాక నేను వేసుకొచ్చిన గొడుగు చీకట్లో పెట్టింది ఎవరికీ కనపడదని తెలుసు.

'ఒక్క నిమిషం..' అని ఆ యువకుడ్ని పర్మిషన్ అడిగినట్టుగా అడిగి గొడుగు లేకుండానే బైటికి వెళ్లాను.

స్టేషన్ గదిలో కడుపుతో ఉన్న యువతి.. ఆ యువకుడు ఇద్దరే ఉన్నారు.

నేను బెంచీమీద తడిసి ముద్దయి వణుకుతున్న అమ్మాయిని సమీపించాను. నా రాక ఆమెను కంగారు పెట్టింది.

'ఎక్కడికి వెళ్లాలమ్మా..?' గొంతులో మార్దవాన్ని రంగరించి ఆత్మీయంగా అడిగా.

చెప్పడానికి తడబడింది. తెలిస్తే కదా చెప్పడానికి..

'అర్థమైందమ్మా..' అన్నాను.

'ఆఁ.. అది..' తడబడి బిత్తరపోయి నన్నే చూస్తున్నది.

'నెమ్మది పడు.. నీకు తండ్రిలాంటి వాణ్ణి..'

ఆ అమ్మాయి ఠక్కున తలెత్తింది. అవునన్నట్టు రెండు కళ్లు మూసి తలాడించాను. ఆ అమ్మాయి నన్నే చూస్తున్నది. డౌటే లేదు. నేను చాలా సిన్సియర్‌గా.. స్థిరంగా ఉన్నాను.

'నా కూతురిది సరిగ్గా నీ వయసే..' బాధ దిగమింగుకుంటున్నట్టు అని.. దీర్ఘంగా ఓ పేద్ద నిట్టూర్పు విడిచి, పూడుకుపోయిన గొంతుతో..

'అవునమ్మా.. అల్లారు ముద్దుగా పెంచిన ఇరవయ్యేళ్ల నా పెంపకాన్ని కాదని వారం రోజుల క్రితం పరిచయమైన ఒకడ్ని నమ్మి.. నన్ను కాదని అతన్తో ఇప్పుడు రాబోయే రైల్లోనే వెళ్లిపోయింది. ఆ బండికి నేనే.. ఈ చేత్తోనే పచ్చలైటు చూపిస్తే.. బండిలోంచి చివరిసారి నాకు చేయి ఊపిందమ్మా.. నా కూతురు..' అంటూ దుఃఖాన్ని గొంతులో పలికించి ఏడ్చాను.

'ప్చ్.. ప్చ్.. ప్చ్.. ' జాలిగా అంది.

'ఇప్పుడనుకుంటే పోయింది తిరిగి వస్తుందా అమ్మ..? '

తల అడ్డంగా ఊపి.. 'రాదు..' అంటూ నిట్టూర్చింది.

'హాఁ ఒక్కగానొక్క కూతురు. తల్లిలేని పిల్ల. అల్లారుముద్దుగా పెంచాను. అయినా..' తల అడ్డంగా, భారంగా ఆడించి.. కళ్లొత్తుకున్నాను.

'ఆ తర్వాత ఏమైంది?' అందా అమ్మాయి.

'వెరీగుడ్.. ఆ క్యూరియాసిటీనే నాక్కావాలి' అని మనసులో అనుకొని..

'ఏమవుతుంది.. ఏదో ఒకటి అవుతుంది' అన్నాను నిర్లిప్తంగా.

'అంటే..'

సరిగ్గా సంవత్సరం క్రితం..

తుళ్లుతూ.. గెంతుతూ తూనీగలా తిరిగేది. చక్కగా చదివేది. అలాంటిది.. ఏమయిందో ఏమో.. హఠాత్తుగా తనలో మార్పు గమనించాను. ఎవరి ఆకర్షణకో..

ప్రలోభానికో గురైంది. దానికి అందంగా 'ప్రేమ' అని పేరు పెట్టుకుంది. తల్లిలేని పిల్ల అని అన్నీ నేనై చూసినా తననుకుంటున్న ఆకర్షణ.. అదే.. దాని భాషలో ప్రేమ ముందు నా ప్రేమ వీగిపోయింది. నా ప్రేమ ఓడిపోయింది. వాడి ఆకర్షణే.. అదే.. వాడి ప్రేమే గెలిచింది' నేను చెప్తున్నదంతా అలాగే వింటూ ఉండిపోయిందా అమ్మాయి.

'అవునమ్మా.. సరిగ్గా నెల తిరిగిందో లేదో.. అది తీసుకువెళ్లిన నగలూ.. డబ్బూ అయిపోయాయేమో.. లేక దానిమీద మోజు తీరిపోయిందో ఏమో.. వాడికింకా డబ్బు కావాల్సి వచ్చిందో ఏమో.. నా బంగారు తల్లిని ముంబై రెడ్‌లైట్ ఏరియాలో అమ్మేశాడు' భోరున ఏడ్చేశాను.

ఆ అమ్మాయి షాకై నన్నే చూస్తున్నది. ఇంకా దుఃఖాన్ని పలికిస్తూ..

'అప్పుడగానీ.. నా పిచ్చితల్లి మోసపోయానని తెలుసుకోలేకపోయింది. ఇంకో అమ్మాయి సాయంతో అక్కడి నుండి బైటపడాలనే ప్రయత్నంలో దొరికిపోయి ఇంకా చిత్రహింసలను భరించింది. ఆ నరక కూపంలో మగ్గి చావడం కంటే బైటపడే ప్రయత్నంలో చావడమే మంచిదనుకొని ఇంకో ప్లాన్ వేశారు ఆ ఇద్దరూ. ఈసారి క్షేమంగానే బయట పడ్డారు. కానీ, అక్కడి నుంచి ఇక్కడికి వచ్చే ప్రయత్నంలో మళ్లీ మోసపోయారు..'

'ఎలా..?' అందా అమ్మాయి.

'హుఁ అమాయకులు ఎప్పుడూ మోసపోతూనే ఉంటారమ్మా.. రైల్లో ఎవరో పరిచయమై.. పరిస్థితి తెలుసుకొని, ఉద్యోగం ఇప్పిస్తానంటే వాడి వెంట వెళ్లారు. వీళ్లని ఓ చోట పెట్టి వాడూ.. వాడి ఫ్రెండ్స్ నిర్బంధించి రేప్ చేశారు. ఈ మధ్య టీవీల్లో.. పేపర్లలో సంచలనమయింది. ఈ న్యూసే.. ఈ మ్యాటరే.. అది నేను చూసుంటానని.. చదివి ఉంటానని.. నేను తలెత్తుకొని తిరగలేనని ట్యాంక్‌బండ్‌లో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఇదికూడా నాకు తెలియక పోయేదే.. తనతోపాటు ఉన్న ఇంకో అమ్మాయి ద్వారా ఈ విషయాలు తెలిశాయి'.

నేను చెప్పేది ఆ అమ్మాయి వింటూ ఉండిపోయింది. మళ్లీ అందుకున్నాను..

'ఆ అమ్మాయి మరెవరో కాదమ్మా.. ఆ పాపానికి గర్భవతైన ఆ పిల్లే.. ఇందాక నీ దగ్గరకు వచ్చిన పిల్ల..' అలా విషయాన్ని వాస్తవానికి లింక్ చేసేశా. కళ్లు తుడుచుకున్నా.

'బాబాయ్..' అంది.

ఆ మాటకు అదిరిపడ్డాను. నా చెంపల మీదినుంచి కారుతున్న వర్షపు నీటిని ఆర్తిగా తుడిచింది. ఆ అమ్మాయి ఇంకా ఏదో అడగబోతుండగా.. నా గది దగ్గర గొడవ జరుగుతున్నది.

'అమ్మో..' అనుకొని అమ్మాయితో అటు కదిలాను. రెండు బ్యాగుల్నీ తీసుకొని నన్ను ఫాలో అయింది.

స్టేషన్ గదినుంచి.. కడుపుతో ఉన్న యువతిని తోసేస్తూ తనవైపు దూసుకొస్తున్నాడా యువకుడు.

'పట్టుకోండి.. నన్ను మోసం చేసి పారిపోతున్నాడు. వాడ్ని పట్టుకోండి' పడుతూ లేస్తూ అరుస్తున్నది ఆ యువతి.

ఆ యువకుడు కంగారుగా ఉన్నాడు. భయంగానూ ఉన్నాడు. ఆ యువతి షాకులోనూ ఉన్నాడు. మేమున్న దగ్గరకొచ్చి, నన్ను కన్నెత్తి కూడా చూడకుండా నన్ను ఫాలో అవుతున్న అమ్మాయి భుజమ్మీద చెయ్యి వేసి.. అటు తిప్పి 'పద' అని ముందుకు నడవబోయాడు.

నేను ఆగాను. ఆ అమ్మాయి వెనుతిరిగి నన్ను చూసింది. నేనూ ఆమెను చూశాను. ఆ అమ్మాయి తలను బలవంతంగా తిప్పేసాడా యువకుడు.

ఐనా.. ఆ అమ్మాయి మళ్లీ నావైపు చూసింది. ఈలోగా.. కడుపుతో ఉన్న యువతి అక్కడికి వచ్చింది.

'అయ్యా.. ఎన్నాళ్లనుంచో ఎతుకుతున్నాను. ఆడ్ని పట్టుకోండి'

'ఆ పిచ్చిదాన్ని పట్టించుకోవద్దు. పద పోదాం.' అంటూ రెండు బ్యాగుల్నీ అందుకోబోయాడు.

ఆ అమ్మాయికి నేను చెప్పింది ఎక్కింది అనడానికి నిదర్శనంగా రెండు బ్యాగుల్నీ వెనక్కి లాక్కుంది.

'ఫరవాలేదు.. నేను పట్టుకుంటాన్లే..' అన్నాడా యువకుడు.

'ఫరవాలేదు.. నేనే పట్టుకుంటాను..' అందా అమ్మాయి.

'అదేంటి..?'

'అదంతే..' నొక్కి చెప్పింది.

అర్థమయి రెండు బ్యాగుల్నీ బలవంతంగా లాక్కోబోయాడు.

ఆ అమ్మాయి గట్టిగానే పట్టుకున్నది. అది చాలు నాకు.

ఈలోగా.. మెరుపులా ఆమెనుండి బ్యాగుల్ని లాక్కొని పారిపోతున్నాడు.

గొడుక్కి పంపించిన లక్ష్మణ్.. గొడుగుతో ఆ యువకుడికి అభిముఖంగా వస్తున్నాడు. నేను ఆలస్యం చేయలేదు.

'లక్ష్మణ్.. వాణ్ణి పోనివ్వకు..' అని అరిచాను.

లక్ష్మణ్ వర్షానికి వేసుకొస్తున్న గొడుగుని మడిచాడు.

రెండు బ్యాగుల్తో పారిపోతున్న ఆ యువకుడ్ని చూశాడు. కొంచెం వంగి ఆ యువకుడి కాళ్లని మడిచిన గొడుగుతో బలంగా కొట్టాడు. చేతిలోని బ్యాగులు జారి ఆ యువకుడు కింద పడ్డాడు.

'ఆ బ్యాగులు తెచ్చేయ్..' అరిచాను మళ్లీ..

లక్ష్మణ్ బ్యాగులు అందుకున్నాడు. ఆ యువకుడు లేవలేకపోతున్నాడు. కాళ్లు కూడదీసుకుంటున్నాడు. ఆ యువకుడు లేచేలోపు గుండెలమీద ఎక్కి కూర్చుంది.. కడుపుతో ఉన్న యువతి.

'నన్ను మోసం చేస్తావా..?' చెంపలు వాయిస్తున్నది.

లక్ష్మణ్ అమ్మాయి బ్యాగుల్ని తెచ్చిచ్చాడు.

'బాబాయ్..' అంటూ ఆ అమ్మాయి నా గుండెలమీద వాలిపోయి ఏడుస్తున్నది. తల నిమిరి భరోసాగా..

'నేనున్నానమ్మా.. నేనున్నాగా...' అన్నాను.

కృతజ్ఞతగా చూసిందా అమ్మాయి. నా ఆనందానికి అవధులు లేవు.

నా ఈ విజయాన్ని నా భార్య అన్నపూర్ణకి చెప్పాలి.

కాలేజీ రోజుల్నుంచీ ఇప్పటివరకూ ఏ నాటకానికీ 'ఉత్తమ నటుడు' బహుమతి రాలేదని కదా.. సందు దొరికినప్పుడల్లా సెటైర్లు వేస్తుంది. కానీ, ఈ జీవన్నాటకంలో 'లేని' కూతురి కథ అల్లి.. గుడ్డిగా ప్రేమను నమ్మిన అమ్మాయిని అది భ్రమ అని నమ్మేలా నటించిన నేను కాదా.. ఉత్తమ నటుడిని.

***(ప్రేమ.. వంచన.. సాంత్వన.. విశ్వజనీనం అని ముఖ్యపాత్రలకు పేర్లు పెట్టలేదు)***

# యన్నంరెడ్డి వెంకటరెడ్డి

యన్నంరెడ్డి వెంకటరెడ్డి పుట్టి, పెరిగింది ఖమ్మం జిల్లాలో. అక్కడే విద్యాభ్యాసం చేశారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. 'ఈటీవీ', 'జీ తెలుగు' చానళ్లలో పనిచేశారు. రచనపై ఆసక్తితో వందకుపైగా కథలు రాశారు. రెండు వందలకు పైగా కవితలు, రెండు నవలలూ, అనేక వ్యాసాలను వెలువరించారు. 1985లో నిర్వహించిన 'తెనాలి రసమయి అఖిల భారత స్థాయి తెలుగు కథానికల పోటీ'లో ద్వితీయ బహుమతి అందుకున్నారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం (సమాచార, ప్రజా సంబంధాల శాఖ) నిర్వహించే 'ఆంధ్ర ప్రదేశ్' మాసపత్రిక నిర్వహించిన కథల పోటీలో తృతీయ బహుమతిని గెలుపొందారు. అనేక అవార్డులు, సన్మానాలు పొందారు. ఈయన రాసిన 'భగవాన్ వాడిని క్షమించు' కథ విమర్శకుల ప్రశంసలందుకున్నది.

22 katha 1-203 page-1_Layout 1 9/25/2021 3:32 PM Page 101

# పాజిటివ్

**డాక్టర్ వెల్దండి శ్రీధర్,**

**98669 77741**

‘**గాలి పగవట్టినట్టే** అయితంది సప్పుడుజేక మనూరికి మనం పోదాం పాండ్రి’ ముక్కుకు మూతికి దస్తిగట్టుకొని దొంగోని లెక్క ఇంట్లకచ్చుకుంట అన్నడు రమేష్.

‘ఏమైంది? ఇంట్లగుడ గీ ముస్గేంది? మనోడో, మందోడో తెల్వకుంట. అయినా ఎటువోదాం? పోదాం.. పోదాం అంటున్నవ్?’ ఇంట్లకచ్చిన పెనిమిటిని కిందికి మీదికి జూసుకుంట అన్నది పద్మ.

‘ఎటువోదామేంది? టీవీల జూస్తలేవా? రోజు రోజుకు సావులు పెరుగుతనే ఉండే. లోకానికంత గాలి గత్తరచ్చినట్టయింది. నిన్న ఇయ్యాల మా షాపుల పనిజేసేటోళ్లకు ఇద్దరికచ్చింది. వాళ్లు దవాఖాన్లవడి లచ్చలు లచ్చలు కర్సయితున్నయట. ఎవనెవని కాళ్లు మొక్కి తెస్తున్నరో పైసలు. అయినా బతుకుతడో లేదో చెప్పలేమంటున్నరట. ఇగ మనగ్గిన గా రోగమచ్చెనా.. మనం సచ్చుడే. మన దగ్గర రూపాయి లేదు. అయినా ఇంకా ఈడుండి ఏం జేస్తం. రేపటి నుంచి నన్నుగుడ పనిలకు రాకుమన్నడు మా సేటు. దుకాణం బందట రేపట్నుంచి. ఓటెనుకోటి అన్ని బందువెడ్తున్నరు.’ అంగిడ్సి ఇనుప కుర్సి మీదేసి, చెంబుతోని గటగట నీళ్లు తాక్కుంటన్నడు రమేష్.

‘అయ్యో! ఈనింట్ల పీనుగెల్ల ఏం సావుమర్నం కాలమచ్చెనుల్లా..’ పద్మ యాష్టపడుకుంట.

‘సావుమర్నమా.. సావుమర్నమా.. ఇప్పటికే అయిద్రాదల పదిండ్లకు నాలుగిండ్లు ఖాళైనయట. ఇంక మనముండి ఏం జేస్తం. ఎట్ల బతుకుతం. సామాను సర్దు. పోరగాండ్లు రాంగనే బైలెల్లుదాం’ కింద సాపల ఒరుక్కుంట అన్నడు రమేష్.

పగటీలి రొండు గంటల వరకు ఇంత తిని బయిలెల్లింద్రు రమేష్, పద్మ, కొడుకు నరేష్, బిడ్డ పావని. అందరు కల్సి రోడ్ మీదికి వస్తే ఆటోలు దొరుకుత లెవ్వు. ఆటోలు మందం నడుస్తున్నయని కొందరు. అసలే నడుస్తల్వెని కొందరన్నరు.

ఇగ ఏం చేసుడో మన్సునవట్టక చూసి చూసి మెల్లగా సామాను నెత్తి మీద పెట్టుకొని అడుగుల అడుగేసుకుంట బస్టాండ్ దాకా వచ్చిన్రు. బస్సులు కూడా బందైనయట. బస్టాండ్ ముంగట ఉశికేస్తే రాలనంత జనం. కొంత మంది మూతులకు మాస్కులు పెట్టుకున్నరు. మరికొంత మంది మాకేమైతది అని మాస్కులేమీ లేకుండా బేఫికర్గ ఉన్నరు. ఇంటి దాకా ఎట్లపోవుడో సమజ్‌గాలే రమేష్‌కు. అంతా గోలగోల ఉన్నది. ఒగడు తుమ్ముతుండు. ఒగడు దగ్గుతుండు. కొంత మంది శాతగాక కిందనే కూలవడ్డరు. కొద్దిసేపటికి ఎవరో ఒకాయినె దగ్గుకుంట, తుమ్ముకుంట, ఊపిరి గట్టిగ పీల్సుకుంట కిందపడి కొట్టుకుంటండు. ఊపిరి అందుతలేదేమో! ఆయాస పడ్తుండు. దూప.. దూప.. నీళ్లు.. నీళ్లు.. అనుకుంట కింద అటు ఇటు బొర్రుతుండు. వానికున్న రోగం మనకేడ అంటుతదనేమో ఎవరు ఆయినె దగ్గరకి పోతలేరు. దూరంగా నిల్సున్న మందిల ఎవరో 'నూటెనిమిదికి ఫోన్ చేసినం. వస్తదాగుండ్రి. వాళ్లే తీసుకపోతరు' అన్నడు. 'ఏ నూటెనిమిదోళ్లు కూడా పట్టరట ఈ కేసులను. వాళ్లు కూడా భయపడుతున్నరట' అన్నడు ఇంకొగడు.

ఆయినె ఒర్రుడు, బొర్రుడు చూసి ఎవరో ఒకాయినె దూరం నుండే తన చేతిలున్న నీళ్ల సీసా ఇసిరేసిండు. జప్పన అందుకొని తాగి, జరంత నిమ్మలమైండు మనిషి. అయినా ఆయాస పడ్తనే ఉన్నడు.

రమేష్‌కు ఒక్కసారి కింది నుంచి మీద్దాక జల్లుమన్నది. రేపు మన గతి కూడా గింతే కదా! అనుకున్నడు. ఎట్లయినా జల్ది ఈన్నుంచి బయటవడాల్నని ఏదో జీబు వస్తే ముల్లెలన్నీ జీబు టాప్ మీదికి ఎక్కిచ్చిండు. అప్పటికే జీబంత నిండిపోయింది. కూసుండ జాగలేదు. నల్గురం ఎట్లపోవుడు. ఎక్కిచ్చిన సామాను దించుకుందాం అనుకున్నడు. కాని డ్రైవరు ఎన్కకచ్చి 'అరె! పోదాం కూసోండ్రి. జర జరుగుండ్రమ్మా' అంటూ పద్మను, పావనిని లోపల కూసుండవెట్టిండు. 'ప్రెజ్ఞాపూర్ల ఇద్దరు దిగుతరు. మీరాడిదాక పట్టి మీద నిల్సోండ్రి. ప్రెజ్ఞాపూర్ల లోపల కూసుందు–రు' అనుకుంట బండి చాల్ చేసిండు. వేరే సౌలతు లేదు. ఏంజేద్దాం మరి అనుకుంట రమేష్, నరేష్ జీబు పట్టి మీద నిల్సొని గట్టిగ పట్టుకున్నరు. జీబు మెల్లగ బయల్దేరింది. లోపలెవలో తుమ్మిండ్రు.

సిటీ దాటేటాల్లకు గంటన్నర పట్టింది. మధ్యల చాలా మంది చేయి అడ్డంపెట్టి జీబును ఆపిండ్రు. కాని లోపల జాగలేక డ్రైవరు ఆపలేదు. తరువాత చాలా రువ్వడి మీద పోయింది. గంటకే ప్రెజ్ఞాపూర్ వచ్చింది. కాని జీబు ఆగలేదు. ఎవరూ దిగలేదు. ఇగ శనిగరం దాకా నిల్సునుడే అనుకున్నరు రమేష్, నరేష్. మల్లో గంటన్నరకు అంటే రాత్రి ఎనిమిది గంటల వరకు శనిగరం స్టేజీ మీద దించిండు.

బస్సు కిరాయికి రెండంతలు ఇయ్యిమన్నడు డ్రైవరు. రమేష్‌కు కోపం వచ్చింది. 'నువ్వు ఎక్కేటప్పుడే చెప్పద్దా? మేం ఎక్కనే ఎక్కపోదుం నీ జీబు' అని లొల్లి లొల్లి చేసిండు. 'మీకు తెల్వదా? బస్సులే బందాయే. ఇంకా నయం. నిన్న మొన్న మూడంతలు వసూలు జేసినం' అని రెండంతల కిరాయి ఇచ్చేదాకా ఇడ్సిపెట్టలే డ్రైవరు.

నల్గురికి డబల్ కిరాయి కట్టేటాల్లకు రమేష్‌కు కండ్లల్ల నీళ్లు తిరిగినయి.

నల్గురు నాలుగు మూటలు నెత్తి మీదవెట్టుకొని ఊళ్లెకు బయల్దేరింద్రు. నరేష్ లగాయించి నడ్సుకుంట ముందట పోతండు. ఏడెనిమిదేండ్ల కిందట వచ్చినపుడు ఎట్లుందో ఊరు ఇప్పుడు సుతం గట్లే ఉంది. అక్కడక్కడ కొద్దిగా మారినట్టు కనిపిస్తున్నా పెద్దగా మార్పులేదు. ఊరు కొసకే ఉన్న నాయనమ్మ ఇల్లు తొందరగనే గుర్తువట్టిండు.

'నానీ.. నానీ.. ' అనుకుంట లోపటికి పోయి నెత్తి మీది మూట కింద పెట్టిండు.

నుల్క మంచం మీద కూసోని రొట్టెదింటున్న మల్లేశం 'ఉన్నావే రంగమ్మా! నీ మనుమడొచ్చిండు' అన్నడు తలె కింద పెట్టి చెయ్యిగడుక్కుంట.

ఇంటెనుక రేకుల కింద రొట్టె జేస్తున్న రంగమ్మ 'మనమడెవలయ్యా! మనుమడు' అనుకుంట చేతులకంటిన పిండిని చీరెకు, కొంగుకు తుడ్సుకుంట నడింట్లకు వచ్చి నరేష్‌ను బిత్తరపోయి చూస్తూ 'ఒరే! నరేషూ నువ్వారా.. ఎంత పెద్దగైనవురా.. ఎప్పుడో చిన్నగున్నప్పుడు జూసిన. ఎట్లచ్చినవు బిడ్డా! ఊళ్లెకు ఎవ్వల్ను రానిస్త లేరు. సడక్ మీద కంప పెట్టలే నువ్వ రాంగ?' అన్నది. నరేష్ పెయ్యంత పునుక్కుంట... 'మా పెట్టిండ్లే నేనే కాలుతోని పక్కకని వచ్చిన. అక్కడెవలు కావలి లేరు' అన్నడు నరేష్. 'అయితవాయేగని నువ్వొక్కనివే వచ్చినవా? మీ బాపు, అమ్మ, అక్క సుతం వస్తున్నరా?'

'ఏ నేనొక్కన్నే వచ్చిన్నే. వాళ్లు రామన్నరు' అన్నడు. నవ్వుకుంట నుల్క మంచం మీద తాత పక్కపొన్న కూసుండుకుంట.

ఇంతల్నే రమేష్, పద్మ, పావని నెత్తి మీద బరువుతోని మొసపోసుకుంట లోపలికి వచ్చి చెప్పులిడ్సింద్రు.

'అగో.. అందరు వచ్చింద్రు గదా! నీ తీట మాటలు ఇంకా మర్సిపోలేదురా?' అనుకుంట మనుమరాలు పావని దగ్గరకు పోయి నెత్తి మీది మూట దించి దగ్గరికి తీసుకున్నది.

నరేష్ లోపలికి పోయి సర్వల మంచి నీళ్లుదెచ్చి అందరికీ తలో గిలాసల పోసిచ్చిండు.

'ఎప్పుడు బైలెల్లిండ్రురా! రమేషు నాత్రయింది' అన్నది రంగమ్మ కొడుకును చూసుకుంట.

'బస్సులే నడుస్తలేవు గాదె. తిని బైలెల్లినం. కిందా మీద పడుకుంట వచ్చేటాలకు గీ రాత్రయింది' అని 'బాపు ఎట్లున్నవే?' అన్నడు నుల్క మంచంల కూసుండుకుంట.

'మంచిగనే ఉన్నరా. గీ మోకాళ్ల నొప్పే అస్సలు పోతలేదు. మొన్న జీడిగింజ కాల్చి సుతం పెట్టిన' అన్నడు.

'మీ అయ్య ముచ్చట్లు ఒడ్వయిగని. అందరు కాళ్లు చేతులు కడుక్కోండ్రి. ఈ లోపల అన్నం వండుత' అనుకుంట రంగమ్మ ఇంటెన్క పొయ్యికాడికి పోయింది.

* * *

'యాపాటి సంపాయించినవురా రమేషు? ఈడ ఎవుసం జెయ్యిమంటే అలిగి పట్నం పోతివి?' అన్నడు మల్లేశం నాగలి బయటికి తీసి, కొడవలి, పగ్గాలు చేతిల పట్టుకొని, ఎడ్ల కొట్టంలకు పోవుకుంట.

'సంపాయించుడెక్కడిదే. నేను జేసిన కట్టం బట్ట పొట్టకే సాలక పాయె. ఇంక మీదికేలి అప్పుల పాలైతి.' అన్నడు రమేషు నొచ్చుకుంట..

'అదేందిరో? సంపాయించందే పొలగాండ్లను పట్నంల సదివిపిస్తున్నవా? నీ రెక్కల కట్టం నేనేం అడుగతియ్యిరా'

'నేను జెప్పేది నిజమేనే. అయ్యగారి సంపాదన, అమ్మగారి పసుపుకుంకుమన్నట్టే అయితంది సంసారం. పోరగాండ్లు ఉశారున్నరని ఒక డాక్టర్ మేడం దయతల్చి సదివిపిత్తంది. వీళ్లిద్దర్ని'

'తాతా ఏడికి పోతున్నవే పొలంకాడికా? నేను గుడ వత్త' అన్నడు నరేష్ చెప్పులేసుకుంట.

'నువ్వెందుకోయ్. సదువుకున్నోనివి నువ్వాడికచ్చి ఏంజేత్తవ్? అన్నడు మల్లేశం.

'వాని సదువే బురద పిసుకుడు తాతా. తీస్కపో నీకింత ఆసరైతడు' అన్నది వెనకనుంచి పావని నవ్వుకుంట. చెరో మాస్కు చేతుల పెట్టి.

నరేష్, పావని వైపు కొర్రాయిలెక్క చూసుకుంట 'దాని మాటలకేందిగని పా! తాతా మనం పోదాం' అనుకుంట ముందుకు నడిచిండు.

'మేమేమన్నా ఎడ్లమా? మూతులకు గీ సిక్కాలెందుకే పిల్ల. మన తాత ముత్తాతలు గిట్లే మూతులకు ముంతలు, గుడ్డలు కట్టుకొనే బతికిండ్రు. ఊళ్లె ఎవలన్నా పెట్టుకోంగ కనవడ్డదా? అదేం రోగమో! గని అది వచ్చింది తెల్వది. పోయింది తెల్వది. రోజంతా ఎండల కష్టపడేటోల్లం మాకేమైతది? ఇది వరకే మాకు ఆ రోగం రావచ్చు. పోవచ్చు.'

'తాత గట్లే అంటడు గని, నువ్వన్న ముక్కుకు పెట్టుకోరా! నరేషు' అని అరుచుకుంట లోపలికి పోయింది పావని.

'గదేం సదువురా? ఏమో బురుద పిస్కుడు అంటంది మీ అక్క' అనుకుంట నాగలి భుజం మీద పెట్టుకొని ఎడ్ల తలుగులిప్పి, పగ్గాలు పట్టుకొని బయిలెల్లిండు మల్లేశం.

* * *

పొలం దగ్గరికి పోంగనే మల్లేశం నాగలిగట్టి దున్నుడు మొదలుపెట్టిండు. నరేష్ కూడా ప్యాంట్ మీదికి మలిచి పొలంల దిగి మల్లేశం పక్కనే బురద పొలంల నుద్సుకుంట 'ఏం పంటేస్తవే తాతా. బాగనే దున్నతున్నవుగని' అన్నడు.

'ఏమేసుడేందిరా. ఈ పొలంల మా అయ్య జమాన కాన్నుంచి వరే ఏస్తున్నం. ఈ సారిగుడ వరే ఏద్దామనుకుంటున్న'

'అట్ల అన్నేండ్ల నుంచి ఒకటే రకమైన పంటేయద్దే. పంట మార్పిడి చేయాలె. అప్పుడే భూమిల సారం పెరిగి పంట మంచగస్తది'

'అగో నీకేం తెల్సురో.. నాకే చెప్పవడ్తివి.' ఎడ్లను మలుపుకుంట.

'పట్నంల నేను సదివే సదువు గిదేనే. బియస్సీ అగ్రికల్చర్. అంటే ఏ నేలల ఏ పంటేయాలె. ఏ పంటకు ఎన్ని నీళ్లు, ఎంత ఎరువు వేయాలె, ఏ పంటకు ఏం రోగం వస్తది. దానికి ఏం మందులు వాడాలె అన్నీ నేర్పుతరు. మేం గుడ మా యూనివర్సిటీల ఒక మూలకు పంటలు వేస్తం. వాటిని మేమే దగ్గరుండి పరిశీలిస్తం.'

'ఓరియక్క గిదీనికి సదువుడెందుకురా. నాతోనుంటే రొండేండ్లల్ల అన్ని నేర్పుదును.'

'కరెక్టేనే! నీకు తెల్వనియి వాళ్లేం చెప్పరు. కాని అన్నీ సైంటిఫిక్‌గా నేర్పిస్తరు. భూసారాన్ని బట్టి ఎప్పుడు ఏ పంట వేయాలె, పొలంల ఎప్పుడెప్పుడు ఏమేం జేయాలె అన్ని నేర్పుతరు'

'అయితే ఇప్పుడేమంటవురా' వరేద్దామంటవా? వద్దా?'

'వద్దు తాత. నా మాటిను. ఈ సారి పంట మార్చుదాం. చుట్టు అందరు పొలాలల్ల వరే ఏస్తున్నరు గదా! మల్ల మనమెందుకు? మనం పూల తోట పెడుదాం.'

'నీకు పిచ్చిలేసిందారా? పువులెవరు కొంటర్రా. అవి ఏపాటి పూస్తయి. పూసినా వాటికి ఏపాటి ధర వస్తది?'

'ఓ పూట అన్నం లేకున్నా నడుస్తది గని, ఇప్పుడు పూలు లేకుంటే నడుస్తలేదే. పుట్టినా, సచ్చినా, పెండ్లికైనా, పూజకైనా అన్నిటికి పూలే కావాలె. మనం పూలతోట పెడితే రెండు, మూడేండ్లల్ల పైసలే పైసలు.'

మల్లేశం నవ్వి 'ఊకోరా... పిల్లకాకికేం తెల్సు ఉండేలు దెబ్బని. నీ సదువులు, గిదువులు ఈడ పనిజెయ్యయి. పొయ్యి సదువుకొని, పరిచ్చలు రాయిపో..' అన్నడు.

'అట్లగాదే. మనకు మొత్తం ఎంత భూమున్నది?'

'ఆరెకురాలు'

'సరే! సరదాగా చెరి మూడు ఎకురాలు తీస్కుందాం. నువ్వు నీ మూడు ఎకురాలల్ల వరి పంటెయ్యి. నేను నా మూడెకురాలల్ల పూల తోట పెడ్త. యాడాది తిరిగే సరికి ఎవలెంత సంపాయిస్తరో చూద్దాం. మనిద్దరం చెర్తు కట్టుకుందామే.'

'సరే! రా. నీ సదువు గెలుస్తదో. నా అనుభవం గెలుస్తదో చూద్దాం.'

* * *

మూడు నెల్లల్ల ట్రాక్టర్లు పెట్టి దున్నిచ్చి, ఒక్కెకురం బంతిపూలు, ఒక్కెకురం గులాబి పూలు, ఇంకో ఎకురం చేమంతి పూలు పెట్టిండు నరేష్. ఎప్పటికప్పుడు చీడ పురుగులు పట్టకుండా ఏమేమి జాగ్రత్తలు తీసుకోవాల్నో తన పుస్తకాల్లో చూసి, యూట్యూబ్‌లో అనుభవజ్ఞుల వీడియోలు చూసి, మధ్యమధ్యన తన యూనివర్సిటీ ప్రొఫెసర్లకు ఫోన్లు చేసుకుంట తోటకు మందులు కొడుతున్నడు. వీడియో కాల్స్ చేసుకుంట, వాట్సాప్‌లో పిక్స్ పెట్టుకుంట తగిన సలహాలు తీసుకుంట పాటిస్తున్నడు.

కాలం మంచిగనే కావడంతో మల్లేశం కూడా తన అనుభవాన్ని రంగరించి మంచి విత్తనాలు, నాట్లు, ఎరువులు, కలుపులు అన్నీ చాలా జాగ్రత్తగా చేస్తున్నడు. అప్పుడప్పుడు నరేష్ కూడా తనకు తోచిన సలహాలిస్తున్నడు. కొట్టిన మందులేడపోయినయో కాని చీడపురుగుల దాడి ఎక్కువవడంతో పంట అనుక్నంత చేతికి రాలేదు. పసలంతా కష్టపడ్డా అరవై వేలు రాలేదు.

నరేష్ మాత్రం తోటను కంటికి రెప్పలా కాపాడుకుంట వస్తున్నడు. పెండ్లిల్ల సీజను, వరుసగా పండుగలు రావడంతోని నరేష్ పూలకు గిరాకీ బాగా వచ్చింది. ట్రాక్టర్లతో పూల బస్తాలు కరీంనగర్ మార్కెట్‌కు తరలిస్తున్నడు. కొన్ని సార్లు వ్యాపారులే డైరెక్టుగా తోట దగ్గరికి వచ్చి చెప్పిన ధరకు తీసుకపోతున్నరు. ఆ చుట్టు పక్కల ఇదొక్కటే తోట కావడంతోటి నరేష్ పూలకు బగ్గ డిమాండ్ వచ్చింది. ఆరు నెలలు తిరిగే సరికి ఎంత లేదన్నా ఆరు లక్షలు సంపాయించిండు. ఏడాది తిరిగే సరికి మొత్తం ఆరు ఎకరాల్లో పూల తోటే పెట్టి పది లక్షల మీదనే సంపాయించిండు. మల్లేశం, మనుమడు నరేష్ తెలివికి అప్సోసైపోయి లోలోపల మురిసిపోతుండు. రెండేండ్లు తిరిగే సరికి ఊళ్లో నరేష్ వ్యవసాయదారులందరికీ వ్యవసాయ శాస్త్రవేత్తలాగ కనిపించసాగిండు. దానికి తగ్గట్టుగనే నరేష్ రైతులందరినీ జమ చేసి 'వ్యవసాయదారుల సంఘం' ఒకటి పెట్టి రైతులందరికీ ఆర్గానిక్ పంటలు ఎట్ల పండించాల్నో, ఇనార్గానిక్ పంటలు ఎట్ల పండించాల్నో మెలకువలు నేర్పించుకుంట రైతులకు అండగ నిలబడుతున్నడు. నరేష్‌ను చూసి ఊళ్లె కొంత మంది రైతులు

అక్కడక్కడ పూల తోటలు పెట్టింద్రు. నరేష్ తమ పొలం పక్కనున్న జాగను కూడా కొని తోటను మరింత విస్తరించిండు. ఊళ్లె కొన్ని ఆధిపత్య కులాలు 'వీడేందిరో! నిన్నియాల లాగు కట్టి బాగా ఉషారు సూపిత్తండు' అని లోలోపల మసలిపోతుంద్రు.

మల్లేశం, రమేష్ ఇద్దరు వ్యవసాయాన్ని నరేష్‌కే అప్పజెప్పి మెల్లగా ఒక ఎరువుల దుకాణం పెట్టి అందులో కూర్చుంటున్నారు. పావని తమ్ముడు అండగా నిలవడడంతో ఎం.డి. కార్డియాలజిస్టు చదవడానికి ఉస్మానియా మెడికల్ కాలేజీలో చేరింది.

* * *

'రొండేండ్ల కింద మీరు అయిద్రావాద్ ఇడ్సిపెట్టి మనూరికి వచ్చిందే నయ–ంమైంది. లేకపోతే మన ఇల్లు, ఊరు ఇంతగనం మారకపోవు' అన్నడు మల్లేశం కార్ల కూసుండుకుంట.

'అదేందే తాత అట్లంటవ్. పక్షి ఆకాశంల ఎంత దూరం ఎగిరినా మళ్లీ గూటికి రావాల్సిందే గదా! ఇది కూడా గంతే. అయినా ఇప్పటికీ నూటికి డెబ్బయి మంది పల్లెల్లనే ఉన్నరు. పల్లెటూరు లేనిదే పట్నం ఎట్ల షోకుల వడ్తది. పట్నంకు అవసరమైనవన్నీ పల్లె నుంచే పోవాలె గదా!' అన్నడు నరేష్ కారు స్టార్ట్ చేసి. మళ్లా తనే 'కాలం కల్సి రావాలె, చెయ్యరావాలె గని వ్యవసాయమంత మంచి వృత్తి మరోటి లేదే తాత. లక్షలు సంపాయించొచ్చు. ఏ రియలెస్టేట్ బిజినెస్‌కు ఇది తీసిపోదు. ఇన్నొద్దులు మనకు నీళ్లు లేక, కరెంటు లేక, కరువుకు నా అసోంటి పోరగాండ్లంతా ఎడారి దేశాలకు వలస పోయి చేసేటోడు లేక పల్లెల్ల వ్యవసాయ భూములన్నీ బీడువారి పోయినై. ఇప్పుడు జరజర కాలమైతుంది గదా! పైగా వాన నీళ్లు ఒక్క సుక్క సముద్రంల కల్వకుంట మన నీళ్లు మనమే వాడుకుంటున్నం గదా! ఇగ మనకు రాయితోని కొట్టినా సావులేదు.'

అన్నడు నవ్వుకుంట.

'మీ తాత, మనువల ముచ్చట మా సాలుగని నరేషు ఎంత సేపైతదిరా మనం వరంగల్ చేరుకునేటాల్లకు' అన్నది రంగమ్మ. నరేష్ దిక్కు, మల్లేశం దిక్కు సూసుకుంట.

'ఎందుకే నానీ. నడుమ మల్లోసారి ఆగి నాస్త జేద్దాం. నీళ్ల సీస ఉన్నది గదా! తాక్కుంట కండ్లు మూసుకో, నువ్వు కండ్లు తెర్సే సరికి వరంగల్‌ల ఉంటం' అన్నడు. నవ్వుకుంట. రమేష్, పద్మ కూడా నవ్వింద్రు ఈ ముచ్చటకు.

'సరే! గని మనకంటె పెద్ద కులపోల్లట గదరా! ఒప్పుకుంటరంటవా?'

'పైసలు లేకుంటెనే కులం ముచ్చట ముందటవడ్తదే. పైసలుంటె కులాన్ని

పట్టించుకోరు. వాళ్లకంటె మనకే భూమి ఎక్కువున్నది. వాళ్లకంటె మనకే పెద్ద కారున్నది. వాళ్లకంటె మన దగ్గర్నే పైసలెక్కువున్నయి. పిలగానితోని సమానంగా అక్కగుడ ఎం.డి. చెయ్యనేవట్టే. ఇప్పుడు వాళ్లు ఒప్పుకునుడు కాదు. మనమే ఒప్పుకోవాలె. పిలగాడు ఇల్లరికం వస్తనంటేనే ఈ సంబంధం ఖాయం చేసుకుందాం. లేదంటే లేదు. ఎందుకంటె ఇద్దరి సదువులు అయిపోయినంక మనూళ్లెనే హాస్పిటల్ పెట్టియ్యాలె. ఇప్పటికే మన ఊరుకు కావాల్సిన పంటలను మనమే పండించుకుంటున్నం. ఇగ ఏదన్న రోగమొస్తే తక్కువ జెయ్యనీకి హాస్పిటల్ గుడ ఉంటే పక్కూరుతోని పనేలేదు. వాళ్లే మన దగ్గరికి రావాలె.

'ఇగ పట్నం మొకాన పోవార మరి మాతోనే ఉంటవా?'

'ఎందుకే గట్లడుగుతున్నవ్? పట్నంలేముందే? ఉండుటానికి జాగ కరువు, పీల్చుటానికి గాలి కరువు. ఇప్పుడు బాగా పైసలు సంపాయించినోళ్లు గుడ పట్నాలిడ్సిపెట్టి ఏదో ఒక పల్లెటూరు జేరి నాలుగెకురాలు జాగ కొనుక్కొని అండ్ల నడుమ ఇల్లు కట్టుకొని మంచిగ ప్రశాంతంగ జీవించాలనుకుంటున్నరు. ఏ రోగాలన్నా రానీ పోనీ. మళ్లా అంతా పాతకాలపు జీవన విధానాన్నే అలవాటు చేసుకుంటున్నరు...'

రంగమ్మ సప్పుడుజెయ్యక పోయేసరికి నరేష్ ఓ సారి వెనక్కి తిరిగి చూసిండు. రంగమ్మ కండ్లు మూసుకుంది. కారు జోరుగా, మెత్తగా సాగిపోతూనే ఉంది...

నిద్ర రాకుంట కారులో సన్నగా పాటలు పెట్టిండు.

'వినకపోతివిగదరా... వినకపోతివిగదరా... ఎరుకగలిగిన పదము
కొరివి కొనితెచ్చుకొని వణికితేమి ఫలము...'

* * *

# డా. వెల్దండి శ్రీధర్

వెల్దండి శ్రీధర్ స్వస్థలం సిద్దిపేట జిల్లా కోహెడ. తల్లిదండ్రులు ఈశ్వరమ్మ, ఓదయ్య. ప్రస్తుతం హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 2005లో 'అమృత వర్షిణి'తో కథలు రాయడం మొదలు పెట్టారు. 'పొక్కిలి' కథకు 2009లో మంజీరా రచయితల సంఘం 'వట్టికోట ఆళ్వారు స్వామి ఉత్తమ కథా పురస్కారం' లభించింది. 2017లో ప్రపంచ తెలుగు మహాసభల్లో భాగంగా 'ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కవిత్వం' గ్రంథాన్ని తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రచురించింది.

# ఆరాధ్య

**గౌరీ పొన్నాడ**

**63052 65908**

**సునంద** గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ మెయిన్ బ్రాంచ్.. చాలా హడావిడిగా ఉంది. చైర్‌పర్సన్ సునందాదేవి, సంస్థ వార్షికోత్సవ కార్యక్రమానికి రాబోయే ముఖ్యఅతిథి కోసం ఎదురుచూస్తున్నది.

'మేడం.. మీరంత ఆదుర్దా పడకండి.అన్నీ సక్రమంగానే జరుగుతున్నాయి. అతిథిని ఆహ్వానించేందుకు అందరం సిద్ధంగానే ఉన్నాం' యజమాని మనసులోని ఆదుర్దాని పోగొట్టాలని ప్రయత్నించింది టీమ్‌లీడర్ ఆరాధ్య.

'నాకు తెలుసు ఆరాధ్య, నువ్వంతటి సమర్థురాలివని. అందుకే, ఆ బాధ్యతను నీకు అప్పగించాను' మనస్ఫూర్తిగా అన్నది సునందాదేవి.

ఇద్దరూ మాట్లాడుకుంటుండగానే మంత్రి శ్రీపతి కారు వచ్చింది. ఆరాధ్య, సునందాదేవితోపాటు మరికొంతమంది ఎదురెళ్లి మంత్రి శ్రీపతిని సాధరంగా ఆహ్వానించారు.

మంత్రిని ముందు వరుసలో కూర్చోమని చెప్పి, క్షణంకూడా ఆలస్యం చేయకుండా సమావేశాన్ని ప్రారంభించారు.

తన మధురమైన స్వరంతో ప్రార్థనా గీతమాలపించి, సంస్థ యజమాని అయిన సునందాదేవిని, మంత్రితోపాటు అక్కడికి విచ్చేసిన మరికొంతమంది ప్రముఖులను వేదికపైకి పిలిచింది ఆరాధ్య. మంత్రి చేతులమీదుగా జ్యోతి ప్రజ్వలన చేయించి, ఆయనను మాట్లాడవలసిందిగా కోరింది.

మంత్రి శ్రీపతి మాట్లాడుతూ.. సునందాదేవి గొప్పతనాన్ని, ఆమె కార్యశీలతను ప్రశంసించాడు. నేటి సమాజంలో స్త్రీ సాధిస్తున్న విజయాలకు ఆమెను ఒక ఉదాహరణగా చెప్పాడు. వారి పార్టీ స్త్రీ సాధికారత కొరకు చేస్తున్న కృషిని వివరించి, తన ప్రసంగాన్ని ముగించాడు.

మంత్రి తర్వాత సునందాదేవి, మరికొంతమంది ప్రముఖుల ప్రసంగాలూ

పూర్తయ్యాయి. ఆ తర్వాత తనను మాట్లాడమంటూ సునందాదేవి చేసిన సైగలను అర్థం చేసుకొన్న ఆరాధ్య వేదికపైకి వచ్చి మాట్లాడింది.

'సభలో మాట్లాడిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు. స్త్రీలపై ఇంతటి గౌరవాన్ని, అభిమానాన్ని చూపిస్తున్న మంత్రిగారికి ప్రత్యేక కృతజ్ఞతలు. కానీ, మంత్రిగారు భావిస్తున్నట్లుగా స్త్రీలందరూ అభివృద్ధి చెందలేదు. ఇప్పటికీ మారుమూల పల్లెటూర్లలో కనీస సౌకర్యాలు లేకుండా ఎంతోమంది స్త్రీలున్నారు. సమాజంలో వారు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు' అని చెప్పి.. కొన్ని సమస్యలను వివరించింది. వీలైనంత ఎక్కువగా స్త్రీలకు సహకారం అందించమని కోరింది. అనంతరం సమావేశాన్ని ముగించి, అందరినీ లంచ్ చేయమని ఆహ్వానించింది. సునందాదేవి తనపై ఉంచిన నమ్మకానికి తగినట్లుగా మొత్తం కార్యక్రమాన్ని ముందుండి నడిపించింది ఆరాధ్య. అక్కడికొచ్చిన క్షణంనుండి ఆరాధ్యలోని అభ్యుదయ భావాలు, మాటతీరు, తెలివితేటలు, చలాకీతనం, సంస్కారం, ఆత్మస్థైర్యాన్ని గమనిస్తున్న మంత్రి శ్రీపతి, వెంటనే ఆమెను తన ముఖ్య సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశాడు.

'నీ అర్హతకు తగిన ఉద్యోగం ఇప్పుడొచ్చింది ఆరాధ్య. నీ తెలివితేటలకు తగిన బహుమానం ఈ ఉద్యోగం' అభినందించి, పంపించింది సునందాదేవి.

వచ్చిన అవకాశానికి సంతోషిస్తూ, విషయాన్ని తల్లికి ఉత్తరం ద్వారా తెలియజేసింది ఆరాధ్య. వెంటనే మంత్రి కొలువులో చేరింది.

ఆరాధ్యను చూసిన క్షణంనుండి ఆమెను ఎక్కడో చూసిన భావం మనసులో మెదులుతున్నా.. ఎక్కడ చూసాడో గుర్తురాక, అనుక్షణం ఆమె గురించి ఆలోచిస్తూ, ప్రతిపనినీ ఆమెను సంప్రదించిన తర్వాత చేస్తున్నాడు మంత్రి శ్రీపతి.

అది అతని అనుచరులకు కంటగింపుగా మారింది. 'సార్.. మీరు ప్రతి విషయం మేడం సలహా తీసుకొని చేయడం, ఒక ఆడదానికి మీరంత విలువనివ్వడం ఏం బాగాలేదు సార్' అన్నాడు మంత్రి ముఖ్య అనుచరుడైన సత్యవేలు.

'ఏవయ్యా సత్య.. ఆమె పనే నాకు సరైన సలహాలివ్వడం. సరే! మీ అందరికీ అంత బాధగా ఉంది కదా! ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ఏంచేస్తే మంచిదో ఆలోచించండి. రేపు మా ఇంట్లో హోంమినిస్టర్ గారితో సమావేశం ఉంది. మీరందరూ రండి, మీ సలహాలు చెప్పండి. ఎవ్వరి సలహా నచ్చినా.. మేం పాటిస్తాం' అన్నాడు శ్రీపతి. ఆరాధ్య సమయస్ఫూర్తి, తెలివితేటలను అందరికీ తెలియజేయాలని అనుకున్నాడు.

అతను ఇంటికెళ్లేసరికి పంట డబ్బులను బ్యాంకులో వేయడానికి నగరానికి వచ్చిన తన తండ్రి లక్ష్మీపతి ఇంట్లో ఉన్నాడు.

'చాలా రోజులనుంచి రమ్మంటున్నాను. ఇప్పటికి తీరిక దొరికిందా నాన్నా? అమ్మ

ఎలా ఉంది? అమ్మను కూడా తీసుకురావాల్సింది' అంటూ తండ్రి కాళ్లకు నమస్కరించాడు శ్రీపతి. వెళ్లి ఆయన పక్కన కూర్చున్నాడు.

'నీకు తెలియందేముంది శ్రీపతి, సర్పంచ్‌గా ఊరి బాగోగులు చూసుకోవాలి. పొలం పనులూ చూడాలి. తీరికెక్కడ? నిన్న పంటను అమ్మితే వచ్చిన డబ్బులను బ్యాంకులో వేసినట్లుంటుంది.. నిన్ను చూసినట్లుంటుందని వచ్చాను' కొడుకును ఆప్యాయంగా తడుముతూ చెప్పాడు లక్ష్మీపతి.

'సరే నాన్నా.. భోజనం చేసి ఈ రోజుకు విశ్రాంతి తీసుకోండి. రేపు హోంమినిస్టర్‌గారితో సమావేశముంది. అది పూర్తయ్యాక నేనే స్వయంగా మిమ్మల్ని బ్యాంకుకు తీసుకువెళ్తా' అని చెప్పి తన గదిలోకి వెళ్లిపోయాడు శ్రీపతి.

మరునాటి ఉదయం మంత్రి శ్రీపతి ఇంట్లో హోంమినిస్టర్‌తో సమావేశం ఏర్పాటు చేసింది ఆరాధ్య. ఎప్పుడూ మోడ్రన్ డ్రెస్‌లో ఉండే ఆరాధ్య, ఆ రోజు మొదటిసారి సాంప్రదాయబద్ధంగా చీర కట్టింది. ఆ చీరలో ఆమెను చూస్తుంటే.. బాగా తెలిసిన మొహంలా అనిపించింది మంత్రి శ్రీపతికి. హోంమినిస్టర్ వచ్చిన తర్వాత.. 'ఎవరైనా.. ఏమైనా సలహాలు చెబుతారా?' అనుచరులందరినీ చూస్తూ అడిగాడు మంత్రి.

'అసలీ ప్రభుత్వ పాఠశాలలు ఎందుకండి? ప్రభుత్వానికి అనవసరపు ఖర్చు. విద్యను పూర్తిగా ప్రైవేటుపరం చేయండి. ప్రభుత్వానికి డబ్బే డబ్బు' అన్నాడు సత్యవేలు.. ఇంతకంటే అద్భుతమైన సలహాను ఎవ్వరూ ఇవ్వలేరన్నట్టుగా చూస్తూ..

'అప్పుడు మన పార్టీ నామరూపాలు లేకుండా పోతుంది. ఇంతమందిలో మంచి సలహాలిచ్చేవారే లేరా?' అందరివైపు చూశాడు హోంమినిస్టర్.

సత్యవేలులాగే అందరూ పిచ్చిపిచ్చి సలహాలు ఇచ్చారు.

'ఇంతకంటే మంచి సలహాలిచ్చేవారు లేరా శ్రీపతి?' ఎవ్వరి సలహా నచ్చక.. అసహనంగా అన్నాడు హోంమినిస్టర్.

'ఉన్నారు సార్'.. అంటూ 'ఇప్పుడు నీ వంతు' అన్నట్టుగా ఆరాధ్య వైపు చూశాడు శ్రీపతి.

అంతవరకూ మౌనంగా కూర్చున్న ఆరాధ్య, హోంమినిస్టర్‌కు నమస్కారం చెప్పి..

'సత్యవేలుగారు చెప్పినట్లుగా ప్రభుత్వ పాఠశాలలన్నిటినీ ప్రైవేటుపరం చేయడంకాదు.. నెమ్మదినెమ్మదిగా ప్రైవేట్ పాఠశాలలన్నిటినీ ప్రభుత్వపరం చేయాలి. ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు అందుతాయని చెప్పాలి. ప్రతి ఉపాధ్యాయుడికీ సెలవుల్లో వృత్యంతర శిక్షణనిస్తూ, వారిలోని ప్రతిభకు మెరుగులు దిద్దాలి. ప్రతి పాఠశాలలో.. అంటే ప్రభుత్వ పాఠశాలలైనా, ప్రైవేట్ పాఠశాలలైనా ఒకే రకమైన అంశాలను బోధించేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి సంవత్సరం ఒక్కొక్క అంశాన్ని

అమలుచేస్తుంటే, అతిత్వరలో ప్రభుత్వ పాఠశాలలు పూర్వవైభవాన్ని సంతరించుకుంటాయి' అని చెప్పింది.

తన సలహా హోంమినిస్టర్‌కు నచ్చిందో.. లేదోనని అతని ముఖ కవళికలను పరిశీలించింది.

ఆమె చెప్పింది విన్న హోంమినిస్టర్.. 'అద్భుతం మిస్ ఆరాధ్య, మీరు చెప్పిన ప్రతి సలహా పాటించేలా చర్యలు తీసుకుంటాం. ఇన్ని తెలివితేటలున్న అమ్మాయిని కాదని పిచ్చిపిచ్చి సలహాలన్నిటినీ వినిపించారేంటయ్యా? తెలివిలేకపోతే.. ఆ అమ్మాయిని చూసి నేర్చుకోండి మీరంతా. ఇకపై ఎవరికీ పిచ్చిపిచ్చి సలహాలు ఇవ్వకండి' అంటూ శ్రీపతి అనుచరులను మందలించాడు హోంమినిస్టర్. సమావేశాన్ని ముగించి బయల్దేరాడు.

అంతవరకూ గదిలో కూర్చొని ఆరాధ్య చెబుతున్నది విన్న లక్ష్మీపతి, మనసాగక ఆమెను చూసేందుకు బయటకు వచ్చాడు. ఆరాధ్యను చూసి ఆశ్చర్యపోయాడు.

'ఆరాధ్యా.. నా అంచనా ఎప్పుడూ తప్పు కాలేదు. నాకు తెలుసు నువ్వు చాలా చక్కటి సలహాలిస్తావని' అభినందించాడు మంత్రి. మళ్లీ ఏదో గుర్తొచ్చిన వాడిలా 'మీ అమ్మగారి పేరు ఏంటి? మీ ఊరు ఏంటి?' అని అడిగాడు.

'నాది కూడా మీ ఊరే సార్. మేడ్చర్లలోని తూముకుంట. మా అమ్మ పేరు మంగమ్మ. ఆమెకు మీరంతా తెలుసు'

'నేను మీ ఊరి వాడినని తెలిసికూడా ఇన్నిరోజులూ ఎందుకు చెప్పలేదు ఆరాధ్య?' ఒకపక్క సంతోషం.. ఇంకోపక్క ఆశ్చర్యం కలగాపులగం అవుతుండగా అడిగాడు మంత్రి శ్రీపతి.

'ఇందులో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సింది ఏముంది సార్. మీరడిగుంటే చెప్పేదాన్ని. మీరడగలేదు.. నేను చెప్పలేదు.. ఒకే సార్ ఇక నేను వెళ్లొస్తాను' అంటూ వెళ్లిపోయింది ఆరాధ్య.

అప్పటివరకూ వాళ్ల మాటలు వింటున్న లక్ష్మీపతి.. ఆరాధ్య అందాన్ని తలచుకుంటూ, అంతులేని సంతోషంతో గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నాడు.

***

ఆరాధ్య పుట్టిన మూడేండ్లకు ఆమెకు అమ్మవారు పోసింది. చావుబతుకుల మధ్య ఉన్న కూతుర్ని తీసుకొని, పోలేరమ్మ గుడికి వచ్చింది ఆమె తల్లి మంగమ్మ. కూతురు ప్రాణాపాయం నుండి బయటపడితే జోగినీగా మారుస్తానని మొక్కుకుంది. కానీ, కాలక్రమంలో 'జోగినీ వ్యవస్థ నిరోధక చట్టం' వచ్చిందని తెలుసుకొని, కూతుర్ని పట్నం పంపించి చదివించింది.

విలాస పురుషుడైన లక్ష్మీపతికి మంగమ్మ మీద కోపం వచ్చినా, తన కొడుకు అప్పుడే

రాజకీయ ప్రవేశం చేయడంతో, అతని రాజకీయ భవిష్యత్తుకు భంగం వాటిల్లకూడదని అప్పటికా విషయాన్ని పక్కనపెట్టాడు. కానీ, ఇప్పుడు ఆరాధ్య అందాన్ని చూసిన లక్ష్మీపతికి వికారపు ఆలోచనలు మొదలయ్యాయి. వెంటనే తన కర్తవ్యం ఏంటో ఆలోచించాడు.

తండ్రి పరిస్థితి ఇలా ఉంటే.. కొడుకు పరిస్థితి ఇంకోలా ఉంది.

'సద్గుణాలు, ఆత్మస్థైర్యం, తెగువ, అందం కలిగిన అమ్మాయి భార్యగా వస్తే.. తన జీవితం 'తిలక్ అమృతం కురిసిన రాత్రి'లా మధురంగా, మనోహరంగా ఉంటుంది. కానీ, ఒక చాకలి అమ్మాయిని పెండ్లి చేసుకోవడానికి తండ్రి ఒప్పుకొంటాడా?' అని ఆలోచిస్తున్నాడు శ్రీపతి.

వారంరోజులు ఉంటానని వచ్చిన లక్ష్మీపతి, కొడుకుతో చెప్పి వెంటనే ఊరు బయల్దేరాడు. తండ్రి ఎందుకింత అకస్మాత్తుగా వెళ్తున్నాడో అర్థంకాలేదు శ్రీపతికి. కానీ, తండ్రిని ప్రశ్నించే ధైర్యం లేదతనికి. అందుకే, క్షేమంగా వెళ్లమనీ.. ఇంటికెళ్లిన వెంటనే ఫోన్ చేయమనీ చెప్పి తన పనిలో నిమగ్నమయ్యాడు.

ఊరు చేరుకున్న వెంటనే.. లక్ష్మీపతి మంగమ్మకు కబురు పంపాడు.

'దండాలు దొర.. రమ్మని కబురుచేసింద్రట. బట్టలున్నయ్యా ఉతికెతందుకు?' అడిగింది మంగమ్మ.

'ఎప్పుడూ లేనిది ఇప్పుడెందుకు పిలిపించారో? తానేం తప్పు చేశానో?' అని అర్థంకాక భయం భయంగా చూస్తున్నది.

'ఏం మంగమ్మ.. దేవుడికి మొక్కిన మొక్కులు మర్శిపోయినట్టున్నవ్'.. డొంకతిరుగుడు మాటలెందుకని నేరుగా అడిగాడు లక్ష్మీపతి.

'ఏం మొక్కు దొర ' అంటూ.. అసలు తాను ఏం మొక్కుకుందో గుర్తురాక నెత్తి గోక్కుంది చాకలి మంగమ్మ.

'ఏమే.. ఒళ్లు బలిశిందా? పోలేరమ్మ మొక్కునే మర్శిపోయినవా?' హూంకరించాడు లక్ష్మీపతి.

'మట్టిబుర్ర దొర.. యాదికిలేదు. తప్పు మన్నించి, గదేందో శెప్పు దొర' వణికిపోతున్న చేతులను జోడిస్తూ అడిగింది మంగమ్మ.

'నీ బిడ్డకు అమ్మవారు పోసినప్పుడు జోగినీగా మారుస్తనని ఊరందరి ముందు.. పోలేరమ్మ గుడిలో మొక్కిన మొక్కు మర్శిపోతే ఎలాగే? ఇప్పుడు సూడు.. పోలేరమ్మకు కోపమచ్చింది. ఊరంతా కరువుతో కటకటలాడుతంది. ఇప్పుడు నీ మొక్కుబడి ప్రకారం నీ బిడ్డను జోగినీగా మార్చు' గంభీరంగా అన్నాడు లక్ష్మీపతి.

అంతవరకూ వణికిపోతూ.. వంగివంగి దండాలు పెట్టిన మంగమ్మ, అతడి మాటలు వినగానే రౌద్రమూర్తి అయ్యింది.

22 katha 1-203 page-1_Layout 1 9/25/2021 3:32 PM Page 114

'ఏంది దొరా.. నా బిడ్డను జోగినీగా మార్చాల్నా? నీకు గత్తర్రాను. నీ బతుకు శెడ. ఎంతమంది ఆడిబిడ్డల ఉసురు పోసుకుంటవ్? ఇంకోసారి గా మాటంటే.. నిన్నే ఆ పోలేరమ్మకు బలిత్త! నా బిడ్డను జోగినిగ మారుత్తనని మొక్కిన. నిజమే! గానీ, గట్ల శెయ్యొద్దొన్ని సర్కారే ఖానూన్ చేసింది. నువ్వు యాది మర్శినవా దొర. సదువుల సరస్వతి.. నా బిడ్డ. పట్నంల కొలువు జేత్తంది. ఇంకొసారి నీ పాడుకండ్లు నా బిడ్డమీద పడ్డయంటే.. సాకలి బండకేసి దంచుత.. యాదికుంచుకో.. నా బిడ్డ జోలికి రాకుంటే నీకే మర్యాద'

ఎందరో ఆడబిడ్డలను జోగినీలుగా మార్చి, వాళ్ల బతుకులను బుగ్గిపాలు చేసిన లక్ష్మీపతి.. తన బిడ్డనూ జోగినీగా మారుస్తాననే సరికి విచక్షణ కోల్పోయింది మంగమ్మ. ఊరిపెద్ద అనే విషయం మర్చిపోయి.. చెడామడా తిట్టి, అక్కడి నుండి వెళ్లిపోయింది.

***

మంగమ్మ చేసిన అవమానాన్ని లక్ష్మీపతి భరించలేకపోయాడు.

అంతవరకూ అక్కడే ఉన్న లక్ష్మీపతి అనుచరుడు రంగయ్య.. జరిగిన విషయాన్నీ, మంగమ్మ చేసిన అవమానాన్నీ వెంటనే మంత్రి శ్రీపతికి చేరవేశాడు.

అంతవరకు ఆరాధ్యను పెండ్లి చేసుకుందామనుకున్న శ్రీపతి, తండ్రికి జరిగిన అవమానానికి పగ తీర్చుకోవాలని నిర్ణయించుకున్నాడు.

అప్పటివరకూ ఎంతో సౌమ్యంగా, మర్యాదగా మాట్లాడిన మంత్రి, ఆ రోజు నుంచి ఆరాధ్యతో చాలా కఠినంగా, అగౌరవంగా మాట్లాడటం మొదలుపెట్టాడు. మంత్రి ప్రవర్తనలో అకస్మాత్తుగా ఎందుకింత మార్పు వచ్చిందో అర్థంకాలేదు ఆరాధ్యకు.

తరువాత తన అనుచరులను మంగమ్మ ఇంటికి పంపించి, ఆమె గుడిసెను కూలగొట్టించాడు లక్ష్మీపతి. మొక్కును తీర్చుకోకుంటే ఊరినుండి వెలేస్తానని బెదిరించాడు.

ఊరి పెద్దను కాదని ఆ ఊరిలో బతకలేక, కూతురి బతుకు బుగ్గిపాలు చేయలేక.. కన్నీటితో ఉన్న ఊరిని విడిచి కూతురు దగ్గరికి బయల్దేరింది మంగమ్మ. తల్లిద్వారా జరిగిందంతా తెలుసుకున్న ఆరాధ్యకు.. అప్పుడు అర్థమైంది శ్రీపతి ప్రవర్తనలో మార్పుకు కారణం. అయినా, ఏమీ తెలియని దానిలానే మౌనంగా శ్రీపతి దగ్గరకు వెళ్లింది.

'ఏంటి? మొహం అలా వాడిపోయి ఉంది. మీ అమ్మ వచ్చేసిందా?' అన్నాడు మంత్రి శ్రీపతి వెటకారంగా నవ్వుతూ.

'నన్ను క్షమించండి సార్.. అమ్మ పాతకాలం మనిషి. అందుకే, తొందరపడి పెద్దయ్యగారిని తిట్టింది'

'ఆరాధ్యా.. నువ్వు క్షమాపణ చెప్పినంత మాత్రాన ఊరిలో మా తండ్రికి జరిగిన అవమానం మాసిపోదు. నేను నిన్ను పెండ్లి చేసుకోవాలనుకున్నాను. కానీ, ఇప్పుడు కాదు. మా నాన్న అన్నట్లుగా నువ్వు జోగినీగా మారాల్సిన అవసరం లేదు. ఎందుకంటే, అది చట్ట

వ్యతిరేకం. కానీ, నువ్వు జీవితాంతం నాకు ఉంపుడుగత్తెగా ఉండాలి. అప్పుడే మా తండ్రికి జరిగిన అవమానానికి లెక్కసరిపోతుంది' తన రాక్షసత్వాన్ని కురిపిస్తూ కఠినంగా శాసించాడు మంత్రి శ్రీపతి.

'సరే సార్.. కానీ, మా అమ్మను ఊరినుండి వెలివేయకండి. నా తండ్రి జ్ఞాపకాలతోనే బతుకుతున్న ఆమె.. ఈ పట్టణంలో ఉండలేదు. నిన్నటి నుండి పచ్చి మంచినీళ్లుకూడా తాగలేదు' అంటూ కన్నీళ్లతో వేడుకుంది ఆరాధ్య.

తెగువ, తెలివితేటలున్న ఆరాధ్య.. తల్లికోసం లొంగిపోతుందని ఊహించని శ్రీపతి, ఆశ్చర్యపోయాడు.

'సరే.. మీ అమ్మ ఊర్లో ఉండాలంటే, మా తండ్రి కాళ్లపై పడి క్షమాపణ చెప్పాలి. అయినా, మా బట్టలుతికి బతికే చాకలిదానికి.. ఎందుకే అంతపొగరు? ఇప్పుడు నువ్వు పెళ్లీపెటాకులు లేకుండా.. పూజకు పనికిరాని పువ్వులా ఉంటూ, నీ జీవితం నా చేతుల్లో బలవుతుంటే.. అప్పుడు మా నాన్న పగ చల్లారుతుంది. నువ్వు ఇప్పుడే నా కోరిక తీర్చాలి' అన్నాడు అసభ్యకరంగా మాట్లాడుతూ.

'అమ్మను ఊరు పంపించి.. నా బట్టలు సర్దుకొని వచ్చేస్తాను సార్. మీకు నాపై నమ్మకం లేకుంటే.. మీ అనుచరులను నాతో పంపించండి' అతని మాటలకు ఒంటిపై తేళ్లూ జెర్రూ పాకుతున్నంత అసహ్యం వేస్తున్నా.. ముఖంలో ప్రశాంతత కోల్పోకుండా మాట్లాడింది ఆరాధ్య.

తల్లికోసం పూర్తిగా లొంగిందని భావించిన శ్రీపతి.. 'అవసరం లేదు.. మీ అమ్మకు నచ్చచెప్పి, మా నాన్న కాళ్లపై పడి క్షమించమని అడగమని చెప్పు. ఇక వెళ్లు. రేపు ఉదయాన్నే రా' అని ఆదేశించాడు.

అతని ముఖంలో రాక్షసానందం ఉప్పొంగింది. ఆరాధ్య అందాన్ని తలుచుకొని.. మధ్యాహ్నం కునుకుతీశాడు మంత్రి శ్రీపతి.

***

'సార్.. లేవండి. ఒక్కసారి టీవీ పెట్టండి' అరుచుకుంటూ మంత్రి గదిలోకి వచ్చాడు సత్యవేలు.

అతని అరుపులకు ఉలిక్కిపడి లేచి.. 'ఏమైంది రా.. ఎందుకలా అరుస్తున్నావ్? కొంపలేం మునిగాయని' మంచి నిద్ర చెడగొట్టాడన్న కోపంలో చిరాగ్గా అన్నాడు శ్రీపతి.

'నిజంగానే కొంపలు మునిగిపోతున్నాయ్. ముందు మీరు టీవీ పెట్టండి సార్' కంగారుగా అన్నాడు సత్యవేలు.

'నువ్వా.. నీ వెధవ కంగారు..' అంటూ టీవీ ఆన్ చేశాడు శ్రీపతి.

..'ఈ కరోనా కష్టకాలంలో ప్రజల యోగక్షేమాలు మరిచి, 1988లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకువచ్చిన జోగినీ వ్యవస్థ నిర్మూలన చట్టానికి వ్యతిరేకంగా.. సాంప్రదాయాల పేరుతో సాంఘీక దురాచారానికి మరలా బీజం వేయబోయిన మంత్రి శ్రీపతి..' అంటూ అన్ని టీవీ ఛానళ్లలోనూ అదే వార్త వస్తున్నది. వాటిని చూసి, భయంతో నిలువునా వణికిపోయాడు మంత్రి శ్రీపతి.

'టీవీలోనే కాదు సార్.. ఈ వార్త అన్ని సామాజిక మాధ్యమాల్లోనూ హల్‌చల్ చేస్తున్నది'.. మంత్రి పరిస్థితి ఏంటో అర్థంకాక చెప్పాడు సత్యవేలు.

అప్పటికి అర్థమైంది శ్రీపతికి.. తాను చేసిన తప్పు..

ఆరాధ్య ధైర్యం, ఆత్మస్థైర్యం, తెలివితేటలు, తెగువ తెలిసికూడా తల్లికోసం లొంగిపోయిందనుకొని.. వెనుకా ముందూ చూడకుండా విజయగర్వంతో వాగిన వాగుడుని సీక్రెట్ కెమెరాతో రికార్డ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసిందని. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ఇప్పుడు ఆలోచించి లాభం లేకపోయింది అతనికి.

ప్రభుత్వం అతనిని మంత్రి పదవి నుండి తొలగించి, పార్టీ నుండి పూర్తిగా బహిష్కరించింది. పోలీసులు అరెస్టు చేసి, శ్రీపతిపై నాన్ బెయిలబుల్ కేసు పెట్టారు. ఆరాధ్య తెలివితేటలను, సమయస్ఫూర్తిని అభినందిస్తూ, అందరు ఆడపిల్లలూ ఆరాధ్యలా ధైర్యంగా ఆలోచిస్తే.. ఎంత గొప్పవాడైనా ఆడవాళ్ల జోలికి రావడానికి భయపడతారనీ, శ్రీపతికి కఠిన శిక్ష పడేలా చేస్తానని మాట ఇచ్చారు ముఖ్యమంత్రిగారు.

భగవత్ ప్రార్థనలో జీవితాన్ని కడతేర్చాల్సిన వయసులో వచ్చిన పాడు ఆలోచన.. తన బిడ్డ జీవితాన్ని నాశనం చేసిందన్న బాధతో మంచం పట్టాడు లక్ష్మీపతి.

## గౌరీ పొన్నాడ

*స్వస్థలం శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం తోపలి గ్రామం. పదహారేండ్లకే వివాహమైనా, భర్త మధుసూదన రావు ప్రోత్సాహంతో ఉన్నత విద్యనభ్యసించారు. బీఎస్సీ, బీఈడీ పూర్తి చేసి, ప్రస్తుతం ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. తాతగారి దగ్గర కథలు వింటూ పెరిగిన వీరు, బాల్యం నుంచే కథలపై మక్కువ పెంచుకున్నారు. అయితే, ఇటు కుటుంబ బాధ్యతలు.. అటు విధుల నిర్వహణ వల్ల కథలు రాయడంపై దృష్టి పెట్టలేకపోయారు. గతేడాది వచ్చిన లాక్‌డౌన్‌లో ఖాళీ సమయం దొరకడంతో కథలు రాయాలనే ఆలోచన చేశారు. వీరు రాసిన మొట్టమొదటి కథ 'ప్రేమకు వయసు లేదు'. రెండోది.. ఇప్పుడు బహుమతి పొందిన 'ఆరాధ్య'. కరోనా కవితలు, వ్యాసాల పోటీలో ప్రథమ బహుమతిని గెలుపొందారు. 'ప్రతిలిపి' నిర్వహించిన 'సైన్స్ ఫిక్షన్' పోటీలో రెండో బహుమతి, 'సహరి' పత్రిక నిర్వహించిన ఉగాధి కథల పోటీలో కన్సోలేషన్ బహుమతిని అందుకున్నారు.*

# నిర్వాణ

ప్రొఫెసర్ రామా చంద్రమౌళి

**93901 09993**

***మనిషికి రెండు జీవితాలు. ఒకటి పూర్తిగా భౌతికమైంది. మరొకటి భౌతికేతరమూ, అభౌతికమూ అయింది. నిరంతరం వర్తమాన సంక్లిష్ట భౌతిక జీవితంలోనే నలిగిపోతున్న ఈ తరాన్ని, ఒక భౌతికాతీత జీవితంలోకి నడిపించుకుపోవాలనే ఈ కథ.***

కాలం నది. అది ఎప్పుడూ గర్జిస్తూ, ఉద్ధృతమవుతూ, శాంతిస్తూ, అంతఃఝురులతో ఘర్షిస్తూ కూడా నిలకడగా ముందుకే, మున్ముందుకే ప్రవహిస్తూ వెళ్తుంది. నది వెనుదిరగడమూ, ఆగి వెనక్కి చూసుకోవడమూ ఉండదు. వ్యతిరిక్త ప్రవాహమూ ఉండదు.కాలం కూడా అంతే. ముందుకు దూసుకుపోవడమే! ఈరోజు పుట్టిన మనిషికి రేపు రెండ్రోజుల వయసు. తర్వాత మూడు రోజులు, ఒక నెల, ఆరు నెలలు, ఆరేండ్లు. వయసు పెరగడమే, తరగడముండదు. మనిషి పాతబడటం, వస్తువులు పాతబడటం, ప్రపంచం పాతబడటం, సకల చరాచర సృష్టంతా పాతబడుతూ ఉండటం. ఇదంతా ఒక అర్థం కాని అభౌతిక క్రీడ.

మనిషి ఈ కాలమనే మహాప్రవాహంలో ఎదురీదుతూ గతంలోకి, గతాంతర జీవితంలోకి, వార్ధక్యం లోనుండి మళ్లీ యవ్వనంలోకి, బాల్యంలోకి, అక్కడినుండి గత జన్మల్లోకి, అంతకు ముందటి ప్రాచీనతల్లోకి, మూలాల్లోకి, 'ఆది' లోకి పునర్యానించగలడా? ప్చ్.. ఏమో! అంటే అట్లా రెగ్రెస్ అవుతూ గతంలోకి అభిక్రమించడమంటే మనిషి గతజన్మల స్పృహలోకి వెళ్తూ తనను తాను తరచి తరచి తెలుసుకుంటున్నట్టేనా?

76 ఏండ్ల విశ్రాంత శాస్త్రవేత్త విశ్వనాథం. కండ్లు మూసుకున్నాడు నిశ్శబ్దంగా, మౌనంగా, నిర్వికారంగా. అతను అప్పుడు ప్రశాంత సముద్రంలా ఉన్నాడు, గంభీరమై. విశ్వనాథం హైదరాబాద్ గచ్చిబౌలీలో ఎల్అండ్టీ వాళ్లు నిర్మించిన బహుబ్లాక్ల పోష్ అపార్ట్మెంట్లలో, జే బ్లాక్ 12వ అంతస్తులోని 1204వ నంబర్ 4బీహెచ్కేలోని విశాలమైన నైరుతి బెడ్రూంలో. వెన్నెల పరుపులతో చేసినట్టున్న కింగ్సైజ్ బెడ్పై అచేతనంగా పడుకొని ఉన్నాడు. అతని మనసు కల్లోల కడలిలా

ఉంది. శరీరం రాలిపోయిన బొండు మల్లెపువ్వులా వాడిపోయి ఉంది. 'జీవితం ఏమిటి?' అని అతని హృదయం చాలా రోజులుగా తనలో తానే తర్కిస్తున్నది.

బ్రతుకంతా ఎన్నో, ఎన్నెన్నో పరిశోధనలు చేసి, కొత్తకొత్త జీవశాస్త్ర రహస్యాలను కనుక్కొని, మనుషుల దీర్ఘవ్యాధులకు ఔషధాలను రూపకల్పన చేసి, పేటెంట్స్‌ను సంపాదించి..

కండ్లు మూసుకుంటే. జాతీయ, అంతర్జాతీయ శాస్త్రవేత్తల సదస్సుల్లో హర్షాతిరేకంతో తాను జీవశాస్త్ర మూలాలను ఆవిష్కరిస్తూ కీలక రహస్యాలను విప్పి చెబుతూండగా ప్రపంచ ప్రసిద్ధి చెందిన మేధావులు కరతాళ ధ్వనులు చేస్తున్నపుడు పొందిన మహోద్వేగ ఘడియలు.

'అవన్నీ ఇప్పుడేవి? ఆ అమృత క్షణాలేవి?'

విశ్వనాథం ఒంటరి. భార్య వెళ్లిపోయింది, యేడాది క్రితం. ఒక్కగానొక్క కొడుకు గూగుల్ దక్షిణాసియా అధిపతి. ఊపిరి తీసుకోవడానికి

కూడా సమయం ఉండని ఉద్యోగం. ఇక ఎవ్వరూ లేరు అతనికి.

'అసలు మనిషికి ఏమి కావాలి?' అని ప్రశ్న.

ఎన్నో ఆధ్యాత్మిక, తాత్త్విక మానసిక శాస్త్ర గ్రంథాలన్నిటినీ ఆపోసన పట్టి..

'అంతిమం ఏమిటి?' అని తర్కం.

'చివరి తీరం, ఆఖరి అవధి, అవతలి ఒడ్డుపై.. ఏమున్నది?'

విశ్వనాథానికి తాను ఎంతో ఆరాధించే భారతదేశ మహోన్నత గ్రంథం 'భగవద్గీత' జ్ఞాపకమొచ్చింది.

'నేను ఈ ప్రపంచానికి అత్యంత ప్రాచీనకాలం నుండి జ్ఞానాన్ని దానం చేస్తున్న పవిత్ర పుణ్యభూమి భారతదేశంలో పుట్టినందుకు గర్విస్తున్నాను' అని ఎన్నెన్నో వేదికలపై ఉద్వేగంతో చెప్పిన విషయం విశ్వనాథం మనసులో కదలాడి, చప్పున అతని కండ్లనిండా నీళ్లు పొంగుకొచ్చాయి.

'భగవద్గీత' శ్లోకాలు మొత్తం అతనికి కంఠతా వచ్చు. మానవులను సన్మార్గంలో నడిపే మంత్రాలవి, విశ్వనాథం దృష్టిలో.

నాల్గవ అధ్యాయం జ్ఞానయోగంలో..

బహూనిమే వ్యతీతాని<br>
జన్మాని తవ అర్జున,<br>
తాన్యహం వేద సర్వాణి<br>
న త్వం వేత్థ పరంతప

.. అర్జునా! నాకును, నీకును పెక్కుజన్మలు గడిచినవి. నేను వాటినన్నిటినీ

ఎరుగుదును. కానీ, నీవు ఎరుగవు. మరిచితివి. ధర్మాధర్మాది సంస్కారములచేత నీ జ్ఞానశక్తి ఆవృతమైనది. నీవు మాయాధీనుడవు. కానీ, నేను నిత్యశుద్ధ బుద్ధముక్త స్వభావుడను. అలుప్త, విద్యాశక్తినీ, మాయాధీశుడనూ అగుటచే నా జ్ఞానశక్తి సర్వదా అనావృతము.

'అంటే, తనకు గతజన్మల వృత్తాంతం ఏదీ స్ఫురించదా?'

అటు బౌద్ధంలో 'ఆలారకాలాముడూ' ,

'ఉద్దక రామపుత్రుడూ' అనే ఇద్దరు యోగిపుంగవుల దగ్గర సంజ్ఞానా సజ్ఞాయతన, నిర్వికల్ప సమాధి విద్యలను నేర్చుకొని, అంతిమంగా.. మగధరాజ్యంలోని ఉరువేల అంటే ఇప్పటి బుద్ధగయకు చేరుకున్న సిద్ధార్థుడు. తన 35 ఏండ్ల వయసులో సంబోధి అంటే సంపూర్ణ జ్ఞానోదయం కలిగి బుద్ధుడయ్యాడు. బుద్ధుడు ప్రవచించిన సత్యం ఏమిటంటే ధ్యానం, ఏకాగ్రతే సమాధి స్థితి కాదు. ఆ రెంటికీ మించిన స్థితి, ధ్యానంలోకి వెళ్లగలిగిన బౌద్ధభిక్షువు హృదయంలో ఆనందం ఉద్భవిస్తుంది. అతడు నాలుగు ధ్యాన దశలను అధిగమిస్తాడు. శరీరాన్ని, మనసునూ పవిత్రత, స్వచ్ఛత ఆవరిస్తాయి. ఆ దశలో చతురార్య సత్యాలైన 'లోకంలో దుఃఖం ఉంది', 'దుఃఖానికి కారణం ఉంది', 'దుఃఖాన్ని నిరోధించవచ్చు', 'దుఃఖ నిరోధానికి మార్గం ఉంది' అన్న గ్రహింపుతో అర్థం చేసుకొని..

సుఖాపేక్ష, అస్తిత్వాపేక్ష, అవిద్య అనే మూడు మహాదోషాలు ఎలా మొదలవుతాయో? ఎలా అంతమవుతాయో? గ్రహిస్తాడు. అప్పుడు ఆ బౌద్ధభిక్షువు తన పూర్వజన్మ పరంపరనే కాకుండా ఇతరుల గతజన్మలనుకూడా మనోనేత్రంతో దర్శించి అర్థం చేసుకుంటాడు.

ఈ చతురార్య సత్యాలేకాక అష్టాంగమార్గం అంటే సమ్యక్ దృష్టి, సమ్యక్ సంకల్పం, సమ్యక్ వాక్కు, సమ్యక్ కర్మ, సమ్యక్ జీవనం, సమ్యక్ కృషి, సమ్యక్ స్మృతి, సమ్యక్ సమాధి.. ఇదంతా ఒక అనంత ప్రయాణమై, బౌద్ధ ధర్మసార సంగ్రహణంగా 'నిర్వాణం' ప్రాప్తమవుతుందని సారాంశం.

'అసలు ఈ 'నిర్వాణం' అంటే ఏమిటి?'

..'నిర్వాణం' అనేది బుద్ధుడి ప్రవచనం ప్రకారం చావు, పుట్టుకలు, వ్యాధులు, దుఃఖాలు లేని అనిర్వచనీయ, నిరుపమాన స్థితి. మనం ఊహిస్తున్నట్టుగా మరణానంతరం కూడా ఈ జన్మలోనే, బతికి ఉండగానే పొందగలిగిన స్థితి. ఆనందమయమైన ప్రశాంత స్థితి. ఒక్కమాటలో చెప్పాలంటే, ధార్మిక జీవనానికున్న అత్యున్నత లక్ష్యం నిర్వాణం. నిర్వాణ పథాన్ని పొందిన సాధకుడు మరణ భయాతీతుడు.

'పునఃపునః జన్మలు, పునఃపునః మరణాలు.. ఈ ప్రత్యయ అప్రత్యయాలు ఏమిటి?'

కుండలినీ చక్రాలు మూలాధార చక్రం నుండి మొదలై స్వాధిష్ఠాన, మణిపుర, అనాహత, విశుద్ధ, ఆజ్ఞా, సహస్రార సప్తచక్రాలుగా విస్తృతమవుతాయి. ఈ సహస్రార చక్రమే పినైల్ గ్లాండ్. మూడో కన్నుగా పరివర్తించి, దివ్యదృట్యష్టిగా మారి..

విశ్వనాథానికి తను ఎటో కాలంలోకి అంతరిక్షం నుండి రాలిపోతున్న నక్షత్రంలా పతనమైపోతూ, రివ్వున దూసుకుపోతూ..

**జీవిత చరమం ఇంత భయంకరంగా ఉంటుందా? 'చచ్చిపోతే బాగుండును' అని ఆయన రోజుకు కనీసం వంద సార్లయినా అనుకునుంటాడు కండ్లనిండా నీళ్లతో. కానీ, చావు రాదు, పిలువగానే. మృత్యుదేవత తల్లి లాంటిది. ఏడుస్తూ పిలువగానే రాదు. 'మదర్ నోస్ వెన్ టు ఫీడ్ ద చైల్డ్' . తను రావలసినప్పుడే వచ్చి పరిష్వంగిస్తుంది.**

ఇప్పుడు తాను ఆనందుడు. బుద్ధుడి అనుంగ సహచరుల్లో ముఖ్య అనుచరుడు. కపిల వస్తుపురం, మగధ రాజ్య 'వేణువనం', మృగదావనం, త్రిశరణాలు.. 'బుద్ధం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి', ఏవేవో ద్వారాలు తెరుచుకుంటూ, ఆకాశాలు విచ్చుకుంటూ అడవులు బాహువులను చాస్తూ ఆహ్వానిస్తూ సముద్రాలు, వనాలు, వసంతాలు, జలపాతాలు, నదీ సంగమాలు.. అంతా ఒక వినూత్న మాయామేయ సంచలితోగ్న సంభరితం.

ఒకదాని వెంట మరొక జన్మ, మరొక మరణం. ఇంకొక పుట్టుక, ఇంకొక చావు. చక్రమేదో నిరంతరంగా పరిభ్రమిస్తూ నీడలు వెలుగులు, చీకట్లు వేకువలు, మెళకువలు నిర్నిద్రలు..

తెగిపోతున్నాడు తను. గగనోద్ధతినుండి ఇటు ఈ పాతాళాంతరాల్లోకి.

బెల్ మోగుతున్నది. 'ఙ్ ఙ్ ఙ్ ఙ్ ఙ్' అని నిరంతరంగా. సమాంతరంగా ఇటు పక్కనున్న మొబైల్ ఫోన్‌కూడా.

విశ్వనాథం ఉలిక్కి పడ్డాడు. రాలిపడ్డాడు, చటుక్కున స్పృహలోకి. కండ్లు తెరిస్తే ఎదుట గోడపై గడియారంలో తొమ్మిదీ నలభై నిమిషాలు.. రాత్రి.

బుద్ధుడి అనుచరుడైన తాను ఆనందుడు. బుద్ధుడి బోధనలన్నిటినీ క్రోడీకరించి కూర్చిన 'త్రిపిటకాలు', స్పృహ. త్రి అంటే మూడు. పిటకాలు అంటే గంపలు. మూడు గంపలు వినయ పిటక, సుత్త పిటక, అభిదమ్మ పిటక. మూడు గంపలనిండా అనంత జ్ఞానం. జ్ఞానమయ, కాంతిమయ, శాంతిమయ, మహితాత్మమయ మనోజ్ఞ భూమి ఈ తన భరతభూమి.

బెల్ ఇంకా మోగుతూనే ఉంది. విశ్వనాథం కదలలేదు, అచేతనుడు. రెండు కాళ్లూ పడిపోయి, ప్యారలైజ్ అయి కింది లోయర్ బాడీ మొత్తం అచేతనం. అప్పర్ పార్షియల్లీ ఫంక్షనల్. కాళ్లు కదలవు, చేతులు కదులుతాయి. కానీ, పనిచేయవు.

తను బతికుంటాడు. కానీ, చచ్చిపోయి శ్వాసిస్తూ..

'జీవన్మృతుడా తను?'

విశ్వనాథం ఒంటిపైన ఒక అందమైన పట్టు జలతారు వంటి దుప్పటి ఉంది. పాదాలపైనుండి ఛాతీవరకు. దుప్పటి కింద అంతా నగ్నం. పిరుదులకింద ఒక లాట్రిన్ బౌవెల్ అటాచ్డ్. మోటరైజ్డ్. సెల్ఫ్ క్లీనింగ్ అండ్ స్కావెంజింగ్. ప్రెషరైజ్డ్ ఎయిర్ ఆపరేటెడ్.

దొడ్డికి వచ్చినప్పుడు కుడిచేతికి దగ్గర్లో ఉన్న టచ్ బటన్‌ను స్పర్శిస్తే మోటార్ ఆన్ అయి బౌవెల్‌లో పడ్డ మలాన్ని బయటకు తన్నుకుపోయి, సానిటైజర్ ద్రవాన్ని చిమ్మి శుభ్రపర్చి.. క్షణాల్లో అంతా మామూలు. ఆ అద్భుతమైన మెషీన్‌ను కొడుకు ఆరు నెలల క్రితం స్విట్జర్‌ల్యాండ్ నుండి తెప్పించి, ఇన్‌స్టాల్ చేయించాడు.

లేకుంటే నరకమే. చచ్చుబడి పోయిన శరీర కిందిభాగం మలమూత్రాల విసర్జన తాలూకు సంకేతాలను మాత్రం ఇస్తుంది. కానీ, చర్యలు తెలియవు విశ్వనాథానికి.

జీవిత చరమం ఇంత భయంకరంగా ఉంటుందా? 'చచ్చిపోతే బాగుండును' అని ఆయన రోజుకు కనీసం వంద సార్లయినా అనుకుంటాడు కండ్లనిండా నీళ్లతో.

కానీ, చావు రాదు, పిలువగానే. మృత్యుదేవత తల్లి లాంటిది. ఏడుస్తూ పిలువగానే రాదు. 'మదర్ నోస్ వెన్ టు ఫీడ్ ద చైల్డ్' . తను రావలసినప్పుడే వచ్చి పరిష్వంగిస్తుంది.

హాల్, అపార్ట్‌మెంట్ అంతా అతినిశ్శబ్దంగా, బంగారు పాముల పుట్టలా ఉంది. ఆయన దగ్గర నర్సింగ్ డ్యూటీలో ఉండే మిసెస్ బెంజమిన్ ఈరోజు రాదు. ఆమె బిడ్డ పెండ్లి. ఇంకా రెండు దినాలూ రాదు. ఔటాఫ్ స్టేషన్. ఇంకెవరినో ఏర్పాటు చేసింది ప్రతిగా. కానీ అతనో, ఆమెనో రాలేదు.

డబ్బు ఉంటే అన్ని సౌకర్యాలూ. అయినా, అన్ని సేవలూ అందవనీ, ముఖ్యంగా ప్రేమ దొరకదనీ విశ్వనాథానికి ఎప్పుడో అర్థమైంది.

కుడిచేతి దగ్గరున్న 'లేజర్ కంట్రోలర్' ను సుతిమెత్తగా నొక్కాడు. 30 ఫీట్ల దూరంలో ఉన్న సింహద్వారం తెరుచుకుంది నాజూగ్గా. అప్పుడర్థమైంది విశ్వనాథానికి, బయట అతిభయంకరంగా వర్షం కురుస్తున్నదని. వాన చప్పుడు భీకరంగా. దర్వాజా దగ్గర నిలబడి ఒక యువతి, వర్షంలో తడిసి ముద్దయి. ఒంటినుండి నీళ్లు ధారలు ధారలుగా కారుతూ.

ఒంటిపైన అతినల్లగా తడిచిన టీషర్ట్. చేతిలో నల్లటి సంచి. ముఖంపై కాంతివంతంగా మెరుస్తూ నవ్వు. గడప దగ్గరే ఉండిపోయి, 'సర్.. స్విగ్గీ ' అన్నది.

స్విగ్గీ, జొమాటో.. హంగ్రీ సేవర్స్‌కు ఒక కండిషన్ ఉంటుంది. డెలివరీ ఇచ్చేటప్పుడు కస్టమర్ ఇంటిగడప బయటే నిలబడి ఫుడ్‌ను డెలివరీ చేయాలని. సేఫ్టీ మెజర్ అది.

విశ్వనాథం క్షణకాలంలో ఒక గంటక్రితం నుండి తన సిక్త్ సెన్స్ అంటే మనసులో నిద్రావస్థలో ఉన్న ఇంట్యూషన్, జరగబోయే సంగతిని ముందే సూచించే భగవత్ నిర్మిత 'ఎక్స్‌ట్రా సెన్సరీ పర్సెప్షన్' న్యూరాన్స్ యాక్టివేట్ అయి.. భారతీయ ప్రాచీన సాహిత్యంలో ఉటంకించిన 'ఆకాశవాణి' ఆదేశాల వంటిది..

'ఒక గంటలో ఎవరో వస్తారు.. ఎవరో వస్తారు.. ఎవరో వచ్చి..' అని.

వచ్చింది ఆ ఆకాశవాణి దూతేనా.. ఈమేనా?

'ప్లీజ్ కమిన్' అని సకల శక్తులనూ కూడగట్టుకొని పలికాడు విశ్వనాథం.

అప్పుడు చూసిందామె, బయటి తలుపు రెక్కపై.

'వేమూరి విశ్వనాథం.. సైంటిస్ట్' అన్న అక్షరాలను. ఒక్కసారిగా ఇంట్రావీనస్ కాల్షియం ఇంజెక్షన్‌ను తీసుకున్నంత విభ్రమానికి లోనై, ఆ హాల్‌లోకి భయం భయంగా నడిచింది. ఒంటినిండా వర్షపు నీళ్లోడుతూనే.

విశ్వనాథం దగ్గరగా వచ్చి పక్కనే నిలబడి, ఆయన కండ్లలోకి చూసింది దయగా, తల్లివలె.

విశ్వనాథం ఎందుకో తీవ్రంగా చలించిపోతూ, ఆమెవైపు అతి నిస్సహాయంగా, దీనంగా సముద్రమంత ప్రేమతో, వాత్సల్యంగా చూశాడు.

అప్పటిదాకా తనకు ఆకలి వేస్తున్నదన్న విషయాన్ని మరిచిపోయిన అతనికి, 'తల్లి దగ్గరికి రాగానే పాలు తాగాలన్న స్పృహ కలిగిన పసి బాలుని' వలె చకితుడై..

'ఇప్పుడీమె నాకు ఆహారాన్ని తెచ్చిందా? ఒక కప్పు పెరుగన్నం.. ఇంత రాత్రి. ఇంత భీకర వర్షంలో తడుస్తూ, అమ్మవలె, కన్న తల్లివలె' అనుకున్నాడు కన్నీళ్లతో సుడి తిరిగిపోతూ.

'సర్.. కర్డ్ రైస్' అన్నదామె. ప్రతిగా అతనేమీ మాట్లాడలేకపోయాడు. ఎందుకో అతని గొంతు గద్గదమై, ఒట్టి కన్నీళ్లు లావాలా పొంగి చిమ్ముకొచ్చాయి. తలూపాడు, చిన్న పిల్లాడిలా. ఆమె ఒంటి పైనుండి కారుతున్న వాననీటిని కొద్దిగా తుడుచుకుంటూ, వీపుకున్న బ్యాగ్‌లోనుండి ఒక అందమైన, మెరుస్తున్న సిల్వర్ పేపర్ ప్యాకెట్‌ను బయటకు తీసి, అతి వినయంగా, అతిప్రేమతో దాన్ని పక్కనున్న టీపాయ్‌పై పెట్టింది. పెట్టి విశ్వనాథాన్ని జాగ్రత్తగా, సానుభూతితో, దయతో

పరిశీలనగా పరికించింది. అంతా అర్థమైందామెకు.

'సర్.. తినిపించాలా?' అన్నది మళ్లీ.

అతనికిక దుఃఖం ఆగలేదు. ఎక్కెక్కిపడి..

'నేను.. యామిని సర్' తనను తాను పరిచయం చేసుకుంటూ.. వెండి రంగులో ఉన్న పెట్టెమీది వెండిరంగు కాగితాన్ని ఒలిచి..

అప్పటిదాకా 'నాలో ఇంత ఆకలి దాగి ఉందా?' అనిపించిందేమో విశ్వనాథానికి, ఉద్యుక్తుడయ్యాడు మానసికంగా తినడానికి.

అప్పుడు గమనించిందామె, అతని తలగడ దగ్గర ఉన్న అద్భుతమైన పుస్తకం 'డై ఎమ్టీ' బై టోడ్ హెన్రీ.

'ఖాళీగా మరణించు' అని ఆ పుస్తకం. నిత్య సంఘర్షణలతో, కోటి కోరికలతో, ఆపేక్షలతో, స్వార్థపర ఆకాంక్షలతో నిరంతరం శిథిలమైపోయే మనిషి అసలు ఖాళీగా ఉంటాడా ఎప్పుడైనా? మనిషి తనను తాను ఖాళీ చేసుకోవడం ఎంత కష్టమో! అది ఒక ఆత్మపరిత్యాగ దశ. భావాతీత ధ్యానయోగ (Transcendental meditation ) సాధనతో మాత్రమే సాధ్యమయ్యే తురీయ క్రియ. 'ఈయన ఈ పుస్తకాన్ని చదువుతున్నాడా? ఈ అచేతన స్థితిలో' అనుకున్నది యామిని. అతనివైపు అనునయింపుగా చూస్తూ, చేతిలోకి ఒక చెంచా పెరుగన్నాన్ని తీసుకొని, విశ్వనాథం నోటి కందిస్తూ..

విశ్వనాథం నోటిని ఆతృతగా తెరిచాడు.. పక్షి కూనకు తల్లిపక్షి ఆహారాన్ని ముక్కుతో అందిస్తున్నప్పటి పారవశ్య క్షణంలోవలె.

'డై ఎమ్టీ' రాసిన టోడ్ హెన్రీ గురించి ఆలోచించిందామె ఆ కొద్ది క్షణాల్లో, అతనికి అన్నం తినిపిస్తూ.

హెన్రీ ఒక కీలమైన వ్యాపార సదస్సులో పాల్గొన్నప్పుడు ఒక పెద్దాయన ప్రసంగిస్తూ సభికులను అడిగాడట 'ఈ ప్రపంచంలో 'రిచ్ ల్యాండ్' ఎక్కడున్నది?' అని. దానికి ఆ పెద్దల్లో ఒకరు, 'ఆయిల్ గల్ఫ్ దేశాలనీ', ఇంకొకరు, 'ఆఫ్రికాలోని వజ్రాల భూములనీ' .. ఇట్లా అనేకానేక జవాబులు చెప్పారు. కానీ, అంతిమంగా ఆ ప్రశ్నించిన పెద్దాయన చెప్పిందేమిటంటే.. 'అన్నిటికన్నా అతి ధనిక భూమి.. శ్మశానం' అని. అందరూ ఆశ్చర్యపోతూండగా మళ్లీ ఆయనే చెప్పాడు, 'అంతిమంగా ఎవరైనా తన వెంట దేన్నీ తీసుకుపోలేని నిస్సహాయతలో, తనలో, తనతో ఉన్న సకల ఐశ్వర్యాలనూ, అద్భుతమైన ఆలోచనలనూ, జ్ఞానాన్నీ, గమ్యాలను చేరగల నేర్పునూ, అన్నిటినీ మించి ఈ మానవలోకాన్ని పవిత్రంగా ప్రేమించగల దైవత్వాన్ని.. అన్నిటినీ నీ సహ మానవులకు దానం చేసి, నిర్వాణ స్థితిలో ఎవ్వరైనా చేరగలిగేది

ఒక్క శ్మశానానికే గదా!' అని.

అప్పుడు అవాక్కయిన నిశ్శబ్దమే టోడ్ హెన్రీచేత ఈ అద్భుతమైన 'డై ఎమ్టీ' గ్రంథాన్ని రాయించింది.

కానీ, మనిషి తనను తాను ఖాళీ చేసుకోవడం అంత సులువైన విషయం కాదని ఎవరికైనా తెలుస్తుంది, ఆ పుస్తకాన్ని చదువుతున్నపుడు.

యామిని ఊహకు భిన్నంగా విశ్వనాథం ఆమె తినిపిస్తున్న కొద్దీ బాక్స్‌లోని పెరుగన్నాన్ని మొత్తం తిన్నాడు ఆబగా. ఆశ్చర్యపోయిందామె.

తర్వాత ప్రశాంత వదనంతో..

'ఎదురుగా ఆ గోడకు ఎనిమిది ర్యాక్స్ ఉన్నాయమ్మా. దె ఆర్ నంబర్డ్. గో టూ జీరో. ఓపెన్ విత్ దిస్ కీ' అని ఒక తాళం చెవిని తలగడ కిందినుండి తీసిచ్చాడు. అది ధగధగా మెరుస్తున్నది.

'ఆ జీరో ర్యాక్‌లో ఇంకో కీ ఉంటుంది. దాంతో ఓపెన్ ర్యాక్ నంబర్ ఫైవ్, సిక్స్ అండ్ త్రీ' అని ఆయాస పడటం మొదలెట్టాడు.

యామిని ఆ తాళం చెవిని తీసుకొని మౌనంగా వెళ్లి, జీరో అరను తెరిచి, దాని లోపలినుండి మరో నల్లని క్రోమియం కీని తీసుకొని, మొదట ఆయన చెప్పినట్టే.. ఐదో నెంబర్ అరను తెరిచింది. దాన్నిండా దిమ్మదిరిగేట్టు గుట్టలు గుట్టలుగా అన్నీ రెండువేల రూపాయల నోట్ల కట్టలున్నాయి. కొన్ని కోట్లవుతాయవి. ఆ అరను మూసి ఆరో నంబర్ అరను తెరిచింది. దాన్నిండా వజ్రాలు పొదిగిన బంగారు ఆభరణాలు. అవీ అనేక కోట్ల విలువైనవే. దాన్ని మూసి అతను చెప్పిన మూడో నంబర్ అరను తెరిచింది. దాంట్లో.. అతని చెక్ బుక్‌లు ఐదారు. అన్నీ అంతర్జాతీయ బ్యాంకులవి. పక్కనే ఐదారు ఫైల్స్.. తెరిచి చూసింది. అన్నీ విశ్వనాథం కనిపెట్టి, ఈ ప్రపంచానికి ప్రసాదించిన.. మనిషిని వ్యాధులనుండి రక్షించగలిగే పరిశోధనల బాపతు పేటెంట్స్. కోట్ల విలువ గలవి. అయితే, చిత్రంగా ఆమెకు అదే అరలో.. బంగారు రంగు అట్టతో ధగధగా మెరిసిపోతూ లావైన గ్రంథం 'శ్రీమద్భగవద్గీత' కనిపించింది. దాన్ని చేతిలోకి తీసుకొని, మిగతా అరలన్నిటికీ జాగ్రత్తగా మళ్లీ తాళం వేసి, తిరిగి ఆయన దగ్గరికి వచ్చింది. వచ్చి ఎదురుగా నిలబడి, ఆమె చేతిలో అంతకు ముందే ఆయనిచ్చిన ప్రధాన తాళంచెవి ఉంది. అప్రయత్నంగానే యామిని అతన్నీ, అతని తలగడ పక్కనే ఉన్న 'డై ఎమ్టీ' పుస్తకాన్ని చూసింది.. ఒక లిప్తకాలం చిత్రంగా!

సరిగ్గా ఆ క్షణమే విశ్వనాథానికి తనలోని సిక్త్ సెన్స్ అనబడే ఎక్స్ ట్రా సెన్సరీ పర్సెప్టివ్ వ్యవస్థ యాక్టివేట్ అవుతూ.. అర్థం కానిది ఏదో తనను ఆవహిస్తున్నదన్న

సత్యం తెలుస్తుండగా..
యామిని.. 'ఈయన తనకు ఈ తన నిధుల రహస్యాలను చెప్పి.. 'కావాలంటే వీటన్నిటినీ తీసుకుపో' అన్న సజెషన్ ఇస్తూ, తనను తాను ఖాళీ చేసుకుంటున్నాడా?' అనుకున్నది.

విశ్వనాథం అతికష్టంగా అటు పక్కనే ఉన్న మంచం అరలోనుండి ఒక చెక్‌బుక్‌ను తీసి అందించాడామెకు, ఆయాస పడ్తూనే. మొత్తం ఇరవై ఐదు లీవ్స్ ఉన్నాయి. అన్నీ సంతకాలు చేసి ఉన్న బ్యాంక్ చెక్స్. దాన్ని యామిని చేతిలో పెట్టి భారంగా కండ్లు నిలకడగా ఉంచి చూస్తూండగా..

ఇక ఆలస్యమవుతున్నట్టుగా గ్రహించి, యామిని ఒంటి పైనుండి వర్షపు నీరు కారుతుండగానే తన స్విగ్గీ బ్యాగ్ లోనుండి ఒక గ్రంథాన్ని బయటికి తీసి విశ్వనాథానికి చూపించింది.. అది 'డై ఎమ్టీ' పుస్తకమే టోడ్ హెన్రీది.

విశ్వనాథం ముఖంపై చిన్మయమైన ఒక నవ్వు మొలిచింది తృప్తిగా.

యామిని కండ్లనిండా కన్నీళ్లు.

విశ్వనాథం మరణించాడని గ్రహించిందామె.

'మరి, తనుకూడా.. ఖాళీ కావాలి కదా!'

## ప్రొఫెసర్ రామా చంద్రమౌళి

*1950 లో జన్మించిన ప్రొఫెసర్ రామా చంద్రమౌళి మెకానికల్ ఇంజనీరింగ్ లో పోస్ట్ గ్రాడ్యుఏషన్ చేసి ప్రస్తుతం వరంగల్లు లోని ' గణపతి ఇంజనీరింగ్ కాలేజ్ ' లో వైస్ ప్రిన్స్ పాల్ గా పనిచేస్తున్నారు. 76గ్రంథాలను ప్రచురించారు. 32 నవలలు, 385 కథలు, 12 కవిత్వ సంపుటాలు, 3 నాటకాలు, 4 విమర్శా సంపుటాలను వెలువరించారు. 2011 లో గ్రీస్ లో జరిగిన 11 వ ప్రపంచ కవుల సదస్సు లో భారత ప్రతినిధిగా పాల్గొన్నారు. 2016 లో తైవాన్ లో జరిగిన ' ప్రపంచకవుల సదస్సులో ' కూడా భారత ప్రతినిధిగా పాల్గొని తన కవితలను వినిపించారు. 2019 లో భువనేశ్వర్, ఇండియాలో జరిగిన ప్రతిష్టాత్మక ' 39 వ ప్రపంచ కవుల కాంగ్రెస్– 2019 ' లో భారత ప్రతినిధిగా పాల్గొని తన ఇంగ్లిష్ కథల సంపుటిని ప్రపంచ వేదికపై ఆవిష్కరింపజేశారు.*

# ఋణం

ఎం.ఆర్.వి. సత్యనారాయణ మూర్తి

98486 63735

**'ఏమండీ..** ఇవ్వాళ కత్తికి పదును పెట్టిస్తానన్నారు. మర్చిపోకండి. రాత్రి దానితోనే పనసకాయ కొట్టాలి' అన్నది వర్ధనమ్మ వంటింట్లోంచి.

'ఆ.. గుర్తుంది. బయటికెళ్లేటప్పుడు పట్టుకెళ్తాను' అన్నారు వెంకటరమణ మాస్టారు.

ఐదు నిమిషాలు గడిచాక, కత్తిని సంచిలో పెట్టుకొని కమ్మరి రంగయ్య దగ్గరకు బయల్దేరారు మాస్టారు. రేపు మాస్టారు తండ్రిగారి తద్దినం. ఇంటిపక్కనుండే మల్లయ్య నిన్ననే పనసకాయ, అరటికాయలు, అరటి ఆకులు ఇచ్చి వెళ్లాడు.

ఇంట్లో పనులుంటాయని ఇవ్వాళ్ల, రేపు సెలవు పెట్టారు మాస్టారు.

మాస్టారు వెళ్లేసరికి కొలిమి నిప్పులో ఇనుపముక్కను కాలుస్తున్నాడు రంగయ్య. తన కొడుకు సుధాకర్ కొలిమి చక్రాన్ని తిప్పుతున్నాడు. చక్రం తిరుగుతుంటే బ్లోయర్ద్వారా గాలి పొయ్యిలోకి వెళ్లి నిప్పుల్ని కణకణ మండిస్తోంది. మాస్టార్ని కూర్చోమని సైగ చేశాడు రంగయ్య. తన సంచిని కింద పెట్టి ముక్కాలు పీటమీద కూర్చున్నారు మాస్టారు. నిప్పుల్లో బాగా కాలిన ఇనుపముక్కను పట్టుకారుతో బయటకు తీసి, ఇనుప దిమ్మమీద పెట్టాడు రంగయ్య. తన కొడుకేసి చూసి 'రా' అన్నట్టు తలూపాడు. వెంటనే సుధాకర్ బలమైన పెద్ద సుత్తి తీసుకొని, ఎర్రగా కాలిన ఇనుపముక్క మీద బలంగా కొట్టాడు. అతను వేసిన ప్రతి దెబ్బతోపాటు రంగయ్యకూడా తన కుడిచేతిలోని సుత్తితో ఆ కాలిన ఇనుపముక్కను తనకు కావాల్సిన విధంగా కొట్టాడు.

మూడు నిమిషాలు గడిచాక ఇనుపముక్కను పట్టుకారుతో అటూఇటూ తిప్పి చూసి సంతృప్తి చెందాడు రంగయ్య. వెంటనే దాన్ని పక్కనున్న నీళ్ల గిన్నెలో ముంచడంతో సరసరమని శబ్ద వచ్చింది.

అప్పుడు మాస్టారు కేసి తిరిగి, 'ఏంటి మాస్టారు ఇలా వచ్చారు' అని అడిగాడు రంగయ్య.

మాస్టారు సంచిలోంచి కత్తి తీసి 'దీనికి పదును పెట్టాలి' అంటూ రంగయ్య కిచ్చారు. సుధాకర్వైపు తిరిగి 'ఈ రోజు బడికి వెళ్లలేదా?' అని మళ్లీ అడిగారు.

సుధాకర్ ఏమీ మాట్లాడలేదు.

మాస్టారిచ్చిన కత్తికి ఆకురాయితో పదును పెడుతూ, 'నేనే మానెయ్యమన్నానండీ. నాకు పనిలో సాయం చేయమన్నాను' అన్నాడు రంగయ్య.

మాస్టారు ఆశ్చర్యపోయారు రంగయ్య మాటలకు.

'గతంలో నేను వచ్చినప్పుడు మీ అబ్బాయి తొమ్మిదో తరగతి చదువుతున్నాడని చెప్పావు. ఈయేడు పదో తరగతిలో ఉండాల్సిన వాడిని ఇలా స్కూల్ మాన్పించడం ఏం బాగా లేదు రంగయ్యా' అన్నారు.

'ఏం చెయ్యమంటారు మాస్టారు? మా ఆవిడ ఉన్నప్పుడు నాకు పనిలో సాయం చేసేది. నిరుడు అది పోయాకా ఒంటరివాణ్ని అయ్యాను. పనిలో సాయానికి ఎవరినైనా రమ్మంటే 'రోజుకు రెండు వందలిస్తావా?' అని అడుగుతున్నారు. నాదే అంతంత మాత్రం సంపాదన. అంత డబ్బిచ్చి మనిషిని పెట్టుకోలేక నా కొడుకునే చదువు మాన్పించి పనిలో పెట్టుకున్నా. మరి మేమిద్దరం బతకాలి కదా మాస్టారూ! నాకు వేరే ఏ పనీ రాదు. కూలీ పనికి వెళ్లే బలం కూడా లేదు. దివ్యాంగుడ్ని కదా!' అన్నాడు రంగయ్య బాధగా.

'నిజమే! రంగయ్యకు పోలియోతో ఒక కాలు సన్నగా ఉంటుంది. కూర్చొనే పనులు చేయగలడు. సుధాకర్ బాగా చదువుతాడు. కానీ, తండ్రికోసం గ్రహణం పట్టిన సూర్యుడిలా ఉండిపోయాడు. దీనికి ఏదో పరిష్కారం చూడాలి' అని మనసులోనే నిశ్చయించుకొన్నారు మాస్టారు.

'సుధాకర్.. నీకు చదువుకోవాలని ఉందా?' అని మళ్లీ ఆయనే అడిగారు.

ఆనందంగా తలూపాడు సుధాకర్.

రంగయ్య వద్దన్నా వినకుండా ఇరవై రూపాయలు అతని చేతిలో పెట్టారు మాస్టారు.

'సుధాకర్.. నువ్వు పదో తరగతి పరీక్షలకు ప్రైవేట్‌గా హాజరవుదువు గానీ. పగలు మీ నాన్నకు సాయం చెయ్యి. రాత్రి మా ఇంటికి వచ్చి చదువుకో. పుస్తకాలు నేను కొనిస్తాను. ఫీజుల సంగతి నేనే చూస్తాను' అని భరోసా ఇచ్చి ఇంటికి బయల్దేరారు మాస్టారు.

మర్నాడు తన ఇంట్లో తద్దినం హడావుడి అయ్యాక, సాయంత్రం పుస్తకాల దుకాణానికి వెళ్లి పదో తరగతి పుస్తకాలు, నోట్స్ పుస్తకాలు కొన్నారు మాస్టారు. సుధాకర్‌కు కబురు చేసి వాటిని అందించారు.

'సుధాకర్.. విద్య మనిషికి మూడో కన్ను. మీ నాన్న కాలంలో సమాజ పరిస్థితులకు, ప్రస్తుత పరిస్థితులకు చాలా తేడా ఉంది. మనిషి ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలంటే ఉన్నత విద్య నేర్వాలి. నువ్వు ఎంతవరకు చదువుకుంటే, అంతదాకా నేను చదివిస్తాను. నా పిల్లల చదువులు పూర్తయి ఉద్యోగాల్లో ఉన్నారు. అందుకని, నువ్వు మొహమాట పడాల్సిన పని లేదు. చదువుమీదే దృష్టి పెట్టు'

అన్నారు మాస్టారు.

ఆయన మాటలు సుధాకర్‌లో నూతనోత్సాహాన్ని నింపాయి. మాస్టారు ఎమ్మెస్సీ, బీఈడీ చేశారు. హిందీ తప్ప అన్ని సబ్జెక్టులనూ సుధాకర్‌కు బోధించేవారు. ప్రతి ఆదివారం పక్కవీధిలో ఉన్న హిందీ పండిట్ నరసింహం గారి దగ్గర హిందీ నేర్చుకునేవాడు సుధాకర్.

ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటలకు మాస్టారింటికి వచ్చి రాత్రి తొమ్మిది గంటల వరకూ చదువుకొనేవాడు సుధాకర్. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మాత్రం పూర్తిగా మాస్టారింట్లోనే ఉండి చాలా శ్రద్ధగా చదువుకున్నాడు. రోజూ తెల్లవారు జామున మాస్టారు అతన్ని నిద్ర లేపి చదివించారు. మాస్టారి భార్య వర్ధనమ్మగారు కూడా సుధాకర్‌ను ఎంతో ఆదరంగా చూశారు.

మాష్టారు ఆశించిన మేరకు సుధాకర్ పరీక్షల్లో ప్రథమ శ్రేణిలో పాసయ్యాడు. ఆ తర్వాత ఇంటర్‌మీడియట్, డిగ్రీకూడా ప్రైవేట్‌గానే చదివి పాసయ్యాడు.

'డిగ్రీ పూర్తి చేశావు. ఇప్పుడు ఏం చేద్దామని అనుకుంటున్నావు?' అడిగారు మాస్టారు.

'యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు రాయాలనుకుంటున్నాను సార్..' వినయంగా అన్నాడు సుధాకర్.

అతని మాటలకు చిన్నగా నవ్వి,

'గుడ్. మంచి ఆలోచన. దానికి చాలా కృషి చేయాలి. ముందుగా నువ్వు ఏదైనా కాలేజీలో చేరి పీజీ చెయ్యి. నీకు లోకం తీరు తెలుస్తుంది. సమాజం పట్ల మరింత అవగాహన పెరుగుతుంది' సలహా ఇచ్చారాయన.

'ఇప్పటికే మీమీద నేను చాలా భారం మోపాను. కాలేజీలో పీజీ చదువంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. ఇన్నాళ్లూ నాన్నకు సాయం చేస్తూ వచ్చాను. నేను వెళ్లిపోతే నాన్న పరిస్థితి ఎలా?' సందిగ్ధంగా ఆగిపోయాడు సుధాకర్.

అతని మొహంలో విచార మేఘాలు కమ్ముకున్నాయి.

అది చూసిన మాష్టారు ఆప్యాయంగా సుధాకర్ భుజం మీద చెయ్యి వేశారు. ఆయన స్పర్శ అతనిలో వెయ్యి ఏనుగుల బలాన్నిచ్చినట్టయ్యింది.

'చూడు సుధాకర్.. మీ నాన్నకు దివ్యాంగుల పింఛన్ వస్తున్నది. తెల్లరేషన్ కార్డుతో తక్కువ ధరకు బియ్యం వస్తాయి. శివాలయం వీధి సెంటర్‌లో చిన్న బడ్డీకొట్టు అమ్మకానికొచ్చింది. మొన్ననే కొన్నాను. ఆ కొట్టులో మీ నాన్న కొబ్బరికాయలు, అరటిపండ్లు, పూజా సామగ్రి అమ్ముకోవచ్చు. పెద్దగా శ్రమ పడాల్సిన పని ఉండదు. వ్యాపారానికి కావాల్సిన డబ్బులు నేనిస్తా. నువ్వు మీ నాన్నకోసం బెంగ

పెట్టుకోకు. మీ నాన్నను నేను కని పెట్టుకొని చూస్తాను. సరేనా?' అంటూ భరోసా ఇచ్చారు.

'మాస్టారు నా కోసం, నా తండ్రి భవిష్యత్తు కోసం ఎంత పకడ్బందీగా ఆలోచిస్తున్నారో కదా..' అన్న భావన రాగానే సుధాకర్ కండ్లలో గిర్రున నీళ్లు తిరిగాయి. వెంటనే మాస్టారు పాదాలకు నమస్కరించి దుఃఖించసాగాడు సుధాకర్. మాస్టారు అతని భుజాలు పట్టుకొని పైకి లేపారు.

'మాస్టారూ.. ఎన్ని జన్మలెత్తినా మీ ఋణం తీర్చుకోలేను..' అన్నాడు సుధాకర్ సజలనయనాలతో.

'నువ్వు జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని సాధించాలన్నదే నా కోరిక. కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివితేనే ఉన్నత ఉద్యోగాలు వస్తాయన్న భ్రమను నువ్వు పటాపంచలు చేయాలి. గ్రామాల్లోకూడా విద్యారత్నాలున్నాయని నువ్వు నిరూపించాలి' ఉద్వేగంగా అన్నారు మాస్టారు.

'తప్పకుండా విజయం సాధించి మీ పేరు నిలబెడతాను..' స్థిరంగా, ఆత్మవిశ్వాసంతో చెప్పాడు సుధాకర్.

రెండేండ్లు గిర్రున తిరిగాయి. సుధాకర్ ఎంఏ పాలిటిక్స్‌తో యూనివర్సిటీ టాపర్‌గా నిలిచాడు. రంగయ్యకూడా కొత్త వ్యాపారంలో నిలదొక్కుకున్నాడు.

మాస్టారు స్నేహితుడి కొడుకు సూర్యతేజ విశాఖపట్నంలో సివిల్స్ పరీక్షలకు వెళ్లేవారికోసం కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ పెట్టి, చాలా పేరు తెచ్చుకున్నాడు. ఒకరోజు సుధాకర్‌ను తీసుకొని విశాఖపట్నం వెళ్లి, సూర్యతేజను కలిసి వాళ్ల ఇన్‌స్టిట్యూట్‌లో చేర్పించారు మాస్టారు. ఫీజులు అన్నీ మాస్టారు కట్టారు.

సుధాకర్ చాలా పట్టుదలతో చదివాడు. సూర్యతేజకూడా మాస్టారు చెప్పడం వల్ల అతనిపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బోధించాడు. అందరి ఆశలూ ఫలించి, పరీక్షలు బాగా రాసి ఐపీఎస్‌కు సెలక్టయ్యాడు సుధాకర్. సుధాకర్ విజయానికి వెంకటరమణ మాస్టారు, రంగయ్యతోపాటు శివపురం ప్రజలంతా ఆనందించారు.శిక్షణ పూర్తయిన తర్వాత నిజామాబాద్ జిల్లాలో ఏఎస్పీగా విధుల్లో చేరాడు సుధాకర్.

కాలచక్రంలో సంవత్సరాలు వేగంగా గడిచిపోతున్నాయి. మాస్టారి ఇద్దరు కొడకులూ పెండ్లిళ్లు చేసుకొని అమెరికాలో స్థిరపడ్డారు. మాస్టారు ఉద్యోగ విరమణ రోజున మాత్రం వచ్చి వెళ్లారు. సుధాకర్‌కు శ్రీకాకుళం ఎస్పీగా ప్రమోషన్ వచ్చింది. తండ్రిని కూడా తనతోనే తీసుకెళ్లిపోయాడు సుధాకర్. రెండేండ్లు గడిచాయి. ఒకరోజు మాస్టారుగారి భార్య నిద్రలోనే ప్రాణాలు విడిచారు. విషయాన్ని

కొడుకులిద్దరికీ ఫోన్ చేసి చెప్పారు మాస్టారు. కాసేపటికి పెద్ద కొడుకు ఫోన్ చేశాడు.

'ఇండియా రావడానికి విమాన టికెట్లు దొరకడం లేదు. కార్యక్రమాన్ని బంధువుల చేత చేయించండి. పదో రోజుకు నేనూ, తమ్ముడు వస్తాం' అని చెప్పాడు. ఆ మాటలతో మాస్టారుకు వాళ్లమీద విరక్తి కలిగింది.

తమ్ముడి కొడుకుతోనే తన భార్య అంత్యక్రియలు జరిపించారు మాస్టారు.

మాస్టారుగారి భార్య చనిపోయారన్న విషయాన్ని ఆయన స్నేహితుడు రామకృష్ణ చెప్పిన వెంటనే శివపురంలో వాలిపోయాడు సుధాకర్. పది రోజులు మాస్టారు దగ్గరే ఉన్నాడు. పదో రోజుకు మాస్టారు కొడుకులు అమెరికానుంచి వచ్చి, మూడు రోజులు కార్యక్రమాలు చేసి వెళ్లి పోయారు. వారి ప్రవర్తనకు రామకృష్ణ ఆశ్చర్యపోయాడు. భార్య చనిపోయిన తర్వాత మాస్టారు చాలా మూడీగా ఉంటున్నారు. వెనుకటి ఉత్సాహం తగ్గింది. ఒకరోజు బాత్రూమ్‌లో జారి పడిపోయారు. కుడికాలు ఫ్రాక్చరయ్యింది. రామకృష్ణ కుటుంబసభ్యులే మాస్టారు మంచిచెడ్డలు చూస్తున్నారు.

**మాస్టారు స్నేహితుడి కొడుకు సూర్యతేజ విశాఖపట్నంలో సివిల్స్ పరీక్షలకు వెళ్లేవారికోసం కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ పెట్టి, చాలా పేరు తెచ్చుకున్నాడు. ఒకరోజు సుధాకర్‌ను తీసుకొని విశాఖపట్నం వెళ్లి, సూర్యతేజను కలిసి వాళ్ల ఇన్‌స్టిట్యూట్‌లో చేర్పించారు మాస్టారు. ఫీజులు అన్నీ మాస్టారు కట్టారు.**

కాలం మరింత వేగంగా పరిగెడుతూనే ఉంది.మాస్టారుకు 70 ఏండ్లు వచ్చాయి. సుధాకర్‌కు డీఐజీగా ప్రమోషన్ వచ్చింది. రెండు నెలలకు ఒకసారి శివపురం వచ్చి మాస్టారును చూసి వెళ్తున్నాడు. ఒకరోజు మాస్టారు, రామకృష్ణ లోకాభిరామాయణం మాట్లాడుకున్నాక టాపిక్ పుణ్యక్షేత్రాలవైపు మళ్లింది.'రామకృష్ణ గారూ, మీరు కాశీ వెళ్ళారా?' అడిగారు మాస్టారు.

'లేదండి. మీరు..?'

'నేనూ వెళ్లలేదండీ.. ఎప్పుడూ ఏవో పనులతో సరిపోయేది. ఇప్పుడేమో హ్యాండ్ స్టిక్ సాయం లేనిదే నడవలేక పోతున్నాను. మా అబ్బాయిల సంగతి మీకు తెలుసుగా! డాలర్ల సంపాదన మీదున్న శ్రద్ధ కన్నతండ్రిమీద లేదు. జీవితంలో ఒక్కసారైనా కాశీకి వెళ్లి, గంగలో స్నానం చేసి విశ్వనాథుడ్ని దర్శించాలంటారు.

మా తమ్ముడు నడివయసులోనే చనిపోయాడు. మా నాన్నగారికి నేనైనా గయలో పిండప్రదానం చేయాలి. ఎప్పటికి ప్రాప్తమో? ఏమిటో?' ఆవేదనగా అన్నారు మాస్టారు.

ఓ గంట గడిచాక రామకృష్ణ తన ఇంటికి వెళ్లినా, మాస్టారు మాటలే ఆయన చెవిలో మారుమోగుతున్నాయి.

ఎప్పుడూ ధైర్యంగా ఉండే మాస్టారు ఈరోజు బేలగా మాట్లాడటం ఆయన్ని కలచి వేసింది.

తను హార్ట్ పేషెంట్. లేకపోతే తనే ఆయన్ని కాశీకి తీసుకుని వెళ్లేవాడు. 'మరి ఇప్పుడు ఎలా?' అనుకుంటూ చాలాసేపు ఆలోచించాడు రామకృష్ణ. తర్వాత ఒక నిర్ణయానికి వచ్చి, సుధాకర్‌కు ఫోన్ చేశారు.

'నమస్తే రామకృష్ణ గారు.. మా మాస్టారు కులాసాగా ఉన్నారా?' కంగారుగా అడిగాడు సుధాకర్.

'ఆ.. మీ మాస్టారు బాగానే ఉన్నారు. నువ్వేమీ కంగారు పడకు. కానీ, నువ్వో పని చేయాలి. ఆయనకు కాశీ యాత్ర చేయాలని చాలా కోరికగా ఉంది. ఆయన నిన్ను అడగరు. చాలా అభిమానం గల మనిషి. నువ్వే పూనుకొని ఆయన్ని కాశీకి తీసుకెళ్లి, విశ్వనాథుడి దర్శనం చేయించు. ఒకరి తోడు లేకుండా ఆయన వెళ్లలేరు. నేను అశక్తుడ్ని. లేకపోతే నేనే తీసుకొని వెళ్లేవాడిని..' అన్నారు రామకృష్ణ బాధగా.

'మా గురువుగారికి సేవ చేసే భాగ్యం కలిగినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. నా జీవితం ఆయన పెట్టిన భిక్షే. ఆ విషయం మీ అందరికీ తెలుసు. ఆయన ఋణం నేను ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేను. అటువంటిది ఇంత చిన్న పనిని ఆయనకోసం చేయలేనా? తప్పకుండా చేస్తాను. పది రోజులు సెలవు పెడతాను. ఆయన ఎక్కడికి తీసుకు వెళ్లమంటే అక్కడికి తీసుకెళ్తాను. మీరు నాకు మంచి ఉ పకారం చేశారు రామకృష్ణగారు థాంక్స్..' అన్నాడు సుధాకర్.

నాలుగు రోజులయ్యాకా ఒక ఉదయం మాస్టారు ఇంటికి వచ్చాడు సుధాకర్. 'మాస్టారూ.. నాకు ప్రమోషన్ వచ్చాక కాశీ వచ్చి విశ్వనాథుడ్ని దర్శనం చేసుకుంటానని మొక్కుకున్నాను. మీరు కూడా వస్తే నాకు ఆనందంగా ఉంటుంది. మీరు కాదనరనే ధైర్యంతో రెండు ఫ్లయిట్ టికెట్లు కూడా తీసుకున్నాను..' వినయంగా అన్నాడు.

మాస్టారు పక్కనే ఉన్న రామకృష్ణ, 'వెంకటరమణగారు.. మీకు మంచి అవకాశం వచ్చింది. సుధాకర్ మిమ్మల్ని చాలా జాగ్రత్తగా తీసుకెళ్తాడు. కాదనకండి, కాశీకి వెళ్లి రండి' అని ధైర్యం చెప్పారు.

ఇద్దరి మాటల్నీ కాదనలేక పోయారు మాస్టారు. పైగా అది తన చిరకాల వాంఛ. అందుకే 'సరే' అన్నారు.

వెంకటరమణగారి బ్యాగ్ సర్దుకోవడంలో రామకృష్ణ సాయం చేశారు. సుధాకర్ కారులోనే ఇద్దరూ విజయవాడ వెళ్లి, విమానంలో కాశీకి చేరుకున్నారు.

మాస్టారు కోరిక మేరకు ఆంధ్రాశ్రమంలో దిగారు. కిందనే రెండు ఏసీ రూములు తీసుకున్నాడు సుధాకర్.

మర్నాడు ఉదయాన్నే లేచి కేదార్‌ఘాట్‌కి వెళ్లి, గంగలో స్నానం చేశారు మాస్టారు, సుధాకర్. అక్కడి జిల్లా ఎస్పీకి సుధాకర్ చెప్పడంతో వారికి సాయంగా ఒక కానిస్టేబుల్ వచ్చాడు. వాళ్లిద్దరి బ్యాగులను కానిస్టేబుల్ పట్టుకున్నాడు. సుధాకర్ భుజం మీద చేయి వేసి, హ్యాండ్ స్టిక్ సాయంతో నడుచుకుంటూ వెళ్లి కేదారేశ్వరుడ్ని దర్శనం చేసుకున్నారు మాస్టారు.

తర్వాత రూముకొచ్చి కాఫీలు తాగాకా, పోలీసు వాహనంలో విశ్వనాథుడి దర్శనానికి వెళ్ళారు. గుడికి సమీపంలో కారు ఆపి, మాస్టారును దైవదర్శనానికి తీసుకు వెళ్లాడు సుధాకర్. సెక్యూరిటీ సిబ్బందికూడా ఎంతో సహకరించి మాస్టారుకు ఏ ఇబ్బందీ లేకుండా విశ్వనాథుడి దర్శనం చేయించారు. తర్వాత కాలభైరవుడి గుడికి వెళ్లి, ఇద్దరూ స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం దశాశ్వమేథ్ ఘాట్‌వద్ద గంగాహారతికూడా చూసి వచ్చారు.

మర్నాడు మాస్టారును టాక్సీలో గయ తీసుకొని వెళ్లాడు సుధాకర్. మాస్టారుచేత వారి నాన్నగారికి, బంధువులకు పిండప్రదానం చేయించాడు పండా. మాస్టారును క్షణక్షణం కనిపెడుతూ, ఆయన పక్కనే నిలబడి ఉన్న సుధాకర్‌ను పండా హిందీలో మెచ్చుకున్నాడు.

'నాన్నగారికి చేదోడువాదోడుగా ఉంటూ ఆయన చిరకాల వాంఛని నెరవేర్చిన ఉత్తమమైన కొడుకువు నువ్వు' అని అన్నాడు పండా.

ఆ మాట వినగానే మాస్టారు మొహంలో సన్నని నవ్వు వికసించింది.

సుధాకర్ వెంటనే, 'పండిట్ జీ..' అని చెప్పబోతే, మాస్టారు వద్దని వారించారు. పండా ఇంట్లో భోజనం చేసి, మళ్లీ కాశీకి వచ్చారు ఇద్దరూ. తమ గదికి వచ్చాక సుధాకర్‌ను పిలిచి, దగ్గర కూర్చో పెట్టుకున్నారు మాస్టారు.

'సుధాకర్.. నా చిరకాల కోరిక నీ వల్ల తీరింది. నీకు నేను చాలా ఋణపడి ఉన్నానయ్యా..' అన్నారు భావోద్వేగంగా.

'మాస్టారూ! పేదరికంలో ఉన్న నన్ను ఉన్నత స్థాయికి తీసుకు వచ్చిన గురువు, మార్గదర్శకులు మీరు. ఎన్ని జన్మలెత్తినా నేనే మీ ఋణం తీర్చుకోలేను సార్..'

వినయంగా అన్నాడు సుధాకర్.

మర్నాడు ఉదయం మరలా కేదార్‌ఘాట్‌కి వెళ్లి గంగలో స్నానం చేశారు మాస్టారు, సుధాకర్.

పొడిబట్టలు కట్టుకొని సూర్యుడికి నమస్కారం చేశారు మాస్టారు. సుధాకర్ సాయంతో నెమ్మదిగా నడుస్తూ, అతని భుజం మీద తల వాల్చేసారు. సుధాకర్ కంగారుగా డాక్టర్‌ను తీసుకొని రమ్మని కానిస్టేబుల్‌ను ఆదేశించాడు.

యాత్రికుల సాయంతో మాస్టారును నెమ్మదిగా ఘాట్‌లోని చపటామీద పడుకోబెట్టాడు.

కాసేపటికి కానిస్టేబుల్ డాక్టర్‌ను తీసుకుని వచ్చాడు. డాక్టర్ మాస్టార్ని పరీక్షించి, చనిపోయారని చెప్పారు. ఆ మాట వినగానే సుధాకర్ చాలాసేపు దుఃఖించాడు. మాస్టారు పిల్లలకు ఈ విషయాన్ని తెలియజేయాలని ఫోన్‌కోసం ఆయన చొక్కా జేబు వెతికితే ఒక ఉత్తరం కనిపించింది. అందులో..

'చిరంజీవి సుధాకర్‌ను దీవించి వ్రాయునది. ఒకవేళ నేను అనుకోని పరిస్థితుల్లో కాశీలో మరణిస్తే, కొడుకుగా నువ్వే ఆ బాధ్యతను చేపట్టి, ఇక్కడే ఆ కార్యక్రమం పూర్తి చేయాలని కోరుతున్నాను. నా పిల్లలకోసం చూడవద్దు! ఇట్లు.. వెంకటరమణ.'

ఉత్తరం చదివిన సుధాకర్, మాస్టారువైపు రెప్పవేయకుండా చూడసాగాడు.

ఎందుకో అతనికి మాస్టారు అమ్మగారి పేరు గుర్తుకు వచ్చింది.

**ఆమె పేరు.. గంగారత్నం!**

# ఎం.ఆర్.వి. సత్యనారాయణ మూర్తి

*కవి, రచయిత, వ్యాఖ్యాత, నటుడు, దర్శకుడిగా బహుముఖ ప్రజ్ఞను చాటుతున్నారు ఎం.ఆర్.వి. సత్యనారాయణ మూర్తి. స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ. 1951 సెప్టెంబర్ 30న జన్మించారు. ఇప్పటివరకూ 250 కథలు, 300 కవితలు ప్రచురించారు. అక్షర భారతం, సమైక్య భారత్ పేరుతో రెండు నాటికలు రాశారు. 10 కథా, ఏడు కవితా సంపుటాలను వెలువరించారు. అనేక కవితలు ఆంగ్లం, ఉర్దూ, కన్నడంలోకి, పలు కథలు కన్నడంలోకి అనువాదమయ్యాయి. 30 కథలు, 30 ప్రసంగాలు ఆకాశవాణిలో ప్రసారమయ్యాయి. 25 నాటికలకు గాత్రాన్నీ అందించారు. వీరు గాత్రధారణ చేసిన 'అన్వేషణ' ఆకాశవాణి నాటకం, జాతీయస్థాయిలో 'తృతీయ బహుమతి' ని పొందింది. సాహిత్యసేవకు గౌరవంగా, 2017లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి 'గిడుగు రామ్మూర్తి తెలుగు భాషా పురస్కారం' వరించింది.*

# మా ఊరి ధన్వంతరి రాంరాం తాతా

జనపాల శంకరయ్య

**80747 27108**

శ్రీసీతారామలక్ష్మణుల గుళ్లో నాలుగువందల యేళ్ల నుంచి నందాదీపం వెలుగుతుంది. ఓ వైపు జంట చెర్వులు, మరోవైపు మాండవ్య మహాముని తానమాడి పూజించిన రాములోరి ఆనవాళ్లు, ఇంకోవైపు నక్కవాగు మానేరు మట్టిమహిమల ఊరుంది. పాడిపంటలకు, కవి పండితులకు నెలవు. సబ్బండ వర్ణాల వాళ్లు వావివరుసలతో సమైక్యంగా పిలుచుకుంటూ పల్లెపట్టులకు తలమానికమైంది. అదే 'ఆవునూరు' ఆత్మీయతకు నిలువెత్తు నిదర్శనం.

ఓరోజు అంబటాళ్లయింది. డడ్డరం ఢమ్‌కా డడ్డరం ఢమ్‌కా డప్పుల సప్పుడు సెవుల వడంగనే ఇంట్లోనుంచి దర్వాజలకు వచ్చింద్రు వాడకట్టోల్లందరు. మోకాళ్లదాకా దోతి ఖద్దరు బనీను తలకు రూమాలు చేతిలో కర్రతో వున్న యాభైఏళ్ల పెద్దమనిషి ఒకళ్లు ఎత్తుకున్న గంపలోంచి బిస్కిట్ పుడలు తీసి పొల్లగాండ్లకు పంచుతుండు. సంబురంగ రాం రాం తాతా! రాం రాం తాతా! అంటూ ఎగురుతూ దుమ్‌కుతూ లొల్లి లొల్లి కేకలేస్తూ చీమల దండోలే రాం రాం తాతా ఎంటవడ్డరు పిల్లగాండ్లు. కొందరు గుమిగూడి రాం రాం తాతా పేరు మోగుతుంది. బత్తుల మల్లయ్య పేరు మరిసింద్రు అసలు ఒక్క బనీను లేకపోతే గాంధితాతే అంటరు. బగ్గ మంచోడు. పెద్దోల్ల మనసు ఎప్పుడో గెలిచిండు. ఇప్పుడు పిల్లల మనసు గెలిసిండు. ఇంట్ల ఓ పూట కుంటే ఇంకోపూటకు ఉండదు. అయినా తెగారం చేసి పొలగాండ్లకు బిస్కిట్లు పంచిండు. ఊల్లో మాటలచ్చిన పిల్లగాండ్ల దగ్గరినుండి కాటికి కాల్లు సాపిన ముసలోల్లదాక అందరికి తెలుసు. పగోల్లు లేని మనిషి. అందరినోట్లో పండు అసోంటోడు. కాని ఊరుకు దూరంగా ఓ పాక ఏసుకొని ఉంటుండు. అని అనుకుంటుంద్రు. పొల్లగాండ్లకు బిస్కిట్లు పంచిండు. జబ్బసంచిలో మందులు ఓ పక్కకు సర్ది. ఓ అవ్వఇచ్చిన బువ్వకూర మూట పెట్టిండు. జబ్బకేసుకొని ఇంటిదారి వట్టిండు. ఓ..... మల్లన్నా.... అని కేకలేసిన సప్పుడు మల్లయ్యసెవిలో దూరింది. ఆగి ఎనకకు తిరిగిండు.

నీయవ్వ.... పిలిస్తే ఇనత్తలేదాయే... ఎగపోత్తూ అన్నడు భూమయ్య ఆయాసంగా... ఏంది తమ్మి... ఇప్పటిదాకా ఊల్లో ఉన్నా గిప్పుడే ఇంటికి పోతున్నా

అన్నడు మల్లయ్య. కొంచెం సేపు దమ్ముతీసుకొని... గడీల పొల్లగాండ్లు చెట్టిర్క ఆట ఆడింద్రు. లక్షణ్‌రావు దొర కొడుకు చిన్నోడు రాకేశ్ దొర తీటపోరడు కొనమండల్లకెక్కిండు మండకు పురుగువట్టిందేమో పుటుక్కున ఇరిగింది. కింద వడ్డడు... కుడికాలు ఇరిగింది. పెద్దొరసాని చిందొరసాని బగ్గ ఏడుతుంద్రు... ఓరి భూమా... గా బత్తుల మల్లిగాన్ని జల్ది దొల్కరాపో.... అన్నడు దొర కల్లల్ల నీళ్లు దిర్గంగ. నువ్వు గిప్పుడే వోతున్నవని దుబ్బిగాడు జెప్పిండు. జెప్పన ఉరికచ్చిన... పా పోదాం... జెప్పన నడువన్న... తమ్మీ గీ బువ్వ మా ముసల్దానికిచ్చి దేవుని గుట్ట జంగల్లకోయి మందాకు తీసుకొనివత్తా... కాలు యిగిందంటున్నవ్‌గదా! ఇంటికాడ సెక్కిన ఎత్తె బద్దలు తీసుకొని ఎంత....గట్టవోయి గిట్లత్త... ఇంకేంది తమ్మి నువ్వు వో ఇగ...అన్నడు మల్లయ్య ఆత్రుతగా... నీ యవ్వ మల్లన్నా! జాముజేత్తే గా దొర తిడుతడే సిన్నదొర బగ్గ ఏడుత్తుండు తండ్లాడుతుండు సూడబుద్దయితలేదు.. మనసుల కలికలి అయితుంది.... ఇంగో గా బువ్వ మీ యింటికాడ వదినె కిచ్చుత్త... గిట్లనే జంగల్‌కు నువ్వువో అన్నడు బూమయ్య దీనంగా. సరే తమ్మీ! గట్లయితే ఇంటికాడ వదినె నడుగు ఎదురుంగ గూట్లో ఎత్తె బద్దెలు పిరికెడన్ని వట్టుకొని నువ్వు దొరింటికివో...! నేను దేవుని గుట్టకాడ మందాకు తెంపుకొని జెప్పనత్త...పో.... అంటూ బువ్వమూట యిచ్చి జెంగల్ తొవ్వ వట్టిండు మల్లయ్య వేగంగా... మందుచెట్టు ఆకు దూసుకొని ఆపద ఎవలదయినా ఒకటే పొల్లగాడు సిన్నపానం . ఎంత తల్లడిస్తుండో అని మనసుల తలసుకుంటూ కొండెంగ జంగలేత్తూ దొరింటికి జేరుకుండు.

సుంకరి భూమయ్య దర్వాజల నిల్సుండి ఎదురుసూత్తుండు. మల్లయ్య కనబడగానే అవ్వా! పోయిన పానం తిరిగచ్చినట్లయింది... రా.. రా... మల్లన్నా! అంటూ ఇంట్లకు దోలుకపోయిండు ఆత్రుతగా. ఏమయింది మల్లిగా... బగ్గసేపయింది. కొడుకు బాధ సూడలేక మనసు తల్లడ మల్లడ మవుతుంది. అటుసూత్తెనే ఏడుపాగుత లేదురా... అన్నటు దొర కంట తడిపెడుతూ. దొరా... మందుచెట్లుకోసం బగ్గ లెంకిన ఓ కాడ గుంపుగుండే మ్యాకలు మేసినయి. తిరుగంగ తిరుగంగ దొరికింది బాంచెన్ కాల్మొక్తా... అన్నటు మల్లయ్య భయంగా. సరేరా...! ఆ.. సూడు మల్లిగా మంచిగా జెల్ది మగ్గేట్టు కట్టుకట్టు ఆడు ఉన్నకాడ ఉండద్రా... ఆంతో కట్టముంది అన్నడు దొర బాధపడుతు.

మల్లిగాని చెయ్యిగుణం మంచి బంగారం. ఎవల్లకాడ నేర్సుకున్నడో గాని ఎన్ని చెట్లమందులు తెలుసు. బగ్గగొప్పోడు. ఆని వైద్యం అమృతం. గందికే మాఊరి ధన్వంతరీ. బొక్కలు పొల్లు పొల్లు యిరిగినా కట్టుకడితే మగ్గుడే. ఒక్కటేమిటి

బాలింతలకు పెద్దమందు. బాలింతకాడ తెలుపు, దమ్ము, దగ్గు, కోరింత దగ్గ సర్వవాతాలకు ఎన్నో రోగాలకు ఆడిమందు అమృతంగా పనిజేత్తది. కాని ఆడు నోట్లో నాలుక లేనోడు కట్టు కట్టపట్టందుకు పైకం అడుగడు. ఎంత ఇంతే గంత తీసుకుంటదు. గింత తొక్కుబువ్వ పెట్టినా ఊకుంటడు. జెంగలంత దిరిగి తిరిగి తెత్తడు. తగిన కూలి అడగని ఉత్తముడు మా ఊరికోసమే పుట్టిండేమో. 'శరీర ధర్మమ్ ఖలు ధర్మసాధనమ్' అన్నట్లు తన పెయ్యిని ఊరోల్లకోసమే కట్టపడుతడు. కష్టజీవి మన ఊరోల్లకు సంజీవని గుట్టసోంటోడు అని కమల దొరసాని కితాబిచ్చింది. అయ్యో దొరసాని! గట్టెందుకు పొగుడుతరు. నాకు తెలిసినంత సేవ జేత్తున్న బాంచెన్ కాల్మొక్తా! అన్నడు మల్లయ్య. అరే మల్లయ్య నువ్వు మాటి మాటికి ఈ బాంచెన్ మాట మరువురా! నువ్వు గొప్ప వైద్యుడివిరా! నీకు దెలుస్తలేదు గాని 'వైద్యోనారాయణ హరి:' వైద్యుడు నారాయణ దేవుని వంటి వాడు అంటరు పెద్దలు ఆపదలో ఆదుకునే దేవుడివిరా! నువ్వు. అంటరానోనివని దూరంగా ఉండద్దు అన్నది దొరసాని బిగ్గరగా.

ఎందమ్మా! దొరసాని మల్లిగాన్ని పల్లకిల ఊరేగింపుమంటవా ఏంది... అన్నడు దొర నవ్వుకుంటూ. అయ్యోదొర! దండం పెడతా! అంటరానోన్ని గట్లెందుకంటరు ఏదో దేవుడిచ్చిన వరం. ఈ విద్యతో సేవజేస్తూ బతుకెల్ల దీస్తున్న గంతే దొర బెదిరిండు మల్లయ్య. ఓరే! మల్లిగా మాగ్గాడ మనసుండదారా! నీ గొప్పదనమంతా మా మనసులుంటది గాని ఎందుకో దొరతన మడ్డమస్తుంటది. గంతేగని. నువ్వు గొప్పోడివిరా మల్లిగా! అంటూ దొర తలదించుకుంటడు.

అయ్యా! ఇరిగిన దగ్గర సర్ది కట్టుకట్టిన నీల్లు పడనియ్యకుండ్రి. పత్తెం రెండు రోజులు ఎల్లిపాయ కారం తినిపించుండ్రి. తర్వాత కూర గాయలు తినొచ్చు. వారం దాకా పప్పులొద్దు. దొరసాని పదిరోజులయినంకా మల్ల కట్టుకడుతా! ఇంగ పొయ్యత్త దొరా! దొరసాని! అంటూ నడుస్తుంటడు మల్లయ్య. అరె మల్లయ్యా! నీతో వచ్చిన చిక్కే గిదేరా! నోరులేనోడా! గుట్టలు చెట్లు దిరిగినవ్ ఉట్టిగనే పోతావ్రా బిగ్గరగా అంది దొరసాని. ఏమయింది దొరసాని నేనేమన్న బాంచెన్ కాల్మొక్తా అంటూ మల్లయ్య బీరిపోతడు. ఓ దొరా! ఆనికి పదిరూపాయలియ్యి. తిండనక ఎండనక తిప్పల వడ్డడు. అరే! నీ ముసల్దానికి ముద్దవప్పన్నం తీసుకపో! అంది దొరసాని. నీ కడుపు సల్లగుండ అంటూ పంచెలో గట్టుకొని జబ్బసంచిల ఏసుకొని పోయత్త బాంచెన్ అంటూ బయలు దేరిండు మల్లయ్య.

ఓ మల్లయ్య బాపూ! ఇంటకు రా!నీయవ్వ! గింత పోద్దాటి కల్లు దాగిపో! నీయవ్వ నీకు పైసలెందుకే తాగుతామని బుద్దిపుట్టినప్పుడు బుద్ధిదీరా! దాగిపో! మొన్న మా

అత్తకు వాతానికి మందువోత్తివి. నా బిడ్డకు పెద్ద మందు బాలింతకాడ దెత్తివి. పైసల్ తీసుకోమంటే ఎందుకుతియ్‌బిడ్డా అంటివి నీయవ్వ! ఇంగో ఆకు వట్టుకో మంటూ కల్లు వంచుతడు నర్సాగౌడు. అవ్వ! కొడుకా! కల్లు గట్టిగ ఉంది... సరాయించుకుంటూ తుర్తయింది బిడ్డా! లచ్చవ్వా! మన్‌మనికి పాలరుగుతున్నయా! ఇంగో గీ యేరు చనువాలల్ల కొద్దిగ రంగరించి పొయ్యి పాలరుగుతయ్, ఎక్కిల్లు వట్టయ్, ఏడ్వడు మత్తుగ నిద్రపోతడు బిడ్డా! వివరించిండు మల్లయ్య. ఆ! గట్టనే మామా! నా చిన్నబిడ్డకు తెలుపువోతున్నది మామా! అన్నది లక్ష్మి. అయ్యోబిడ్డా! మె–ఎన్నెందుకు జెప్పలేదు. రోగమొత్తే జెప్పుకోవాలె. దనముంటే దాసుకోవాలె. సెప్పతేనే గదా బిడ్డ తెలిసేది అన్నడు మల్లయ్య.

ఆకువట్టు.... మని కల్లు వంచుతడు నర్సాగౌడ్. సాలు బిడ్డ మూడు దమ్ములు వట్టిన. పొద్దుగూట్లె వడుతుంది. మా ముసల్దాని సేవజేసుకోవాలి. అంటూ సంచి సర్దుకుంటుండు మల్లయ్య. అయ్యో! బాపు కోడండ్లు జూసుకోరా! అయ్యో కడుపు జింపుకుంటే కాల్లమీద వడతది. ఎతకత మత్తుగుంది. ఏంజూత్తరు బిడ్డా కొడుకులకు ఎవల బతుతులు వాళ్లయే. ఇద్దరు గుడ్డిగూబలోలే ఉన్నం. ఏదో జెడ్డ గడియొచ్చింది. నా పెండ్లాం జాలట్లజారి ఇర్సుకవడ్డది ఎన్నుపూస తొలిగింది. కాలుకో చెయ్యికో అయితే కట్టుగడుతుంటి. దావకాన్ల జూపిత్తే ఆపరేషన్ లచ్చగావలెనన్నరు. మంచం నేత్తుంది. పొయ్యి ఎలిగించుడు. చెయ్యి గాల్చుకునుడు నేను. ఎందర్నో బాగు చేసిన నా అదృట్టం నారాత గిట్లుంది. ఏజన్మల పాపమో. ఇంగో గా కమలవ్వ దొరసాని గింత బువ్వ కూర వెట్టింది. చెరింత దింటం పంటం. నాకత జెపితే తెల్లారది బిడ్డా! అంటూ ఫక్కున పగిలిండు. కన్నీల్లు కట్టలు తెంచుకున్నయి మల్లయ్యకు. అయ్యో బాపు ఏడవకు బాపు ఎప్పుడయినా మా ఇంటికి రావచ్చు. ఏమనుకుంటరో అని అనుకోవద్దు బాపు! అని ఓదార్చిండు నర్సాగౌడ్. కల్లు తుడుచుకుంటూ గట్లనే బిడ్డ ఇంక పోయత్తా అంటూ గడుప దాటిండు మల్లయ్య బాధతో. దారెంటా పిల్లలు రాంరాం తాతా! రాంరాం తాతా! పెద్దలు వరుసబట్టి పలుకరిస్తుంటే బాధ పరిసిండు. ఇల్లుచేసి ముసలవ్వ సేవలో మునిగిండు. దొరసాని బెట్టిన బువ్వ మూత ఇప్పి కంచుపల్లేలల్ల చెరింతపెట్టి ముసలవ్వకు ఇచ్చి తానోటి తీసుకొని తింటూ దొరసాని ముద్దవప్పు ఎట్లజేత్తదో గాని కమ్మగుంది. తిండి ముగించుకొని నిద్రలోకి జారుకున్నరు.

* * *

ఓరోజు అద్మరాత్రి తలుపులు దిబ్బదబ్బ సప్పుడు మల్లయ్యసెవిలో దూరింది. దిగ్గునలేచి ఆ... ఎవలయ్యా! వత్తున్న..ఎవలూఅంటూనే తలుపుదీసిండు మల్లయ్య.

ఆ! నేను మామా! నక్కల మల్లారెడ్డిని. నక్కల బాల్‌రెడ్డి బిడ్డ ఆపదవడుతుంది. రాత్రి బువ్వదిన్నంక సురువయింది. ఇప్పటిదాకా వాడకట్టంత పరేషన్ అవుతుండ్రు. నిన్ను దోలుకరమ్మని తోలిండ్రు.... ఆ! జల్ది పోదాం పద! మామా! మూలసుక్క వొడిసిందా! అబ్బో బబ్బులు గమ్మినయ్ వాన సురువయితంది. గొంగడి కొప్పెర వెట్టుకుండు. మందుల సంచి జబ్బకేసుకుండు. ముసలిదానా! ఊల్లెదాక పోయత్తా! అని చెప్తూ. పా బిడ్డా! మల్లారెడ్డి! అంటూ ఊరిబాట వట్టిండు. మామా సైకిలెక్కు తొక్కుతా! బయపడకు మామా! అన్నడు బాల్‌రెడ్డి. అయ్యో బిడ్డా! నాకు సైకిలెక్కరాదు బిడ్డా! జెప్ప జెప్ప నడుస్తా అంటూ బాట అందుకుండు మల్లయ్య. వాన జోరందుకుంది. ముంతవోత పోత్తుంది. ఇద్దరు మాట్లాడుతూ నడుత్తుండ్రు. బిడ్డా!నరారి పంతులు డాక్టరు, మంగలి అనుమవ్వత్త అచ్చిండ్రా! అల్లేమంటుండ్రు. అడిగిండు మల్లయ్య.అచ్చిండ్రు మామా అందరు ఆగమౌతుండ్రు. ఎడ్లబండిగూడ తయారు చేసిండ్రు గాని సిరిసిల్లకు పోదామంటే పెద్దాగురావట్టే. ముత్తాబాద పోదామంటే మన చెరువు మత్తడి దుంకవట్టే. మన సెర్లకు వచ్చే కాలువ బగ్గ అత్తుంది. ఇంగా కాట్లోని చెరువు కట్ట మీదికెల్లి దేవుని గుట్ట కాడి నుండి పోతిగంటి నుంచి ముత్తవాద పోదామంటే పోతిగంటి చెరువు మత్తడి దుంకుతుంది ఒర్రె బగ్గవారుతుంది. నీయవ్వ! మన సర్పంచి కిషన్‌రావుదొర గా ఎమ్మెల్యేతో జెప్పి పెద్దాగు మీద వంతెన గట్టిత్తే సిరిసిల్లకు వోవత్తుండే. సెర్లకెల్లి రోడ్డేత్తే ముత్తవాద పోవత్తుండే. ఏంనాయకులో నీయవ్వ. ఊరిసుట్టూ నీళ్లే ఇదో లంకయింది. గిట్లాంటి ఆపద వడితే సావుబతుకుల నడుమ పోరాడవడితిమి. మాటల్లోనే ఇంటికి జేరుకున్నము. అరే మల్లిగా! డాక్టరు నరారిపంతులూ! ఓ మంగలనుమవ్వ! ముగ్గురాలోచించండ్రి. తల్లిపిల్ల బతికేటట్లు జూడుండ్రి. ఎటువోరాకుంటుంది. ఈ గోసజూడలేక పోతున్న. ఇగ వోండ్రి అన్నడు కిషన్‌రావు దొర సర్పంచి.

అనుమవ్వత్త... తొవ్వసాపుందా! నొప్పులున్నయా! ఇబ్బంది ఎందుకవుతుంది అంటూ తెలుసుకున్నడు మల్లయ్య! అల్లుడా ఉమ్మనీరు బగ్గవోయింది. పొల్ల బక్కపలుసగుంది. బిడ్డ అడ్డం దిరిగింది తొవ్వల కత్తలేదు. లేకపోతే ఒక్కలనన్న దావకాండ్లకు పోనిచ్చిన్నా! అన్నది అనమవ్వ దిగులుతో. పంతులు గారు నొప్పులకు సూదియ్యండ్రి నేను పసరు మందిత్తా! నొప్పులు గట్టిగత్తయి. అనుమవ్వత్తా! తక్కుడు నువ్వుల నూనె వాడి పిండాన్ని తొవ్వలకు తెచ్చుకో! గంతే.. దేవుని దయవల్ల సులువుగా అయిద్ది. గోరువెచ్చని నీళ్లుదాగియ్యి. బయపడకత్తా ! అంటూ ఇగురం జెప్పిండు మల్లయ్య.

వాన కొద్దిగా తగ్గుముకం పట్టింది. ఆడకొంత మంది ఈడకొంతమంది ముచ్చట్లు

పెడుతుంఢ్రు. తల్లిగారొల్లు తలచుకుంట ఏడుస్తుంటే నా కల్లల్ల నీల్లు కమ్ముకున్నయ్. వీదిలైట్లు అక్కడోటి అక్కడోటి ఉన్నయ్ ఒక్కసారి బగ్గ మెరిసింది. ఉరిమి పిడుగు వట్టట్టయింది. అందరు ఉలిక్కివడ్డరు. కరెంటు వోయింది. కాన్పు అయింది. మగబిడ్డ పుట్టిండు. కందిలి ఎక్క ముట్టిచ్చింఢ్రు. మగ బిడ్డ పుట్టిండు తల్లి బిడ్డ సేమంగ ఉన్నరు అని మంగలి అనుమవ్వ కేకేసి సెప్పింది. అందరు గట్టిగా ఒక్కసారి ఊపిరి పీల్చుకున్నరు. గుడి ముందర కొబ్బరి కాయ గొట్టింఢ్రు . డాక్టర్ నరారయ్యగారు, మంగలనుమవ్వ, బత్తుల మల్లయ్య మీకు సేతులెత్తి మొక్కుతున్నా.... నాబిడ్డను మనుమన్ని బతికిచ్చింఢ్రు. బత్తుల మల్లయ్య నువ్వు దేవునివిరా! కల్లల్ల నీళ్లు రాలంగ దండం బెట్టిండు బాల్‌రెడ్డి. అయ్యో పటేలా! బాంచెన్ నన్ను అంత దండోన్ని చెయ్యకుంఢ్రి. ఏదో ఊరికి సేవచేసుకునే భాగ్యం దక్కింది పటేలా. మొదటి కాన్పుకదా! పొల్లపెయ్యి బగ్గ మెత్తవడుతది. పెద్దమందు బాలింతకాడ సంటోనికి పాలుతాగడానికి మందుసెట్టు రేపు తీసుకత్త. బల్లున తెల్లారవట్టే ఇంటికాడ పన్లు సేసేకోవాలె. బర్ల జండిగి, ఆవుల జెంగిడి ఎదురైతే తొవ్వ దూగదు. పటేలా పొయ్యత్తం అంటూ గొంగడి కొప్పెర పెట్టుకొని బయలు దేరి ఇల్లుచేరుకుండు.

* * *

ఆరోజు దసరా పండుగ పొద్దున్నే ఊల్లో ఇచ్చేటోల్లకు మూలిక మందులిచ్చిండు. కొందరు పైసలు మరికొందరు బువ్వకూర వెట్టింఢ్రు. సార్గమ్మకాడ గడిల మైసమ్మకు బలిచ్చిన యాటల మాంసం కొంతపెడితే మూటవట్టుకున్నడు. బత్తుల మల్లిగా! బాగున్నావ్‌రా! మానవ సేవే మాధవసేవ అంటే ఏందో అది నువ్వేరా!నువ్వు ఇరవ–యేండ్ల వయసునుంచి చెట్ల మందుల చిట్కాలతో ఎందరో రోగులకు నయం చేసినవ్. దురాశలేదు. సాయమే నీధర్మం. ఇప్పుడు డెబ్బయారు ఏండ్లదాక ఉంటవుగని నీచేతి కఱ్ఱతోడుంటే వయసోనోలే వుశారుగా నడుస్తుంటవ్ అంటూ మంచాల రాయేశం శావుకారి ఆవేదనగా అన్నడు. అయ్యా! షావుకారి మీ అందరి దీవెనలతో జేత్తున్న అంటూ మల్లయ్య అడుగు ముందుకు వేయగానే పిల్లలు రాంరాం తాతా!రాంరాం తాతా! ఆనందంగా అందరికి రాం రాం చెబుతూ ఎల్లాగౌడ్ ఇచ్చిన కల్లులొట్టి వట్టుకొని ఇంటిదారి వట్టిండు. మొగులు మీదికి జూసిండు అరె! నెత్తిమీదికి పొద్దొచ్చింది. అనుకుంటూ నడక వేగం పెంచిండు మల్లయ్య. కొందరు వయసు పొలగాండ్లు బండ్లమీద బుఱ్ఱు బఱ్ఱుమని రువ్విడిగా పోతుంఢ్రు. దసరా పండుగగదా! తాగి తడిపి సంబరంగా గాడిలో నడుపుతుంఢ్రు. చెప్పితే ఇంటరా గుఱ్ఱు గఱ్ఱుమంటరు. పడుసోల్లు పెడుసోల్లే గదా! ఏమన్న ఇబ్బందే. ఏంజేద్దాం తొవ్వొంటా నా అసోంటి ముసలోల్లకు టక్కరియతే ఉంటమా ! పెద్దపానాలు పుసుక్కున

పోతయ్. అని ఆలోచనలు చుట్టుముట్టాయ్. తేరుకొని ముసల్ది ఎంత ఎదురు–జూత్తుందో అంటూ పక్కపొంట నడుస్తుండు మల్లయ్య. ఎనకనుంచి ఎమునోలే ఆటో మల్లయ్యను గుద్దుకొని చేతాడంతా దూరం రాక్కు పోయింది. రెండు కాల్లు విరిగి బొక్కలు బయటికెల్లినయ్. నెత్తురు మడుగయ్యింది. అటోడు ఊరోడే బయపడి తింపుకొని ఏం దెల్వనట్టు ఊర్లోకి పోయిండు. పొలం పనుల్లో ఉన్నోల్లు ఉర్కొచ్చి అయ్యో! బత్తుల మల్లయ్య! రాం రాం తాతా! మంచినీళ్లు తెచ్చి తాగించిండ్రు ఈ వార్త దావానలంలా ఊరంతా పాకింది. అందరికి ఆత్మ బంధువు తండోప తండాలుగా వచ్చిండ్రు. కన్నీల్లు రానోల్లు లేరు. కొనూపరితో కొట్టుమిట్టాడుతున్న మల్లయ్యను దావకాన్లకు తీసుకపోదామని తయారు జేత్తుండ్రు.

ఓరేయ్! రాకేశ్! బత్తుల మల్లయ్యకు రాయిచెట్లు దగ్గర యాక్సిడెంట్ అయిందంట! ప్రాథమిక చికిత్స డబ్బా తీసుకో నీ కారుమీద పోదాం అన్నడు లక్షణ్‌రావు దొర ఆత్రుతగా! ఏంది నాన్నా! దసరా పండుక్కు ఎంజాయ్ చేద్దామనుకుంటే నిన్నమొన్న జేసి అలసిపోసిన డాక్టర్‌పనే. అవే కేసులంటవ్ అందరితో హాయ్‌గా ఉందామంటే ఎవనికో యాక్సిడెంట్ అని ఆగం జేత్తుండ్రు. వడ్లు వాగుల వోత్తేంది. గడ్డి గాడ్పునవోతేంది ఏదన్న దావకాన్లకు వాల్లే పోతరు. అన్నడు విసుగ్గా రాకేశ్. ఓరేయ్! అడ్డగాడిదా! మూర్ఖుడా! దుర్మార్గుడా! అంటూ ఆవేశంతో ఊగిపోతూ చెయ్యెత్తి, దించి... కనికరం లేనోడా! ఇమానం లేనోడా! ఛీఛీ! నాయం ధర్మం లేదా! కస్సు బుస్సులాడుతుండు లక్షణ్‌రావు దొర. ఇంట్లోల్లందరు ఏమయిందని చిత్రంగా చూస్తున్నరు. అరే పిచ్చోడా! చిన్నప్పుడు నీ కాలు విరిగితే కట్టుకట్టింది ఆ దేవుడేరా! చేసిన మేలు మరువద్దురా! ఛీఛీ! బుద్ధిలేనోడా అన్నడు ఆవేశంగా దొర. అయ్యో! సారీ నాన్నా! రాం రాం తాతనా నాకర్తం కాలేదు. పా పోదాంపద! అంటూ కారెక్కి సంఘటనాస్థలం చేరుకున్నారు. జనాన్ని తోసుకుంటూ వెళ్లి దాతు చూశాడు. దాతు డీలా పడుతుంది. నెత్తురు బాగా పోయింది. అంతలో తోడుగా సుభాష్‌రెడ్డి వచ్చిండు. రాకేశ్! తాత కెట్లుంది అనగిండు. క్రిటికల్ అనిపిస్తుంది నువ్వుజూడు అన్నడు రాకేశ్. చూసి ఓ రాం రాం తాతా కల్లు తెరిచి చూడు. ఇంగో ఇద్దరం డాక్టర్లమున్నమ్. నిన్ను బతికించుకుంటం అన్నడు బాధతో సుభష్‌రెడ్డి. మూలుగుతూ తాత కల్లు తెరిగి దండం బెడుతూ నా ముసల్దేది నా ముసల్ది నాకేమన్నయితే నా ముసల్దానికి దిక్కేవరు? నేనేం పాపం జేసినా? కన్నీల్లు కట్టలు తెంచుకోగా పుల్కు పుల్కున సూడగా అక్కడున్న వాళ్ల యదలు పిండేసినయ్. కంట తడి పెట్టనోళ్లు లేరు. అందరి గుండెలు చెరువులయినయ్. మల్లిగా! జెర ధైర్యంగుండు. మన ఊరోళ్లంతా నువ్వు బతకాలని దేవునికి మొక్కుతుండ్రు. జల్ది సిరిసిల్లకు తీసుకపోండ్రి

బిడ్డా! అంటూ కన్నీళ్లు పెట్టుకున్నడు లక్షణ్‌రావు దొర. మల్లయ్యను కార్లకు వట్టింద్రు. ఓపక్క తన కొడుకును మరోపక్క డాక్టర్ సుభాస్‌రెడ్డి కూర్చున్నడు. రాకేశ్ కారు నడుపుతుండు. రాకేశ్ మా తాత బాల్‌రెడ్డి రాం రాం తాతా! నేను పుట్టినప్పుడు మా అమ్మను నన్ను పానాలతో కాపాడిన దేవుడని అప్పుడు మన ఊల్లో డాక్టర్లు అందుబాటులో లేరని అంతేకాదు. కతలు కతలుగా తాత గురించి చెప్తరు. తాతను బతికించి రుణం తీర్చుకోవాలి రాకేశ్! ఏమంటవ్ అన్నడు సుభాష్‌రెడ్డి. దైవలీల చేసే ప్రయత్నం చేద్దాం. అన్నడు రాకేశ్ కారు వెంకటాపూర్ దాటింది. ఒక్కసారి బాగా కళ్లు తెరచి నా ముసల్ది అంటూ గురుక్కుమన్నడు మల్లయ్య. సుభాష్‌రెడ్డి నాడి చూసి బోరుమని ఏడ్చిండు. కారు ఆపి ఇద్దరు ఒకరిపై ఒకరు పడి కన్నీరు వెట్టుకున్నరు. మనం రుణం తీర్చుకోనీయలేదు తాత అని ఇద్దరు ఒకరినొకరు అనుకొని అంత్యక్రియలు ఘనంగా జేసి వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. తాత చివరి కోరిక ముసలవ్వ బత్కు గురించి అని చెరి 50 వేలు మొత్తం లక్షరూపాయలు డిపాజిట్ చేసి ప్రతినెల వడ్డీ డబ్బులు వచ్చేటట్లు చేశారు. దసరా పండుగ రోజంతా విషాదంతో ముగిసింది.

* * *

# జనపాల శంకరయ్య

డాక్టర్ జనపాల శంకరయ్య స్వస్థలం రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం ఆవునూరు. ఏడో తరగతితోనే చదువు ఆపేశారు. కానీ, ఉన్నత విద్యాభ్యాసంపై మక్కువతో ప్రైవేటుగా ఎం.ఎ, ఎంఫిల్, పీహెచ్ డీ, బీఈడీ, పీటీసీ చేశారు. 32 ఏండ్లపాటు ప్రభుత్వ తెలుగు ఉపాధ్యాయుడిగా సేవలందించారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. సాహిత్యాభిలాషతో పద్య, వ్యాస, బుర్రకథ తదితర ప్రక్రియల్లో అనేక రచనలు చేశారు. ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడిగా ఉన్నారు. 'ఆచార్య దేవోభవ' శతకానికి పాలకొల్లు విశిష్ట పురస్కారం, చెలిమి సాంస్కృతిక సంస్థ పురస్కారం దక్కాయి.. వీరి 'లంబాడీ గేయ సాహిత్యం' పరిశోధనా గ్రంథానికి అంతర్రాష్ట్రీయ ఇందిరా గాంధీ అవార్డు వచ్చింది. తొలి కథ 'మా ఊరి ధన్వంతరి రాంరాం తాతా' కథ, నమస్తే తెలంగాణ – ముల్కనూరు ప్రజా గ్రంథాలయం నిర్వహించిన పోటీల్లో విశిష్ట పురస్కారానికి ఎంపికైంది.

# కర్మకాండ

బద్రి నర్సన్

**94401 28169**

**మార్నింగ్** వాక్ ముగించుకొని ఇంటికొచ్చిన మనోహర్, షూ లేస్ విప్పుతుండగా ప్యాంటు జేబులోని మొబైల్ ఫోన్ రింగయ్యింది. చేతిలోకి తీసుకొని చూస్తే, తమ్ముడు సుధాకర్ నుండి కాల్. ఆత్రుతగా కిచెన్‌లోంచి బయటికొచ్చిన అర్ధాంగి కవితకు ఫోన్‌లో పేరు చూపిస్తూ, కాల్ రిసీవ్ చేసుకున్నాడు. ఆవైపు నుంచి సుధాకర్ చెప్పిన మాటలకు మనోహర్ కండ్లు తడిసిపోయి, నీటిబొట్లు షర్ట్‌పై రాలుతున్నాయి.

'అదే వార్తనా?' అన్నట్లు భర్త కండ్లలోకి చూసింది కవిత.

'ఔను' అన్నట్లు చిన్నగా తలూపడంతో, దగ్గరికెళ్లి మనోహర్‌ను పొదివి పట్టుకుంది.

మనోహర్ తల్లి చనిపోయింది. ఎనభై ఏండ్లు దాటిన ఆవిడ ఉబ్బసంతో బాధపడుతూ, తెల్లవారు జామున తుదిశ్వాస విడిచింది.

సొంతూరిలో ఉంటున్న తల్లిని మనోహర్ చూసొచ్చి నాలుగు రోజులైంది. ఆరోగ్యం కాస్తా కుదుట పడ్డట్లు కనబడటంతో.. 'కవితను తీసుకొని మళ్లీ వస్తాను' అని చెప్పి వచ్చాడు.

అమ్మకోసం మరణ శకటం సిద్ధమైందనిపించినా, దాని వేగం ఇంతలా పెరుగుతుందని ఆయన ఊహించలేదు. ముదిమి వయసు అంటేనే ఎప్పుడూ తు–పాను హెచ్చరిక జెండా ఎగుర వేసినట్లే! చావు దోబూచులాటలో 'ఆమె ఎంత కష్ట పడుతుందో? ఎందర్ని కష్ట పెడుతుందో?' అనే బెంగనుండి ఆయనకు లభించిన ఊరట, విషాద మట్టాన్ని తగ్గిస్తున్నది.

కండ్లు తుడుకుంటూ కిచెన్‌లోకి వెళ్లిన కవిత నీళ్లగ్లాసు తెచ్చి, ఆయన చేతిలో పెడుతూ..

'బట్టలు సర్దేస్తాను' అని చెప్పి, బెడ్రూం వైపు నడిచింది. వెంటనే ఏదో గుర్తొచ్చినట్లు వెనక్కి తిరిగి వాష్ ఏరియావైపు వెళ్లింది.

పనిమనిషి వీరమ్మ కనబడలేదు. 'బట్టలుతకడం మధ్యలో ఆపేసి ఎక్కడికెళ్లింది?' అనుకుంటూ మెయిన్‌డోర్ దగ్గరికొచ్చింది.

డోర్ బయట కారిడార్‌లో కొంగుతో చేతులు తుడుచుకుంటూ నిలబడి ఉన్న

వీరమ్మ ... 'చావు ఇంట్లో పనిచేయనమ్మా' అన్నది ఇబ్బందిగా ముఖం పెడుతూ.

'చావు.. ఊర్లో కదా?..' నడుమ ఇదేం గోల అన్నట్లు అంది కవిత.

'పోయింది మీ సొంత మనిషే కదమ్మా.. అంటు మీకుండదా?' అని ఎదురు ప్రశ్న వేసింది వీరమ్మ.

'అంటు ముట్లేంటే తల్లీ!' అంటూ తలుపేసింది కవిత విసుగ్గా. సగం ఉతికిన బట్టలను దండెంపై వేస్తుండగా, పక్క ఫ్లాట్‌లోని అనసూయ మాటలు వినిపిస్తున్నాయి.

'బిరబిర వెళ్లిపోతున్నవేందే.. మా ఇంట్లో పని చేయవా?' అంటున్నదామె.

'చావు కబురు' మెల్లగా ఆమెకు చెప్పినట్లుంది వీరమ్మ.'సరే.. సరే.. ఇంటికి పోయి శుభ్రంగా స్నానం చేసి రాపో' అని కసురుకుంటూ తలుపేసుకుంది అనసూయ.

అనసూయ, కవిత ఇద్దరూ మిత్రులనేకన్నా వారి మధ్య నాలుగేండ్ల పరిచయం ఉంది అనాలి. పిండివంటలు ఇచ్చి పుచ్చుకోవడాలు, రెండిండ్లకూ పనిమనిషి ఒక్కరే కాబట్టి.

'వచ్చిందా? పోయిందా?' అనే ముచ్చట్లు వారిమధ్య సాగుతుంటాయి. అనసూయ భర్త విశ్వనాథం, మనోహర్ ఇద్దరిదీ టీచింగ్ ఫీల్డే అయినా, పక్కపక్క ఫ్లాట్లు కొన్నాకే పరిచయం ఏర్పడింది.

బ్యాగు బయటపెట్టి మనోహర్ ఇంటికి తాళం వేస్తుండగా, కవిత తాము ఊరెళు _న్నట్లు చెప్పడానికి అనసూయ వాళ్ల కాలింగ్ బెల్ నొక్కింది. తలుపు తెరుచుకోలేదు. మళ్లీ నొక్కింది. తలుపునకు జీవం రాలేదు. బ్యాగు తీసుకొని కవితవైపు వస్తున్న మనోహర్ మొబైల్‌కు మెసేజ్ వచ్చింది. చూస్తే..

'మీ తల్లి మరణానికి ప్రగాఢ సానుభూతి. రిప్ ఫ్రమ్ విశ్వనాథం' అని ఉంది. మళ్లీ బెల్ కొట్టేందుకు సిద్ధపడుతున్న కవితను వారిస్తూ మెసేజ్ చూయించాడు.

'ఆ తలుపు తెరుచుకోదు. నీ బెల్లుకు ఇదే సమాధానం' అన్నట్లు సైగ చేస్తూ, పదమంటూ ముందుకు నడిచాడాయన.

మూడు గంటలు ప్రయాణించి, వాళ్లు ఇంటికి చేరేసరికి సమయం తొమ్మిది దాటింది. మనోహర్‌కు సుధాకర్‌తోపాటు ప్రకాశ్ అనే చిన్న తమ్ముడున్నాడు.

తల్లికి కొరివి పెట్టేది చిన్నోడే. వరంగల్ నుండి ప్రకాశ్ రావడంతో, ఊర్లోనే ఉ ండే సుధాకర్ అంత్యక్రియల పనులు వేగిరం చేయడంలో అటూ ఇటూ తిరుగుతున్నాడు. మనోహర్ తర్వాత ఇద్దరు ఆడబిడ్డలు. వాళ్లు శవపేటికకు దగ్గరగా కుర్చీలు వేసుకొని కూచున్నారు. అప్పటికే దుఃఖభారంతో అలసి పోయినట్లున్నా.. అమ్మ చివరి చూపుకోసం వచ్చిన అమ్మలక్కలను పట్టుకొని తల్లితో వారికున్న

అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ వెక్కివెక్కి

ఏడుస్తున్నారు.

మనోహర్, కవితలను చూడగానే వారి శోకం కొత్తరాగం అందుకుంది.

'కొడుకులను కన్నావుగని అమ్మా.. వారి సేవకు నోచుకోలేదే అమ్మా'

'నాలుగు తరాల సంతతి నీదమ్మా.. నీకు నా అన్నవాళ్లే లేరమ్మా..'

'అందరూ నీ చావు కోరినోళ్లేనమ్మా..

నీ ఉసురు తగిలి పోతరమ్మా..'

..మనోహర్ వాళ్ల అమ్మాయి బెంగళూరులో ఉంటుంది. ఆమె తొలికాన్పువల్ల సుమారు ఏడాదిపాటు వీళ్లు అక్కడే ఉండక తప్పలేదు. అంత దూరమైనా, మనోహర్ తల్లిని చూడ్డానికి రెండు మూడు నెలలకోసారి వచ్చి వెళ్లాడు.

చెల్లెండ్ల మాటలు విని తను సర్దుకుపోయినా, నలుగురిలో ఇలా అవమానించడం కవితకు ఇబ్బందిగా ఉందని గ్రహించాడు మనోహర్. సరాసరి సుధాకర్ దగ్గరికెళ్లి..

'మేమేం పాపం చేశామురా, ఏం విషపు మాటలివి?' అన్నాడు ముఖం చిట్లిస్తూ..

'దహనం అయ్యేదాకా ఓపిక పట్టు అన్నయ్యా. విననట్లే ఉండి, పని గట్టెక్కిచ్చుకుందాం..' అని అన్న గదవ పట్టుకొన్నాడు సుధాకర్. 'సరే' అని తల ఆడిస్తూ, కవిత దగ్గరికెళ్లి ఓపిక పట్టమన్నట్లు ఆమె తల నిమురుతూ ఇంట్లోకి వెళ్లాడు.

'ఎవరూ రాకండి. ఇక్కడ వసతులు లేవు. ఏదో హెల్త్‌ప్రాబ్లమ్ చెప్పి నేను కూడా రేపు వచ్చేస్తా..' అని గద్దించినట్లు ఫోన్‌లో మాట్లాడుతున్నది మనోహర్ పెద్దచెల్లి. ఆయన వాష్‌రూమ్‌లో ఉన్న సంగతి ఆమెకు తెలియదు. చిన్నప్పటి ప్రేమలు కాలంతోపాటు పెరగకుండా ద్వేషంగా, నలుగురిలో పరువు తీసేంత కసిగా ఎందుకు మారిపోతాయో అర్థం కాలేదు ఆయనకు.

పెండ్లిళ్లు కాగానే తోడబుట్టిన మగవాళ్లు మారిపోతారని ఆడబిడ్డలు, పెళ్లయి ఇన్నేండ్లయినా మీ వాళ్లు కనబడగానే ముఖం వెలిగిపోతుందని పెండ్లాలూ మగాళ్లని ఆడి పోసుకోవడం రివాజయింది. తల విదిలించుకొని బయటికి వచ్చాడు మనోహర్.

అమ్మకు స్నానం చేయించి, కొత్త వస్త్రాలను చుడుతున్నారు. తలకొరివి పెట్టే ప్రకాశ్ తలపైనుంచి నీళ్లు కుమ్మరించుకొని కొత్త పంచె కట్టుకుంటున్నాడు.

ఈ వయసులోనూ అమ్మ పొద్దున్నే స్నానం చేసి, చక్కగా దువ్వుకొని హన్మాండ్ల సిందూరంతో నొసట నామంగా, చిన్నగా దిద్దుకొని, పెద్ద అరుగుమీద కుర్చీలో కూర్చొని, స్టూలుపై కాళ్లు చాపుకొని, ఇంటి ముందరినుండి వచ్చీపోయే వాళ్లను

**భోజనాలయ్యాక కొందరు సేద తీరగా, మనోహర్ తమ్ముళ్ల వద్దకెళ్లి జరుపవలసిన కర్మకాండల గురించి ప్రస్తావన తెచ్చాడు. ఎవరికీ ఇందులో పెద్ద అనుభవం లేదు. దహనం తర్వాత శ్మశానవాటికలోనే తోడొచ్చినవారికి మందు ఏర్పాటు చేయాలట. ఎవరూ గుర్తు చేయకపోవడంతో ఆ కార్యక్రమం జరగలేదు. 'ఆచారాలు తెలియని మనుషులని' మాట పడాల్సి వచ్చింది. మూడోరోజు పక్షికి పెట్టి, అక్కడే చెట్ల నీడన భోజనాలతోసహా మద్యం ఏర్పాటు చేద్దామని అన్నదమ్ములు నిర్ణయించుకొన్నారు.**

పేరుతో, వరసతో పలకరిస్తూ ఉండేది. పాలు, పెరుగు, పండ్లు, కూరగాయలు అమ్మేవాళ్లంతా ఆమెకు ఆత్మబంధువులే. పొద్దున, సాయంత్రం టీతోపాటు బొంబాయి కారెలు తినడం అమ్మకు అలవాటు. చావు వార్త తెలియగానే వారంతా చివరి చూపుకోసం వచ్చినట్లు దూరంగా నిలబడ్డారు. కారెలమ్మే సాయిబుకూడా సైకిల్ పక్కన పెట్టి, శవం దగ్గరిదాకా వచ్చి చూసి వెళ్తున్నాడు.

కుటుంబసభ్యులు వరసగా అమ్మ దగ్గరికెళ్లి నోట్లో తులసి ఆకుతో నాలుగు చుక్కల నీళ్లు పోస్తున్నారు. తన వంతు వచ్చేసరికి తల్లి జ్ఞాపకాలతో పొంగుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేకపోయాడు మనోహర్. కవిత ఓదార్పుగా వెంట నడిచింది.

అమ్మ అంతిమయాత్ర మొదలైంది. నలుగురు మోసే కాలం పోయి మహాప్రస్థానం వాహనాలు వచ్చాయి. 'నలుగురితో మంచిగా ఉండు' అనే సామెత వట్టి పోయినట్లయింది. వాహనం వెనకాల ఆటోల్లో, మోటారు సైకిళ్లపై రావలసినవారు వచ్చారు.

చిన్న కొడుకు చేతులమీద దహన సంస్కారం పూర్తయింది. అక్కడే స్నానాలు చేసి, ఇంటికి చేరుకున్న కుటుంబసభ్యులు అమ్మ జ్ఞాపకంగా అరుగుపై వెలిగించిన దీపానికి దండం పెట్టుకున్నారు. కేటరింగ్‌కు ఇచ్చిన భోజనం వచ్చింది. ససేమిరా తినలేమని కండ్లు తుడుకుంటున్న ఆడబిడ్డలను కవిత బతిమాలి నాలుగు ముద్దలు తినేలా చూసింది.

భోజనాలయ్యాక కొందరు సేద తీరగా, మనోహర్ తమ్ముళ్ల వద్దకెళ్లి జరుపవలసిన కర్మకాండల గురించి ప్రస్తావన తెచ్చాడు. ఎవరికీ ఇందులో పెద్ద అనుభవం లేదు. దహనం తర్వాత శ్మశానవాటికలోనే తోడొచ్చినవారికి మందు ఏర్పాటు చేయాలట. ఎవరూ గుర్తు చేయకపోవడంతో ఆ కార్యక్రమం జరగలేదు. 'ఆచారాలు తెలియని మనుషులని' మాట పడాల్సి వచ్చింది. మూడోరోజు పక్షికి పెట్టి, అక్కడే చెట్ల నీడన

భోజనాలతోసహా మద్యం ఏర్పాటు చేద్దామని అన్నదమ్ములు నిర్ణయించుకొన్నారు. అమ్మ చనిపోయింది బుధవారం. శుక్రవారం పక్షికి పెడుతున్నామని యాభైకి పైగా బంధుమిత్రులకు ఫోన్లద్వారా సమాచారం అందించారు.

చెట్ల పక్కన వంటలు మొదలైనాయి. పన్నెండు దాటింది. వండిన పదార్థాలన్నిటినీ ఓ విస్తరిలో పెట్టి దూరంగా పక్షులు తిరిగే చోట పెట్టి వచ్చారు. కొద్దిసేపటికి ఓ కాకి వచ్చి విస్తరిలోని ఓ ముక్కను నోట కరచుకొని వెళ్లిపోయింది.

పగలు రెండవుతున్నది. ఒక్కొక్కరుగా పది, పదిహేను మంది వచ్చారు. వచ్చినవారిని టెంట్లకింద టేబుల్ ముందు కూర్చోబెట్టి ప్లేట్లలో, గ్లాసుల్లో కావలసినవి సమకూర్చి మర్యాదలు చేస్తున్నారు. యాభైకి పైగా వస్తారనుకున్న మనుషుల జాడలేదు.

'ఏరా.. నారాయణ వస్తానన్నాడు రాలేదు..' అన్నాడు ఓ స్నేహితుడితో మనోహర్.

'ఇవ్వాళ శుక్రవారం కదా. పలకరించడానికి ఎవరూ రారు. నిన్న, మొన్న కలిసిన వాళ్లే వస్తారు' అని సమాధానం.

'చావు భోజనమంటే చాలామంది వెనుకాడుతున్నారు మనోహర్! కొత్తింట్లోకి వెళ్లినవారు, పిల్లల పెండ్లిళ్లు చేసిన వాళ్లు ఏడాదిదాకా ఈ భోజనం ముట్టరు' అని తనకు తెలియని విషయం చెప్పారొకాయన.

'నీ మాట తీసేయలేక గోపాల్ వచ్చాడుగానీ, తింటలేడు. తాగుత లేడు. మిక్చర్ ప్యాకెట్ తెచ్చుకొని తింటున్నాడు' అంటూ వేలెత్తి ఆయనవైపు చూపుతూ చెప్పాడో మిత్రుడు.

ఫోను ఎత్తిన వాళ్లంతా వస్తామనే అన్నారు గానీ, రాలేమని ఒక్కరూ అనలేదు. రాకపోవడానికి ఎవరి కారణాలు వారికున్నాయి. సాయంత్రం అయిద్దైంది. వచ్చిన కొద్దిమంది సెలవు తీసుకున్నారు. ఇంటివారంతా తిన్నాక కూడా వండిన పదార్థాలు సగమైనా ఒడవలేదు.

గిన్నెలు కడుగుతున్న పనివాళ్ల దగ్గరికెళ్లి..

'మిగిలినదంతా మూటలు కట్టుకోండి. ఎవరికైనా పనికొస్తుంది..' అన్నాడు మనోహర్, ఎవరో ఒకరు తింటే మేలే కదా అనుకొని.

'సార్.. మేం చావు భోజనం ముట్టము. బయట తినడానికి విడిగా రెండు వందలీయండి..' అంది ఒకామె తలెత్తకుండానే.

అలసిపోయిన వాళ్లు కుర్చీల్లోనో, చాపలపైనో కునుకు తీస్తున్నారు. తమ్ముళ్లవైపు వెళ్తున్న మనోహర్ వెనుకాలే వచ్చిన పనామె.. 'సార్.. గిన్నెలు ఖాళీ చేసి ఇవ్వండి.

కడిగేసి వెళ్తాం..' అన్నది.

'మీరే ఎక్కడైనా..'

'మాకు అంత బరువులు లేవవు. ఆ వాగు పక్కన పడేసి రండి. పశువులు తింటాయి'

ముగ్గురన్నదమ్ములూ కలిసి, గిన్నెలు మోసుకెళ్లి వాగు ఒడ్డున రాళ్లపై కుమ్మరించి వచ్చారు.

మామూలు భోజనానికి, చావు భోజనానికి తేడా ఏముందీ. మనుషుల్లో ఇలాంటి అపోహల్ని నూరి పోసినోడు కనిపిస్తే కసి తీరా తన్నాలనిపిస్తున్నది మనోహర్‌కు.

మర్నాడు ఉదయం కూరగాయల మార్కెట్లో మనోహర్‌కు తన డిగ్రీ క్లాస్‌మేట్ రవీందర్ కనబడ్డాడు. ఎన్నాళ్లకు కనబడ్డాడన్న ఆనందంలో చేయి కలుపుతూ..

'బాగున్నావా రవీ..' అన్నాడు .

మనోహర్ బోడిగుండును చూసి రవీందర్,

'తిరుపతికి వెళ్లినవా?' అన్నాడు.

లోపలే నాలుక కరుచుకున్న మనోహర్ చేయి వదులుకొని,

'లేదు.. మా అమ్మ చనిపోయి నాలుగు రోజులైంది' అన్నాడు సంజాయిషీగా. మాట పూర్తి కాకుండానే రవీందర్ కొంత ఎడంగా జరిగాడు.

'సారీ. మరిచిపోయి చేయి కలిపాను..'

'దాందేముంది, పర్వాలేదు. ఇంటికి పోయినాక స్నానం చేస్తే సరి..' అంటూ రవీందర్ చకచకా వెళ్లిపోయాడు.

* * *

పదో రోజు జరిపే పెద్దకర్మకు ఏర్పాట్లు మొదలయ్యాయి. కుటుంబసభ్యులంతా ఆహ్వానిస్తున్నట్లు కార్డుపై పేర్లు వేయించి, రెండ్రోజుల ముందే వాటిని పక్కింటి అబ్బాయి సాయంతో ఊర్లో ఉన్న బంధుమిత్రులకు, వీధిలో ఇంటింటికీ అందేలా చూశారు.

పొద్దున్నే మార్కెట్‌వైపు బయలుదేరిన మనోహర్‌కు దార్లో, చెత్తవేసే మూలల్లో తల్లి దశ దినకర్మ కార్డు ముక్కలు కనబడ్డాయి. వెనుదిరిగి పక్కింటి అబ్బాయిని పిలిచి, 'ఇదేంటి' అన్నట్లు వాటిని చూయించాడు.

'కర్మకాండ కార్డును ఎవరూ ఇంట్లో ఉంచుకోరు. చదవగానే చించేసి పడేస్తారు. మీదేకాదు, ఎవరిదైనా ఇంతే అంకుల్..' అని అబ్బాయి ఇందులో తన తప్పేమీ లేదన్నట్లు మనోహర్‌వైపు చూశాడు.

తనను తాను ఎలా సమాధాన పరచుకోవాలో అర్థం కాలేదు మనోహర్‌కు.

మూడో రోజు అనుభవంతో పెద్దకర్మ రోజున వంటలు సగానికి సగం తగ్గించారు. అందులోనూ కొంత మిగిలినా ఇబ్బంది కలుగలేదు.

ఇంటివారి భోజనాలు కూడా అయ్యాక, వెళ్లేవారు తిరుగు ప్రయాణం ఆలోచనలో పడ్డారు.

ముగ్గురు అన్నదమ్ములను వారివారి అత్తింటివారు నిద్రకు తీసుకెళ్లాలి. సరాసరి ఇప్పుడే తీసుకెళ్లొచ్చు లేదా పది రోజుల్లో ఎప్పుడయినా పర్వాలేదు. మనోహర్ అత్తమామలు గడిచి పోయినందున ఆ భారం బావమరుదులపై పడింది. ఇద్దరిలో ఏ ఒక్కరు తీసుకెళ్లినా చాలు. పెద్ద బావమరిది, ఆయన భార్య ఓ మూలన నిలబడి చర్చించుకుంటున్నారు. నెలరోజుల్లో వారి కూతురు పెండ్లి ఉంది.

'నిద్రకు తీసుకుపొమ్మని మీ తమ్మునికి చెప్పు' అని పోరుతోందామె. ఈలోగా చిన్న బావమరిది దంపతులు 'మేం వెళ్తున్నాం' అని చెప్పి జారుకున్నారు.

పిచ్చిచూపులు చూస్తున్న పెద్ద బావమరిదిని పిలిచి.. 'సంగతేంటి?' అన్నాడు మనోహర్.

'బావా! మిమ్మల్ని, చెల్లిని నిద్రకు తీసుకెళ్లాలి. మా అమ్మాయి పెండ్లి సంగతి మీకు తెలిసిందే, తమ్ముడు..' అని ఇంకేదో చెప్పబోయాడాయన.

'మీరు పిలిచినా నేను రాను. ఏడాదిపాటు మేమే ఎవరింటికీ వెళ్లం. మీరు నిశ్చింతగా ఉండండి..' అంటూ ఆయన భుజాన్ని తట్టి, ఇదంతా చూస్తున్న కవితవైపు నడిచాడు మనోహర్.

అన్నల అవమానకర ప్రవర్తనతో కవితకు తల్లిదండ్రులు గుర్తొచ్చారు. మనోహర్ దగ్గరికి రావడంతో ఆమెకు కన్నీరు ఆగలేదు.

'ఊర్కో.. ఏడవకు. దీంట్లో వాళ్ల తప్పేముంది? ఇలాంటి పనికిమాలిన ఆచారాల్ని వారి మెదళ్లలో కూచోబెట్టిన వారిని అనాలి..' అని ఓదార్చాడు.

తిరుగు ప్రయాణంలో మనోహర్ మనసు నిలకడగా లేదు.

'పోయినవారు మిగిల్చిన దుఃఖం కన్నా చుట్టూ ఉన్న మనుషుల ప్రవర్తన భరించడమే కష్టం. నిర్జీవమైన దేహం కాల్చితే బూడిదవుతుంది. పాతి పెడితే మట్టి అవుతుంది. వదిలేస్తే కుళ్లి కంపు కొడుతుంది. ప్రేతం, భూతం అని చనిపోయిన వారిని అగౌరవ పరుస్తూ, అమానవీయంగా చిత్రిస్తున్నారు.

అమ్మ జ్ఞాపకంగా మిగిలిపోతుంది గానీ, దెయ్యమెలా అయి ఇతరులను భయపెడుతుంది, బాధ పెడుతుంది..' జర్నీ సాంతం ఇవే ఆలోచనలు ఆయన్ని వేధించాయి.

మర్నాడు ఆఫీసుకు వెళ్లి తిరిగి వస్తూ, దారిలో మోహన్ ఫౌండేషన్ నుండి

రెండు అప్లికేషన్ ఫారాలు తీసుకొచ్చాడు మనోహర్. రావడంతోనే అందులోంచి ఒకదాన్ని కవిత చేతిలో పెట్టి చదవమన్నాడు.

'ముందు ఫ్రెష్కండి..' అంది కాగితం తీసుకుంటూ.

'అన్నీ తర్వాతే.. ముందు చెరో ఫారంపై సంతకం పెడుదాం..' అంటూ సోఫాలో కూర్చున్నాడు.

కవితవైపు చూస్తూ, 'చనిపోయాక మన శరీరాలను మెడికల్ కాలేజీకి అప్పగించేందుకు ముందస్తు అంగీకార ధృవీకరణ పత్రం ఇది..' అని ఆమెకు చెప్పి, తను సంతకం చేశాడు.

'ఇదిగో పెన్ను తీసుకో..' అన్నాడు ఆలోచన అనవసరం అన్నట్లు..

'ఇప్పుడివన్నీ ఎందుకండీ?' అంటూనే పెన్ను అందుకొని సంతకం చేసి, పెన్ను, కాగితాన్ని భర్త చేతిలో పెట్టింది.

'ఇలా చేస్తే కర్మకాండల నుంచి తప్పించుకోవచ్చు. దినాలు, తద్దినాలు, ఏవీ వద్దని పిల్లల్ని రాతపూర్వకంగా కోరుదాం. అంతగా అవసరమనిపిస్తే చిన్నగా సంస్మరణ సమావేశం జరిపి, తేనీటి విందు ఇవ్వమందాం'

'చావు సభ అని వచ్చినవారంతా చాయ్, బిస్కట్ తీసుకుంటారో? లేదో?' విషాద సందర్భంలో కవిత చమత్కారంగా మాట్లాడటంతో చాన్నాళ్ల తర్వాత మనోహర్ ముఖం నవ్వుతో విప్పారింది.

## బద్రి నర్సన్

*రచయితగా, కాలమిస్ట్గా చిరపరిచితులైన బద్రి నర్సన్ స్వస్థలం జగిత్యాల. ప్రస్తుతం హైదరాబాద్లో నివాసముంటున్నారు. డిగ్రీ వరకూ జగిత్యాలలోనే విద్యాభ్యాసం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎంఏ, ఎంఎడ్ చేశారు. ఓయూలో చదువుతున్న రోజుల్లోనే 'రంగుల కల', 'విముక్తి కోసం' సినిమాలకు రచన, దర్శకత్వ శాఖల్లో పనిచేశారు. ఉన్నత విద్యాభ్యాసం తర్వాత తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఉద్యోగంలో చేరారు. 2015లో విరమణ పొందారు. దివంగత కవి, చిత్రకారుడు అలిశెట్టి ప్రభాకర్ కవిత్వాన్ని పుస్తకంగా తెచ్చారు. తన జీవితంలో అత్యంత సంతృప్తిని ఇచ్చిన అంశం ఇదేనని నర్సన్ చెప్తారు. సాహిత్యంపై మక్కువతో 30 వరకూ కథలు రాశారు. అందులో ఎనిమిదింటికి వివిధ పోటీల్లో బహుమతులు అందుకున్నారు. 'ఓ రైతుకథ' కు 2016లో నోముల సత్యనారాయణ పురస్కారం దక్కింది. 2017, 19లలో 'నవ తెలంగాణ' పత్రిక నిర్వహించిన కథల పోటీల్లో ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుపొందారు. 2020లో నిర్వహించిన 'పాలపిట్ట–శకుంతల జైనీ' దసరా కథలపోటీల్లో 'రబ్బరు బొమ్మ' కథకు మొదటి బహుమతి లభించింది.*

# ఈద్ కా చాంద్

హనీఫ్

**83285 86518**

**'అమ్మీ..** ఛోటీ ఆగయి'

రోట్లో గోరింటాకు నూరుతున్న పనిని ఆపి అమ్మకూడా గుమ్మం తలుపువైపు చూసింది.

ఇంట్లో ఒక సెకనుకు ముందున్న స్థితికి భిన్నంగా, ఏదో ఒక కొత్త ఉత్సాహం వచ్చిన వారిలా ఇంట్లో వాళ్లంతా హాల్‌లోకి వచ్చేశారు. రాబోతున్న అథితికి స్వాగతం చెప్పడానికి!

ఆ పాప మొదటి అడుగు ఇంట్లోకి పెట్టగానే అందరూ ఒక్కసారే ముక్తకంఠంతో 'హ్యాపీ బర్త్‌డే టూ యూ' అని చెప్పేశారు.

పాపం చిన్నపిల్ల.. తట్టుకోలేని సంతోషం! అందరిలోకి కరిగి, ఒదిగి పోయింది.

'అదేరా.. 'ఈద్ కా చాంద్' పడమరన ఎలా కనిపిస్తాడో? తారతమ్య భేదాలు లేకుండా అందరికోసం ఎలా వస్తాడో? ఛోటీకూడా అంతే, తప్పక వస్తుంది. ఈ వీధి అంతటా వీచే చల్లని గాలి తెమ్మెర అది'

'అంతొద్దులే! మరీ పైపైకి ఎత్తేస్తున్నావ్ దాన్ని'

'కుళ్లిన వాసనేదో వస్తోంది ఇంట్లో, కాస్త బైటికెల్లరా?'

'అమ్మీ! దాని ముందు నన్నంత చులకనగా తీసి పడేయకు' ..

అనన్య గోరింటాకు సాకుతో ఆ ఇంటికి వచ్చింది. తన రాకను ఇంతలా స్వాగతించారని ఉబ్బి తబ్బిబ్బై పోయింది.

ఈ ఇంట్లో తనకు ప్రతి యేడూ జరిగే సత్కారం. తన పుట్టిన రోజు సెలబ్రేషన్స్ పొద్దున్నే జరిపించేశారు. తాతయ్య, నానమ్మ, పిన్నమ్మలు, బాబాయిలు ఎంతగా ఆదరించారనీ..

'అబ్బ.. నువ్వంటే నాకెంతో ఈర్ష్య. ఒకేరోజు రెండు పుట్టినరోజు వేడుకలు నీకేనా' అన్నాడు ఖలీల్.

'అరేయ్.. అక్కను అలా అనవచ్చునా? తప్పు గదూ!' అని అందరూ కోప్పడ్డారు. ఎందుకంటే, ఆ రెండు కుటుంబాలకూ తను ఒక్కతే ఆడపిల్ల.

* * *

పరంధామయ్య.. పొద్దుటి కాఫీ, ఫలహారాలయ్యాక ఇంటిముందు పందిరికింద ఉన్న ఈజీ చైర్లో కూర్చొని, ఆలోచనల్లో మునిగిపోయాడు.

ఇది అతనికి మామూలే. 'మా రెండు కుటుంబాల మధ్య స్థితిని ఏమైనా నివారించగలనా?' అని ఆయన ఆలోచిస్తూ ఉంటాడు. కానీ, దాన్ని 'ఎలా మొదలెట్టాలి?' అనే దగ్గరే ఆగి పోతుంటాడు. దీర్ఘాలోచనల్లో పరిష్కారం దొరక్క పోయినా నుదుటి చర్మం మీద ఇష్టమొచ్చినట్లు పిచ్చిగీతలు పెట్టేసుకుంటాడు. అవి పెద్ద తరహాకు నిషానీలుగా మిగిలి వున్నాయి. ఈరోజు తన మనవరాలి పుట్టినరోజు.

'వాళ్లందరూ మా ఇంటికి రాకుండా ఉంటే..' ఈ ఆలోచన రావడమే ఆయనకు మింగుడు పడటం లేదు. తానైతే.. రమ్మనమని ఆహ్వానం పంపాడు.

'తాతయ్యా!' అని గట్టిగా అరుస్తూ పరంధామయ్య ఆలోచనలను డిస్ట్రబ్ చేస్తూ, బైటినుంచి వస్తున్న మనవరాలు తన చేతులకు పెట్టించుకొన్న గోరింటాకు డిజైన్‌ను తన ముందు ప్రదర్శనకు పెట్టింది.

వాటిని చూడగానే, 'బాగుంది.. బాగుంది' అన్నాడు పరంధామయ్య.

అనన్య తన పెద్ద కొడుకు కూతురు. ఇవాళ ఆ పాప పుట్టినరోజు. ఈ యేడాదే పదో తరగతి పాసైంది. ఎప్పుడు వెళ్లిందో ఏమో అక్కడికి.

పుట్టిన రోజనే కాదు. ఏ పండుగోచ్చినా, పబ్బమొచ్చినా ఆ ఇంటినుంచే ముస్తాబై రావడం తనకు అలవాటు.

ఆ విషయం తెలిసినా 'ఎక్కడినుంచి ఈ ముస్తాబు?' అని అడిగాడు.

'అబ్బా.. తెలియనట్టే ఆరాలు. పీరు తాతయ్య వాళ్ల ఇంటినుంచే' అని చెవిలో గట్టిగా అరిచి ఇంట్లోకి వెళ్లింది అనన్య.

పీరు సాహెబు.. తనకు చాలా ఇష్టమైన పేరు. తన బాల్య స్నేహితుడు. వాళ్లిద్దరూ కలిసి పెరిగిన వాళ్లు. ఒకరికి తెలియని రహస్యాలు వేరొకరి దగ్గర దాగి లేవు. అంతటి ప్రాణమిత్రులు. పీరు సాహెబ్‌కు తాత, ముత్తాతల నుండి సంక్రమించిన ఆస్తి పిల్లల చదువులకు కర్పూరంలా హరించుకుపోయింది. రెక్కల కష్టానికి తోడు ఓ నాలుగు ఎకరాల భూమి మాత్రం మిగిలింది. ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. తన మాట వినే, ముగ్గురు సంతానం తర్వాత కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకొన్నాడు. ఆ ఊళ్లోని ముస్లిం కుటుంబాల్లో ఈ పని చేసిన మొదటివాడు.. పీరు సాహెబ్.

తనతో పోటీ పడి మరీ పిల్లల్ని బాగా చదివించాడు. ముగ్గురి పెండ్లిళ్లూ చేశాడు.

ఊరివాళ్లంతా, 'మీవి రెండు కుటుంబాలు కావు.. ఒకటే కుటుంబం' అంటుండేవారు. కానీ, ఎవరిదో దిష్టి తగిలింది. చెడు చూపు, చెడు ఆలోచనలు

ఆ రెండు కుటుంబాలకూ చుట్టుకున్నాయి. ఏనాడూ తగువు పడలేదు. ఒకరినొకరు ఎదురుపడి మాటా, మాటా అనుకున్నదీ లేదు. అయినా, రెండు కుటుంబాలూ దూరమవుతున్నాయనే బాధను మాత్రం అనుభవిస్తున్నారు.

పరంధామయ్య పెద్ద కొడుకు బాబ్రీ మసీదు కూల్చివేతలో పాల్గొన్నాడు. అప్పటి నుంచే పెడసరంగా మాట్లాడటం, ముస్లిం సమాజాన్ని ద్వేషించడం నేర్చుకున్నాడు. ఈ విషయం పరంధామయ్యకు చాలాకాలం తర్వాత తెలిసింది.

'రాజకీయాలను కుటుంబాల్లోకి తేవద్దురా..' అనేవాడు కొడుకుతో. ఆ మాటలను కొడుకు చెవిన పెట్టలేదు.

దేశంలో ఎక్కడో, ఏదో మూల చిన్నచిన్న సంఘటనలు జరిగినప్పుడల్లా పక్కనున్న తన వాళ్లనే అనుమానంగా చూసేవాడు.

'ఏదో ఇన్సిడెంట్ జరిగితే అందరినీ దోషులు అనడం తప్పు..' అని చిన్నపిల్లల్లా వాదులాట పెట్టుకునేవాళ్లు తండ్రీ కొడుకులు.

'ప్రతి సంఘటనకూ మేమే శీలపరీక్ష నిర్ధారణ సర్టిఫికెట్‌ను చేత పట్టుకొని నిలబడటం అవమానంగా ఉంది' అని పీరు సాహెబ్ పిల్లలు బాధపడేవారు. బొక్కెనకు తాడుకు మధ్య బాయి గిలక రాపిడి ఆర్తరావం లాగ ఉండేవి ఆ స్వరాలు.

'నిజమే కదూ!' అనుకునేవాడు పరంధామయ్య.

కొడుకు మాత్రం తన పిల్లలను పీరు సాహెబ్ ఇంటివైపు వెళ్లకుండా కట్టడి చేయడానికి చాలా ప్రయత్నాలు చేశాడు.

ఆ ప్రయత్నానికి తండ్రి అడ్డు పడుతూనే వచ్చాడు. అందుకే, వారిని ఆపలేకపోయాడు. కానీ, ఇది ఎంతకాలం నిలుస్తుందో చూడాలి. ఏదేమైనా, ఓ రెండు మంచి లౌకిక కుటుంబాలు కనుమరుగై పోవడం ప్రారంభమైంది. ఈ విషయంపై కొడుకుతో అనేకసార్లు వాదించాడు కూడా.

'ఏ రాజైనా ఏ దేశం మీదైనా దండెత్తినప్పుడు సైన్యంతోనే వస్తాడు. ప్రజలను, పిల్లలను, కుటుంబాలను వెంట పెట్టుకొని దండెత్తి రాడు. దేశాన్ని జయించిన తర్వాత తన ప్రజల్ని తరలించడు. తన పాలనలోనే ప్రజలను ఆకట్టుకొంటూ విస్తరిస్తాడు. మొగలాయిలు కానీ, ఆంగ్లేయులు కానీ, చేసిందిదే. ఇందులో ఒకరు శత్రువులుగా, మరొకరు మిత్రులుగా ఎలా వుంటారు?'

'బ్రిటిష్‌వాళ్లు దేశాన్ని పాలించిన కాలమంతా దేశాన్ని పిప్పిచేసి, సంపదనంతా తరలించుకొని పోయారు. ముస్లింలు అలా కాదే! ఇక్కడే పుట్టి, ఇక్కడే కడతేరి పోయారు. దానికి దాఖలాలు కోకొల్లలు. అయినా, ఎవరిమీద శత్రుత్వం కలిగి వుండాలి? సంపదను కొల్లగొట్టుకొని పోయి దేశాన్ని పిప్పిగా చేసిన వాడిమీదనా?

లేక ఇక్కడే పుట్టి ఇక్కడే కడతేరి పోయిన వాళ్లమీదనా? కష్టనష్టాలు, సుఖదుఃఖాలు పంచుకునే వాళ్లతోనా శత్రుత్వం? మన ప్రజలతోనేనా మన వైరం?'

'రాజుల సహజ లక్షణం రాజ్యాలు స్థాపించిన మేర తమ ఆలోచనల్ని, విశ్వాసాల్ని వ్యాపింపజేయడం. అందులో భాగమే ఇక్కడి ముస్లింలు, క్రిస్టియన్లు. వీళ్లు పరాయి దేశపు ప్రజలు కారు, ఇక్కడివారే! కడజాతి వారనీ, అంటరాని వారనీ ఇక్కడి సంస్కృతిలో హేళనకు, అవమానాలకు గురైన అణగారిన ప్రజలు, హీన ప్రజలే.. అసలైన మూలవాసులు. ఇక్కడి బహుజనులు'

'అప్పుడెప్పుడో జరిగిన దాన్ని కులమార్పిడి అంటావేమిటి? అప్పటి ఆత్మగౌరవ పరివర్తన తప్పెలా అవుతుంది?'

'నిరక్షరాస్యులు సరే! చదుకున్నవారూ ఈ ఆలోచనలను కలిగి ఉండటం.. రానున్న కాలంలో పెద్ద మూల్యమే చెల్లించాల్సి వస్తుంది'

ఇలా సాగేది.. కొడుకుతో పరంధామయ్య సంభాషణ. అనేకసార్లు చెప్పి చూసినా, కొడుకులో మాత్రం మార్పు రాలేదు.

* * *

అనన్య వాళ్ల నాన్న ఇంకా ఇంటికి రాలేదు. ఆయనకోసమే ఎదురుచూస్తూ కూర్చున్నది. రోజూ వచ్చే సమయానికంటే ఈరోజు ముందే వస్తాడని తనకు గట్టి నమ్మకం. గోరింటాకు పెట్టుకున్న రెండు చేతులూ శుభ్రంగా కడుక్కుంది. తెల్లటి ఒంటిఛాయపై ఎర్రటిరంగు గోరింటాకుతో చేతులు మెరిసి పోతున్నాయి. తనను ముద్దు పెట్టుకొనే నెపంతో, గోరింటతో పండిన రెండు చేతులనూ ముద్దు పెట్టుకోవడం నాన్నకు అలవాటు. ఈరోజూ అదే చేస్తాడని రెండు చేతులనూ కనిపించకుండా చున్నీ చాటునో, వీపు వెనకాలో దాచే ప్రయత్నాన్ని రిహార్సల్ చేస్తున్నది అనన్య. ఇదంతా గమనిస్తున్న అమ్మ..

'ఏమిటే.. రెండు చేతులనూ ఓణీలో చుట్టేస్తున్నావెందుకు?' అడిగింది.

దానికి అనన్య నవ్వి ఊరుకుంది. 'ఏమీ లేదు లే' అని మనసులోని మాట అమ్మతో చెప్పకుండా దాటేసింది.

ఇంట్లో అందరూ ఉన్నారు. ఇల్లంతా సందడి, సందడిగా ఉంది. అనన్య కొత్తబట్టలు తొడుక్కుంది. నాన్న రాగానే కేక్ కటింగ్. నాన్న దగ్గర గిఫ్ట్ అందుకోవాలని ఒకటే ఉబలాటం. ఈసారి పీరూ తాతవాళ్ల ఇంటినుంచి ఎవరూ రాలేదు. అదే వెలితిగా కనిపిస్తున్నది.

ఆ లోపం ఉన్నట్టు అందరి మనసుల్లోనూ ఏదో ఓ మూల ఉండే ఉంటుంది.

పరంధామయ్య ఇంట్లో అటూ ఇటూ తిరుగుతున్నాడు. మాటిమాటికీ 'అందరూ

వచ్చినట్లేనా..?!' అని జ్ఞాపకం చేస్తునట్టు కేకేస్తున్నాడు.

ఇంతలో ఇంటిముందు స్కూటర్ హారన్ మోగింది. చిన్న కొడుకు తుర్రున వెళ్లి గేటు తెరిచాడు. నాన్న స్కూటర్ దిగాక, హెల్మెట్ అందుకొని.. 'నాన్న వచ్చాడోచ్..' అనుకుంటూ ఇంట్లోకి వచ్చాడు.

నాన్నకూడా నవ్వుకుంటూ ఇంట్లోకి వస్తూ వస్తూనే, 'పాపేది?' అని భార్యవైపు చూస్తూ అడిగాడు.

'కాస్త ఫ్రెష్ అవండి. పాప వస్తుంది లెండి' అందావిడ.

తుండుతో ముఖం, చేతులు తుడుచుకుంటూ ఉండగా, తన బిడ్డ ఎదురుగా వచ్చి నిల్చున్నది. ఆమెను కొత్తపిల్లను చూసినట్టు కిందినుంచీ పైదాక చూసి..

'నువ్వు మారవ్ లే!' అన్నాడు కోపంగా.

'అందుకే, నీ పుట్టినరోజు వచ్చిందంటే అయిష్టత నాకు. ఎంతగా విడమర్చి చెప్పినా చెవిన పెట్టట్లేదు. చిన్నపిల్ల కదా, వింటుందని విడిచి పెడుతుంటే రానురానూ మొండికేస్తున్నావ్. అయినా, ఇంట్లో ఉన్న పెద్దలకే ఇంగితం లేదు. నిన్ను కట్టడి చేయడం వృథా ప్రయాస..' అంటూ రుసరుస లాడాడు. తన అయిష్టతను ప్రదర్శిస్తూ నిలుచున్నాడు.

తండ్రి కోపాన్ని చూసిన అనన్య అయోమయంగా దిక్కులు చూస్తూ నిల్చుంది. తండ్రి కోపాన్ని తట్టుకోలేక ఏడ్చేసింది.

అప్పుడే మనవడు ఖలీల్‌ను వెంట పెట్టుకొని, పీరూ సాహెబ్ భార్య ఇంట్లోకి వచ్చింది. ఆమె వెనకే ఇద్దరు కోడళ్లూ వచ్చారు. అది చూసిన ఇంట్లోని వాళ్లందరూ నవ్వు ముఖాలతో ఎదురెళ్లారు.

'అత్తయ్యా.. రండి, రండి' అని సాదరంగా ఆహ్వానించింది అనన్య వాళ్ల అమ్మ.

అనన్య వాళ్ల నానమ్మ.. దాదీ (పీరూ సాహెబ్ భార్య)ను గాఢంగా పెనవేసుకుంది.

'అలాయ్ బలాయ్' తీసుకుంటూ, కొన్ని నిమిషాలు అలానే కౌగిలింతల్లో ఉండిపోయారిద్దరు మిత్రులు. వాళ్ల దేహాలు ఏం మాట్లాడుకున్నాయో! వాళ్లకే తెలియాలి. తమ జీవితాల్లోని సంతోషాలు, దుఃఖాలు పెనవేసుకుంటున్నట్లు ఉన్నదా దృశ్యం.

అది చూసిన కొడుకు వేరే గదిలోకి వెళ్లిపోయాడు. మిత్రులిద్దరూ కబుర్లలో లీనమయ్యారు. ఆ మాటకొస్తే ఇంట్లో వాళ్లంతా కబుర్లలోనే మునిగిపోయారు. దీంతో ఇంటి వాతావరణమంతా ఒక్కసారిగా సందడిగా మారిపోయింది.

ఇంటికి వచ్చిన పీర్ సాహెబ్ ఇంటిల్లిపాదినీ చూసి, సంతోషపడి పోయారు పరంధామయ్య.

**'ఏముంది ఇందులో..' అని మనసులో అనుకుంటూనే విప్పదీశాడు. లోపల ఉన్న గిఫ్ట్‌ను చూసి, ఆయన నోటెంట మాట రాలేదు. నిర్ఘాంత పోయి చేతిలో ఉన్న దానివైపే చూస్తున్నాడు.**

'ఏమమ్మా.. మీ ఆయనలు లేరా ఇంట్లో?' అంటూ పీరు సాహెబ్ కోడళ్లను పలకరించాడు.

వాళ్లు ఏదో అన్నారు. కానీ, పరంధామయ్య వినిపించుకునే స్థితిలో లేడు. ఏవో పనులు కల్పించుకొని ఇంట్లో అటూ ఇటు తిరుగుతున్నాడు.

'అవునూ.. మీ ఆయనకు బాగో లేదని విన్న. నేనూ, మా ఆయన, మా కూతురు ఇంటికి వెళ్లి నిన్నే వచ్చాం. అందుకే చూడ్డానికి రాలేక పోయాం' అని సంజాయిషీ ఇస్తున్నారొకరు.

'ఇప్పుడెట్లున్నరు?'

'ఏముందీ.. వయసు పెరిగే కొద్దీ రోగాలు చుట్టుముడుతున్నయ్. బి.పి, షుగర్ కూడా ఉన్నాయి. ఈమధ్య కంట్రోల్ కావట్లేదు. దవాఖానల చుట్టూ తిరగడానికే సరిపోతున్నది'

'పలకరించడానికి రావాలె.. మీ బావా, నేనూ కలిసి వస్తాం'

'రజియాకు బిడ్డ పుట్టిందట గదా! మనవరాలు మంచిగున్నదా? పురిటింట్లో బాగా పనులుంటయ్. బాగా బిజీగా ఉండి ఉంటావ్! బారసాల ఎప్పుడొచ్చింది? కాస్త ముందుగాల చెప్పు..'

.. ఇలా ఒక్కొక్కరి నోటివెంట ఒక్కో ప్రశ్న. ఎప్పటినుంచి మిగిలిపోయి, పోగుబడి ఉన్నాయో! ఒకొక్కటీ నెమరు వేసుకుంటున్నారు.

వాళ్లు రావడంతో ఇంట్లో వాతావరణం కాస్త నెమ్మదించింది. పుట్టినరోజు వేడుకకోసం ముందుగానే ఇల్లంతా అలకరించారు.

చుట్టుపక్కల వాళ్లూ ఒకొక్కరుగా రాసాగారు.

అనన్య ముఖం కడుక్కొని మరోసారి ముస్తాబై వచ్చింది. క్రమక్రమంగా ఇంటి వాతావరణమంతా అనన్య పుట్టినరోజు వేడుకలోకి మారింది.

ఆహూతులతోపాటు ఇద్దరు నానమ్మల చప్పట్ల మధ్య కేక్ కట్ చేసింది అనన్య. తమ్మునితోపాటు ఖలీల్‌నూ తోడుగా పక్కనే నిలబెట్టుకుంది.

అనన్య చేతులకున్న గోరింటాకు మెరుపుతోపాటు ఇంటి అలంకరణ లైట్ల కాంతితో ఇప్పుడు ఆ ఇల్లు అలజడి కలలోంచి తెరుకున్నట్టుగా ఉంది.

వ్యక్తిగతంగా ఎవరూ, ఎవరినీ ఎదురుపడి మాటా, మాటా అనుకున్నది లేదు.

ఇంట్లో ఉన్న ఆ ఒక్కడిలోనే ప్రేరేపిత ద్వేషం వెళ్లూనుకుంటూ వస్తున్నది. ముస్లింల వేషధారణ మీద, ఆహారపు అలవాట్ల మీద, జీవన విధానం మీద.. మనసులో పేరుకు పోయిన ద్వేషం, గూడు బద్దలు కొట్టుకొని రాజ్యం ఏలుతున్నది.

అనన్య తన తండ్రి అయిష్టత నుంచి తేరుకుంది. తన మనసులో తండ్రి గీసిన సరిహద్దు రేఖలమీద 'దాది' (నానమ్మ) రాక.. వెన్న పూస్తూ బిడ్డను ఓదార్చే ప్రయత్నం చేసింది. బిడ్డకు ఆ ఆప్యాయతలు ఒకదిక్కు, తండ్రి ద్వేషం మరో దిక్కు. పరంధామయ్య తాతయ్య స్వానుభవపు మంచితనం ఇంకో దిక్కు. అనన్యను ట్రయాంగిల్ కూడలిలో నిలబెట్టాయి.

* * *

చుట్టుపక్కల వాళ్లు వెళ్లిపోయారు. ఇంట్లో వాళ్లే మిగిలారు. వాతావరణం గుంభనంగా ఉంది. రోజులాగే అయితే, టీవీ పెట్టుకొని చూస్తుండేవాళ్లు. ఇప్పుడు అలా ఏం లేదు. ఆ వాతావరణం నుంచి బయట పడేందుకు అనన్య తల్లి టేబుల్‌మీద వున్న గిఫ్ట్ ప్యాక్స్‌వైపు దృష్టి మరల్చింది. ఎవరేం తెచ్చారోనని చూడటం మొదలుపెట్టింది. భర్తకూడా తోడొచ్చాడు. గ్రీన్ రేపర్లో చుట్టిన చతురస్రాకారపు గిఫ్ట్ ప్యాకెట్‌మీద ఆయన దృష్టి పడ్డది. దాన్ని చేతిలోకి తీసుకున్నాడు. బరువుగా ఉంది.

'ఏముంది ఇందులో..' అని మనసులో అనుకుంటూనే విప్పదీశాడు. లోపల ఉన్న గిఫ్ట్‌ను చూసి, ఆయన నోటెంట మాట రాలేదు. నిర్ఘాంత పోయి చేతిలో ఉన్న దానివైపే చూస్తున్నాడు.

అప్రయత్నంగానే.. 'నాన్నగారూ.. ఇటు రండి' అని పిలిచాడు.

పరంధామయ్య వెంటనే వచ్చాడు. చేతిలోని పుస్తకాన్ని తండ్రికి అందించాడు కొడుకు.

ఆకుపచ్చ రంగు అట్టతో బంగారు వర్ణపు అక్షరాలతో ఉంది ఆ పుస్తకం. చూసి వెంటనే 'ఖురాన్' అని చదివాడు పరంధామయ్య.

'తెలుగులోనే ఉంది. ఇది చదువలేవా?' అంటూ కొడుకును ప్రశ్నించాడు. కొడుకు నోరు మెదపక పోవడంతో మళ్లీ ఆయనే..

'ఇది గిఫ్ట్‌గా ఇచ్చారా? చదువు.. తప్పేముంది! వాళ్లను ఎప్పుడూ ఆడి పోసుకుంటుంటావు గదా! చదువు ఈ పుస్తకాన్ని. ఇది వాళ్ల జీవన విధానం. మనకు భగవద్గీత ఎలానో, వాళ్లకు ఖురాన్ అంతే! మంచి పని చేశారు. తెలుగులోనే ఉంది. చదివి అర్థం చేసుకో.. లొసుగులేమైనా దొరికితే అవి ఉదాహరణగా చూపి మరీ తిట్టొచ్చు. అలా కూడా ఉపకరిస్తుంది. దేనిపైనా గుడ్డిగా ద్వేషం పెంచుకోవద్దు.

అరబ్బీనుంచి తెలుగులోకి అనువాదం చేయించి మరీ అచ్చు వేయించారు. ఏ పుస్తకమైనా అది చేయాల్సిన పని తప్పక చేస్తుంది. చదువు తప్పేం కాదు..' అంటూ ఆ పుస్తకాన్ని కొడుకు చేతుల్లో పెట్టి వరండాలోకి వెళ్లిపోయాడు పరంధామయ్య.

* * *

సాయంత్రం అప్పుడప్పుడే చీకటి పడుతున్నది. పడమర దిక్కున చీకటి జాడ ఇంకా కనిపించడం లేదు. ఎర్రటి సూర్యుడు నడిచి వెళ్లిన బాటలాంటి అడుగుల ఛాయ మాత్రం ఇంకా కనిపిస్తూనే ఉంది. పీరు సాహెబ్ పిల్లలు.. పరంధామయ్య ఇంటిముందు నిల్చొని ఉన్నారు.

ఇద్దరూ కూడ బలుకున్నట్లే ఒక్కసారిగా 'అన్నా..' అని పిలిచారు. ఆ పిలుపు విన్న పరంధామయ్య కొడుకు ఇంట్లోంచి బయటికి వచ్చాడు.'అన్నా.. ఇవాళ 'ఈద్ కా చాంద్' .. నీతో కలిసి చూద్దామని వచ్చాం' కాసేపు ముగ్గురి మధ్యా మాటల్లేవు. ఇద్దరినీ సందిట్లోకి తీసుకున్నాడు పరంధామయ్య కొడుకు.

* * *

# హనీఫ్

*హనీఫ్ స్వస్థలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం తిప్పనపల్లి. సయ్యద్ భిక్కన్ సాహెబ్, ఇమాంబీ దంపతులకు 1962 ఫిబ్రవరి 2న జన్మించారు. బీఏ పూర్తి చేసిన హనీఫ్, 1990 వరకు వివిధ పత్రికల్లో జర్నలిస్ట్‌గా పనిచేశారు. ఆ తర్వాత సింగరేణి కాలరీస్‌లో 26 ఏండ్లపాటు ఈపీ ఆపరేటర్‌గా విధులు నిర్వహించారు. కార్మిక సంఘాల్లోనూ క్రియాశీలక పాత్ర పోషించారు. 2016లో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని పుప్పాలగూడలో నివాసం ఉంటున్నారు. 1980 నుంచి కవిత్వం, 2000 నుంచి కథలు రాయడం ప్రారంభించారు. ఇప్పటివరకు 25 కథలు రాశారు. 'ఇక ఊరునిద్రపోదు', 'ముఖౌటా' పేరుతో కవితా సంపుటాలు, 'పడమటి నీడ' కథల పుస్తకాన్నీ వెలువరించారు. పలువురి కవితలను 'దూదిపూల దుఃఖం' పేరుతో, తన సంపాదకత్వంలో పుస్తకంగా తీసుకొచ్చారు.*

# తీర్పు

గాజోజు నాగభూషణం, 98854 62052

**ఇంటర్‌వెల్** అయిపోయి క్లాసులకు వెళ్తున్న సమయంలో స్టాఫ్ రూమ్‌లోకి వచ్చింది రమ. ఆమె బిడ్డ ఐదో తరగతి చదువుతున్నది. కొడుకు ఐదు వరకు మావద్దే చదివి, ప్రస్తుతం ఈ ఆవరణలోనే ఉన్న హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నడు.

స్టాఫ్ రూమ్‌లోని అందరివైపూ బెదురుగా చూస్తున్నది రమ. ఏడ్చి ఏడ్చి ఉబ్బిపోయిన కండ్లు.. ఆమె దుఃఖపు లోతును చెబుతున్నాయి.

''ఏం సంగతమ్మా.. ఇట్లా వచ్చావు?''

స్టాఫ్ వైపు చూస్తూ, చూపులు నేలకు దించుకుంది కానీ, ఏమీ మాట్లాడలేదు. నా సైగతో స్టాఫ్ మొత్తం తరగతులకు వెళ్లిపోయారు.

నేను ఎనిమిదేండ్లుగా ఈ పాఠశాలలో పని చేస్తున్నాను. రమకు ఎప్పుడు ఏ సమస్య వచ్చినా, సలహా కావాలన్నా.. నాతో చెప్పుకొని, నేనిచ్చే సమాధానంతో స్వాంతన పొందేది.

''కూర్చో రమా..'' అని కుర్చీ ముందుకు జరిపానో లేదో.. ఒక్కసారిగా కాళ్ల మీద పడింది. కురిసీ.. కురిసీ అలసిన మేఘం మళ్లీ కుండపోత వానందుకున్నట్లు భోరున ఏడవసాగింది. ఈ హఠాత్పరిణామానికి ఖంగుతిన్న నేను, ఆమెను లేపి కుర్చీలో కూర్చోబెట్టాను. కాస్తంత కుదుట పడ్డాక..

''గంతగనం ఏం కష్టం వచ్చిందమ్మా?'' అని అడిగాను.

''ఏం జెప్పాలె సారు. ఇగ నేను బతికే హైబిల్ కాదు. ఆడ పుట్టుక పుట్టినందుకు

ఎన్ని భరించన్నో అన్నీ భరించిన. ఎంత ఏగియన్నో అంత ఏగిచ్చిన. ఎన్ని నిందలు మోయన్నో.. మోసిన. వివన్నీ భరించి బతుకుతున్ననంటే.. నా పిల్లల కోసమేనాయె. గిప్పుడు ఆ ఆశా సచ్చిపోయింది సార్. దేవతైన సీతమ్మకే తప్పలేదు. మనిషిని నేనెంత. ఒక్కసారి మనసు గట్టిగ చేసుకుంటే చాలు. సచ్చి సర్గానికో.. నరకానికో పోతా. నరకం గూడ గింత ఘోరంగా ఉండదేమో! అన్నదమ్ములు లేని దానికి, ఓ అన్నలాగ మీరు అండగున్నరు. ఎన్నో బాధలల్ల ఓదార్చింద్రు. ఎన్నోసాళ్ల పైసలుగూడ సాయం జేసింద్రు. నాకు తెలిసి మీకు మొత్తం తిరిగి ఇచ్చేశాననే అనుకుంటున్నా. నేను ఎవరి బాకీల లేను. కడసారి మాటగా మీకు శెప్పుకోవాలని అనిపించి వచ్చిన''

..ఆమె గొంతు మూగబోయింది. కానీ, కండ్లు రెండూ గండిపడ్డ కాలువలే అయ్యాయి. ఏమీ మాట్లాడలేని మౌనం.. కాసేపు నన్నావహించింది. ఆమె ఎదుర్కొంటున్న సమస్యలన్నీ దాదాపు నాకు తెలుసు. కానీ, మనసును ముక్కలు చేసిన గాయమేదో కొత్తగా అయినట్లు తెలుస్తున్నది.

''రమా.. మీ ఆయన మస్కట్ పోవుడే నీకు ఎక్కడ లేని కష్టాలు తెచ్చి పెట్టింది. ఎన్నో అవమానాలు భరిస్తూ, ఓపికగా నీ కుటుంబాన్ని ఇంతదూరం నెట్టుకొస్తున్నావు. తెలివైన పిల్లలు. వాళ్ల కోసమే బ్రతుకుతూ, మీ ఆయన డబ్బులు సరిగా పంపకున్నా, కూలీనాలీ చేసుకుని గుట్టుగా ఎల్లదీసు కొస్తున్నవు. ఇప్పుడు పిల్లల మీద ఆశ కూడా చచ్చిపోయింది. జీవితాన్నే ముగిస్తాను అంటున్నావు. అంత పెద్ద సమస్య ఏమొచ్చిందమ్మా?''

''దొంగ ముండకొడుకు.. ఇక్కడ చేసుకోవడానికింత పనున్నా, దోస్తుల సంబురంతో ఏదో సంపాదిత్తనని మస్కట్ వోతే, మితికి మిత్తి కలిసి కుప్పైన అప్పు గట్టడానికి, వాని ఖర్సులకు ఆడికాడికే గావట్టె! సుక్క తెగి పడ్డట్టు అప్పుడో పదివేలు, ఇప్పుడో పదివేలు పంపితే ఏ మూలకు సాలకపాయె. ఇక నా ఖర్మ గింతేనని నాది నేను సర్దుక రావడితి. కానీ, గీ అత్తముండ ఎక్కడలేని నిందలు మోపవట్టే. సేన్లకెల్లి అచ్చుడు గంట ఆలస్యమైతే, ఏదో రంకు సాగించినట్టు.. వాడకట్టంతా ఇనచ్చేలా అనరాని బూతులనవట్టే. ఊళ్లో ఏ పనిమీద ఎవరింటికి పోయినా.. ఇంటికి రాంగనే, పిల్లి మీద, బల్లిమీద వెట్టి బండ బూతులు తిట్టవట్టె. పానం మంచిగ లేక దవాఖానకో, పిల్లలకు ఏదన్నా కొందమని కరీంనగర్ దాకా పోయ్యత్తె.. ఇగ పెద్ద రామండమే! దాని మాటలకు సావనన్న సావాలె! సంపనన్న సంపాలె! అన్నంత కోపం అచ్చినా నేనేం జేత్త. నా జోలికి రావద్దని తిట్టినా, బెదిరిచ్చినా దాని మెదట్ల పురుగు మెసులుతునే ఉంటది. శిన్నపిల్లల ముందే నీచాతి నీచంగా మాట్లాడితే, నాపట్ల ఎలాంటి అభిప్రాయాలు ఏర్పరచుకుంటారోనని కుమిలి కుమిలి సత్తన్న. గిప్పుడు నాకు తెల్వకుంటనే పెద్ద కుట్ర

**పిల్లలు. వాళ్ళ కోసమే బ్రతుకుతూ, మీ ఆయన డబ్బులు సరిగా పంపకున్నా, కూలినాలి చేసుకుని గుట్టుగా ఎల్లదీసు కొస్తున్నవు. ఇప్పుడు పిల్లల మీద ఆశ కూడా చచ్చిపోయింది. జీవితాన్నే ముగిస్తాను అంటున్నావు.**

జేసింది. ఎప్పటి సంది నూరిపోత్తందో.. ఏమో కానీ, మొన్న జరమొచ్చి కరీంనగర్ల చూయించుకొని ఇంటికచ్చెటాళ్లకు అంబటాళ్లైంది. మా అత్త ముం.. ఒక్కమాట మాట్లాడకుండ మూలకే కూసున్నది. నాకు ఇచ్చంత్రమే అనిపిచ్చింది. గానీ, అంతల్నే వాన లేని పిడుగు నా నెత్తిన పడ్డట్టే అయ్యింది. 'గింత సేపు ఎందుకైందే దొంగ లం.. ఏడేడ తిరిగి అత్తున్నవ్' అని నా కొడుకు అనంగనే.. భూదేవర పగిలిపొయ్యి, అండ్లకు కూరుకుపోయినట్టయ్యింది. కొంచెం సేపు ఏమర్థం కాలే. ఈ దుఃఖం ఎవరితో శెప్పుకోవాలె.. లేచి ఈ శెంప ఆ శెంప వాయించేసరికి.. వాడు మరింత రెచ్చిపోయిండు. 'నాకు నానమ్మ అంతా చెప్పింది. నువ్వు ఎవడెవడితోనో తిరుగుతున్నవనే ముఖం సూపెట్టలేక పదేండ్లయినా నాన్న వత్తలేడని. గందుకే మేమెన్నిసార్లు రమ్మని ఫోన్ చేసినా ఇగ వత్త.. అగ వత్త అనుకుంట వత్తనే లేడు. నువ్వు గిట్ల జేస్తే నా తలకాయ కొట్టేసినట్లుంది. గిట్లనే జేత్తే సంపి పాడేత్త' అన్నడు. నిండా పదమూడేండ్లు లేని నా కన్నపేగు.. ఆడతనపు శీలానికి సంబంధించి రెచ్చగొట్టే సరికి అమ్మ అన్న విషయం కూడా మర్శిపోయి.. నిజా నిజాలు తెలుసుకోకుండానే అనరాని మాటలన్నడు. ఆడే గింత ఘోరంగా అనుమానించినంక.. ఇంక నేనెవరి కోసం బతకాలె సార్?''

..ఒక్కసారి మెదడు మొద్దు బారినంత పనైంది నాకు. రమ కొడుకు రవి.. కండ్లలో మెదిలాడు. చాలా క్లెవర్.. ఉట్టి అమాయకుడు. ముసల్ది కక్ష తీర్చుకోవడానికి పసి హృదయంలో విషం నింపింది.

''రమా.. ఇది వాడికి పుట్టిన బుద్ధి కాదమ్మా! వాడొట్టి అమాయకుడని నీకూ తెలుసు. మీ అత్త వాణ్ణి పావుగా వాడుకుంది. దానికి నేను నచ్చజెపుతాను. నువ్వు మనసు స్థిమితం చేసుకోమ్మా. అనవసరంగా మనసు విరగొట్టుకొని క్షణికావేశంలో పిల్లలకు అన్యాయం చేయకు''

''ఆడు అమాయకుడే సార్. కానీ, ఆడూ మొగోడే కదా! మొగోళ్ల రక్తంలనే ఆడదాని మీద అనుమానపు బీజాలుంటాయి. మగ అహంకారమూ దాగి ఉంటుంది. మొగోన్ని మరో మొగోడు సమర్థించుకోవడమూ ఉంటుంది. కానీ, ఆడవాళ్లలోనే, ఆడవాళ్లను ద్వేషించే లక్షణం.. తరాలు మారినా పెరుగుతుందే కానీ, తగ్గడం లేదు. ఇంతకుముందే మీకు చెప్పిన. మస్కట్ కెళ్లే ముందు వీసా ఆలస్యమై.. నా మొగుడు బొంబైల రెండు

**'తెలంగాణ గ్రామీణ స్త్రీలకు ఇది పెద్ద శాపమే సర్. ఇక్కడ ఆడవాళ్ళను వాళ్ళ మానానికి వాళ్ళను వదిలేసి అక్కడ వాళ్ళు హాయిగా ఉంటారు. కుటుంబాలను పోషించుకోలేక మగవాళ్ళ లైంగిక వేధింపులు భరించలేక ఆత్మహత్యల వరకు వెళుతున్నారు ఆడవాళ్ళు' .**

నెల్లున్నడు. గప్పుడు ఆడు రెడ్‌లైట్ ఏరియాలకు పోయిన సంగతి తెల్సినా ఆని దోస్తులు, అవ్వయ్యా.. ఎవలూ తప్పు తీయలే. నా మొగుడు తల్లి శెప్పిన మాటలు ఇని నన్ను అనుమానించిండు. కానీ, నేను శెప్పినా.. వాళ్ల నాయిన చేసే తప్పును నమ్మేటోడు కాదు. ఇక ఆడిదానికి నిజమైన సపోర్ట్ ఎక్కడ దొరుకుతది. మొగ తోడు లేని ఆడోళ్లను ఎవడైనా.. 'ఫ్రీగా దొరికిన సినిమా' అన్నట్లే చూస్తరు సార్. అయినా, పేదరికమే ఎన్నెన్ని సమస్యలకో మూలకారణం సార్. మొన్న ఆదేశ్ రవి పాటల ఎంత గొప్పగ శెప్పిండు.. 'పేదరికం కంటే పెద్ద రోగముందా.. అయినవాళ్ల కంటే పెద్ద అండ ఉందా' అని.. ఇంటర్ పూర్తి కాంగనే, సదివించే స్తోమత లేక సదువుకోవాలన్న నా కోరికను చంపేశింద్రు. కట్నమిచ్చుకొనే స్థాయిలేక నాకంటే తక్కువ సదివినోనితో గీ దిక్కుమాలిన సంబంధం కట్టబెట్టి నా గొంతు కోసింద్రు. మీరుగూడ ఎన్నోసార్లు ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ కట్టమని చెప్పింద్రు. కానీ, క్లాసులకు వెళ్లినా, పుస్తకం పట్టినా మా అత్త శివసత్తి ఏషం ఏత్తదన్న భయమే నన్ను ముందుకు పోనియ్యలే. ఇంటర్ దాకా మా క్లాస్‌ల నేనే ఫస్ట్ సార్. టీచర్లకు.. లెక్చరర్లకు ఇష్టమైన స్టూడెంట్‌ను. ఇంటర్‌లో కాలేజీ జీవితం రంగుల ప్రపంచంలా ఉండేది. కానీ, పెండితోనే ఒక్కసారి జీవితం తల్లకిందులైంది. మొగుడు మారుతడన్న దారి కనిపిస్త లేదు. అత్తమామల ఆగడాలు ఆగుత లేవు. కొడుకు పుర్రెలో సొచ్చిన అనుమానం పురుగు సచ్చిపోదు. ఇక నా జీవితాన్ని ముగించుకోవడమే నా ముందున్న దారి సార్''

''రమా.. నీకు నేను మాట ఇస్తున్నాను. ఈ ఒక్కసారి విను. రవి మెదడులో చిమ్మిన విషాన్ని తొలగించి, నీ పట్ల ప్రేమ, విశ్వాసం కలిగి ఉండేలా చేసే బాధ్యత నాది. వాడికి నేనంటే ఎనలేని గౌరవం. మీ ఆయనతో కూడా ప్రత్యేకంగా మాట్లాడతాను. మీ అత్తామామల సంగతి 'సఖి' లాంటి సంస్థలకు అప్పజెప్తాను. వాళ్లే చూసుకుంటారు. న్యాయపరంగా వాళ్ల అరాష్‌మెంట్‌ను కట్టడి చేయిస్తా. అన్నదమ్ములు లేరని ప్రతి రక్షాబంధన్‌కు నువ్వు కట్టే రాఖీ సాక్షిగా చెబుతున్నానమ్మా.. నేను నిన్ను కాపాడుతా! నా మీద భరోసా ఉంచి, ఇంటికెళ్లి హాయిగా పడుకో!''

ముఖం కొంగులో దాచుకొని ఐదు నిమిషాలు ఆగకుండా ఏడ్చింది. ఆ తర్వాత తేలిక పడిన మనసుతో నాకు దండం పెట్టి వెళ్లిపోయింది.

మగవాడినైనందుకు అంత సేపూ అదిమి పెట్టుకున్న కన్నీళ్లు.. ఆమె వెళ్లగానే ధారాపాతంగా కురవసాగాయి. కండ్లు తుడుచుకొని కూర్చున్నాను.

లంచ్ కాగానే అరుణ మేడం అడిగింది..

''రమ ఎందుకంత ఆందోళనగా ఉంది సార్?''

కొడుకు చేసిన నిర్వాకాన్ని, ఆమె సూసైడ్‌కు సిద్ధపడ్డ విషయాన్నీ చెప్పాను.

''తెలంగాణ గ్రామీణ స్త్రీలకు ఇది పెద్ద శాపమే సర్. ఇక్కడ ఆడవాళ్లను వాళ్ల మానానికి వాళ్లను వదిలేసి, అక్కడ వాళ్లు హాయిగా ఉంటారు. కుటుంబాలను పోషించుకోలేక మగవాళ్ల లైంగిక వేధింపులు భరించలేక ఆత్మహత్యల వరకూ వెళ్తున్నారు ఆడవాళ్లు'' ఆందోళనగా అన్నది అరుణ మేడం.

''రమ గురించి ఊళ్లో బ్యాడ్ టాక్ నడుస్తుంది మేడం. నిప్పు లేందే పొగ వస్తుందంటరా?'' అన్నాడు మరో కోలీగ్ శ్రీనివాస్ రెడ్డి.

''బ్యాడ్ టాక్ అంటే ఏమిటి సార్? రమ అందంగా ఉంది. ఎందరెందరి వెకిలి చేష్టల్నో ధైర్యంగా తిప్పి కొట్టింది. లొంగని ఆడవాళ్ల మీద సునాయసంగా చేయగలిగేది, వారి కారెక్టర్ అసాసినేషన్. బాధ్యత గల ఒక ఉపాధ్యాయుడిగా, ఊళ్లో వాళ్లు అన్న దాంట్లో ఏ ఆధారాలున్నాయో తెలుసుకోకుండా ప్రచారంలో మీరూ ఓ భాగం కావడం మీలో సహజాతంగా దాగిన పురుష అహంకారమే రెడ్డి గారు''.. ఆవేశంతో విరుచుకుపడింది అరుణ మేడం.

ఆమె మాటలకు రియాక్ట్ అవడం అటుంచి, ఆమె ఆవేశం ముందు కామ్‌గా ఉండక తప్పలేదు అతనికి.

''రమకు మనం ఏమీ చేయలేమా సార్?'' అంది అరుణ మేడం.

''చెయ్యాలి మేడం.. మనలాంటి వాళ్లం, ఇతర స్వచ్ఛంద సంస్థలు అండగా నిలబడాలి. ఆమెకు ఏ ఇతర ఆధారమూ లేదు. నేను ఆమెకు భరోసా ఇచ్చి పంపాను. నా మీద విశ్వాసంతో వెళ్లింది. ఈ నా ప్రయత్నంలో మీ సహకారం కూడా ఉండాలి''

''తప్పకుండా సార్..''

స్కూల్ అయిపోగానే సరాసరి 'సఖి' ఆఫీసుకు రజనీ మేడంతో కలిసి వెళ్లి పూర్తి వివరాలు ఇచ్చాను. వాళ్ల టీంతో ఊరికి వచ్చి, ఫామిలీ

**ఇక అక్కణ్ణుంచి ఇంటికెళ్ళి రాత్రంతా ఒకటే ఆలోచిస్తున్నాను. ఈ సున్నితమైన విషయాన్ని రవితో ఎలా మాట్లాడాలి. మా బడిలో 5వ తరగతి అయిపోయేవరకు, అమ్మా అమ్మా అంటూ కొంగు పట్టుకొని తిరిగిన వాడి అమాయకపు చూపులు నా కళ్ళల్లో తిరుగుతున్నాయి.**

**రవి నోట్లోంచి ఆ మాటలు వినగానే రమ ఒక్కసారిగా తలెత్తి ఇటువైపు చూసింది. కళ్ళవెంట ధారాపాతంగా నీళ్ళు కారిపోతున్నా, కుండల కొద్దీ అమృతమేదో ఆమె నెత్తి మీద కుమ్మరించినట్లు, సంతోషంతో కూడిన చిన్న నవ్వు నాకు మాత్రమే కనిపించి మాయమైంది.**

మెంబర్స్, ఊరి వాళ్లతో కలిసి మాట్లాడి తప్పక పరిష్కరిస్తామని మాట ఇచ్చారు.

అక్కడ నుండి అడ్వకేట్ మిత్రుని దగ్గరకు వెళ్లి, చట్టపరంగా ఆమెకు గల రక్షణ చర్యల గురించి డిస్కస్ చేశాను. అవసరమైతే పోలీస్ సహాయం ఏ విధంగా తీసుకోవచ్చో తెలుసుకున్నాను.

ఇక అక్కణ్ణుంచి ఇంటికెళ్లి రాత్రంతా ఒకటే ఆలోచిస్తున్నాను. ఈ సున్నితమైన విషయాన్ని రవితో ఎలా మాట్లాడాలి. మా బడిలో ఐదో తరగతి అయిపోయేవరకు.. ''అమ్మా అమ్మా..'' అంటూ కొంగు పట్టుకొని తిరిగిన వాడి అమాయకపు చూపులు ఇప్పటికీ నా కండ్లలో తిరుగుతున్నాయి. ఒక మూర్ఖురాలి దుర్మార్గపు ఆలోచన వాడి పసి హృదయంలో కల్లోలం రేపి, ఇంతటి కలకలానికి కారణమయ్యింది. చాలా ప్రేమతో, సున్నితంగా డీల్ చేయాలి అనుకొని పడుకున్నాను.

***

ఉదయం స్కూల్‌కు వెళ్లగానే లొల్లిలొల్లిగా ఉంది. హైస్కూల్ హెడ్ మాస్టర్ గారి దగ్గరకు వెళ్లాను.

''విషయం తెలిసిందా సార్? మన పేరెంట్ రమ.. వాళ్ల అత్తామామలిద్దర్నీ చంపేసింది''

ఒక్కసారి షాక్‌కు గురయ్యాను.

''ఏమయ్యిందట సార్? ఇంత ఘోరం ఎలా జరిగింది?''

''అర్ధరాత్రి వాళ్ల మామ బాగా తాగి ఉండి, రమ మీద చెయ్యి వేశాడట. ఎంత ఆవేశంలో ఉందో ఏమో, రోకలి బండతో మోదగానే ఒక్క దెబ్బకే తలపగిలి కుప్ప కూలిండంట. అడ్డుకోబోయిన అత్త కూడా.. ఎడాపెడా బాదిన దెబ్బలకు ప్రాణాలు విడిచిందంట''

ఉండబట్టలేక అరుణ మేడంతో కలిసి రమ ఇంటికి వెళ్లాను. ఊరు ఊరంతా పోగైంది. బట్టలనిండా రక్తపు మరకలతో.. వాకిట్ల పందిరి కింద మౌనమునిలా కూర్చొని ఉంది రమ. జనాలంతా రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు.

''గింతకు తెగిత్తదా?'' అని కొందరు..

''చాలా మంచి పని చేసింది. కాటికి కాళ్లు జాపిన ముసలోనికి గిదేం పాడుబుద్ధి. మంచి గుణపాఠం నేర్పింది. మల్లెవ్వల్లు గీ చెత్త పని చేయకుండా భయం కొద్ది ఉంటరు.

ముసల్ది ఏవన్న తక్కువనా.. పొల్లను అరిగోస పోసుకుంది'' అని మరికొందరు అంటున్నరు.

నన్ను చూడగానే రమ పిల్లలిద్దరూ వచ్చి నన్ను చుట్టేసుకున్నరు.

''అమ్మా.. అమ్మా..'' అంటూ వెక్కివెక్కి ఏడుస్తున్నరు.

''మా అమ్మ చాలా మంచిది సార్. మా నానమ్మ తాతయ్యలే మంచోళ్లు కారు''

రవి నోట్లోంచి ఆ మాటలు వినగానే, రమ ఒక్కసారిగా తలెత్తి ఇటువైపు చూసింది. కండ్లవెంట ధారాపాతంగా నీళ్లు కారిపోతున్నా, కుండల కొద్దీ అమృతమేదో ఆమె నెత్తిమీద కుమ్మరించినట్లు.. సంతోషంతో కూడిన చిన్న నవ్వు నాకు మాత్రమే కనిపించి మాయమైంది.

ఇప్పుడు రమ మనస్సు పూర్తిగా తేలికపడిన విషయం నాకు బోధ పడింది.

అరుణ మేడం, నేను రమ దగ్గరకు వెళ్లగానే..

''సార్, ఇది నేను ఊహించని ముగింపు. కాలం నా నుదుటన రాసిన వింత తీర్పు. నా పిల్లల మీద కొంచెం దయ ఉంచండి''

''రమా! ఇది నువ్వు కావాలని చేసిన నేరం కాదు. నువ్వు త్వరలోనే నీ పిల్లల దగ్గరకు వస్తావు. దానికోసం చట్టపరంగా, ఇతరత్రా మేము నీకు అండగా ఉంటాం''

బయట పోలీస్ వ్యాన్ వచ్చిన చప్పుడు. రవి నా దగ్గరకు వచ్చి..

''పోలీసులు వచ్చిండ్రు సార్. అమ్మను కాపాడండి సార్..'' అంటూ భయం భయంగా అడుగుతున్నాడు.

''తప్పక బేటా.. అమ్మకేం కాదు. మేమంతా లేమూ'' అంటూ చెబుతుంటే.. అరుణ మేడం పిల్లలిద్దర్నీ దగ్గరకు తీసుకుంది.

పోలీసులు రమను తీసుకు వెళ్లగానే.. నేను స్కూల్ వైపు తిరిగి వస్తుంటే గుర్తొచ్చింది.

ఆరోజు.. 'రక్షా బంధన్'.

***

## గాజోజు నాగభూషణం

కవి, రచయిత, గాయకుడిగా చిరపరిచితులు గాజోజు నాగభూషణం. 1962 మే 12న జగిత్యాలలో జన్మించారు. బీఏ, బీఎడ్ చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ కరీంనగర్‌లో నివాసముంటున్నారు. అలిశెట్టి ప్రభాకర్‌తో పరిచయం తర్వాత, ఆయన ప్రభావంతో సాహిత్య రంగంలోకి అడుగుపెట్టారు. ప్రధానంగా 'కవిత్వం' రాస్తారు. 'మట్టి సరిగమలు' పేరుతో మొదటి కవితా సంకలనాన్ని వెలువరించారు. ఇప్పటి వరకూ పది కథలు రాశారు.

# సుక్కబఱ్రె

**వేముగంటి శుక్తిమతి,**

**99081 10937**

**అ**డవుల్లో తిరిగే జంతువులు, వృక్షాలమీద కొందరు పరిశోధన చేస్తుంటారు. కొంతమంది దేశంలో జరుగుతున్న అల్లకల్లోలాలను, ఉద్యమాలను అధ్యయనం చేస్తుంటారు. మరికొంతమంది చంద్రమండలాన్ని, నక్షత్రకూటమిని శోధిస్తుంటారు. కానీ, మనుషుల లోపల కూలుతున్న మమతల గోడలు, వాటి శిథిలాల గురించి ఎవరికి కావాలి.ప్రతి ఊరినావహించి ఒక వ్యక్తిత్వం ఉంటుంది. 'ఊరికి వ్యక్తిత్వమేమిటని' ఆశ్చర్యంగా అనిపించినా ఆ ఊరూ, ఆ మనిషీ గుర్తుకురాగానే, నాలో నేనే విషాదంగా నవ్వుకుంటాను. అవి నేను రీసెర్చ్ చేసే సమయంలో ముఖ్యమైన చాప్టర్లు. నా జీవితానుభవంలో మమేకమైపోయిన జ్ఞాపకాలు, గుర్తులు..

అక్కడంతా నిశ్శబ్దం.'ఆ చల్లని సముద్రగర్భం.. దాచిన బడబానలమెంతో..' గంభీరమైన ఆ గీతంలో భావరాగ స్వరాలెంతగా కదిలిస్తాయో ఆమె కనుకొనుకుల్లో నుండి పొంగి పొర్లుతున్న దుఃఖం నన్ను కుదిపేస్తుంటుంది.ఆమె అసలు పేరు తెలియదు. ఆ ఊర్లో అందరూ 'పాలమ్మ' అంటారు. పాడిపశువులే ఆమె జీవితం, సంతోషం, సర్వస్వం. వాటికీ, ఆమెకూ ఉన్న అనుబంధం గురించి చెప్పాలంటే, ఆమె గతంలోకి తొంగి చూడాల్సిందే! ఆనాడు ఆడపిల్లకు పసుపు కుంకుమ కింద పాడి పశువును ఇచ్చి పంపడం ఆనవాయితీ. ఆ విధంగా ఆమెతోపాటే తెచ్చుకున్న సుక్కబఱ్రె, ఎన్ని ఈతలైనా అన్నీ ఆడదూడల సంతతితో ఆమె చేతుల్లోనే పుట్టి పెరిగినయ్. ఆమె అన్నిటినీ ముద్దుగా 'సుక్కబఱ్రె', 'సుక్కదూడ' అనే పిల్చుకునేది. ఆ విధంగా ఆ బఱ్రె సంతతితో ఆమె ఇల్లు ఒక పాల సంద్రమైంది.'దొడ్డంతా బఱ్రెలే నిండె.. నా బురద పొలానికి నాగలి కట్టేందుకు ఒక్క మగదూడను కనకపాయె..' మనసులో నవ్వుతూ అనేవాడు ఆమె భర్త.

నేను చిన్నప్పుడు వెళ్లిన మా అమ్మమ్మగారి ఇంటికి వెళ్లాలనిపించి బయల్దేరాను. ఈ మధ్యకాలంలో పల్లెలు చాలా అభివృద్ధి చెందాయని, పల్లె గురించి రీసెర్చ్ చేస్తున్న. నా థీసిస్‌కి ప్రత్యక్షంగా కథనం కోసం కూడా ఒక నెపంగా వెళ్లా. మా

మేనమామ కొత్తగా పెట్టిన డెయిరీ ఫామ్‌ను చూపిస్తానని తీసుకెళ్తూ, మధ్యలో ఒక ఇంటిముందు ఆగి–'ఇదే నాతో పొత్తు కలుస్తానని వెంట పడుతున్న చిన్నప్పటి స్నేహితుడు సత్యబాబు ఇల్లు' అన్నాడు.'అంటే, నీకు ఇష్టం లేదా మామా? వెంట పడుతున్నాడంటున్నావు?' అడిగాను.'వాడు వట్టి బద్ధకస్తుడు. కాకపోతే, వాళ్లమ్మకు దొడ్డినిండా బర్రెలే. అవి పేరు మోసిన గౌడి బర్లకన్నా ఎక్కువ పాలిస్తయి. కొడుకులమీద కోపంతో ఈ మధ్యన పాలన్నీ మిల్క్ బూత్‌కు పంపించుకుంటుందట' 'అంటే.. వాళ్లకు పోయకుండానా?' 'వాళ్లకెందుకు పొయ్యదు. ఆమె పేరే పాలమ్మ.

ఎవ్వరు అడిగితే వాళ్లకు లేదనకుండా పోస్తది' 'మరి కొడుకులమీద ఎందుకు కోపం?' 'పక్కనే ఉండి ఏమీ పట్టించుకోక.. పైగా వాటిని అమ్ముకుందామంటున్నరట.. అందుకే' ఆ విధంగా మాట్లాడుకుంటూనే ఇద్దరం డెయిరీ ఫామ్ దాకా నడుచుకుంటూ వెళ్లాం. అక్కడికి పోగానే మామ అక్కడి పనులన్నీ చూసుకుంటూ, అటూ ఇటూ తిరుగుతూ ఉంటే, నాకు మాత్రం పాలమ్మ గురించే ఆలోచన కలుగుతోంది. కాసేపటికి అక్కడున్న ఒక సిమెంట్ బెంచీమీద ఇద్దరం కూర్చున్నాం. మామ తన డెయిరీ ఫామ్‌కైన ఖర్చు గురించి, ఇచ్చే పాల గురించి, పచ్చి పాలలో వెన్న తీసే మిషిన్ గురించి.. ఇంకా ఏదేదో చెప్తున్నాడు. 'పాలు తీసే మిషిన్ కొనాలి' అనుకుంటున్నట్లు చెప్తూ–'సత్తిబాబు వాళ్ల అమ్మకు వయస్సు మళ్లింది. బర్రెలన్నీ అమ్మేస్తానంటున్నది. మాక్కాకుండా ఆమెను వేరేటోళ్లకు అమ్మనిస్తమా? వాళ్ల అన్నకు అన్నో ఇన్నో పైసలిచ్చి తానే బర్లను తోలుకొచ్చుకొంటానని సత్తిబాబు అంటుండు. నాతోపొత్తు కలుస్తనని చెబుతుండు. అవి చక్కదనాల పాడి బర్లు. ఇవ్వాళ్ల సాయంత్రం వాటిని చూసి పొమ్మన్నడు. నా కొడుకు గూడ వస్తడు. చూద్దాం' మామ మాటలకు ఆ పాలమ్మను చూడొచ్చనే ఆత్రుత కలిగింది నాకు.

సాయంత్రం బర్రెగొడ్లను చూసొచ్చిన రాకేశ్‌ను 'ఎట్ల ఉన్నయిరా బర్రెగొడ్లు?' అడిగిండు మామ. మామ కొడుకు రాకేశ్ ముఖమంతా జేబురించుకుంటూ

'ఏమో, నాయ్న నాకిష్టం లేదు. ఆ పాలమ్మ కండ్లల్ల నీళ్లు కనపడుతున్నయ్. ఆమె మనల్ని మింగినట్టు కొరకొర చూస్తంది. మనమేందో పుణ్యానికి బలవంతంగా ఆమె సొమ్ము దోచుకున్నట్టు..' చిరాకుగా అన్నాడు.

'ఉంటుందిరా. నాకా పాలమ్మ బాధ తెలుసు. ఆ తల్లిని నా చిన్నప్పటి నుండి చూస్తూనే ఉన్నా. ముసిముసి చీకట్ల లేచి వొంగబడి కొట్టాన్ని అద్దమోలె శుభ్రం చేయడం, బర్లకు గడ్డేయడం, సూడిబర్లను పురిటికొచ్చిన బిడ్డ లెక్క చూసుకోవడం చూసి, ఆ అమ్మ చెయ్యి తీరు మంచిదని ఊర్లందరూ అనుకునేటోల్లు. ఆమె

పిల్లలతోపాటే వాటినీ పెంచుకున్నది. 'పాలమ్మా.. బర్రెగొడ్లను భలే సాదుతున్నవ్' అని ఎవరన్నా అంటే, 'కాదు.. కాదు.. కరువుల్ల, కాలాల్ల అవే మమ్మల్ని సాదుతున్నయ్' అని తృప్తిగా నవ్వుతుండేది. ఆవూ దూడలకు మేత తినిపించిన తర్వాతనే తన పిల్లలకు అన్నం పెట్టుకునేది. ఆ సూరిబాబుకూ, నాకూ చిన్నప్పటి నుంచీ దోస్తానం కదా. చెట్లకు ఉయ్యాలలు కట్టుకొని ఊగుకుంట, ఆడుకుంట అక్కడ్నే ఉండేటోన్ని. సాయబాన్ల పెద్దదాలి వుండేది. పిడకలమీద పెద్ద కుండెడు పాలు ఎర్రగా కాగుతుండేవి. 'తాగుండ్రిరా..' అనుకుంట బెల్లం కలిపిన పాలను తన కొడుకులతోపాటు నాకూ పోసేది.

ఎంత రుచి ఆ పాలకు. పాలటికెను కవుచిప్పతో గీకుతున్న చప్పుడు కాంగనే అందరం ఉరికి, చుట్టూ చేతులు చాపుకొని కూచునేటోళ్లం. ఆ గోకు, ఆ పాలు.. అబ్బ.. ఎంత రుచి! ఇప్పటికీ అనుకోంగనే ఆ రుచి నాలుకమీద తెలుస్తనే ఉంటది. ఆమె చల్లకవ్వం పెట్టి, పెద్ద కుండెడు చల్లచేసి ఊళ్లో వాళ్లకు పోస్తూనే ఉండేది. కొంతమంది కూరగాయలు, ఇంకొంతమంది మెత్తడి తవుడు, తెలకపిండి తెచ్చి పెట్టెటోళ్లు. ఈ విధంగా వస్తుమార్పిడి తప్ప, పైసల బేరం లేదు. అసలు పైసెట్లుంటదో మా చిన్న పోరగాళ్లకు తెల్వకనే పోయేది. అయినా, పల్లెల్ల పైసలెందుకు? పాడి, పంట.. ఈ రెండే జనాన్ని సాదినయ్. ఏమో.. ఆ తరం వెళ్లిపోయింది. పాడుకాలం మొపైంది..'

విరక్తిగా అంటున్న మామ మాటలకు నా మనసులో ఏవేవో ఆలోచనలు. అవేంటో తెలుసుకుంటుంటే, మనమేంటో అర్థమైపోతుంది. ఇప్పటివాళ్లకు అన్నీ గొప్పలే. చెప్పుకోవడం తప్ప, చేతలు లేవు. వాళ్లకు చేతలు తప్ప, మాటలు రావు. ఈ కాలంలో మరీ వాట్సప్, ఫేస్బుక్ లొచ్చినాక నీతుల పుట్టలే! అవన్నీ నీటిలో రాతలే.

'చల్లతో ఊరోళ్లందరి కడుపులు చల్ల చేసేది. అంత చేసినా.. ఇదేందో గొప్పనిగానీ, అందరికీ తెలవాలనిగానీ ఆమె అనుకోలేదు' అంటూ మామ మళ్లీ చెప్పుకుపోతున్నాడు.'పాలమ్మ మొగడు కూడా వ్యవసాయంల దిట్ట. నలుగురైదుగురు పాలేర్లు ఉన్నా వీళ్లకు తగ్గట్టు 'రాజాలు' అనే పాలేరు మంచి పనోడు. వాడి పనితనాన్ని చూసి, ఊళ్లో ఎంతోమంది ఎక్కువ జీతం ఇస్తానన్నా ఆ ఇంటి మనుషులకూ, పశువులకూ, తనకూ మాటా మంచి కలిసిందనీ, ఆ ఇల్లు వదిలి కాస్త ఎక్కువ జీతానికి ఆశపడి పోకపోయేటోడు. అసలు అతనికి రాని పనిలేదు. చేయని పనిలేదు. వొళ్లు దాచుకోవడం అంటే ఆ రోజుల్లో చాలామందికి తెలియదు.

ఈ పనెందుకు చేయాలని వచ్చిన పని ఎగ్గొట్టే కువారాలు అప్పుడు లేవు. అందుకే, మనసు శుభ్రంగా ఉండి, పని చేస్తుంటే ఏ రోగాలూ ఉండక పొయ్యేవి..' 'మరి పెద్దకొడుకు ఏం పని చేస్తాడు మామ?' అడిగాను.'ఆస్తి పంపకాలప్పుడు 'నాకే వాటాలొద్దు. రెండఱ్రలు, నా బఱ్రెగొడ్లు నాకుంచుండ్రి. నా జీవి ఉన్నంతకాలం వాటికి నేను, నాకు అవి అనుకుంట.. వాటిని సాదుకుంట బతుకుత' అన్నది. పెద్ద కొడుక్కు ఖర్చు పెట్టుకొనేందుకు ఎప్పుడూ చేతినిండా పైసుండాలె. 'వ్యవసాయంల ఏం పాడయింది. దండుగ పని. మా నాయన పిచ్చోడు. రోగమొచ్చినా భూమి అమ్మొద్దంటడు. గందుకే డాక్టరద్దు.. మందులద్దు అనుకుంట రోగాన్ని ముదర బెట్టుకొని సచ్చి పోయిండు' అనుకుంటనే లీడర్ గిరి పేరుతో రాజకీయాల్లో దిగిండు. ఏ నాయకుడినో అవుతనని కలలు గంటూ గడి కింత భూమి నమ్మిండు. ఆఖరికి పెండ్లాం మెడల బంగారం కూడా పాడు చేసిండు..'

'మామా.. నీకు ఇవన్నీ ఎలా తెలుస్తయి?' అడిగాను.'ఎందుకు తెలవదు? అప్పుడప్పుడూ వాళ్ల ఇంటికి పోతూనే ఉంట కదా!' 'అవునా మామ. రేపు ఒక్కసారి పోదాం..' నా మాటలకు మామ 'సరే' అని తలూపాడు.

'ఆ బఱ్రెగొడ్లను అమ్ముకుందం' కొడుకుల మాటలు లీలగా వినిపించాయి పాలమ్మకు.ఆమె గుండెల్లో సన్నని దడ ప్రారంభమైంది. ఆమె కండ్లముందే ఇవన్నీ 'మాయం కావడం' ఆమె జీర్ణించుకోలేక పోతున్నది.

నిద్రపట్టని పాలమ్మ కండ్లూ నోరు తెరుచుకొని డబ్బు ఐదేండ్ల మూగభాషగా మిగిలింది. సుక్కబఱ్రె మొదటి ఈత గుర్తొచ్చి, ఆమె మనసు బాధగా మూలిగింది. మొట్టమొదటి దూడ పుట్టినప్పుడు తను ఎంతో సంతోషించింది. ఆ దూడ చూడటానికి చాలా అందంగా ఉండి, గిట్టల దగ్గర, మోకాళ్ల దగ్గర నల్లటి మచ్చలు మరింత అందాన్ని తెచ్చిపెట్టినయ్. నుదుట గోధుమ రంగుతో మచ్చ. మెత్తటి శరీరం. చురుకైన కండ్లు. తను వేడి నీళ్లు కాసి, బఱ్రెను– దూడను కడిగి శుభ్రం చేసింది. ఈనిన కొన్ని గంటలకు తినిపించాల్సిన ఆకులు, మందులు తినిపించింది. దూడ పుట్టిన కొన్ని గంటలకే ఆకిలంతా పరుగు తీసింది. దాని లేతకాళ్లు నొప్పి పెడతాయని ఉరకనీయకుండా పట్టుకుంటే, విడిపించుకొని పరుగు తీసింది. తన బిడ్డ చలాకీతనానికి సుక్కబఱ్రె గర్వంగా చూసింది.

'తొలుసూరు ఆడబిడ్డ పుట్టిందయ్యా మనింట్ల. ఇంక అంతా మంచే జరుగుతది' అంటున్న తన సంతోషాన్ని చూసి–

'ఇంటి ముందట గొడ్డూ గోదా ఉంటేనే మంచిది. కమ్మగా వారం రోజులపాటు

22 katha 1-203 page-1_Layout 1 9/25/2021 3:32 PM Page 169

జున్నుపాలు తాగొచ్చు' అన్నాడు భర్త.

ఆ మాటలు విని, 'ఇంకా నయం. రోజూ మనమే తాగుడేందయ్యా! ఈ వాడన పూటకొకళ్లకు పంపుడే!' అలా అన్నప్పుడు ఆమె మనసులో ఏదో తృప్తి. వెచ్చటి పాలకు వింతైన వాసన. అమ్మ ఒళ్లో కూర్చున్నప్పుడు వచ్చే వాసన. బర్రెగొడ్లు మేతమేసి ఇంటికి రాగానే వాటికోసం ఉలవలు, తెలకపిండి, మెత్తటి తవుడు కలిపిన బొచ్చెలు వాటి ముందుంచితే, అవి ఆవురావురని తినేవి. కాసేపటికే కుడితి తాగి, బరువైన పొట్టలతో నేలపై అటూ ఇటూ దొర్లుతూ వ్యాయామం తీరుగ చేస్తుండేవి. ఆ రోజులన్నీ ఇంకా ఆమె కండ్లముందు కదలాడుతూనే ఉన్నాయి. ఉవ్వెత్తున లేచిన జ్ఞాపకాలను అదిమి పెడుతూ, గట్టిగా కండ్లు మూసుకున్నది.

పాలమ్మ మమ్మల్ని కూర్చోమంటూ వాల్చిన మంచంపై, మామ పక్కనే కూర్చున్నాను.ఆ పక్కనే ఆమె కొడుకు సత్తిబాబు నిల్చొని ఉన్నాడు. 'కొడ్కా.. మీ నాయిన పోయేనాటికి తాతల ఆస్తితోపాటు తను సంపాదించిందంతా కాపాడుకున్నడు..' అంటూ కండ్లనీళ్లు పెట్టుకొన్నది పాలమ్మ. కొంగుతో కండ్లు తుడుచుకుంటూ మళ్లీ చెపుతున్నది.. 'కొడ్కా.. మీ నాయిన కట్టం చేసి చేసి ఓ కుక్కి మంచాన్ని ఆ శెట్లకింద ఏసుకొని కూసుండెటోడు. మోదుగాకు సుట్టల పొగాకు పొడుం పోసుకొని, ఈ సుట్ట తాగుకుంట సేద తీర్చుకునేటోడు. ఆ చెట్లనీడే తన తల్లి ఒడి అనేటోడు. గందుకదే.. మీ నాయిన పోయినా, ఆ శెట్టుకింద కుక్కి మంచంల కూసున్నట్టే కనిపించేది నాకు..' ఆమె మాటలు మింగుతూ వెక్కివెక్కి ఏడ్చింది. 'కొడ్కా.. మీరు కొట్టేసింది ఆ శెట్లను కాదు. మీ నాయిన రూపాన్ని, నా పాణాన్ని..' ఆ మాటలు వింటున్న మామ, ఏమీ మాట్లాడలేక తలొంచుకొని కూర్చున్నాడు. నాకు మాత్రం హృదయమంతా పిండేసినట్లయింది. పాలమ్మ ఇంకా చెబుతూనే ఉన్నది. 'మనకు బుక్కెడు బువ్వ పెట్టే భూదేవరే మన కన్నతల్లి. ఎన్ని కట్టాలచ్చినా తల్లిని అమ్ముకుంటమా? గట్లనే బువ్వ పెట్టే భూమినిగూడ అమ్మద్దని మీ నాయిన శెప్పేది. భూముంటే ఏం లాభమని నా కొడుకులు అడిగితే, నేనేం జెప్పాలె? అమ్మతో లాభమేంది? బువ్వతో లాభమేంది? అని అడిగితే ఏం జవాబు చెప్తం. ఈ కాలం మనుషులు శానా తెలిసినోళ్లు. తెలివిగల్లోళ్లాయె. మా ఎన్కటోళ్లకు గివ్వేవీ తెల్వదాయె. భూమిని నమ్ముకోవాలె కొడుకా. అమ్ముకోవద్దు..' విరక్తిగా నవ్వుకుంటూ చెప్పిందామె. 'ఏముంది నాయినా.. ఒక్కొక్కటి ఒక్కొక్కటి అన్నీ మాయ–ంమైనై. ఇద్దరు కొడుకులు పోటీపడి భూమిని అమ్ముకున్నా.. నా ఆస్తి కాదని గుండెను రాయి చేసుకున్న. అన్నీ అయిపోయినయ్. గిప్పుడు నా బర్రెగొడ్లకు బేరం బెట్టింద్రు..'

అని ఒక్క క్షణం ఆగి మళ్లీ చెబుతోంది.

'మట్టి తినకుండ దూడ మూతికి కట్టిన బుట్టలిప్పితే గంతు లేసుకుంట తల్లి దగ్గరికి పోతది. పొదుగును మూతితోని కుమ్మితే పాలు కారుత్తది. అది తాగినంక యజమాని పోయి, చేతితోని పాల పొదుగును తాకంగనే మనిషికి ఉపకారం చేస్తున్న అనుకుంట తృప్తిగ కండ్లు మూసుకొని కల్మషం లేకుండా పాలిత్తది. గందుకే, ఆ పాలకు అంత రుశి, గంత బలం. అదీ.. మనిషికీ పశువుకూ ఉన్న బంధం. గదంతా పోయి, ఏందో పాలు పిండే మిషినట. పచ్చి పాలల్ల వెన్నతీసే మిషినట. మనిషికి, భూమికి, పశువుకు ఉన్న బంధాలన్నీ తెగ్గొట్టి, మధ్యన రాక్షసుల తీరుగ ఈ మిషిన్లు అచ్చి కూసున్నయ్. మిషిన్లతోటి పాలు తీస్తరట. కొంచెం అటీటు అయినా పాల బదులు రక్తం కార్తదట. ఏదో సూదెయ్యంగనే పొదుగుల పాలు జేర్తయట. కానీ, ఆ పశువుకు అచ్చు రోగం, ఆ పాలు తాగితే మనిషికి అచ్చే రోగం గురించి ఆలోచన లేదా బిడ్డా! నోరు లేని పశువును పీడించి, దాని బిడ్డను పాలు తాగకుంట చేసే హక్కు మనకెక్కడిదయ్యా? బిడ్డపాలు బిడ్డ తాగాల్సిందే గదా?' పాలమ్మ మాటల ప్రవాహం కొనసాగుతూనే ఉన్నది.'మిషిన్ల కాలం అచ్చె కొడుకా.. విషపు కాలం అచ్చె. క్యాన్లకొద్దీ పాలు గావాల్నని సంకరజాతిని పెంచబట్టిరి. పాలల్ల ఏందేదో కల్వ బట్టిరి. పాలల్ల నీళ్లు తప్ప ఏది కలిపినా, పాపమే! పాలు నీళ్ల తీర్గ కలిసుండే మనిషినీ, పశువును విడగొడుతుండ్రు. పాడి పరిశ్రమ పెంచండి కొడుకా.. కానీ, పాలల్లో ఇసం కల్పొద్దు. మిషిన్లు అద్దు, అవి రాక్షసులు. మనుషుల్ల రాక్షసులు కల్వొద్దు. కలియుగం మునిగిపోతది..' అంటూ మళ్లీ విరక్తిగా నవ్వింది.'నిన్నటి సంది బర్రెగొడ్ల బేరం అయిపోయిందనీ, బయానా తీసుకున్ననని నా శిన్నకొడుకు ఒక్కటే గోల..' ఈ మాటలు అనంగనే ఆమె ఎండిపోయిన చెంపల మీద జలజలా కన్నీళ్లు కారాయి.

**ఆ తెల్లవారి..**

బేరగాడు వచ్చాడు. బర్రెలు కదలడం లేదు. ఒక్క అడుగు ముందుకేస్తే, రెండడుగులు వెనక్కి వేస్తున్నాయి. అన్నిటికన్నా పెద్దదయిన 'సుక్కబర్రె' .. మెడతాడు గుంజిపట్టి, కాళ్లు నేలకు తొక్కిపట్టి, చెవులు రిక్కించి పాలమ్మనే చూస్తోంది. అది కదిలేటట్టు లేదని కర్రతో రెండు దెబ్బలు వేశాడు కొన్నవాడు. ఆ దెబ్బలు తనకే తాకినట్టు ఉలిక్కి పడ్డది పాలమ్మ. ఉరికినట్లే పోయి, అతని చేతిలోని కట్టెను పక్కకు తోసింది. 'వద్దు కొడుకా కొట్టకు. నోరు లేని బిడ్డలు. ఇన్నేండ్లు దెబ్బ కొట్టకుండ సాదుకున్న. గందుకే నన్ను వదిలి పోనంటున్నయ్..' అంటూ కొంగుతో సుక్కబర్రె

చర్మాన్నంతా తుడుస్తూ ప్రేమగా నిమిరింది. 'బిడ్డా.. నన్నొదిలి పోను కాళ్లస్తలెవ్వా! నన్నేం జెయ్యమంటవ్ బిడ్డా! నువ్వెళ్లిపోతే ఈ పాలమ్మ ఎట్ల బతకాలె? నువ్వు లేకుంటె నాకు ఈ పాలమ్మ పేరెందుకు? అసలు బతుకుడెందుకు?' హృదయ విదారకంగా దాని వీపుమీద అలాగే పడుకొని వెక్కివెక్కి ఏడుస్తున్నది పాలమ్మ. ఆమెను చూసి సుక్కబ్రె.. ఆమె చేతులను నాలుకతో నాకుతూ, కండ్లెంట నీళ్ల కారుస్తూ, మూగప్రేమతో ఆమె చేతులను తడిపింది. ఇప్పుడవి ఆమెవి కావు. వాటిని కొట్టొద్దనే హక్కు ఆమెకు లేదు. డబ్బుతో లావాదేవీలు జరిగి, వాటి శరీరాలు అమ్ముడు పోయాయని పాపం వాటికేం తెలుసు? వెనక ఉన్నవాడు గట్టిగా అదిలించాడు. బలవంతంగా అడుగులు గుంజుకుంటూ, వెనక్కి తిరిగి పాలమ్మను చూస్తోంది సుక్కబ్రె. ఒంటిమీద దెబ్బ పడగానే అడుగు ముందుకు వేసింది.సూర్యుడి వెలుగులా ప్రకాశిస్తున్న ఓ రైతు రూపం, చంద్రుడి వెన్నెలలా పరచుకున్న 'పాలమ్మ' నామం క్రమక్రమంగా నల్లబడి పోయాయి. కానీ, ఆమె పాడి పంట గురించి, అనుభవాల లోతుల నుండి ముందు తరాలకు ప్రబోధించమన్నట్టు చెప్పిన సందేశం మాత్రం.. నా చెవుల్లో శాశ్వతంగా నిలిచిపోయింది.

## వేముగంటి శుక్తిమతి

*వేముగంటి శుక్తిమతి స్వస్థలం హన్మకొండ. ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించి, రచనా వ్యాసంగాన్ని ప్రవృత్తిగా ఎంచుకున్నారు. ఇప్పటి వరకూ 25 కథలు, ఆరు నవలలు, 50కి పైగా వ్యాసాలు రాశారు. పిల్లలకోసం బుర్రకథలు, నృత్య నాటికలు, ఏకపాత్రాభినయంతోపాటు అనేక పాటలు రాశారు. హైదరాబాద్ పీర్జాదిగూడలోని 'స్ఫటిక సాయిబాబా' చరిత్రను పారాయణ గ్రంథంగా వెలువరించారు. వీరి మొదటి కథ 'మానవత్వం మరిచిన వేళ' కు ఆంధ్రభూమి వారపత్రిక ఉగాది కథలపోటీలో మొదటి బహుమతి వచ్చింది. 'మళ్లీ పల్లె ఒడిలోకి' అనే నవల 'అంపశయ్య నవీన్ అవార్డు' ను గెలుచుకున్నది. తెలంగాణ మలిదశ ఉద్యమ చరిత్రను 'నేను సైతం' పేరుతో నవలగా రాశారు. 'ఉపాసన' సంస్థ నిర్వహించిన సంక్రాంతి కథలపోటీలో 'నేటి మనిషి' కథకు బహుమతిని గెలుచుకున్నారు. 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'నమస్తే నమః' శీర్షికలో 'దేవీ భాగవతం' గురించిన ఆధ్యాత్మిక వ్యాసాలు రాస్తున్నారు.*

# చీకటి వెలుగులు

స్ఫూర్తి కందివనం

**96527 45117**

**'జయమ్మా! వో జయమ్మా!'** గడపకాడ నిలవడి ఇంట్లకు తొంగి సూసుకుంట, జయమ్మ కొరకు వెతుక్కుంట పిల్శింది ఎదురింట్లుండే చంద్రకళ. చేతిలున్న జాకిటు గుడ్డకు మ్యాచింగ్ దారం కోసం, గూట్ల ఉన్న దారాల డబ్బాలు తీస్తున్న జయమ్మ.. చంద్రకళ పిలుపు ఇనంగనే–

'ఆ.. వొస్తి!' అనుకుంట జాకిటు గుడ్డను ఆడ్నే స్టూల్‌మీన వెట్టింది. వొంగిపోయిన నడుముకు చేతులు వెట్టుకొని తలుపు కాడికొచ్చింది.

'చంద్రకళా నీవా! నీ బట్టలే కుడుతుండా! రేపు పొద్దుగాల వరకు కుట్టిస్త బిడ్డ. నీవు రాలేకున్నా సరే! పొద్దుగాల్నే నీ బిడ్డను పంపు. ఇచ్చి తోల్తా.. అట్లేగెనా?' అన్నది ముక్కు చీదుకుంట, కొంగుతోని కండ్లద్దాలు తూడ్సుకుంట.

'ఇంగా కుట్టిలేవా జయమ్మా! రేపు ఊరికి వోతున్నమని చెప్తి గద!' అన్నది చంద్రకళ.

'అవ్వు.. చెప్తివిగానీ, నాకు జర నిన్నటిసంది సర్దయింది. కుట్టనీకే వీలుగాలే. రేపు ఎండ పొద్దున బస్సుకు గద మీరు వొయ్యేది! అప్పటి వరకు ఇస్తలే'

'పొద్దుగాల్నే పిల్లను వంపుత, తప్పకుండ కుట్టి పెట్టయితే!'

'అట్లెగే కుట్టిస్త పో బిడ్డ!'

'సరే' అనుకుంట ఇంటికి వోయింది చంద్రకళ.

జయమ్మ లోపటికి వోయి స్టూల్‌మీన వెట్టిన జాకిటు గుడ్డ, దారం కండలు

తీస్కొని కుట్టు మిషన్ల రెండు మూడు నూనె సుక్కలు వోశి, కుట్టడం షురు జేయంగనే–

'జయవ్వా! ప్రమీలక్క ఫోను జేషింది' అని ఉరుక్కుంట వొచ్చి జెప్పిండు జయమ్మ ఇంటిపక్క పోర్షన్ల కిరాయికుంటున్న సీనుగాడు.

'అవ్వ కొడ్కా! వొస్తున్న పా' అనుకుంట, దబదబ తలుపులు దగ్గరికేసి సీనుగానెంబడే వోయింది జయమ్మ.

ఐదు నిమిషాలకు ప్రమీల మల్ల ఫోను జేసింది.

'హలో అమ్మా! మంచిగున్నవా?' అన్నది ప్రమీల.

'మంచిగున్న బిడ్డ! అల్లుడు, మన్మరాండ్లు గిట్ల మంచిగున్నరు గద!' అన్నది జయమ్మ.

'అందరం మంచిగున్నం. ఈసారి పండ్గకు ఊరికి రానికే వీలుగాదేమోమ్మా! మీ అల్లుడికి జర ఆఫీసుల పని ఎక్వుంది. ఇగ ఆడ ఊర్ల నీవొక్క దానివి ఏం జేస్తవు ఈడికే రా'

'పండుగ బట్టలు చానున్నయి బిడ్డ! సూస్త.. కుదుర్తే వొస్తలే'

'కుదుర్తే గాదు తప్పకుండ రామ్మా. ఇగో నీ మన్మరాండ్లు అమ్మమ్మ తానికి వోదమని ఒకటే ఎంబడి వడిన్రు. వాళ్లకొరకన్న రా'

'అట్లైగే వొస్తలే! ఉంట మల్ల. ఇగ ఫోన్ల పైసలు చానయితయ్' అని ఫోను పెట్టేసి, ఇంటికి వోయింది జయమ్మ.

కుర్చీల కూసోని 'పిల్లలు రమ్మంటున్నరు, ఎట్లనో ఏమో?' అనుకుంట, మల్ల కుట్టుమిషను తొక్కుడు షురుజేసింది.

ఇగ అట్లిట్ల జేశి పది రోజులల్ల కుట్టాల్సిన బట్టలన్నీ కుట్టిచ్చింది. రేపు పండుగనంగ ముందురోజు బిడ్డకాడికి పోనీకే బస్సెక్కింది. కండక్టర్కి పైసలిచ్చి మైబునార్ (మహబూబ్‌నగర్)కు టిక్కెట్టు తీస్కొని, సీటుల కూసుంది జయమ్మ.

'ఏం జయమ్మా.. బిడ్డతానికి వోతున్నవా?' అడిగిండు అదే ఊర్ల ఉండే కిష్టయ్య.

'అవ్వన్నా! రమ్మనే.. మల్ల పోకుంటే పిల్లలు బుగులు వడ్తరు. అందుకే ఇగ వోతుండ' అని చెప్పింది జయమ్మ.

బస్సు కదిలి ముందుకు వోతుంటే కిటికీ పక్కకు కూసోని బయిటికి సూస్తున్న జయమ్మకు ఆమె గత జ్ఞాపకాలు యాది కొచ్చినయ్. ఇప్పుడే కాదు, ప్రతీ ఏడాదీ వచ్చే దసరా పండుగకు జయమ్మ జీవితంలగా పండుగ మిగిల్చిన చేదు గుళికల్లాంటి యాదులన్నీ పీడకలలై వేధిస్తుంటయి. దసరా పండుగంటే ఊర్ల

**'ఏం జయమ్మ బిడ్డతానికి వోతున్నవా?', అడిగిండు అదే ఊర్ల ఉండే కిష్టయ్య. 'అవ్వన్నా! రమ్మనే, మల్ల పోకుంటే పిల్లలు బుగులువడ్తరు. అందుకే ఇగ వోతుండ', అని చెప్పింది జయమ్మ. బస్సు కదిలి ముందుకు వోతుంటే, కిటికీ పక్కకు కూసోని బయిటికి సూస్తున్న జయమ్మకు ఆమె గత జ్ఞాపకాలు యాదికొచ్చినయ్.**

అందరికీ సంబురాలు తెచ్చి పెట్టేది. కానీ, జయమ్మకు గతంల గా దినము తగిలిన ఎదురు దెబ్బనే గుండెల గునపం లెక్క గుచ్చుతుంటది.

జయమ్మ అమ్మనాయినోల్లది పాలమూరు జిల్లాల గోపులాపుర్ అనే చిన్న పల్లె. ఇద్దరు ఆడివిల్లలు, ఇద్దరు మొగపిల్లల ఎనకసిరి ఆఖరున పుట్టింది జయమ్మ. ఇంట్ల అందరికంటే చిన్నది, అన్నిట్ల హుషారుగుంటది. ఏ పని జెప్పినా శిట్టశిట్ట జేసి పెడతది. ఎర్రగ బుర్రగ లేకున్నా చామనఛాయ రంగుల ఉండి, మంచికళ మొకం ఆమెది. అదే జిల్లాకు చెందిన రామాపురంల కెల్లి పెద్దింటి సంబంధమొస్తే పదిహేనేండ్లకే ఆమెకు పెండ్లి జేసిన్రు జయమ్మ అమ్మ నాయిన రామచంద్రయ్య, కనకమ్మ. ఆ కాలంలనే ఊర్ల పెద్ద బంగ్లా, పెద్ద బట్టల దుకునం ఉండేది జయమ్మ అత్తగారోళ్లకు. నలుగురు ఆడివిల్లల ఎనక ఒక్కడే కొడుకాయే. వొచ్చే కోడల్ని కూతురు లెక్క జూస్కుంటమంటే ఇగ తమ బిడ్డ బంగ్లాల రాణి లెక్క బతుకుతదనుకున్నరు ఆలుమగలు. అనుకున్నట్లే ఆ ఇంటికి పెద్ద కోడలైనా, చిన్న కోడలైనా అన్నీ జయమ్మనే. కానీ, అత్త గంగమ్మ పెత్తనం ముంగట కోడలు కోడలు స్థానంలనే ఉండిపోయింది. గంగమ్మ భర్త మూడేండ్ల కిందనే జర సుస్తియ్యి కాలం జేసిండు. అంతకు మునుపే ఆడివిల్లలు నలుగురికీ పెండ్లిల్లు జేసింది. యాపారం, ఆస్తుల విషయాలన్నీ కొడుకు నర్సింహులే చూస్కుంటడు.

ఇగ పెండ్లయిన కొన్ని నెలలు మంచిగనే ఉన్న నర్సింహులు, గా తర్వాత ఒక్క దినం గూడ పెండ్లాంతోని సరిగ మాట్లాడిందే లేదు. కొన్నిసార్లయితే కనీసం ఆమె మొకం గిట్ల సూడకుండనే బయిటికి పోయ్యేది. ఎప్పుడో పొద్దున్నే 'దుకునం కాడికి వోతున్నా' అని చెప్పి పోయి, మల్ల మాపటికి చీకటి వడ్డాక వొచ్చేటోడు. 'దుకునం కాడ పని ఎక్కువుంటదేమో' అనుకున్నది జయమ్మ. పొద్దస్తమానం ఇంట్ల పనులన్నీ చేస్కొని పెనిమిటి కొరకు ఎదురు జూస్కుంట ఉండేది.

ఇట్లనే కొన్ని నెలలు గడిచిపోయినయి. రాను రాను నర్సింహులు జయమ్మకు

**ఇగ ఊర్ల ఆడివిల్లలందరు ఎర్రమన్ను తీస్కపోయి అమ్మవారి గుడిల ఏడు మేడెల గౌరమ్మను తయారు జేసిన్రు. తర్వాత గౌరమ్మ ముంగటనే మట్టితోని జేసిన గుండప్ప (గణపతి)ని గుడంగ వెట్టిన్రు. పొలాలల్ల కెల్లి గాసగాండ్లతోని తెప్పిచ్చిన తంగేడుపూలు గౌరమ్మకు, గుండప్పకు సుట్టూ పేర్చి అలంకరణ జేసిన్రు.**

ఒక అపరిచితుడు లెక్కనే అయిపోయిండు. చీకటి వడ్డాక వొచ్చేది, ఆ తర్వాత వారానికొకనాడు ఇంటికొచ్చి పోతుండేటోడు. 'ఎందుకట్ల' అంటాని పెనిమిటిని అడగడానికే అవకాశం లేదు, అత్తను అడిగే ధైర్నం లేదు. ఊర్లనేమో 'నర్సింహులు ఊరికి కొత్తగొచ్చిన అంజనమ్మతోని ఉంటున్నడు' అని అప్పుడప్పుడు పుకార్లు ఇనిపియ్యవట్టే. అంజనమ్మ జర సదువుకున్నామే. ఊర్ల పిల్లలకు టూషన్లు జెప్తుంటది. ఓనాడు అంజనమ్మ బట్టలు కొననీకే నర్సింహులు దుకునంకి వొచ్చింది. అట్ల పరిచయమయ్యి చిన్నగ ప్రేమగా మారి, ఇగ నర్సింహులు ఆమె తాననే ఉండుకమయ్యింది. కాని జయమ్మకు పెనిమిటి మీదున్న నమ్మకం ,చుట్టుపక్కలోల్ల చెప్పుడు మాటలమీద లేదు. అందుకే, ఆమె మనసు వాళ్లు మోసుకొచ్చే పుకార్లను అంగీకరించలేకపోయింది.

ఇగ గా ఏడాది 'దసర పండుగ దగ్గర వడవట్టే' అంటాని బిడ్డను, అల్లుడిని పండుగకు రమ్మని పిలువనీకే జయమ్మ నాయన రామచంద్రయ్య రామాపురంకి వొచ్చిండు. తండ్రిని జూడంగనే పుట్టెడు దుఃఖం పొంగుకొచ్చింది జయమ్మకు.

'బుగులు వట్టినవా జయమ్మ.. అట్ల ఏడ్వవడ్తివి!' అన్నడు రామచంద్రయ్య.

మనసులున్న బాధలు జెప్పి తండ్రిని పర్శాన్ జేయుడు ఇష్టం లేక, 'అవ్వు నాయిన! చాన దినాలకు సూశ్న గద నిన్ను అందుకే..' అన్నది చీర కొంగుతోని కండ్లు తూడ్చుకుంట.

'ఏడ్వకు బిడ్డా! ఆడివిల్లలకు తప్పవు ఇయన్ని. వారం రోజులల్ల నవరాత్రులు షురువయితయి గద! నీవు, అల్లుడు రెండ్రోజుల మునుపే వొచ్చి పండుగైనాక వోవాలే సూడు బిడ్డ. నేను అల్లుడికి గుడంగ జెప్త' అన్నడు రామచంద్రయ్య, బిడ్డను చూసిన సంతోషంల తడిసిన కండ్లతోని.

జయమ్మ ఒకసారి అత్త మొకం సూశి, మల్ల తండ్రికెల్లి సూశి–

'అయినకు ఈలుగాదేమో నాయిన! చాన పనుంటుంది దుకునంల. ఇగ

పండుగ పూట అంటే ఇంగింత పని ఎక్కువుంటది' అన్నది చిన్నగ.

'అట్లనా! దుకునం కాడ పనోళ్లున్నరు గద? లేకుంటే నేను ఆడికే వొయి అల్లుడిని కలిషి జెప్తలే అయితే!'

'వొద్దు నాయిన! నేనే చెప్పి జూస్తలే! నీకు మల్ల బస్సుకు ఆల్శమైతది'

'నీ ఇష్టమైతే! ఇగో మీయమ్మ నీ కొరకు మురుకులు, గరిజెలు జేశి పంపింది' అనుకుంట చేతిలున్న సంచి జయమ్మ కిచ్చిండు.

ఎనకసిరి గంగమ్మతోని జరసేపు మాట్లాడి–

'ఇగ నేను వొయ్యొస్త బిడ్డ!' అని జయమ్మకు జెప్పి ఊరికి బయలుదేరిండు.

తండ్రి వోతుంటే పుట్టింటోళ్లు యాదికొచ్చి చాన దుఃఖమొచ్చింది జయమ్మకు.

సూస్తుండగనే వారం ఎల్లిపాయే. నవరాత్రులు షురువయినయి.

'పండుగ దినాలల్లనన్న పెనిమిటి ఇంటికొస్తడేమో' అని కొండంత ఆశతోని ఎదురు చూసింది జయమ్మ, కానీ, లాభం లేకపాయే.

ఇగ ఊర్ల ఆడివిల్లలందరు ఎర్రమన్ను తీస్కపోయి అమ్మవారి గుడిల ఏడు మేడెల గౌరమ్మను తయారు జేసిన్రు. తర్వాత గౌరమ్మ ముంగటనే మట్టితోని జేసిన గుండప్ప (గణపతి)ని గుడంగ వెట్టిన్రు. పొలాలల్ల కెల్లి గాసగాండ్లతోని తెప్పిచ్చిన తంగేడుపూలు గౌరమ్మకు, గుండప్పకు సుట్టూ పేర్చి అలంకరణ జేసిన్రు. అందరిండ్లల్లకెల్లి అమ్మవారికి బచ్చాలు, పాశం, బెల్లమన్నం, శెనిగె గుగ్గిళ్లు.. ఇట్ల రకరకాల నైవేద్యాలు చేసుకొచ్చి పెట్టిన్రు. కన్నెపిల్లలు పట్టు లంగాలు, వోణీలు, పెళ్లయినోళ్లు పట్టుశీరలు గట్టి కుచ్చుల జడలేస్కొని కాళ్లకు, శేతులకు మైదాకు వెట్టుకొని గౌరమ్మకు పాటలు వాడుతుంటే.. సూడనీకే అందరు దేవతల్లెక్క గొట్టవట్టిన్రు. పూజయిన ఎనకసిరి ఆడోళ్లంత పసుపుల జరంత సున్నం గలిపి తయారుజేసిన సెంద్రంతోని చేతులమీద శిన్న శిన్న ముగ్గులేసుకుంటున్నరు.

'అగా.. పండ్గపూట మైదాకే వెట్కున్లేవానే! ఏంటికీ?' అంటాని జయమ్మను అడిగింది వోల్ల ఇంటి ముంగటుండే చిట్టెమ్మ.

అట్ల అడగంగనే పెనిమిటి యాదికొచ్చి జయమ్మ మనసు కలికలయి ఏం జెప్పకుండ గప్పుగుంది. ఇగ ముత్తయిదువులు ఒకర్కొకరు తాంబూలాలు ఇచ్చుకొనుడు షురుజేస్తుండంగనే అంజనమ్మ గుడంగ గుడి కాడికొచ్చింది.

'ఈమెనే అంజనమ్మంటే!' అంటాని ఆడున్న ఇద్దరు ఆడోళ్లు గుసగుసగా అనుకుంటుంటే, ఆమెను సూశేటాలకు జయమ్మకు పానం కశిబిషయి ఇగ ఆడ ఉండబుద్దిగాలే. కానీ, పసుపు కుంకుమ తీస్కోకుండ పోవొద్దని బలంతంగ పానం బిగవట్కోనుంది.

ఇగ తొమ్మిది రోజులు దినాము గుడిల అమ్మవారికి అలంకరణలు, గౌరమ్మకు, గుండప్పకు పూజలు ఘనంగ జేసిన్రు. దినాము ఊరంత ఒక కుటుంబం లెక్కనే కలిషి పండుగ జేస్కుంటుంటే జయమ్మకు మంచిగన్పిస్తుండే. జరంతసేపు మనసులున్న బాధను పక్కన వెడ్తుండే.

ఇట్ల తొమ్మిది రోజులు గడిచి పోయినయి. పదో రోజు దసర పండుగ. గా దినం ఇగ గుడికి వోయి అమ్మవారి దర్శనం గిట్ల జేస్కొచ్చినాక ఒకరింటికి ఒకరు వోయి సంతోషంగ జమ్మి వెట్టి బంగారం (జమ్మి ఆకు) ఇచ్చి పుచ్చుకుంటుంటే ఊరంత చాన కళకళగున్నది.

'జయమ్మా! గీ ఇంట్ల మనకు తెల్సినోళ్లున్నరు వాళ్లకు గుడ జమ్మి వెట్టొద్దం పా!' అంటాని తోల్కవోయింది గంగమ్మ.

'అట్లెగే' అని అత్త ఎంబడి వోయింది జయమ్మ.

గదే టైంల ఆ ఇంటికి రెండిండ్లవతల ఇంట్లకెల్లి నర్సింహులు, అంజనమ్మ ముచ్చట వెట్టుకుంట, నగుకుంట బయిటి కొస్తుంటే, జయమ్మ సూశి కండ్లల్ల నీళ్లు వెట్టుకుంది. గంగమ్మకు గుడంగ గుండెల పిడుగు వడినట్లయింది. ఎంబటే ఆడికి వోయి కొడుకును నిలదీశింది.

'నేను అంజనమ్మను పెండ్లి జేస్కోవాలన్కుంటున్న' అన్నడు నర్సింహులు ఖచ్చితంగ.

ఇగ కొడుకు అన్నిటికి తెగించిండని అర్థమయ్యి, ఇప్పుడేమన్నా లాభం లేదని కోడలికి ధైర్నం జెప్పి ఇంటికి తోల్కవోయింది.

మరుసటి రోజు పదకొండో రోజయితది. జయమ్మ గా దినం పెండ్లయిన కొత్తల పెనిమిటి తెచ్చిన చిలకపచ్చ రంగు పట్టుచీర కట్టుకొని, కుచ్చుల జడేస్కొని, 'కనీసం ఈ దినమన్న పెనిమిటి ఇంటికొచ్చి పోతడేమో..' అని ఆశగ ఎదురు జూస్తుంది.

'యేమాయె జయమ్మ! అందరు వోతున్నరు గుడికాడికి పా జల్దీ!' అన్నది గంగమ్మ. కోడలి పరిస్థితి ఎరుకున్నది గంగమ్మకు. కానీ, 'ఇగ కొడుకు ఉన్నా లేనట్టే..' అనుకుంది.

'వొస్తి అత్తమ్మ!' అని జెప్పుకుంట, పెనిమిటి కొరకు గుమ్మం దిక్కు జూస్కుంటనే పుట్నాల పొడి, బెల్లం కలిపి గురుగులు తయారు జేసింది. దాంట్లకు బొడ్డొత్తులు వెట్టి, నెయ్యి వోషి తాంబాలంల గుండ్రంగ వెట్టింది. ఇగ అవి వట్టుకొని చిన్నగ లేశి, గప్పుగ అత్త ఎంబడి గుడికి వోయింది. అమ్మవారికి అందరు తీస్కొచ్చిన గురుగులతోని పెద్ద హారతిచ్చి పాటలు వాడి, ఎనకసిరి పసుపు కుంకుమలు

ఇచ్చిపుచ్చుకున్నరు. ఇగ దినాము గౌరమ్మకాడ వెట్టే పూలన్ని తీస్కపోయి గుడిలనే ఒక మూలకు వెట్టి, బరువు కొరకు దాంట్లమీద రాళ్లు వెట్టేటోళ్లు. గయి ఎండిపోయి తెప్పలాగ తయారయింది. పసుపుతోని గౌరమ్మను, గండప్పను చేసి, దొప్పలల్ల వెట్టి, బొట్లు వెట్టి, దీపాలు ముట్టిచ్చిన్రు. ఎండిపోయిన పూలతోని తయారైన తెప్పమీద ఇవన్ని వెట్టిన్రు. ఊర్ల పిల్లలు, పెద్దలు అందరు కలిసి మేడల గౌరమ్మ, గుండప్పతోసహా అన్నిటినీ గుడి కాడినుంచి కోలాటాలాడుకుంట, మంగళ వాయిద్యాలు వాయించుకుంట ఊరి బయట చెరువు కాడికి తీసుకపోయి–న్రు. అన్నిటినీ చెరువుల ఇడిషి పెట్టిన్రు. ఒకపక్క చెరువుల గౌరమ్మను ఇడిషినాక నీళ్లల్ల తేలుకుంట తడుసుకుంట మునిగిపోతుంటే, జయమ్మకు పెనిమిటి యాదికొచ్చి గుండెలున్న బాధ కండ్లలకెల్లి ఉప్పొంగుకొచ్చింది.

తర్వాత చెరువు గట్టు కాడనే అందరు చెట్లకింద కూసోని, జోలి వెట్టుకుంట ఇంటికాడికెల్లి కట్టుకొచ్చుకున్న చిత్రన్నం, పిండొంటలు తింటుంటే జయమ్మకు, గంగమ్మకేమో నర్సింహులు యాదికొచ్చి గవేవి మింగుడు వడలేదు. ఇగ ఆడికెల్లి ఇంటికొచ్చినాక ఉలుకూ పలుకూ లేకుండ ఉన్న కోడల్ని సూస్తుంటే గంగమ్మకు మనసంత కలికలయింది.

## స్ఫూర్తి కందివనం

స్ఫూర్తి కందివనం స్వస్థలం మహబూబ్‌నగర్. ప్రస్తుతం హైదరాబాద్‌లోని నాచారంలో నివాసముంటున్నారు. తల్లిదండ్రులు కందివనం రఘురామయ్య, మారిపాకుల వరలక్ష్మి. భర్త పాపతోటి నరేంద్రకుమార్. బయో టెక్నాలజీలో పీజీ చేసిన వీరు, ఆరేండ్లపాటు సైంటిఫిక్ ఈ–జర్నల్స్ పబ్లిషింగ్ సంస్థల్లో మేనేజింగ్ ఎడిటర్‌గా పనిచేశారు. సాహిత్యం పట్ల ఆసక్తితో 2019 నుండి రచనలు చేయడం ప్రారంభించారు. ఇప్పటివరకూ ఇంగ్లీషులో 12 కథలు, తెలుగులో 33 కథలు, రెండు నవలలు రాశారు. 'చైత్ర' నవలను పుస్తకంగా వెలువరించారు. 'లోగిలి' మాస పత్రిక 2019లో నిర్వహించిన సింగల్ పేజీ కథల పోటీలో తృతీయ బహుమతి గెలుచుకున్నారు. 'ఈనాడు కథా విజయం 2020', 'అర్చన ఫైన్ ఆర్ట్స్ కథా మాలిక 2021' పోటీల్లో వీరి కథలకు ప్రత్యేక బహుమతులు లభించాయి. 'అరసం యువ కథా పురస్కారం–2021' కథల పోటీల్లో వీరు రాసిన 'నేను.. మీ..!' కథకు ప్రోత్సాహక బహుమతి అందుకున్నారు. వీటితోపాటు ఆన్‌లైన్ సాహిత్య వేదికల్లో నిర్వహించిన పలు పోటీల్లోనూ బహుమతులు దక్కించుకున్నారు.

# మనసున మనసై

చింతపట్ల పద్మా రమేష్

**'తాతయ్య....**బస్ వచ్చేసింది' పిల్లల అరుపుకు ఈ లోకంలోకి వచ్చాను.

హడావిడిగా పిల్లలిద్దరిని స్కూల్ బస్సు ఎక్కించాను. వారి బుట్టలూ సీటు కింద పెట్టే పనిలో నేనుండగా,నా మెడ చుట్టూ తమ చిన్ని చేతులు బిగించి, నా మొహాన్ని ముద్దులతో నింపారు ఇద్దరు.

'బై తాతయ్యా' అని కిలకిలా నవ్వుతూ బస్సు లోపలికి పరిగెత్తారు. మనసు దూది పింజ అయ్యింది కాసేపు. అలసట మటుమాయమైంది.

వెనక్కి తిరుగుతుండగా 'కాస్త బస్సు ఆపండి అంకుల్' అంటూ వెనక నుండి ఓ ఆడ గొంతు అభ్యర్థన.అది నా స్నేహితుడు శివరాం కోడలు సుమది. కాలనీ రోడ్లు ఇరుగ్గా ఉండటం మూలాన స్కూల్ బస్సులు లోపలికి రాలేవు. అర కిలోమీటరు నడిచి మెయిన్ రోడ్డు మీద అరగంట బస్సు కోసం వెయిట్ చేయక తప్పని పరిస్థితి. సుమ దాదాపుగా పిల్లల్ని లాక్కొస్తున్నట్లుగా పరిగెత్తుకొచ్చి వారిని బస్సులో ఎక్కిం చేసింది. బస్సు కదిలే దాకా ఆగి నింపాదిగా సుమతో పాటు నడుస్తూ,

'ఏమ్మా! ఈ రోజు ఆలస్యమైన నట్టుంది.'అంటూ ఆరా తీశాను.

'ఈ ఊర్లోనే ఒక పెళ్ళికి వెళ్ళాలి అంకుల్! ఆ ఏర్పాట్లలో పడి.........' అంటూ నవ్వింది.

'కనీసం బస్ ఎక్కించే పని అయినా మా శివరాం గాడికి పురమాయించ లేక పోయావా?' అన్నాను సాలోచనగా.

'ఈ వయసులో ఆయన్ని ఇబ్బంది పెట్టడ మెందుకు అంకుల్' అంటూ వాళ్ళ ఇంటి బాట పట్టింది.

ఎంతైనా శివరాం అదృష్టవంతుడు అనిపించింది.కొడుకు,కోడలు ఒక్క పని చెప్పరు తనకు. ఈ ఒక్క విషయంలో తప్ప చాలా విషయాల్లో నాకు శివ రాముకు పోలిక ఉంటుంది. ఇద్దరం పని చేసింది ఒక ఆఫీసులోనే. ఇద్దరికీ ఒక్కడే మగ సంతానం.వారికీ ఇద్దరేసి పిల్లలు. ఆ నలుగురు కూడా ఒకే స్కూల్లో చదువుతారు. శివరాం భార్య రెండేళ్ల కిందట కాలం చేస్తే, నా భార్య వరలక్ష్మి ఈమధ్యే నాకు దూరం అయింది.

***

ఇంట్లోకి అడుగుపెట్టగానే, ఫోటోలో ఎదురుగా నవ్వుతూ నా భార్య. తన జ్ఞాపకాల పరిమళం నన్ను తాకింది. తానో సాదా సీదా ఇల్లాలు గానే నా జీవితంలోకి ప్రవేశించింది. ఆ తర్వాతే తనేంటో అర్థమైంది నాకు. మా ఊర్లో మాది ఓ లంకంత కొంప. ఇంటికి సరిపోయేంత జనం. బండెడు చాకీరి నవ్వుతూ చేసేది. గుట్టుగా సంసారాన్ని నెట్టుకొచ్చేది. అతి కష్టం మీద పొదుపు చేసి,కొంత డబ్బు దాచుకొనేది.అది తాను చీరలో, నగలో కొనుక్కోవడానికి అనుకుంటే పొరబడినట్లే....అనాథ వృద్ధుల అవసరాలు తీర్చడానికి.అవును,మీరు విన్నది నిజమే! మా బాబు పుట్టినరోజుతో సహా మా ముగ్గురి పుట్టినరోజులూ,మా పెళ్ళి రోజు వృద్ధాశ్రమంలో ఆ ముసలి వాళ్ళ మధ్యే జరిగేవి.వృద్ధులు అంటే తనకెంతో జాలి,దయా.

దానికి ఒక కారణం ఉంది.వరలక్ష్మి పెళ్ళి తర్వాత తనతో పాటు అదృష్ట లక్ష్మిని కూడా మెట్టినింటికి తెచ్చుకుంది. ఇలా ఎందుకన్నానంటే,మా పెళ్ళి తర్వాత ఆమె పెట్టింట్లో దరిద్రమే తాండవించింది.ఆమె తల్లిదండ్రులు కూడా వారి చివరి రోజులలో కొడుకుల నిరాదరణకు గురై, దిగులుతోనే చనిపోయారు. నా వరం బాధ చూడలేక వారికి నా దగ్గరకి తెచ్చుకోవాలని ఎన్నోసార్లు అనుకున్నాను. కానీ, నాకున్న బాధ్యతలు నన్ను ఆ పని చేయనివ్వలేదు. అందుకే, వరలక్ష్మి ఆ వృద్ధులలో తన తల్లిదండ్రులను చూసుకుంటుంటే నేనెప్పుడూ అడ్డు చెప్పలేదు.

వరలక్ష్మి తన తల్లి గారి ఇంటి నుండి పెద్దగా పెట్టుపో తలకు నోచుకోలేదు. పెద్ద సంసారం కాబట్టి నేను కొనిచ్చేది తక్కువే.అందుకే,'మనం కాస్త కుదురుకున్నాక దానధర్మాల సంగతి చూద్దాం వరం.కనీసం ఇలాంటి ప్రత్యేక సందర్భాలకు అయినా చీరలో, నగో కొనుక్కో'అనేవాడిని.

'మనిషికి చావు చెప్పి రాదు కదండీ.మంచి పనిని దాట వేసుకుంటూ వెళితే మన చివరి రోజులలో ఒకరి చేత సేవ చేయించుకునే పరిస్థితి కోస్తాం గానీ,ఒకరికి సేవ చేసే సత్తువ మనకు ఎక్కడుంటుంది?'అనేది.

అలాంటి ఉన్నత భావాలు ఉన్న నా వరం పుట్టినరోజులలో రానుంది. ఆమె పేరు మీద కొందరు వృద్ధులకు అన్న దానం చేయాలని ఉంది. శివరాం అడిగితే చక్కని సలహాలు

చెబుతాడు అనిపించింది. అందునా వాడిని చూసి కూడా చాలా రోజులు అయింది.శివరాం పెరట్లో మామిడి చెట్టు కింద కబుర్లు అనుకోగానే, నా అడుగులు ఉత్సాహంగా వాళ్ళ ఇంటి వైపు పడ్డాయి.

***

శివరాం ఇంటి గేటు తీసే ఉంది.కానీ, ఇంటికున్న తాళం నన్ను వెక్కిరించింది.నిరాశగా వెనక్కి మళ్ళుతూ యథాలాపంగా మామిడి చెట్టు వైపు చూశాను.ఆశ్చర్యం! అక్కడ మామిడి చెట్టు లేదు. ఆ స్థానంలో ఓ పాత రేకుల షెడ్డు వెలిసింది. దగ్గరికి వెళ్ళి చూద్దును కదా, షెడ్డు లోపల ఒక నులక మంచం. దానిమీద మూలుగుతున్న ఒక ఆకారం. పోల్చుకునే ప్రయత్నం చేశాను. ఒక్క సారిగా గుండె ఆగి నట్టుయింది. అది శివరాం!

'శివా' అని పిలిచాను.

పిలుపు నూతిలోంచి వచ్చినట్లు నాది నాకే వినిపించలేదు. కానీ వాడికి వినిపించింది. బలవంతంగా కళ్ళు తెరిచాడు.వాడి కళ్ళలో తడి.

జారిపోయే గుండెను చిక్కబట్టుకొని అడిగాను'ఎలా ఉన్నావు రా?' అని.

అక్కడ పరిస్థితి చూసి కూడా నేను అలాంటి ప్రశ్న వెయ్యొచ్చా?ఉహు.....మన దురదృష్టం ఏంటో గాని ఆప్తుల దగ్గరే అవసరమైన మాటలకు కరువు వస్తుంది.

వాడి నుండి సమాధానాన్ని ఆశించకుండా'ఏమైనా తిన్నావా?' అని అడిగాను.

తలతిప్పి చూపాడు.పాత స్టూల్ పైన ఒక పళ్లెంలో అన్నం,కూర ఆ పక్కనే నీళ్లు పెట్టి ఉన్నాయి.

'నేను వంటింట్లోకి కూడా వెళ్లాల్సిన అవసరం లేదు రా! మా కోడలే ప్లేట్ చేతి కందిస్తుంది అని శివరాం గొప్పగా చెప్పే వాడు. అంటే ఇలాగా! వంటింట్లో ఏం ఖర్మ.... వాడినసలు ఇంట్లోకే రానీయడం లేదు వాడి కొడుకు, కోడలూ.

నాకు ఇప్పుడిప్పుడే విషయం కాస్త అర్థమవుతోంది.శివరాం భార్య పోయాక టైంకి తిండి పెట్టే వారూ, మందలించేవారు లేక సిగరెట్లకూ, మందుకూ అలవాటు పడ్డాడు. అది కాస్తా,జబ్బు పేరుతో వాడిని మంచం పట్టించింది. అందుకే వాడు ఈరోజు ఈ పరిస్థితిలో ఉన్నాడు.

'కనీసం నీ కొడుక్కెనా నీకుయ ట్రీట్మెంట్ ఇప్పించి, నిన్ను జాగ్రతగా చూసుకోవాలని లేదా రా?' అన్నాను బాధగా .

'నా గురించి బాధపడడానికి నీలా నా కొడుక్కి ఉద్యోగం ఇప్పించ లేదు ఇల్లు కూడా కట్టించలేదు కదరా' అన్నాడు అంతకన్నా బాధగా.

నిజానికి తండ్రీ కొడుకుల మధ్య ఉండాల్సింది బాంధవ్యమా లేక వ్యాపారమా? కొద్దిసేపు మా మధ్య మౌనం రాజ్యమేలింది. వాడి మాలల వెనక ఉన్న పరమార్థం లోకి

**'నేను వంటింట్లోకి కూడా వెళ్లాల్సిన అవసరం లేదు రా! మా కోడలే ప్లేట్ చేతి కందిస్తుంది అని శివరాం గొప్పగా చెప్పే వాడు. అంటే ఇలాగా! వంటింట్లో ఏం ఖర్మ.... వాడినసలు ఇంట్లోకే రానీయడం లేదు వాడి కొడుకు, కోడలూ.**

వెళితే....నిజానికి నేనో డయాబెటిక్ పేషంట్‌ని. పదేళ్ల కిందటే నాకు చూపు మందగించింది. చేసేది డీఈవో ఆఫీసులో ఉద్యోగం. ఊపిరి సలపని పని ఒక్కోసారి కళ్ళు తిరిగి పడిపోయే వాడిని. ఆఫీసులో దగ్గరే ఉండి నా బాధ చూసిన వాడు కాబట్టి శివరాం, నా భార్య సహాయంతో నచ్చజెప్పి నా చేత బలవంతంగా వాలంటరీ రిటైర్మెంట్ ఇప్పించాడు. నా స్థానంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ అయిన నా కొడుకు ఒక చిన్న పోస్టుతో ప్రభుత్వ ఉద్యోగిగా మారాడు.

శివరాం బలవంతం మీద రిటైర్మెంట్ తర్వాత వచ్చిన డబ్బులతో శివరాం ఉండే కాలనీలోనే ఒక కొత్త ఇల్లు కొని అందులో ప్రవేశించడం జరిగింది. నా కోసం ఇంత చేసిన శివరాం ఇలాంటి పరిస్థితికి రావడానికి ఒక విధంగా నేను కూడా కారణమేమో! కనీసం తన ఒంటరితనాన్ని దూరంగా చేసే ప్రయత్నం అన్నా నేను చేసి ఉండాల్సింది అనిపించింది. శివరాంను లేపి బలవంతంగా వాడి చేత రెండు ముద్దులు అన్నం తినిపించి, కబుర్లు చెబుతూ వాడు నిద్ర లోకి జారుకున్నాక ఇంటి బాట పట్టాను. శివరాం కొడుకుని గట్టిగా మందలించి మార్చాలని, వాడి సమస్యకో పరిష్కార మార్గం వెతకాలని ఆ క్షణమే గట్టిగా నిర్ణయించుకున్నాను.

' ఇంటికి వెళ్లేసరికి నా కోడలు వందన గుమ్మంలో నాకోసమే ఎదురు చూస్తుంది.'ఎక్కడికి వెళ్లారు మామయ్యా పొద్దుపోయింది రండి. భోం చేద్దురు' అంది. 'శివరాం ఆరోగ్యం బొత్తిగా బాగా లేదమ్మా చూడడానికి వెళ్ళాను'అన్నాను.

' అంతకుమించి అక్కడి విషయాలేవీ తనతో చెప్పాలనిపించలేదు.(ఒక విధంగా చెబితే నా కోడలు కూడా సుమ లా మారిపోతుందని భయం వల్ల కావచ్చు )

భోజనం అయ్యాక కాస్త కునుకు తీద్దాం అనుకున్నాను. కానీ, శివరాం గురించిన ఆలోచనలు నాకు నిద్రను దూరం చేశాయి. లేచి టీవీ చూద్దాం అనుకున్నా.మనసు దాని మీద కూడా లగ్నం కావడం లేదు.

'మామయ్యా!కాస్త ఏమనుకోకుండా రాత్రి వంట కి ఏమైనా కూరగాయలు పట్టుకు రాగలరా?' అంది మా కోడలు.

నేను ఖాళీగా కూర్చోవడం వీళ్ళకు నచ్చదు.ఒక్క ఫోన్ చేస్తే చాలు....నా కొడుకు ఆఫీసునుండి వచ్చేటప్పుడు కావలసినవి పట్టుకొస్తాడు గా! ఉహు..... ఏం చేస్తాను. మారు మాట్లాడకుండా చెప్పులు వేసుకొని, బ్యాగ్ తీసుకొని మార్కెట్కు బయలుదేరాను.

నా వరలక్ష్మి ఉన్నప్పుడు నన్ను ఒక్క పని చేయనిచ్చేది కాదు. ఆఫీసు, టీవీ, శివరాం....ఈ మూడింటి తోనే పొద్దు గడిచిపోయేది. ఏ మాత్రం ఆలోచించకుండా పని మీద పని చెప్పేస్తుందే.....వందన! తాను పరాయి పిల్లేం కాదు. స్వయానా నా చెల్లెలు కూతురే.మా కొత్త ఇంటి గృహ ప్రవేశానికి అని వచ్చి, మా బావ గారు తన కూతురు వందన ను నా కొడుకు సుధీర్ కు చేసుకొమని అడిగాడు. స్వయానా నా చెల్లెలి భర్త అడిగే సరికి కాదనలేకపోయాను . నా మాటకు విలువిచ్చి (నాకప్పుడు అలా అనిపించింది) సుధీర్ వందన మెడలో తాళి కట్టాడు. కానీ, ఆ తర్వాతే తెలిసింది బంధువుల మాటల మధ్య. సుధీర్, వందన ఒకరి నొకరు ఇష్టపడ్డారనీ, మా వాడు తన మేనత్తను మామని కలుసుకొని పెళ్లి విషయం నాతో మాట్లాడమని ప్రాధేయ పడ్డాడు అనీ. వరలక్ష్మి కి సుధీర్ పై చాలా నమ్మకం. కానీ, వాడిలో నాకు స్వార్థమే ఎక్కువ పాలు కనిపించేది. ఈ సంఘటన వాడి మీద ఉన్న నా అభిప్రాయానికి బలాన్నిచ్చింది.

ఈ విషయాలన్నీ వరలక్ష్మితో చెబుతూ అన్నాను'చూడు వరం! నేను చెప్పాను కదా....నా అనుమానం ఏమంటే ఈ పెళ్లి వెనక ఉన్నట్టే నా రిటర్మెంట్ వల్ల వచ్చిన డబ్బులతో ఇల్లు కొనడం వెనుక కూడా వీడి హస్తం ఉండొచ్చు. వీడి మామ గవర్నమెంట్ ఉద్యోగం ఉంటేనే పిల్లని ఇస్తానని మెలిక పెట్టి ఉండవచ్చు.పిచ్చిగా నువ్వు ఆ శివరాం గాడు వాడి ట్రాప్ లో పడి నాకు ఎసరు పెట్టారు అన్నాను అక్కసుగా.

'ఆపండి! నోటికి ఎంత మాట ఒస్తే అంత అనడమే. పెళ్లి విషయం డైరెక్టుగా మనతో చెప్పేందుకు వాడు భయపడి ఉండొచ్చు కదా! ఇక మీ రిటైర్మెంట్, ఇల్లు కొనడం వంటి విషయాలు నేను, శివరాం అన్నయ్య కలిసి ఆలోచించి తీసుకున్న నిర్ణయాలు.ప్రతిదీ భూతద్దంలో చూస్తారెందుకు?' అంటూ గయ్యిమని లేచింది నా పైకి. తల్లి మనసు తప్పుగా ఎలా ఆలోచిస్తుంది చెప్పండి.

***

తెల్లవారితే వరలక్ష్మి జయంతి. ఆ రోజున రాత్రి నా మనువడు, మనవరాలితో హోం వర్క్ చేయించి, వారికి చెరోపక్క పడుకోబెట్టుకెని కథలు చెబుతున్నాను. గుమ్మం దగ్గర అలికిడి. 'నాన్న' అన్న పిలుపు వినిపించింది.

నిద్రలోకి జారుకున్న పిల్లల్ని మెల్లగా విడిపించుకుని లేచి, లైట్ వేసి చూసాను. సుధీర్! చేతిలో ఏదో కవర్ పట్టుకొని నిలబడి ఉన్నాడు.

'నాన్న ఈ అగ్రిమెంట్ చదివి నేను ఇంటు మార్క్ పెట్టిన చోట సంతకాలు చేయండి. ఇదిగో మీ కళ్ళజోడు' అంటూ చేతికందించి నా ముఖంలో కదిలే భావాలను కూడా గమనించకుండా వెళ్ళిపోయాడు.

అవును! ఇది నేను ఊహించిందే. రెండు రోజుల కిందట సుధీర్, వందన కలిసి మా

ఈ విషయాలన్నీ వరలక్ష్మితో చెబుతూ అన్నాను'చూడు వరం! నేను చెప్పాను కదా....నా అనుమానం ఏమంటే ఈ పెళ్లి వెనక ఉన్నట్టే నా రిటర్మెంట్ వల్ల వచ్చిన డబ్బులతో ఇల్లు కొనడం వెనుక కూడా వీడి హస్తం ఉండొచ్చు. వీడి మామ గవర్నమెంట్ ఉద్యోగం ఉంటేనే పిల్లని ఇస్తానని మెలిక పెట్టి ఉండవచ్చు.పిచ్చిగా నువ్వు ఆ శివరాం గాడు వాడి ట్రాప్ లో పడి నాకు ఎసరు పెట్టారు అన్నాను అక్కసుగా.

సొంతూరు వెళ్లి వచ్చారు. ఎందుకో,ఏమిటో వారు నాతో చెప్పలేదు.వారి సంభాషణ మధ్య పాత ఇంటి ప్రస్తావన లీలగా వినిపించింది. అది అమ్మకానికి పెట్టి ఉంటారు అనుకున్నాను. దాని తాలూకు రిజిస్ట్రేషన్ పేపర్లన్నీ వాడి దగ్గరే ఉన్నాయి. వాళ్లమ్మే ఇచ్చింది వాడికి. అంత గుడ్డి నమ్మకం తనది. ఈ రోజుతో ఆ ఇంటితో నా రుణం తీరబోతోంది. కొడుకే పరాయి వాడు అయినప్పుడు నాకంటూ సొంత ఆస్తులు ఎందుకని భారమైన గుండెతో అగ్రిమెంట్ పేపర్లు చదవకుండానే మార్క్ పెట్టిన చొట సంతకాలు చేసేశాను.

***

ఉదయం లేవగానే అన్యమస్కం గానే నా పనులన్ని ముగిస్తున్నాను. మాటమాత్రంగానైనా సుధీర్ తన తల్లి ని గుర్తు చేసుకుంటాడు అని ఎదురుచూస్తున్న. ఉహు....నాకు అక్కడ నిరాశే ఎదురుయింది.'నాన్న మన ఊరు వెళ్దాం బయలుదేర' మన్నాడు. 'ఎందుకు? ఏమిటి?' అని ప్రశ్నలు వేసేంత సమయం కూడా ఉండదక్కడ.ముందు నుండైనా మా మధ్య పొడిపొడి మాటలే.

అయినా తెలియనిదేముంది. తల్లి పుట్టినరోజు కానుకగా కొడుకు ఇంటిని,తల్లిదండ్రుల జ్ఞాపకాలనూ అమ్మేస్తున్నాడు. ఇంతకన్నా దారుణం ఇంకేముంటుంది. ఆ క్షణంలో శివరాం కొబుక్కి పెద్దగా తేడా లేదని పించింది.వాడు తండ్రి రోగానికి భయపడి తండ్రిని దూరం చేసుకుంటే,వీడు డబ్బుకు ఆశపడి మా జ్ఞాపకాలనే మానుండి దూరం చేస్తున్నాడు.

***

ఊళ్లోకి దిగగానే ఊరి పెద్దలు, నా బాల్య స్నేహితులు చాలా మంది నా ,చుట్టూ గుమిగూడారు. మంచి పని చేశాను అంటూ అభినందిస్తుంటే అర్థం కాక వారితో పాటు అడుగులు కలిపాను.

నేను ఆశ్చర్యం లోంచి తేరుకునేలోపే మా ఇల్లు వచ్చేసింది. ఇల్లు చక్కగా పూలతో అలంకరించి ఉంది. మా మెయిన్ డోర్ కి ఎర్రని రిబ్బన్ కట్టి ఉంది. గుమ్మం పైన పెద్ద అక్షరాలతో ఒక బోర్డు, కళ్ళజోడు సరి చేసుకుంటూ చదివే ప్రయత్నం చేశాను. ' వరలక్ష్మి

**ఇదంతా ఆయన కోసమే వందనా! శివరాం అంకుల్ పరిస్థితి చూసావా? ఆంటీ చనిపోయాక ఆయనతో మాట్లాడే వారు లేక, ఆయన కోడలు పిల్లల్ని కూడా దగ్గరికి రానీయక పోవడంతో ఒంటరితనం భరించలేక ఆయన వ్యసనాలకు దగ్గరయ్యారు. నేను నాన్నకు ఎప్పటికి అలాంటి పరిస్థితి రానివ్వను.**

వృద్ధాశ్రమం'.

ఇది కలా.....నిజమా.....! సుధీర్ వైపు చూశాను. పల్లెంతో నా దగ్గరకి వచ్చాడు. అందులో చిన్న కత్తెర. కానీమ్మనీ చూపులతోనే సైగ చేశాడు. వణుకుతున్న చేతులతో రిబ్బన్ కత్తిరించి లోపలికి అడుగుపెట్టాను.ఎదురుగా గోడకి మా భార్య భర్తల ది పెద్ద సైజు ఫోటో తగిలించి ఉంది.

సుధీర్ ఒక నడివయసు జంటను నా దగ్గరికి తీసుకొని వచ్చి పరిచయం చేస్తూ చెప్పాడు–'ఈ వృద్ధాశ్రమాన్ని ఇకముందు నడిపేది వీళ్లే నాన్నా! వీరి గురించి ఎంత చెప్పినా తక్కువే. వీరి ఆస్తిపాస్తులు, ఉద్యోగాలు చిన్నవైనా ఆశయం మాత్రం పెద్దది. కూలీనాలీ చేసుకుని పూట గడుపుకునే కుటుంబాలలో వాళ్లు బతికేదే కష్టం, ఇక వాళ్ల ఇళ్లలోని ముసలివాళ్లు మధ్యాహ్న భోజనం లేక అల్లాడిపోతున్నారు. అలాంటివారికి వీళ్ళిద్దరూ తమ జీతాలు వెచ్చించి, ఆస్తులు అమ్మి తిండి పెడుతున్నారు. ఎవరూ లేని వృద్ధులను చేర దీస్తున్నారు. దాతల సాయం కోరుతూ పేపర్లో వీళ్ళ పై వచ్చిన ఆర్టికల్ చదివాను నేను. అమ్మ వృద్ధుల బాగోగుల కోసం ఎంత తపన పడేదో మనకు తెలుసు కదా! నాయనమ్మ, తాతయ్య పోయాక ఈ ఇల్లు ఎలాగూ ఖాళీ గానే ఉంది కదా.....వీళ్ళు ఉండేది కూడా మన జిల్లానే కాబట్టి, మన వంతు సాయంగా ఈ ఇంటిని వృద్ధాశ్రమంగా వాడుకోవడానికి ఇచ్చాను. మీ జ్ఞాపకాలను మరమ్మతుల పేరుతో మరుగు పరచ కూడదని ఇంటికి మార్పులు చేర్పులు చేయకూడదనే నిబంధనను అగ్రిమెంట్‌లో చేర్చాను. అమ్మ పుట్టినరోజు జ్ఞాపకంగా ఉండిపోవాలని ఈ రోజే ప్రారంభం చేయించాను . ఇక ముందు కూడా ఈ ఆశ్రమం నడవడానికి మన చేతనైనంత సాయం చేద్దాం. అమ్మ పేరు మీద అన్నదాన కార్యక్రమం కూడా ఉంది నాన్న.....'ఇంకా నా కొడుకు ఏదో చెబుతూనే ఉన్నాడు. వాడు నాతో మనసు విప్పి మాట్లాడుతున్నాడు మొదటిసారిగా! నేను వాడిని అర్థం చేసేకునే ప్రయత్నం చేయడం కూడా మొదటిసారే!

***

ఆ రాత్రి నాకు నిద్ర పట్టడం గగనమే అయింది. అదేంటో మనిషికి పట్టరాని సంతోషం కలిగినా,భరించలేని బాధ కలిగిన నిద్రే దూరమవుతుంది. బాగా అలసిపోయాను కదా....నిద్రపోయి ఉంటాను అనుకొని సుధీర్, వందన నా గురించియే మాట్లాడుకుంటున్నారు.

'మీ నాన్నగారి గురించి మీరెంత ఆలోచిస్తారో ఈ రోజే తెలిసిందండి. మరి ఎందుకండీ

ఆయననలా శ్రమ పెట్టడం . పిల్లలకు బయట ట్యూషన్ మాన్పించి ఆయన చేతే చదువు చెప్పిస్తున్నారు. అడపాదడపా ఆయనకు పనులు చెప్పమని నన్ను కూడా పురమాయిస్తున్నారు. మామయ్య మన గురించి తప్పుగా అనుకుంటున్నారేమో' అంటూ బాధపడుతోంది వందన.

'ఇదంతా ఆయన కోసమే వందనా! శివరాం అంకుల్ పరిస్థితి చూసావా? ఆంటీ చనిపోయాక ఆయనతో మాట్లాడే వారు లేక, ఆయన కోడలు పిల్లల్ని కూడా దగ్గరికి రానీయక పోవడంతో ఒంటరితనం భరించలేక ఆయన వ్యసనాలకు దగ్గరయ్యారు. నేను నాన్నకు ఎప్పటికి అలాంటి పరిస్థితి రానివ్వను. అందుకే పిల్లల్ని ఆయనకు దగ్గర చేసే ప్రయత్నం చేస్తున్నాను. నువ్వేదో వండి పెడితే ఆయన కాదనలేక తినకూడదని ఇష్టమైనది తెచ్చుకుంటారని కూరగాయలు తెచ్చే పని ఆయనకే అప్పగించమంటున్నాను. ఆయన దిగులుగా ఉన్నట్టు కనబడితే ఏదో ఒక పని చెప్పి మనసును డైవర్ట్ చేయమని నీకు చెబుతాను.

'వృద్ధాశ్రమం' వల్ల అమ్మ ఆశయం నెరవేరింది. శివరాం అంకుల్ ఇష్టపడితే, ఆయన్ని కూడా తీరుతుంది. ఇలాంటి విషయాలు ఆయనతో సూటిగా చెప్పలేక ఆయనను కష్టపెడుతున్నాను. నేనేమైనా తప్పు చేస్తున్నానా వందనా?' అని అడుగుతున్నాడు సుధీర్.

నా కోడలు ఏం సమాధానం చెప్పిందో వినలేదు గానీ, నేను మాత్రం నీళ్లతో నిండిన నా కళ్ళను తుడుచుకుంటూ'తప్పు నీది కాదు రా ,నాదే. ఎప్పుడూ నీ గురించి తప్పుగానే ఆలోచించాను. మనసు విప్పి మాట్లాడే ప్రయత్నం చేయలేదు. నన్ను క్షమించు'అనుకున్నాను మనసులో.

! ఎదురుగా ఫోటోలో నా భార్య నవ్వుతూ,వాడు మన పెంపకంలో పెరిగిన వాడండి.వాడెప్పుడు తప్పు చేయడు అన్నట్టు అనిపించింది.పిల్లలిద్దరిని గుండెలకు అదుముకొని తృప్తిగా నిద్రలోకి జారుకున్నాను.

## పద్మావతి తల్లోజు

పద్మావతి తల్లోజు.. కలం పేరు చింతపట్ల పద్మా రమేష్.
నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి గ్రామం. ఎంఏ తెలుగు చేశారు.
ఇప్పటి వరకూ వివిధ పత్రికలలో దాదాపు 10కథలు,20కి పైగా కవితలు
అచ్చయ్యాయి. దాదాపు 50 కి పైగా కవితలు రాశారు.

# గంగిరెద్దు.. గానుగెద్దు

**సుగంధ శ్రీనివాస్**

**7730065637**

'.. ఇప్పుడు మీకోసం మంగ్లీ పాడిన సూపర్ హిట్ సాంగ్..!' ఎఫ్ఎం రేడియో..

'డుడ్డ్డ్.. డుడ్డ్డ్డ్డు.. డుడ్డ్డ్.. వాడు నడిపే బండీ.. రాయల్ ఎన్ఫీల్డు..' అంటూ పాట మారు మోగుతంది.

'తమ్మీ.. ఆపురా బై!' సటుక్కున అన్నాన్నేను.

అప్పుడు.. మంగళి మహేష్ షాప్లో హెయిర్ కటింగ్ చేయించుకుంటున్న.

చేసే కటింగ్ ఆపి.. 'ఎందుకు?' అన్నట్లు చూసిండు.

'పాట బంజెయ్.. కటింగ్ కాదు!'

'ఓహో.. పాట అద్దంటున్నవా? ఈ పాట ఇంటుంటే హుషారొస్తదన్నా..! నిజంగ బుల్లెటెక్కినంత ఊపొస్తది'

ఆపడమెందుకన్నట్లు పరోక్షంగా కన్విన్స్ చేస్తున్నడు మహేష్.

కోపంగా ఒక చూపు చూసిన.. అంతే!

'ఆఁ! సరే సరే..' అని తలూపుకొంటూ ఎఫ్ఎం ఆపేసిండు.

బాగా గరం మీదున్న పెనం మీద నీళ్లు జల్లితే ఎట్లుంటది? అగో.. గట్ల తుకతుక ఉడుకుతంది నా మనసు.

దురదగొండి కొమ్మతోని వీపుల రాసినట్లు, యాసంగి కళ్లంల వరిగడ్డి దులుపుతున్నట్లు 'సిటసిట' మంటంది.

నా చెవులు మళ్లీ వినకూడని సప్పుడు విన్నట్లు నా ముఖమంతా చిట్లించుకొని చూస్తున్నా..

'..డుడ్‌డ్‌డ్.. డుడ్‌డ్‌డ్డు.. డుడ్‌డ్‌డ్..'

మళ్లీ బుల్లెట్టు సౌండ్.. ఈసారి నిజమైందే! మారాజు లెక్క ఫోజుపెట్టి పోతండు వాడు.

చేసే కటింగ్ ఆపి, గుడ్లప్పగించి చూస్తుండు మహేష్. నాకు కోపం పెరిగిపోతంది.

'అన్నా! ఏం బండి పో! ఏం బతుకు పో!' అనుకుంట స్టయిల్‌గా శాల్యూట్ కొడుతుండు.

'తమ్మీ! పోవాల్నారా..?'

నా గొంతులో కోపం వాడికి చుర్రుమని అంటినట్లుంది.

'రాజన్నా.. అది బుల్లెట్టే! కండ్లతోని సూత్తంటేనే కడుపు నిండిపోతందే..' ఆగమన్నట్లు సూచన అనిపించింది.

కూర్చున్న కుర్చీలకెళ్లి లేచిన.. సగం చేసిన కటింగ్‌తోనే!

గతుక్కుమన్నట్టు ముఖం పెట్టి..

'అన్నా.. ఇయ్యాల నీ మూడ్ మంచిగలేనట్లుంది. గింత కోపం ఎన్నడు రాలే నీకు..' అనుకుంట బతిలాడి కుర్చీల కూసుండబెట్టిండు.

జప్పన్నే కంటింగ్ అయిపోగొట్టిండు.

నిజమే! గింత కోపం నాకెందుకొస్తంది? అది కోపమా? అసహనమా? అవమానమా? చేతగాని తనమా..?

ఇంటికి పోయి తానం జేసినంక పాణం సల్లవడ్డది. కడుపునిండా అన్నం తిని, ఇగ బాయికాడికి పోదమని సైకిల్ ముట్టుకోబోయిన. కరెంట్ షాక్ కొట్టినట్లు దానికి దూరం జరిగిన. 'హీరోహోండా సీడీ100' నా బండి. కాలేజీకి పోయేటప్పుడు కొనుక్కున్న సైకిలేమో గది.. కైకిలికి పోయి సంపాదించిన పైసలతోని కొనుక్కున్న బైక్ ఇది.. బండంటే బండే! ఉన్నదా అంటే.. ఉన్నది.

'డొక్కు బండి' అనుకుంట ఊరుఊరంతా పేర్లవెట్టినా.. నాకు మాత్రం అది 'సిల్' బండి లెక్క.

వేరేవాళ్లు స్టార్టు చేస్తున్నారా.. అన్నట్లు సప్పుడు జెయ్యది. కిక్‌మీద కిక్కు కొట్టంగా.. అప్పుడు 'యజమానే' అని నిర్ధారించుకొని స్టార్ట్ అయితది.

బాయికాడికి బండి (బైక్) మీద పోతంటే ఇంట్లోళ్లు, బయటోళ్లు ఇసిత్రంగ చూస్తుంటరు నన్ను.

'నీ లెక్క బండిని చూసుకుంటే మూడు తరాలదాకా చెక్కు చెదరదిరా!' అంటూ

నా దోస్తుగాళ్లు మజాక్ చేస్తరు.. దీన్ని చూసి.

మరి.. గట్లనే పెరిగిన నేను. నూకల బువ్వ తినుకుంట. శినిగిన అంగీ, లాగులతోని నడిపిచ్చిన శిన్నప్పుడు.. బతుకంతా!

బాయి కాడికిపోయి కరెంటు మోటరు ఆన్‌చేసి, మోదుగచెట్టు నీడల తువ్వాల పరుసుకొని ఒరిగిన. తల ఆకాశం వైపు పెట్టి ఆలోచిస్తున్న..

'నవ్వెటోని ముందట బోర్లవడ్డట్టు' గిట్లయిపాయె నా బతుకు.. ఎంత కొట్లాడితే ఏం లాభం! ఊగీ ఊగీ ఉయ్యాల ఉన్నచోటికచ్చి ఆగినట్టు.. ఇగ నా జన్మ గింతే!'

గతమంతా గిర్రున కండ్లల్ల కదులుడు వెట్టింది.

***

నాకు శిన్నప్పటి సంది సదువంటే పిచ్చి. నాకు నేను శెప్పుకుంటే బాగుండదు గానీ, స్కూలంతా వెతికినా నా అసంటోడు ఇంకోడు లేకుండే..

మా నాయినకు సదువుమీద నమ్మకం లేదు. సదువు పేరుతో సోకులకు పోయి చేతికి రాకుండ యాడ బోతడోనని భయం. చదువు.. మా అసొంటి పేదోళ్లకు 'గాజు గది'లాంటిదే అనుకునేటోడు. అన్నీ కనవడ్తయ్ కనీ, ఏదీ ముట్టుకోలేం కదా.. పెండ్లీడుకొచ్చిన ఇద్దరు బిడ్డలను సాగదోలుడెట్లన్నదే ఆయన ముందటున్న లక్ష్యం.

పది పాస్ కాంగనే ఎవుసం చేసుకుంట, కైకిలి కూలి దొరికినప్పుడు చేసుకుంట ఇంటిపట్టునే ఉండాలన్నది ఆయన ఉద్దేశ్యం. కానీ, నేను ఎవరితో చెప్పిస్తే ఆయన మనసు మారుతదో వాళ్లందరితోని చెప్పి పిచ్చిన.

శివరాఖరున ఒప్పుకొన్నడు. అదీ ఒక ఒప్పందం మీద.. 'ముందుగాల ఎవుసం..'. మా నాయిన పనులు నేను చేస్తే, నా చదువుకు అడ్డు పడడని అర్థమైంది. అది చాలు నాకు. పిట్ట రెక్క చిన్నదైనా ఆకాశం అనంతం కదా.. ఎంతైనా ఎగురవచ్చు.

అప్పుడు తెల్సింది, కోటిగాడు ఏదో పెద్ద కాలేజీలకు పోతండనీ. పైసలు కట్టాలంట. పొట్ట కోస్తే అక్షరం ముక్క కనవడదీ.. 'బార్డర్'ల పాసైనోడు గంత దూరం పోయి పైసలు ఖర్సు వెట్టించి సదువుడవసరమా?

వాడంటే నాకేం కండ్లమంటతనం లేదు. కోపమూ కాదు. వాడికే నామీద ద్వేషం. పక్కోడి అభివృద్ధిని చూసి ఓర్వలేని గుణం వాడిది. నా బాల్యం.. వాడి 'రంకుల' చేష్టలతో ఎంత కష్టపడ్డదో.. అప్పుడు 'పలక' ఇప్పట్లా ఇనుప రేకు కాదు. కిందవడితే పలుగుడే! వాడు దొంగతనంగా నా పలకలను ఎన్ని పగులగొట్టిండో.. కోపమొచ్చి కొనిచ్చుడు బంజేసిండు మా నాయిన. పగిలిన పలక ముక్కలమీదే

**మళ్లీ చేపపిల్లకు ఈదడానికి సముద్రం దొరికింది. ఈసారి కోటిగాడు నేనూ మళ్లీ ఒక్కటే కాలేజీ. వాడు ఇంటర్ మూడేండ్లు తీసుకున్నడు. వాళ్ల నాయిన ఎకరం భూమి అమ్మిండు వీడికోసం. డిగ్రీ.. ఫైనలియర్లో ఉండగా మా తాత కిందిమీద జేసుదు వెట్టిండు. మనువడి లగ్గం చూసి పోతడట.**

రాసుకొనేటోణ్ణి. నన్ను చూసుకుంట నవ్వేటోడు.. కోటి గాడు.

నేను క్లాస్‌ల ఫస్టు. గందుకే చెయ్యెత్తి దెబ్బ కొట్టడానికి చేతులు రాకుండే మా సార్లకు. టీచర్లు నన్ను మెచ్చుకున్నప్పుడల్లా వాడి ముఖం బాగా మాడిపోయిన 'సర్వపిండి' లెక్క అయ్యేది. మా 'ఊటూరు' బడికి చుట్టుపక్కల నాలుగూర్ల నుండి వచ్చేటోళ్లు పోరగాండ్లు. అందరికీ నేనంటే అభిమానమే! వాళ్లంతా నా మేధస్సును గౌరవిస్తుంటే.. వీడొక్కడే నా పేదరికాన్ని ప్రచారం చేయడానికి బడిని 'ప్రదర్శన'శాల జేసెటోడు. నాకు బట్టలు సక్కగా ఉండేటివి కాదు. జేబుకు 'చారాణ' పైసలు గూడ తెల్వది. నేనెవ్వర్నీ నొప్పించేటోన్ని కాదు. దోస్తాన్ల రేణివండ్లో, జాంపండ్లో ఎవరన్నా ఇచ్చినా తీసుకొనేటోన్ని కాదు. గంత మొండిగటం.. మా నాయిన ఆస్తులు సంపాదించి పెట్టకున్నా.. అభిమానంగా బతుకుడు నేర్పిండు.

కోటిగాడికి నా 'తీరు' నచ్చకపొయ్యేది. మా ఊళ్లే కోమటి రామన్న దుకాణం నడిచేది వీని శిరుదిండ్ల కొనుగోళ్లతోనే.. ఏది అడిగితే అది వాని చేతిలో ఉండాల్సిందే! వాళ్లింట్ల కోటిగాని మాటే నడుస్తది.

పదిదాకా వాడెంత టిప్‌టాప్‌గా బడికొచ్చినా.. నా చదువు ముందర 'స్ట్రీట్ లైట్' కింద 'టార్చిలైట్' లెక్కవాడు. నా 'లేని'తనమంతా చదువులో వెతుక్కొని సంపాదించేటోన్ని.

ఇంటర్ టైంల మా పెద్దక్క పెండ్లి జేసినం. నేను ఇంటర్‌ల కాలేజీ టాపర్‌గా వచ్చిన. కానీ, నా డిగ్రీ చదువు ఆగింది.

'నాకు మునుపటి లెక్క సాతనైత లేదు. ఇగ సాలు నీ సదువుడు..' అన్న మా నాయినే ఈసారి గెలిశిండు.

ఏం జేస్తం.. మరి. నాక్కూడా అర్థమైంది. కండ్లళ్ల నీళ్లు కుక్కుకుంట 'సరే' అన్న.

ఇగ సూడు.. కనవడ్డోడల్లా 'ఫెయిలైనవారా.. రాజన్నా' అనుడు వెట్టిండ్రు. పాసై సదువుత లేనంటే మా నాయినకు శిన్నతనమని 'ఫెయిలైన' అన్నట్టు సప్పుడు జేయకుండ ఉండేటోన్ని.

ఆ ఏడాది సదువుకు దూరమైనందుకు ఉక్కిరి బిక్కిరైంది. గొడ్డులెక్క పని జేసినా.. పేర్ల వెట్టుడు, ముసిముసి నవ్వుడు అంతా అర్థమవుడు వెట్టింది.. నాకు.

ఇంతలో చిన్నక్కకు దొరింపైంది. ఆ పైసలు, ఈ పైసలు కలిపి ఓ ఎకరం పొలం తీసేస్తే గానీ పెండ్లికి నిండలేదు.

ఇగ మా నాయిన ఒడ్డుకు వడ్డట్టే! నా 'సదువు' మళ్లా సురువు జేసుడే! ఈసారి వాళ్లో.. వీళ్లో కాదు, నేనే అడిగిన.

'రాజన్నా.. యాడాది ఆపుజేసినంక మల్ల సదువుకుంట అంటన్నవా? బిడ్డా.. అప్పు నీదే! కుప్ప నీదే! బుద్ధిగా పనిచేసుకుంట.. సదువుకుంటె సదువుకో' అన్నడు మా నాయిన.

మళ్లీ చేపపిల్లకు ఈదడానికి సముద్రం దొరికింది. ఈసారి కోటిగాడు నేనూ మళ్లీ ఒక్కటే కాలేజీ. వాడు ఇంటర్ మూడేండ్లు తీసుకున్నడు. వాళ్ల నాయిన ఎకరం భూమి అమ్మిండు వీడికోసం. డిగ్రీ.. ఫైనలియర్లో ఉండగా మా తాత కిందిమీద జేసుడు వెట్టిండు. మనువడి లగ్గం చూసి పోతడట.

'దేవుడా.. నా సదువుకు మళ్లీ ఓ గండం' అనుకున్న.

కలిసొచ్చే కాలానికి నడిసొచ్చే అల్లుడు లెక్క మా మామకు దొరికి పోయిన. మా అమ్మకు తమ్ముడి బిడ్డనే కోడలైందని సంబురం. మా నాయినకు కొడుకు పెండ్లికూడా జేసిన అని నిమ్మలం. ముసలోడే గెలిశిండు. గింత జేసినా మా తాత డిఫెన్స్ ఆడుకుంట, ఆడుకుంట.. మొన్నమొన్ననే ఔటయ్యిండు. గిదెంత మోసమో కదా! మా తాతకు నేనేం అన్యాయం జేసిన!

***

అటు సంసారం, ఇటు సదువు, ఇంకా వ్యవసాయం. అయినా డిగ్రీ ఫస్టు క్లాసులో పాసైన. కానీ, యూనివర్సిటీల చదువాలనుకున్న నా ఆశ తీరలేదు. బాధ్యతల మధ్య 'బందీ'ని కదా! నేను డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌ల పీజీల జాయినయ్యా. కోటిగాడు డిగ్రీ పాస్ కాలేక వాళ్ల మామల దగ్గరికి పోయిండు. నా చదువు పూ–ర్తవుతుండగానే మా నాయిన అమ్మిన ఎకరం పొలంతోపాటు ఇంకో మూడెకరాల పొలం కొన్నం. ఇపుడు మా నాయిన ఆరెకరాల ఆసామి!

ఇగ 'నౌకరీ'మీద మనసు వెట్టుకొని ఇంటిపట్టునే చదివితే.. రెండుసార్లు

ఇంటర్వ్యూ చేసిన. కానీ, నౌకరీ చేతికి రాలేదు. పచ్చ పెన్నుమీద చిన్నప్పటి సందీ నా కన్ను వడ్డది. కానీ, అందలే! గిట్ల.. నా బతుకేదో నేను బతుకుతున్న. అయినా కోటిగాడు నామీద బురద జల్లుడు మానుకోలేదు. వాడి దర్పం, వాడి సుఖభోగాలు, జల్సాలు చూసి నేనెప్పుడూ బాధ పడలే. నా తొవ్వ నాదే! నా కష్టం నాదే!

నిన్న జెండా గద్దెకాడ కూసొని.. 'రాజుగాడు గంత సదివి బురద పిసుక్కుంటండు. అన్నిట్ల ఫస్టు అచ్చినోడు పొలంల పల్టీలు కొడుతండు. బతుకుడు అందరికి రాదురా.. నన్ను సూడుర్రి. ఇగో గీ ప్యాంట్‌కే ఐదువేలు తెలుసారా? నా బండికి రెండు లచ్చలు. వాడు ఇంకెప్పుడు మారుతడో ఏమో? వాడెందుల కల్వడు. రూపాయి ఖర్చు పెట్టడు..' అని నన్నక్కడ అందరి ముందట గంజిలీగను తీసేసినట్లు తీసేసిండట.

మనసంతా ఖరాబైంది. గింత కష్టపడితి, చదివితి, పని చేస్తి, చేతులు కాయలు కాసేటట్లు చెమటడ్పితి. ఏం లాభం? కష్టమంటే తెల్వని కోటి గాడు హీరో లెక్క తిరుగవట్టే! ఎప్పుడూ నా దరికి రాని గీ 'చిన్నతనం' నిన్నటి సంది సంపుతంది.

ఉలిక్కిపడి లేచి కూసున్న.

'ఓ సారు.. ఓ సారూ..'

తలాపులో కూసొని పిలుస్తున్నడు.. సీపల్లె కొమురయ్య. గొర్లకు నీళ్లు పెట్టడానికి అచ్చినట్టున్నడు.

'మంచి నిద్ర తీసినవ్ గానీ, బాయిల నీళ్లొడిసినయ్. మోటరు మొత్తుకుంటందని బంజేసిన..' అన్నడు.

'సరే' అన్నట్లు తలూపిన.

'నీ రంది ఒడువని ముచ్చట. మా లెక్క ఏలుముద్ర కాదాయే. గింత సదివి నౌకరు రాకపాయె. ఇక నీ పాణానికి తుర్తిలేదు పో..' అన్నడు.

అది పరామర్శనా..? విమర్శనా..? వినీవినీ నాకు చెవులు చిల్లులు వడ్డయ్. ఓ సావు నవ్వు నవ్వి నిట్టూర్పు వినబడకుండా లేచి ఇంటి ముఖం పట్టిన.

ఇంటికొచ్చి బండి ఆపంగనే.

'చెన్నయ్య సార్ రమ్మన్నడట బిడ్డా..!' అంటూ దగ్గరికొచ్చి చెప్పిండు మా నాయిన.

'ఎలక్షన్ల టైం గదా! ఏదో పనుంటదిలే..' అని ముభావంగా అనుకుంట ఇంట్లకు పోయిన.

'నిన్నూ, నన్నూ.. ఇద్దరినీ రమ్మనడట..'

.. చెన్నయ్య సార్ మా ఊరి సర్పంచ్. అంతకంటే ముందు మాకు సదువు చెప్పిన సార్. మా ఊరు సారే! రిటైర్ అయినంక ఊరు ఊరంతా కల్సి సారును సర్పంచ్‌గా ఉండుమని ఏకగ్రీవం చేసుకున్నరు. సార్ పుణ్యంతోనే ఊర్లో అందరూ కనీసం పదిదాకా సదివిండ్రు. ఇగ నాకైతే సార్ దేవుడే! నా సదువాగినప్పుడు ధైర్యం జెప్పిండు. పదిల మండలంల ఫస్టొస్తే నాకు కొత్త డ్రెస్సు కుట్టిచ్చిండు.

'పది' అయినంక ఇంటర్ వద్దని మా నాయిన అన్నప్పుడు ఈ సారు మాటమీదనే మళ్ల మనసు మార్చుకున్నడు. ఏం ముచ్చటకు రమ్మన్నడో ఆలోచిస్తూ.. సార్ ఇంటి ముందట బండి ఆపిన. మా నాయిన దిగిండు. ఊళ్లె పెద్ద మనుషులంతా అక్కడే ఉన్నరు. మమ్ములను చూడంగానే చిన్నగ నవ్వుకుంట లేచి నిలవడ్డరు.

'గీ మర్యాదేంది..?' నాకేం అర్థం కాలేదు.

నాలుగైదు నిమిషాలకు అక్కడున్నోళ్లంతా వెళ్లిపోయిన్రు. అప్పటిదాకా సార్ ఒక్క మాటకూడా పలుకలే! వాళ్లంతా పోంగనే.. 'కూసో' అన్నట్లు చూసిండు. చాయ్ తెప్పిచ్చిండు. ముగ్గురం తాగుతున్నం.

'రాజన్నా.. కనవడ్తలేవు ఏందిరా? ఈ నడుమ.. శిన్నబోయి కనవడుతున్నవ్.. ఏమన్నా అనుకున్నరా ఏంది? మీ అయ్యా కొడుకులు..' చిరునవ్వు నవ్వుకుంట అన్నడు సార్.

నిన్న జరిగిందంతా సారుకు చెప్పిన. ప్రశాంతంగా విని, దీర్ఘంగా ఓ నిట్టూర్పు విడిచిండు.

'నువ్వింకా శిన్నపిల్లగాని లెక్క చేస్తున్నవేందిరా? కోటి గాడన్నడు. శీను గాడన్నడని, కుక్కల మొరుగుడుకు బాధ పడుతరారా? అసలు నీకూ ఆనికి పోలికుందారా ఏమన్న..?'

నేను తల దించుకొని వింటున్న.

'.. వానిదీ ఓ బతుకారా..? చదువు పేరు జెప్పి ఉన్న పొలం హారతి కర్పూరం కానిచ్చిండు. మామల దగ్గరికి పోయి ఏదో ఉద్ధరిత్తడనుకుంటే తన్నుల వడి ఇక్కడికొచ్చిండు. పూలరంగని లెక్క తిరుగుతూ ఊరంతా అప్పులు జేసిండు. కన్న తండ్రనికూడా చూడకుండా వాళ్ల నాయినను కొట్టిండు. అత్తగారు గట్టిగుంటే చాలని.. సింగరేణి నౌకరున్నోని అందులోనూ ఒక్క బిడ్డే ఉన్న 'సంబంధం' కలుపుకొని లగ్గం జేసుకున్నడు. అత్తగారింట్ల వాని బతుకు నీకు తెల్వది గానీ,

బైటనే వాని బడాయి. వట్టి బానిస బతుకు బతుకుతుండు. వీసమెత్తు పని చేయనోడట.. నేను వీరాధి వీరున్నని డప్పు కొట్టుకున్నడట. వాళ్ల మామ పైసలు ఎత్తుకొచ్చి ఆ బండి కొన్నడట.. వారం కిందటే వాని మామ నాకు ఫోన్ చేసి ఏడ్వబట్టిండు..'

సార్ చెప్పుతుంటే.. నేను బండబారి పోయి వింటున్న..

'.. వాడు ఓడిపోతూ తన వాళ్లందరినీ ఓడిస్తూ బతుకుతుండు. నువ్వు గెలుస్తూ.. నీ వాళ్లను గెలిపిస్తూ జీవిస్తున్నవ్. అరేయ్.. రాజన్నా! లోకమన్నప్పుడు నిన్ను పొగిడేటోడుంటడు.. తిట్టెటోడూ ఉంటడు. వాడేమో అన్నడని బాధ పడకు.. నలుగురు నాలాంటోళ్లు జమై మాట్లాడుకుంటుంటే.. మీ నాయిన జోలి తప్పకుండ వస్తది. ఈ ఊళ్లె మీ నాయినంత అదృష్టవంతుడు లేడని ముచ్చట పెట్టుకుంటున్నరు..' నన్నే చూస్తున్నాడు సార్.

రెండు, మూడు నిమిషాలు మాటలకు బదులు మౌనం.. అక్కడ. ఏదో ఫైల్ తయారు చేస్తున్నడు సార్.

'వచ్చినంక నా ముచ్చట బదులు నీ ముచ్చట నడిసె.. నీకు ఒక మంచి పని ఇస్తున్న.. చేస్తవా..?'

'చేస్తా సార్! మీ మాట కాదంటనా..?'

నా చేతిలో ఒక పేపర్ పెట్టి.. 'సదువు' అన్నడు.

'ఏంది సార్.. గిది..?'

'మినిస్టర్ సారు ఫోన్ చేసి గా తీర్మానం చేయమన్నడు. జల్లెడ వట్టినట్లు ఊర్నీ గాలించిండట.. 'మోడల్ విలేజ్' చేయాలంటే, అప్పటికే అంతో ఇంతో ముందటున్న ఊరు గావాల్నట.. ఇగ సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం కావాలంట. గిన్ని కండిషన్లు ఉ ండంగా మన ఊరును తీసుకున్నడు. నిన్ను ఏకగ్రీవంగా సర్పంచ్‌ని చేసినట్టు తీర్మానం చేసి, రేపు కరీంనగర్ రమ్మన్నడు.. నిన్ను తోలుకొని..'

నా నోరు మూగవోయినంత పనైంది.

'నీ లెక్క నేనుకూడా నమ్మలేదురా! నీ గురించి పూస గుచ్చినట్లు అన్ని ముచ్చట్లు చెప్పుతుంటే నాకైతే మస్తు సంతోషమైంది. నువ్వున్నవనే మన ఊరును సెలెక్ట్ చేసుకున్నడట. 'రాజన్న ఎంతైనా మీ శిష్యుడు కదా సార్..' అన్నడు మినిస్టర్ సార్. ఆ ఒక్క మాటతోని నా వృత్తి ధర్మం.. ధన్యమైనట్టే ఇగ!'

'సార్.. నాకు రాజకీయాలు చేయడం రాదు..' అన్నానేను.

'అందుకే కదా.. నిన్ను సెలెక్ట్ జేసుకున్నరు మినిస్టర్ సార్. పరిపాలన, పనులు

చేసేటోడు గావాలె గానీ, ఖద్దరు వేసి గాలికి తిరుగేటోడు కాదు..' సారు బదులిచ్చిండు.

మా నాయినకు కలో, మాయో.. అన్నట్లుంది.

'గంగిరెద్దు, గానుగెద్దు.. రెండూ ఎడ్లేరా! గంగిరెద్దును అలంకరించి కనబడ్డోడికల్లా దండం పెట్టిస్తరు. గానుగెద్దు పొద్దంతా మెడమీద 'కాని' పెట్టుకొని పనిచేస్తది. వాట్ని రెండిటినీ 'అంగడి'కి అమ్మబోతే.. గంగిరెద్దును ఎవరూ కొనరు. అది కండవట్టి పోతపోసినట్లు ఉన్నాకూడా.. గానుగెద్దునే కావాలంటరు.. బక్కగా బొక్కలు తేలి కనవడుతున్నా..! పనిగల్లోడు ప్రపంచంల ఎట్టనన్న బతుకుతడు..' సార్ నన్నుద్దేశించే కథ చెప్పిండని అనిపించింది.

నాకోవైపు నన్ను గుర్తించి పదవిస్తున్నందుకు ఆనందం.. మరోవైపు తాహతు.. అర్హత లేనివి నెత్తినేసుకుంటున్ననా..? అని భయం!

నా మనసును చదివినట్లున్నడు సార్.

'నేను సర్పంచ్‌గా ఉన్నట్లే గానీ, నీ ఆలోచనలు, నీ సలహాలు సాయం లేకుండా పనులవునారా.. రాజన్న? ఊరుకు అవార్డు ఇప్పిస్తివి.. నీ ఐడియాలతోటి! నీ వంటి శిష్యుణ్ని తయారు చేసినందుకు ఏడకు పోయినా నన్ను చూసి భక్తితో మినిస్టరు సారే లేచి నిలబడుతడు.. నా వెంట ఉండి ఊరికెంతో చేయించినవ్.. ఇప్పుడు నువ్వు సొంతంగా చేసుకోలేవా..'

నేను తల వంచుకొని ఆలోచిస్తున్న. నా మెడలో ఏదో వేస్తుండు సార్.. బంగారు గొలుసు!!

'సార్సార్.. వద్దు వద్దు..' అనుకుంటనే లేచి నిలబడ్డ.

'నా మాట కాదంటవారా నువ్వు..!' అంటూ వీపుల ఒక్కటిచ్చి, దగ్గరికి తీసుకున్నడు.

'ఎంత మంచి కొడుకును కన్నవయ్యా..' మా నాయినవైపు తిరిగి సార్ అనేసరికి, కండ్ల నీళ్లు తెచ్చుకున్నడు మా నాయిన.

ఆ ఆనందంలో ఇంటికొస్తున్నం.. మా నాయిన, నేను.

'..డుడ్‌డ్‌డ్.. డుడ్‌డ్‌డ్డు.. డుడ్‌డ్‌డ్..' చప్పుడు.

ఎదురువడ్డడు కోటిగాడు. వాడు కనబడితే తల వంచుకొనుడో.. తల తిప్పుకొనుడో చేసేటోన్ని.

'సార్థకత కావడానికి బతుకు మనకు సాన పెట్టేటప్పుడు ఇగ సాలని ఎప్పుడూ అనొద్దురా..' అని సార్ నన్ను సాగదోలిన దృశ్యం గుర్తుకొచ్చి, నవ్వుకున్న చిన్నగా!

కోటి గాడు తల తిప్పుకున్నడు. నేను పడ్డ బాధలన్నీ దూదిపింజ లెక్క ఎగిరి పోతున్నయ్. చిన్నప్పటి నుండి 'బరువు'లు మోసిన నేను, 'బతుకు' అలుకగ అయినట్లు అనిపించింది. ఇప్పుడు నా మనసు తృప్తిల వడ్డది.

చెన్నయ్య సార్ మా ఊరి సర్పంచ్. అంతకంటే ముందు మాకు సదువు చెప్పిన సార్. మా ఊరు సారే! రిటైర్ అయినంక ఊరు ఊరంతా కల్సి సారును సర్పంచ్‌గా ఉండుమని ఏకగ్రీవం చేసుకున్నరు. సార్ పుణ్యంతోనే ఊర్లో అందరూ కనీసం పదిదాకా సదివిండ్రు.

ఇగ నాకైతే సార్ దేవుడే! నా సదువాగినప్పుడు ధైర్యం జెప్పిండు. పదిల మండలంల ఫస్టొస్తే నాకు కొత్త డ్రెస్సు కుట్టిచ్చిండు.

## చిప్పబత్తుల శ్రీనివాస్

రచయిత కలం పేరు సుగంధ. శ్రీనివాస్ స్వస్థలం కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం ఊటూరు. ప్రస్తుతం వీణవంక మండలం హిమ్మత్‌నగర్ పాఠశాలలో పనిచేస్తున్నారు. చిన్నప్పటి నుంచి సాహిత్యం పట్ల ఆసక్తి. 1999లో వికారాబాద్‌లో టీటీసీ చదివేటప్పుడు తెలుగు మాస్టారు దొరవేటి (వి. చెన్నయ్య) బాగా ప్రోత్సహించారు. 2003లో ఆంధ్రభూమి వీక్లీలో తొలికథ 'మళ్లీ మళ్లీ పూసే పూలు' ప్రచురితమైంది. 2003–06 మధ్య

19 కథలు, డజనుకు పైగా కవితలు, ఎనిమిది వ్యక్తిత్వ వికాస వ్యాసాలు ప్రచురితమయ్యాయి. 'ప్రియదత్త' వీక్లీ 2004లో నిర్వహించిన కథల పోటీలో రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి, ఆంధ్రభూమి ఉగాది కథలు పోటీలో ప్రోత్సాహక బహుమతి గెలుచుకున్నారు. 2007 నుంచి సాహిత్య సేవకు విరామం పలికి, పోటీ పరీక్షలవైపు వెళ్లారు. అదే సమయంలో చరిత్ర విషయ నిపుణులుగా పనిచేశారు. కూతురు ఆరాధ్య కథ చెప్పమని అడిగినందుకు 14 ఏండ్ల తర్వాత నమస్తే తెలంగాణ, ముల్కనూర్ గ్రంథాలయం కథల పోటీకి ఈ 'గంగిరెద్దు గానుగెద్దు' కథ రాశారు.

# అడివి బతుకులు

డాక్టర్ దిలావర్

**9866923294**

'అరే.. ఓరారీ! నిమ్మలోల్ల పొల్ల పెద్ద మనిషైందటరా!' పెంటకు చెందిన గజ్జెలు పక్కోనికి చెప్పిండు.ఆనోటా ఈనోటా ఆ వార్త పెంటల గుప్పుమన్నది.ఆ పిల్లను గుడిసెకు దూరంగా ఒక చెట్టుకింద కూసోబెట్టింది తల్లి. వెదురు బియ్యం బువ్వా, ఎరవలగడ్డలు, కొండగడ్డలు, తేవరగడ్డలు, వండిన పైలికూర, సిర్రికూర, దుగ్గలకూర, చెంచులకూర అసుంటి పదార్తాలన్నీ సిబ్బిలవెట్టి, ఆ పిల్లకు అంటుకోకుంట దూరంగా పెట్టి అచ్చింది.బగ్గబగ్గ మండే ఎండలే కాయనీ, ఉరుములు మెరుపుల తోటి పిడుగులే పడనీ, ఇయ్యరమయ్యర వానే దంచనీ ఆ చెట్టుకింది పిల్ల గట్లనే ఒంటరిగనే ఉండాలె. బిక్కుబిక్కుమనుకుంట, భయం భయంగా గట్ల మూడు దినాలు గడపాలె. మూడో రోజున, మొగోళ్ల కంట బడకుంట తానమాడిచ్చి ఇంట్లెకి తీసుకొత్తరు.ఆ పిల్ల సమర్తయి గప్పుడు రెండు నెలలైంది. అయ్యా అవ్వా ఇంగ లగ్గం చేసే పనిల వడ్డరు.

కోనమ్మ దోరజాంపండు లెక్క దోర వయసుల మిసమిసలాడుతాంది. విరగబూసిన రేలకొమ్మ లెక్క సక్కదనంగ ఉన్నది. మత్తెక్కించే ఇప్ప పువ్వులెక్క ఉన్నది. అడివి దేవత చెంచుపిల్ల రూపంల అచ్చినట్టున్నది. నున్నగ అంట దువ్వి కొప్పు ముడుసుకున్నది. ఎడమ చెవి పక్కన కొండగోగు పువ్వు పెట్టుకున్నది. పోత పోసిన

అమ్మోరి కంచు విగ్రహం లెక్క ఉన్నది. వయసు తెచ్చిన మిడిసిపాటుతో నవ్వుకుంట, తుళ్లుకుంట, ఒక్కాడ కుదురుగా ఉండక చెంగు చెంగున ఎగిరే లేడిపిల్ల లెక్క ఉన్నది.ఒగరోజు కుండ సంకన బెట్టుకొని మంచినీళ్ల కోసం బయలెల్లింది కోనమ్మ. పెంటకు కోసెడు దూరంల కొండవాగు ఉంది. పెంటవాళ్లు మంచినీళ్ల కోసం అంత దూరం నడవాల్సిందే.

వాగు ఎండిపోయినట్టు ఉన్నది. నడ్మనడ్మ ఉస్కె దిబ్బలున్నయ్. వాటి సుట్టూ నీటిపాయలు పారుతున్నయ్. కోనమ్మ వాగు లోతట్టు సోటుకు పోయింది. కుండ పక్కనబెట్టి మోకాళ్ల మీద కూసున్నది. వంగి చెలిమె తీసుడు మొదలువెట్టింది.

కోనమ్మ కూసున్న సోటుకు ఎగువన మడుగు లెక్క నీళ్లు నిల్శివున్నయి. గా మడుగల రెండు మూడు గాలాలతోని చేపలు పట్టుతున్నడు కొండడు. ఎంతసేపటికీ ఒక్కగాళం బెండూ మున్గత లేదు. కొండనికి యాష్టకొత్తన్నది. ఇసుక్కుంట దిక్కులు సూసుడు మొదలువెట్టిండు ఇంక యాడనైన మంచి సోటున్నదేఉవోనని. మడుగులైతే కన్పించలేదుగనీ శెలిమె తీత్తున్న కోనమ్మ మెరుపు మెరిసినట్టుగా కన్పించింది.వాల్గరెబ్బ లెక్క ఉన్న కోనమ్మను సూడంగనే కొండని యిసుగంత మాయ–ంమై పోయింది. రెండు మూడు సీసాల యిప్పసార తాగినంత వుషారు వచ్చింది. గాళాలు ఒడ్డున పారేశిండు. గట్టిగ పెయ్యి యిర్సుకొని కోనమ్మ దగ్గరికి పోయిండు.గంత దగ్గర కొండణ్ని సూడంగనే కోనమ్మ పెయ్యి జల్లుమన్నది. గుండె బురద మట్ట లెక్క కొట్టుకుంటున్నది. పెయ్యంతా శెమటలు పట్టినయ్. గండె పరకల్లెక్కున్న కండ్లను టపటపలాడించుకుంట సూశీ సూడనట్టుగ కొండని దిక్కు సూశింది. సిగ్గు ముంచుకొచ్చిందేఉవో ఎంబడే కండ్లు వాల్సుకున్నది. గట్ల కండ్లు వాల్సుకున్నా కొండని ఇగ్గరమే కండ్ల బడ్తాంది.

కోనమ్మను సూడంగనే కొండని మనసు నెమలిలెక్క పురియిప్పుకున్నది. నరనరాల్లో ఏదో కరెంటు ఉరుకులు తీత్తన్నట్టుగుంది. గుండె కుందేలు పిల్లలెక్క చెంగు చెంగున గంతులు ఎయ్యబట్టింది.

బలంతంగ గుండెను సిక్కబట్టుకొని శిన్నగ గొంతు సరాయించిండు కొండడు. 'ఏం పిల్లా! ఏం జేత్తన్నవ్?' గొంతు పెకిలించుకొని అన్నడు. 'శెల్మె దీత్తాన్న. కండ్లబడ్తలేదా?' గడ్సుగ అన్నది కోనమ్మ. 'ఎట్ల కండ్లబడ్తది? కండ్లనిండ నువ్వేగదా?' కోనమ్మకెల్లి సిలిపిగ సూస్కుంట అన్నడు కొండడు. 'గదేందీ? నీ కండ్లల్ల నేనుండుడేంది?' అనుకుంట కిసుక్కున నవ్వింది కోనమ్మ.

'నువ్వు నవ్వుతాంటె ఎంత బాగున్నదో ఎర్కేనా? బువ్వా, నీళ్లు యిడ్శి ఎంతకాలమైనా ఉండొచ్చు నీ నవ్వు సూస్కుంట' కోనమ్మకెల్లి సూస్కుంట కొంటెగ అన్నడు కొండడు.శివ్వున తలెత్తి కొండనికెల్లి సూశింది కోనమ్మ. కొండని కండ్లల్ల తనకు కావాల్శినదేందో ఉన్నదనిపించింది కోనమ్మకు. మనసు కొండని సుట్టే తిరుగుతున్నట్టు అనిపిచ్చింది. ఆ ఆలోశెన రాంగనె ఎక్కడలేని సిగ్గు ముంచుకొచ్చింది. శెల్మె దీసుడు లేదు ఏం లేదు. చేతివేళ్లు పైపైన్నే ఉష్కెను గీకుతున్నయి.

'వో.. గిట్టయితే మూడు నాల్గు దినాలకు సుత శెల్మె దియ్యలేవు. జర్గు.. నేను దీత్త' అని కోనమ్మను జరిపి తను కూసున్నడు.

కొండని చెయ్యి తగలంగనె కోనమ్మ నరాలు జివ్వుమన్నయి. కన్నార్పకుంట కొండణ్నే సూత్తాంది. కొండని బలమైన చేతివేళ్లు ఉష్కెను సులాగ్గా తీస్తున్నయి. కొంచెం సేపట్లనే శెల్మల నీళ్లు ఊరినయ్. కుండ లోపట్ల ఉన్న సత్తు గళాసు తీసి కొండనికి అందిచ్చింది కోనమ్మ. కొండడు గబ్బగబ్బ గళాసు తోటి నీళ్లు తోడి కుండ నింపిండు.కోనమ్మ కండ్లు కొండణ్ని మెచ్చుకుంటున్నట్లు మిలమిల మెర్శినయి.కొండని మనసులోపట కోరిక అగ్గి లెక్క రాజుకుంటాంది. బలంతంగ ఆపుకొంట.. 'అనే కోనీ! నన్ను మనవాడుతవా?' సాజ్జిగ కోనమ్మ కండ్లలోపట్లెకి సూస్కుంట అడిగిండు.కోనమ్మ పెయ్యి జలదరిచ్చింది. ఒక్కటన్లె, రెండన్లె. 'మాట్లాడవు? సమ్మతైతే చెప్పు. ఇద్దరం మన కులపెద్ద అంజన్న కాడికి పోదం. మనిద్దరికి ఇష్టమైనంక గాయన సుత సరే అంటడు. మన కుల కట్టుబాటు నీకెర్కే కదా? మూడు దినాలు ఇద్దరం అడివిల్నే ఉండాలె. నేను పొయ్యి అడ్విల మనం ఉండేటందుకు గుడ్శేత్త. అటెంక మనం పెంటకొచ్చి కల్శివున్నా ఎవ్వలేమనరు' ఆశగా అన్నడు కొండడు.

ఒక్కపాలె కోనమ్మ మనసు బెదిరింది. 'మా అవ్వ, అయ్యకు ఎర్కలేకుంటనా?' భయం భయంగా అన్నది కోనమ్మ. 'ఆఁ..' అన్నడు కొండడు. కోనమ్మ కుండ నెత్తిమీదికి ఎత్తుకున్నది.

'గట్ల సాటు మాటుంగ ఎందుకు? నేటుగనే మనువాడుకుందాం. నేను మా అవ్వ అయ్యకు ఎర్కజేత్త. నువ్వు మన కుల కట్టు పెకారం మీ వోళ్లను తోల్కరా. అందరి సమ్మతి అయినంక లగ్గమైతది. గప్పుడు పెద్దలు సుత మెచ్చుతరు. మర్శిపోకు. మీవోళ్లను తోల్కరా' అని ఎనిక్కి ఎనిక్కి కొండణ్నే సూస్కుంట ఇంటిదారి వట్టింది కోనమ్మ.

22 katha 1-203 page-1_Layout 1 9/25/2021 3:32 PM Page 200

**'కల్లానమొచ్చినా, కక్కొచ్చినా ఆగుతాది' అనుకున్నరు.కొండడు, అతని తమ్ముడు గజ్జెలు, తండ్రి కలిసి అడివిల వద్దరు. మంచి మంచి సండ్ర గుంజలు నరికిండ్రు. కొన్ని ఎదురుబొంగులు నరికిండ్రు. గవ్విటిని తీసుకొని గుడిశెకు చేరుకున్నరు.ఆస్మానంత పందిరి, బూదేవంత అరుగులు గాకున్నా మాంచి వాటమైన పందిరేసింద్రు.**

'ఓరారీ! కొండా! నిమ్మలోల్ల తానికి లగ్గం సూపులకు బోవాలె. జప్పున రారా!' అని కొండని అయ్య కేకేశిండు. 'ఏందీ?' అన్నడు కొండడు ఏం ఎర్కలేనట్టు.నిమ్మలోల్ల తానికి అంటే కోనమ్మ కోసవేఉ.. కొండని మనసు కోడెగిత్త లెక్క రంకేసింది సంబురం ఆపుకోలేక. 'లగ్గం సూపులకురా! నిమ్మలోల్ల యింటికి..' అన్నడు కొండని తండ్రి. 'నేను బొయ్యి కులపోల్లు ఒగ తొమ్మండుగుర్ని, పెంటకు పెద్దయిన తోకల అంజన్నను తోల్కొనత్త. గీలోపట్ల నువ్వు జర మంచిగ గుడ్డలేస్కో' అని కొడుక్కి చెప్పి పెంటలకు బోయిండు.ఉన్నంతల మంచిపంచె కట్టుకున్నడు. శేతుల బనీను తొడుక్కున్నడు. జిడ్డోడంగ నెత్తికి ఆముదం పట్టిచ్చిండు. భుజమ్మీద తువ్వాలేసుకున్నడు. గూట్లె ఉన్న అద్దం ముక్కను శేతిలకు తీసుకున్నడు. అక్కడక్కడ పండ్లు యిరిగిపోయిన దువ్వెన తోటి నున్నగ దూస్కున్నడు. అద్దంల సూస్కుంట..'వో.. గప్పుడే పెండ్లి పిలగాని లెక్కగొడ్తున్నవ్ పో' అని ముసిముసిగ నవ్వుకుంట అనుకున్నడు.ఇంతల అయ్యరానే అచ్చిండు. ఆల్లతోపాటుగ తోకల అంజన్న సుత అచ్చిండు.అందరు కల్శి నిమ్మలోల్ల గుడ్శెకు పోయిండ్రు. ఎంట తలా ఒక సీసా ఇప్పసారా తెచ్చుకునుడైతే మర్శిపోలేదు. గుడ్శె ముందుకు పోంగనే రెండు చింకి చాపలు దెచ్చి గుడ్శెముందు పర్శిండ్రు పిల్లోల్లు. పెంటకు పెద్దయిన తోకల అంజన్న గొంతు సరాయిచ్చుకున్నడు. 'అరే..! ముందుగాల గిది జెప్పుండ్రీ. నిమ్మలోల్లు, పులచెర్లోల్లు ఒక్క గోత్రపోల్లు కాదుగదా?' అని అడిగిండు అంజన్న.

'ఒక్క గోత్రపోల్లు అయితే ఏందే?' అని అడిగిండు తొమ్మండుగురిలో ఒకాయినె.

'అరే..! మన చెంచులల్ల ఇర్వయారు గోత్రాలుంటయి. ఒక్క గోత్రపోల్లు మనువాడొద్దు. అది మన కట్టుబాటు. గదిగాక చెంచులల్ల సుత నాల్గు రకాలోల్లు ఉంటరు. అడివి చెంచులు, దేవ చెంచులు, బొంత చెంచులు, ఊర చెంచులు.

గీల్లుగూడా ఒక చెంచోల్లతోని ఇంగొక చెంచోల్లు ఇయ్యిమందుకోరు. ఊర చెంచులు ఊర్లల్ల అడుక్కొని తింటరు. ఊరోల్లిచ్చిన బట్టలు కట్టుకుంటరు. రంగురంగు బట్టలతోని నెమిలీకలతోని యిసిత్రంగా ఏశాలు గడుతరు. కంచుగంట కొట్టుకుంట ఊర్లల్ల తిరుగుతరు' అని శెప్పిండు అంజన్న. 'గట్లనా!' అని నోరెల్ల బెట్టింట్రు అక్కడున్నోళ్లు.

'అయితె మాయెగని పిల్లను, పిలగాన్ని ఒగలనొగల్ని సూపిచ్చుండ్రి' అని అన్నడు అంజన్న. 'గట్లనే!' అని రెండేపులోల్లు పిల్లను, పిలగాన్ని ఎదురెదురుగ కూసుండబెట్టింట్రు. ఇదివరకే పిల్లా, పిలగాడు ఒగలకు ఒగలు ఎర్కే అయినా గంతమందిల సూస్కోవాల్నంటే జర సిగ్గే అనిపిచ్చింది.

'ఇద్దరికీ సమ్మతేనా?'.. అడిగిండు అంజన్న.కొండడు ఓరగా కోనమ్మకెల్లి సూశి 'ఏంటీ?' అన్నట్టుగా కనుబొమ్మలెగరేసిండు.కోనమ్మ కనురెప్పలు వాలిపోయినయి. సిగ్గుతో ముడ్సుకపోయింది.

'మూగి ముత్తాలమ్మ లెక్క కూసున్నరు. చెప్పరేందుల్లో' అని కసురుకున్నట్టు అన్నడు అంజన్న.

'సమ్మతే!' అన్నట్టుగా తలూపింట్రు ఇద్దరూ.గట్లనే రెండేపోల్లను సుత అడిగిండు అంజన్న.

గాల్లు సుత 'సమ్మతే!' అన్నరు.అటెంక జరగాల్సిన జరుగూరు పని మొదలైంది.అటేపోల్లు, ఇటేపోల్లు సారాసీసాలు బయిటికి తీసింట్రు. అంతకుముందే వొండిన ఉడుం మాంసం ముక్కలు సత్తు తలెల పెట్టి ముందుకు తోసిండు పిల్ల తండ్రి. రెండేపులోల్లు మాంసం ముక్కలు నంజుకుంట ఇప్పసారా తాగింట్రు.పెండ్లి కరారు అయింది. పలానా నాడు లగ్గం అని అనుకున్నరు.

అనుకున్నదినం రానే వచ్చింది.

'కల్లానమొచ్చినా, కక్కొచ్చినా ఆగుతాది' అనుకున్నరు.కొండడు, అతని తమ్ముడు గజ్జెలు, తండ్రి కలిసి అడివిల వడ్డరు. మంచి మంచి సండ్ర గుంజలు నరికింట్రు. కొన్ని ఎదురుబొంగులు నరికింట్రు. గవ్విటిని తీసుకొని గుడిశెకు చేరుకున్నరు.ఆస్మానంత పందిరి, బూదేవంత అరుగులు గాకున్నా మాంచి వాటమైన పందిరేసింట్రు. తీరొక్క అడివి పూలతోని పందిరికి పెండ్లికళ తెచ్చింట్రు. ఇల్లంతా సుట్టపక్కాలతోని సందడిగున్నది.తెల్లారింది. పిల్లోల్లు, పిలగానోల్లు అంకాలమ్మ గుడికాడ్కి చేరుకున్నరు. పెంటలోని పది కుటుంబాలు సుత లగ్గం సూడనీకె వచ్చినయి. తోకల అంజన్న పూజారై లగ్గం తంతు జరిపిచ్చిండు.

కుల బంతి మొదలైంది. పిల్లోల్లు యాటను గోసింట్రు. రెండేపులోల్లు

లగ్గానికొచ్చినోల్లందరికి నపరొక సారా సీసా యిచ్చింద్రు. సారా తాగి యాటకూర తోటి పెండ్లి బువ్వ తిన్నరు.

ఒక్కొక్కల్లకు ఇప్పసారా నిశా నెత్తికెక్కింది. తూలుకుంట, ఒగల్లనొగల్లు తోసుకుంట వరుసైనోల్లతోటి పరాష్కాలాడింద్రు.ఇంతల ఒగ కోడెకారు వయసు పొలగాడు డప్పు అందుకున్నడు. చిర్రా, చిటికెన పులా డప్పుమీద జోరుగ సప్పుడు జేస్తన్నయి. డప్పు దరువుకు తగ్గట్టుగా వొయ్యు ఆడపొలగాండ్లు, మొగపొలగాండ్లు సుట్టూతా తిర్గుకుంట, అడుగులేసుకుంట, ఒంగుకుంట లేసుకుంట నెమిలాట ఆడబట్టింద్రు.వాళ్ల ఎన్క, సుట్టూత ఉన్న కోడెకారు పొలగాండ్లు యీలలేసుకుంట సప్పుట్లు కొట్టుకుంట లొల్లి లొల్లిగ కేకలు వెడుతుంద్రు. నెమిలాట ఆడేటోల్లకు వుషారెక్కిత్తాంద్రు.

ఆడి పొలగాండ్లు ఇంకా రెచ్చిపోయి ఆడటం మొదలు పెట్టింద్రు. వాల్ల ఆటా పాటలల్ల ఎంత పొద్దుబోయిందో ఎవలకూ సోయిలేదు. ఓ గంటా, రెండు గంటలు గట్ల పూనకం వచ్చినట్టు ఎగిరింద్రు.

అటెంక మరో వాయి సారా పట్టించింద్రు.

డప్పులు మల్లా కణకణమోగినయి.

ఆ పొలి ఆట మారిపోయింది.

తాగిన సారా లోపట్ల బుస్సున పొంగుతాంది.

శివాలెత్తి మొగ పొలగాండ్లు వూగ బట్టింద్రు. కైపెక్కిన కండ్లు సింత నిప్పుల్లెక్క ఎర్రగ మండుతున్నయి. డప్పు దరువు ఒక్కెల్లి పోతాంటె పొలగాండ్ల అడుగులు ఒక్కెల్లి పోతాన్నయి.

'అరే! కోతాట ఆడుంద్రా!' అన్నడు అంజన్న.

వైసు పోరగాండ్ల ఎంబటే అందుకున్నరు. కోతాట ఆడుతాంటె అక్కడున్నోల్లంత పొట్ట శెక్కలయేటట్టుగ నవ్వబట్టింద్రు.

గట్ల ఆటాపాటలతోటి పొద్దుగూకింది.

కాలం ఆగుతాది? ఎండాకాలం, వానాకాలం, సలికాలం ఒగదానెంబటి ఒగటి గిర్రు గిర్రున తిర్గుతనే ఉన్నయి. ఇంతల కోనమ్మ నీల్లు బోసుకుంది. నెలలు నిండంగనే ఉత్కలాడటానికి పుట్టింటికి అచ్చింది. అచ్చిన ఒగటి రెంద్రోజులకే నొప్పులు మొదలైనయి. గుడిశె ముందు కూకొని ఎదురు బియ్యం చెరుగుతున్నది లశ్మమ్మ. గుడిసె లోపట్లకెల్లి అంతకంతకూ మూల్గులు పెద్దగైతాన్నయి. మూల్గులు యినబడినప్పుడల్లా తల్లిపానం గదా లశ్మమ్మ గుండెను ఎవలో మెత్తటి కత్తితోని కోస్తున్నట్టు అనిపిత్తాంది. ఇంట్లె ఉన్న మొగోల్లంత అడివికి యేటకు బోయింద్రు.

22 katha 1-203 page-1_Layout 1 9/25/2021 3:32 PM Page 203

లశ్మమ్మకు కాల్లు శేతులు ఆడటం లేదు. ఏం చేద్దునురా దేవుడా అనుకుంట అల్లడం తల్లడం అయితాంది. ఎవలన్న అస్తరేమో అని అటు ఇటు సూత్తాంది. గుడ్శె ముంగట బూడ్దెల దంచిన సింతపండు తినుకుంట ఉన్న శిన్న పోరగాండ్లు తప్ప ఎవలూ కండ్లబడలేదు. జరసేపటికి ఎవలో నడ్సుకుంట పోతున్న అలికిడయింది. అటుకెల్లి సూశింది. ఎల్లమ్మ యాడికో పోతాంది. 'ఓ.. ఎల్లవ్వా! యాడ్కివోతున్నవే' అని లాశిగ పిలిశింది.

**కాలం ఆగుతాది? ఎండాకాలం, వానాకాలం, సలికాలం ఒగదానెంబటి ఒగటి గిర్రు గిర్రున తిర్గుతనే ఉన్నయి. ఇంతల కోనమ్మ నీల్లు బోసుకుంది. నెలలు నిండంగనే ఉత్కలాడటానికి పుట్టింటికి అచ్చింది. అచ్చిన ఒగటి రెండ్రోజులకే నొప్పులు మొదలైనయి. గుడిశె ముందు కూకొని ఎదురు బియ్యం చెరుగుతున్నది లశ్మమ్మ. గుడిసె లోపట్లకెల్లి అంతకంతకూ మూల్గులు పెద్దగైతాన్నయి.**

'కట్టెలకు పోతాన్న' అని అన్నది ఎల్లమ్మ. 'పోత పోత గా మంత్రసాని బుచ్చవ్వకు శెప్పిపోవా. మా కోనవ్వకు నొప్పులు జాస్తి అయితాన్నయి. అవ్వవ్వా! సచ్చి నీ కడుపున పుడ్త. జరశెప్పి పోవా' అని బతిలాడింది లశ్మమ్మ. 'గట్లనే శెప్పుత తీ!' అని అన్నది ఎల్లమ్మ. 'కట్టెలకు అడ్వీలకే గదా పోతన్నవ్? గట్లనే మావోల్లు కనిపిత్తే ఆల్లకుసుత జర జెప్పవా?' అని జాలిగ అన్నది లశ్మమ్మ.

'శెప్పుతలే వొదినా! నువ్వేం పికరు పడకు' అనుకుంట తన దారిన పోయింది ఎలమ్మ.

జర సేపట్కి మంత్రసాని బుచ్చమ్మ అచ్చింది.ఏ శెట్టూ లేని కాడ ఆఉవుదం శెట్టే మావృచ్చమన్నట్టు బుచ్చమ్మ వున్నది. బుచ్చమ్మ లేకపోతే ఆ కాత్త నాటు వైద్గమో, మోటు వైద్గమో సుత ఉండది చెంచు ఆడోల్లకు.వొత్త వొత్తనే 'ఎవలకు తప్పినా నాకు తప్పుతాది? మంత్రసాని తనం వొప్పుకున్నంక పిల్లొచ్చినా పట్టాలె, పియ్యొచ్చినా పట్టాలె' తనలో తనే పెద్ద రావాండం సదూకుంట అచ్చింది. ఇంతల యీ లొల్లికి పక్క గుడిశె ముత్తమ సుత అచ్చింది.

'అనే లశ్మమ్మా! ఆఉవుదమున్నాదె?' అని అడిగింది బుచ్చమ్మ.గుర్గిల ఉన్న ఆఉ వుదం తీసి యిచ్చింది లశ్మమ్మ. బుచ్చమ్మ రెండు శేతులకు ఆఉవుదం పూసుకుంది.

'అనే లశ్మమ్మా! ముత్తవ్వా! మీరు శెరొొక్కలు కాల్లను అదిమి పట్టుండ్రి' అని శెప్పింది.ఆల్లు గట్లనే అదిమి పట్టిండ్రు. ఆఉవుదం శేతుల తోటి బుచ్చమ్మ పునకటం మొదలుబెట్టింది. యాడ పిండం జాడ కనిపిత్తలేదు.

బుచ్చమ్మ గట్ల పునుకుతాంటె కోనమ్మ నొప్పులతోని మొత్తుకోబట్టింది. 'లశ్మమ్మా! పిండం తగుల్తలేదు. ఒగ బాణం ముక్క ఉంటే ఇయ్యే' అని అడిగింది బుచ్చమ్మ.దడికి చెక్కిన బాణం తీసింది లశ్మమ్మ. ములికికి పట్టిన మకిలిని గుడ్డతోని సుబ్బరంగ తుడ్శి బుచ్చమ్మకిచ్చింది. బుచ్చమ్మ ఆ బాణం ముక్కతోని లోపల కెలకబట్టింది. అటూ ఇటూ తిప్పుకుంట దారి చెయ్యటం మొదలుపెట్టింది.బుచ్చమ్మ బాణం ములికిని తిప్పుతాంటె, కత్తితోని కోత్తన్నట్టు విలవిలలాడింది కోనమ్మ. కోనమ్మ పైపానాలు పైన్నే పోతాన్నయ్. భరించలేక పెడబొబ్బలు పెడ్తాంది. గావు కేకలతో బొబ్బరిల్లుతాంది. కోనమ్మ కేకలతో అడివి దద్దరిల్లుతాంది. బాణం రాపిడితోని నెత్తురు సుత కార్తాంది.అటు జేసి ఇటు జేసి ఒగ గంట గడ్శింది.బుచ్చమ్మకు దిగశెమటలు పట్టుతాన్నయి.

'అనే..! పిండం అడ్డం తిర్గినట్టున్నది. ఇగ నావల్ల కాదు. దవాకానకు తీస్కపోండ్రి' అని చేతులెత్తేసింది బుచ్చమ్మ.

లశ్మమ్మ నెత్తిమీద పిడుగు పడ్డట్టు అదిరి పడింది. 'సీసైలం మల్లన్నా నువ్వే ఆదుకోవాలె నా బిడ్డెను. కులదేవరా బయ్యన్నా నా బిడ్డెను రచ్చించు తండ్రీ' అని శేతులెత్తి మొక్కుకుంటాంది లశ్మమ్మ.ఇంతల యేటకు బోయిననోల్లకు వార్త అందించింది ఎల్లమ్మ. కోనమ్మ తండ్రీ, అన్నదమ్ములూ, అటు కొండని తండ్రీ, కొండడూ, అన్నదమ్ములు ఉరుక్కుంట అచ్చిండ్రు. 'అరే! ఒగ పెద్ద కఱ్ఱ తీసుకురాండ్రి. దానికి చీరెలతోని జోలికట్టి కోనమ్మను దవాకానకు తీస్కపోదం' అని అన్నడు కోనమ్మ తండ్రి. 'గీ మద్దెల దంచి కొట్టిన వానలకు వాగులు వంకలు పొంగి పొర్లుతాన్నయి. జోలితోని కుదరిది. మంచం మీద తీస్కపోదాం' అన్నడు కొండడు.ఎదురు బొంగుల నుల్క మంచంల రెండు మూడు పాత శీరెలు ఏసిండ్రు. కోనమ్మను దానిమీద పండుకోబెట్టిండ్రు. నాల్గేపుల నలుగురు మంచం కోళ్లను పట్టుకొని భుజాలమీదకెత్తుకున్నరు. అడ్విలకెల్లి దారి సేస్కుంట దవాకానకు బయల్దేరిండ్రు. సర్కారు దవాకాన ఎనిమిది తొమ్మిది కోసుల దూరంల ఉన్నది. ఒగ అంబులెన్సు లేదు. చెంచులకు ఏవన్నా రోగాలు రొష్టులు అత్తే వాల్ల సావు వాల్లు సావాల్సిందే.

కోనమ్మ నొప్పితోని గిలగిల కొట్టుకుంటాంది. పాము లెక్క మెలికలు తిరుగుతాంది. నడుము ఎగిరెగిరి పడతాంది. లబ్బలబ్బ మొత్తుకుంటాంది. వశం కాని నొప్పులతోని అల్లడం తల్లడమైతాంది. పెద్దగా కేకలు పెడ్తాంది.అప్పటికే నాలుగైదు వాగులు దాటింండ్రు. వాగుల్ల, మెడల కాడ్కి నీల్లు పారుతున్నయ్. మంచాన్ని చేతులమీద పైకెత్తి మొండి ధైర్నంతోని వాగులు దాటుతాంండ్రు.

ఆలిశం అయినా కొద్దీ కోనమ్మకు నొప్పులు ఎచ్చుతాన్నయి. రంపంతో కోస్తున్నట్టు, ఇనుపవేళ్లతో దేవుతున్నట్టు. ఇగ తట్టుకోలేక లాశిగ సావుకేక పెట్టింది. గుడ్లు తేలేసింది. కోనమ్మ పానాలు గాలిల కల్శిపోయినయి. 'కోనమ్మా..!' అంట గుండెలవిశి పోయేటట్టుగ కొండడు పెట్టిన పొలికేక.. అలలు అలలుగా కొండా కోనల్ల కల్శిపోయింది.

# డాక్టర్ దిలావర్

ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం కమలాపురం గ్రామానికి చెందిన దిలావర్‌కు చిన్నప్పటి నుంచే సాహిత్యం పట్ల ఆసక్తి ఎక్కువ. తల్లిదండ్రులు మహబూబి, నిజాముద్దీన్. వరంగల్ జిల్లా డోర్నకల్ హైస్కూల్‌లో హెచ్ఎస్‌సీ చేశారు. ఆయనకు చదువంటే ప్రాణం. అందుకే, స్వయంకృషితో పీయూసీనుంచి పీహెచ్‌డీదాకా ఇష్టంగా చదివారు. రచనలపై దృష్టి పెట్టిన దిలావర్ ఇప్పటివరకు ఆరు కవితా సంపుటాలు వెలువరించారు. ఒక దీర్ఘ కవితా సంపుటి, ఒక పద్య కావ్యం, ఐదు నవలలు రాశారు. 'ప్రహ్లాద చరిత్ర', 'ప్రతిధ్వని విమర్శ గ్రంథాలు', 'దూరాల చేరువలో' వంటి ప్రపంచ సాహిత్య వ్యాసాలు రాశారు దిలావర్. ఇప్పటివరకు మూడు కథా సంపుటాలు ప్రచురించారు. 70 వరకు కథలు రాశారు. దిలావర్ రాసిన కథలు ఇంటర్మీడియట్, డిగ్రీ తరగతుల్లో పాఠ్యాంశాలుగా ఉన్నాయి. కవితలు విశ్వవిద్యాలయాల్లో పాఠ్యాంశాలుగా ఉన్నాయి. తన రచనలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వ అవార్డు, సోమసుందర్ అవార్డు, సీపీ బ్రౌన్ –బెంగళూరు అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిభా పురస్కారం.. తదితర గౌరవాలు లభించాయి.